'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 327

మంగళవారం 17-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

### 'శత'క్కొట్టిన నిసాంక

టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై గెలుపుతో 'సూపర్‌–8'కు శ్రీలంక అర్హత

-15లో

### ఇంగ్లండ్‌ దర్జాగా...

ఇటలీపై 24 పరుగుల తేడాతో గెలుపు.. సూపర్‌–8కు అర్హత

-15లో


మన తెలుగు రాష్ట్రాలు గర్వపడే ఘనత! జేఈఈ మెయిన్ 2026 (సెషన్-1) ఫలితాల్లో 300కి 300 మార్కులు సాధించిన

ఆలిండియాలోనే ఒకే ఒక్కడు శ్రీచైతన్య విజయవాడ విద్యార్థి

జేఈఈ మెయిన్ 2026 మొదటి సెషన్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. కఠినమైన పోటీలో సైతం అసాధారణ ప్రతిభను కనబరిచి, NTA ఫైనల్ కీ ప్రకారం 300కి 300 మార్కులు సాధించడం ద్వారా శ్రీచైతన్య విద్యార్థి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాడు. ఆలిండియాలో ఒకే ఒక్కడిగా పసల మోహిత్ సాధించిన ఈ అద్భుతమైన విజయం మన తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది.

**తల్లిదండ్రుల హర్షం:** "మాది కడపజిల్లా. వృత్తిరీత్యా మేము డాక్టర్లం. మా అబ్బాయి చిన్నప్పటి నుండి చదువులో ఎంతో చురుకు. శ్రీచైతన్యలోని IPL Super-60 ప్రోగ్రామ్ మా అబ్బాయి లక్ష్యానికి సరైన బాట వేసింది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నిరంతర పర్యవేక్షణ, మరియు ఒత్తిడి లేని హాస్టల్ వాతావరణం వల్లే ఈ అద్భుత స్కోరు సాధ్యమైంది. మా అబ్బాయి కల నిజం చేసిన శ్రీచైతన్య యాజమాన్యానికి మేము రుణపడి ఉంటాము" అని విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

**విజేత మోహిత్ మాటల్లో...** "నా ఈ విజయానికి ప్రధాన కారణం శ్రీ చైతన్య విద్యాసంస్థల శిక్షణా విధానం. ముఖ్యంగా వారు అందించే స్టడీ మెటీరియల్స్, గ్రాండ్ టెస్టులు మరియు డౌట్ క్లియరింగ్ సెషన్స్ నా ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఆల్ ఇండియా ర్యాంకింగ్ సిస్టమ్ ద్వారా నా స్థాయిని ఎప్పటికప్పుడు విశ్లేషించుకునే అవకాశం కలిగింది. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ముందుకు సాగుతాను."

వేలాది మంది ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేస్తూ దేశ విదేశాల్లో తెలుగు వారి జెండాను ఎగురవేస్తున్న శ్రీచైతన్య, ఈ విజయంతో మరో మైలురాయిని అధిగమించింది.

Advertisement

పసల మోహిత్‌కి మిఠాయి తినిపిస్తోన్న తల్లిదండ్రులు డా. పి. సవిత - డా. పి. కిరణ్


## న్యూస్‌రీల్‌

### రమణీయం.. మల్లన్న రథోత్సవం

5లో



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీశైలంలో అశేష భక్తజనం మధ్య స్వామిఅమ్మవార్లకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి ప్రత్యేక హారతులిచ్చారు.

### స్టీల్‌ప్లాంట్‌ కార్మిక నాయకులకు షాక్‌

3లో

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈ నెల 12న జరిగిన సమ్మెలో పాల్గొన్నందుకు స్టీల్‌ప్లాంట్‌ కార్మిక నాయకులకు యాజమాన్యం వార్నింగ్‌ లెటర్లు జారీ చేసింది. దీనిపై కార్మిక వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.


నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

| 12 గుడ్ల రిటైల్ ధర ₹75 | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 115 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 206 కిలో |
|---|---|---|---|---|
| | రిటైల్ లైవ్ బర్డ్ | 142 కిలో | స్కిన్ లెస్ | 234 కిలో |

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

# వ్యవ'సాయం' ఎక్కడ?

## బడ్జెట్‌లో అరకొర కేటాయింపులతో రైతులకు చంద్రబాబు పంగనామాలు

**ఉచిత పంటల బీమా అటకెక్కించేసి కొత్త బీమా నాటకాలు**

**గత బడ్జెట్‌లో రూ.1,023 కోట్లు కేటాయించినా పైసా ఖర్చు చేయని వైనం**

2లో

ఈ ఏడాది రూ.250 కోట్లతో సరిపెడుతూ మరో మోసం

రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్‌ హబ్‌ అని గొప్పగా ప్రకటన

ఉద్యాన శాఖకు కేటాయించింది కేవలం రూ.1,123 కోట్లే

ఆక్వా రైతులందరికీ రూ.1.50కే విద్యుత్‌ ఇచ్చేస్తున్నామని అబద్ధాలు

గ్రోత్‌ ఇంజన్లంటూనే పశు సంవర్థక, మత్స్య శాఖలపై చిన్నచూపు

కేంద్రం ఇచ్చేది కాకుండా రూ.20 వేలిస్తామన్న 'సుఖీభవ' హామీ ఏమైంది?.. ఏ పంటకైనా గిట్టుబాటు ధర ఉందా?

ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లేనా?

కనీసం యూరియా అందించలేని అన్యాయమైన పాలన

వరుసగా మూడో బడ్జెట్‌లోనూ అన్నదాతకు మొండిచెయ్యే

## యూరియా..'ప్రైవేట్‌' దయ!

### రబీలోనూ కటకటే.. అన్నదాతల అగచాట్లు

- బయట ఎమ్మార్పీకి మించి ఇష్టారాజ్యంగా దోపిడీ..
- బస్తా రూ.350 నుంచి రూ.600 దాకా బాదుడు..
- అక్టోబర్‌లో 1.42 లక్షల ఎకరాల్లో పంటల సాగు..
- అదే నెలలో 1.12 లక్షల టన్నుల యూరియా అమ్మకాలు
- పక్కదారి పట్టించి దొడ్డిదారిన మిక్సింగ్‌ ప్లాంట్లకు
- సాగు చివరి దశకు చేరుకున్నా రైతన్నకు తప్పని ఇక్కట్లు
- మరోవైపు బలవంతంగా కాంప్లెక్స్‌ ఎరువుల భారం
- ఒకే సీజన్‌లో రెండుసార్లు ధరలు పెంచిన కంపెనీలు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడి ఖర్చులతో అన్నదాత కన్నీళ్లు

2లో

ఇండియా ఏఐ ఎక్స్‌పోలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

6లో

## ఘనంగా ప్రారంభమైన ఇండియా ఏఐ ఎక్స్‌పో!

- లాంఛనంగా ప్రారంభించిన ప్రధాని మోదీ
- తరలివచ్చిన పారిశ్రామిక, ఏఐ నిపుణులు
- రంగాలవారీగా ఏఐ ప్రభావంపై చర్చలు
- ఐదు రోజులపాటు జరగనున్న ఎక్స్‌పో
- పాల్గొననున్న 20 మంది దేశాధినేతలు
- 19న సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగం

## జేఈఈ మెయిన్‌లో ఏపీ విద్యార్థుల సత్తా

మహిత్‌

మోహిత్‌

- మహిత్‌, మోహిత్‌లకు 100 స్కోర్‌
- మహిత్‌ ఓబీసీ–ఎన్‌సీఎల్‌ విభాగంలో, మోహిత్‌ జనరల్‌ కేటగిరీలో దేశంలో టాపర్లుగా ఘనత
- ఎస్సీ విభాగంలో దేవ శ్రీవేధ్‌ 99.99 స్కోర్‌తో టాపర్‌

10లో


డీహైడ్రేషన్ గురించి తెలుసుకుందాం

**డీహైడ్రేషన్: ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్య**

ప్రతి సంవత్సరం లక్షలాది మంది భారతీయులు డీహైడ్రేషన్ వల్ల ప్రభావితమవుతున్నారు. దీనివల్ల శరీరానికి అవసరమైన ద్రవాలు మరియు ఎలక్ట్రోలైట్స్ గణనీయంగా తగ్గిపోతాయి.

డయేరియా వంటి వ్యాధుల సమయంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అయితే హీట్ స్ట్రోక్, మసిల్ క్రాంప్స్, రోజువారీ పనులు, తీవ్రమైన శారీరక శ్రమ, క్రీడల సమయంలో కూడా డీహైడ్రేషన్ ఏర్పడుతుంది.

**నీరు ఎందుకు సరిపోదు?**

డీహైడ్రేషన్ సంభవించినప్పుడు శరీరం గణనీయమైన మొత్తంలో సోడియం, పొటాషియం మరియు క్లోరైడ్లను కోల్పోతుంది.

**ఎలక్ట్రోలైట్స్ పాత్ర**

ఎలక్ట్రోలైట్స్ నరాలు మరియు కండరాల పనితీరు, ద్రవ సమతుల్యత, కణ జీవక్రియను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి కండరాలు కుదించడానికి లేదా సడలడానికి సహాయపడతాయి మరియు కణాల లోపల బయట సరైన ద్రవ సమతుల్యతను ఉంచుతాయి.

$Na^+$ $Cl^-$ సోడియం + క్లోరైడ్: ద్రవ సమతుల్యతను నిలబెడతాయి

$K^+$ పొటాషియం: కండరాల పనితీరు మరియు నరాల సంకేతాలకు సహాయపడుతుంది

$Ca^{2+}$ కాల్షియం: నరాల పనితీరు మరియు కండర కుదింపుకు అవసరం

$Mg^{2+}$ మెగ్నీషియం: రోగనిరోధక శక్తికి సహాయం చేస్తుంది, నరాలు, కండరాల పనితీరుకు అవసరం

**ప్రత్యేక అవసరాలకు సరైన ఉత్పత్తిని ఎంచుకోవాలని మేము ఎప్పుడూ సిఫార్సు చేస్తాము:**




డీహైడ్రేషన్ వల్ల కలిగే అతిసారం మరియు వాంతులు[1]

W.H.O. సిఫార్సు చేసిన ఫార్ములా

- ORSL (ఓరసల్ ) ఇప్పుడు Oral Rehydration Salts (ORS) 'ఔషధ' పోర్ట్‌ఫోలియోకు కొత్త బ్రాండ్.
- ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) మరియు CDSCO మార్గదర్శకాల ప్రకారం డయేరియా వల్ల వచ్చే డీహైడ్రేషన్ చికిత్స కోసం రూపొందించబడింది.
- ఇవి రెడీ-టు-డ్రింక్ మరియు పౌడర్ రూపాల్లో అందుబాటులో ఉన్నాయి.
- డయేరియా ఉన్నప్పుడు, మా WHO ORS ఉత్పత్తులనే తీసుకోవాలని మేము ఖచ్చితంగా సిఫార్సు చేస్తాము.

'ప్రతిరోజూ తగినంత నీరు తాగడం'

అలసట మరియు నీరసం*

2X | 4X

**నూతనంగా & మెరుగ్గా eRZL**

- FSSAI నియమాల ప్రకారం 'ఎలక్ట్రోలైట్ పానీయం' ఆహార విభాగానికి కొత్త బ్రాండ్ పేరు ERZL.
- అలసట, ఎండ వల్ల కలిగే నీరసం, లేదా బయట పనులు మొదలైన సమయాల్లో రోజువారీ హైడ్రేషన్ కోసం ఇది రూపొందించబడింది.
- ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే వారి కోసం తక్కువ క్యాలరీల ఎంపిక.
- ఇందులో సుక్రలోజ్ ఉంటుంది, ఇది FSSAI అనుమతించబడిన పరిమితుల్లో సురక్షితమైన నాన్-క్యాలరీ స్వీటెనర్. ఇది అంతర్జాతీయ ఆహార నియంత్రణ సంస్థలు (కోడెక్స్, EFSA మరియు అమెరికా FDA) వినియోగానికి కూడా ఆమోదించబడింది

వినియోగదారులు ఉత్పత్తి లేబుళ్లను జాగ్రత్తగా చదివి సరైన హైడ్రేషన్ పరిష్కారాలను ఎంచుకోవాలని మేము ప్రోత్సహిస్తున్నాము.

ORSL మరియు eRZL గురించి మరింత తెలుసుకోవడానికి, దయచేసి మా కస్టమర్ సర్వీస్‌ను సంప్రదించండి (ఇమెయిల్: consumer-in@kenvue.com & Toll-Free 1800228111).

1 *compared to previous composition 2 note on NSS.docx.pdf ¹Basis DCGI approval of oral rehydration solution. ˆ2X faster hydration as compared to hypertonic beverages. ‡4x more Electrolytes compared to leading brand of sports (electrolyte) drink. ˆ87% Less sugar compared to previous variant under erstwhile brand name. #During Mild to moderate Non-Diarrheal dehydration only.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

## క్లుప్తంగా...

### 26న నెల్లూరు మేయర్, ఏలూరు డిప్యూటీ మేయర్ పదవికి ఎన్నిక

**సాక్షి, అమరావతి:** నెల్లూరు కార్పొరేషన్ మేయర్, ఏలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులకు ఈ నెల 26న ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు కార్పొరేషన్ల కార్పొరేటర్లతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్న ఎమ్మెల్యే, ఎంపీలకు ఈనెల 20లోగా ఎన్నిక సమాచార నోటీసులు అందించాలని సూచించారు. 26న ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏ కారణంతోనైనా 26న ఎన్నికలు జరగకపోతే 27న నిర్వహించాలని పేర్కొన్నారు.

### 23న పాలిటెక్నిక్ లెక్చరర్ల సర్టిఫికెట్ల పరిశీలన

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను కమిషన్ తన అధికారిక వెబ్‌సైట్ **www. psc.ap.gov.in** లో ఉంచింది. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 23న విజయవాడలోని కార్యాలయంలో పరిశీలించడంతోపాటు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి మెమో/కాల్ లెటర్, రెండు సెట్‌ల చెక్ లిస్టులు, రెండు సెట్‌ల అటెస్టేషన్ ఫారాలు, ఇతర పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

### గీతంకు సుప్రీంకోర్టు 'షాక్'!

- నాలుగు వారాల్లోగా రూ.15 కోట్ల డిపాజిట్‌కు ఆదేశం
- విద్యుత్ బకాయిలపై గీతం వర్సిటీకి చుక్కెదురు

**సాక్షి, న్యూఢిల్లీ:** విద్యుత్ బకాయిల చెల్లింపు వ్యవహారంలో గీతం యూనివర్సిటీకి సుప్రీం కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వీబీసీ ఫెర్రో అల్లాయిస్ కంపెనీకి సంబంధించిన విద్యుత్ బకాయిల వ్యవహారంలో నాలుగు వారాల్లోగా రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని వర్సిటీ యాజమాన్యాన్ని సుప్రీం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బకాయిలతో తమకు సంబంధం లేదన్న గీతం తరపు న్యాయవాదుల వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. వివరాల్లోకి వెళితే.. వీబీసీ ఫెర్రో అల్లాయిస్ సంస్థ నుంచి గీతం గతంలో భూములను కొనుగోలు చేసింది. అయితే, వీబీసీ సంస్థ విద్యుత్ శాఖకు భారీగా బకాయిలు పడింది. వీబీసీ చెల్లించాల్సిన రూ.118 కోట్ల బకాయిలను, ఆ సంస్థ ఆస్తులు కొనుగోలు చేసిన గీతం వర్సిటీనే చెల్లించాలంటూ తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాలు చేస్తూ గీతం వర్సిటీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. అక్కడ గీతంకు ఊరట లభించలేదు. రూ.54 కోట్లు చెల్లించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ గీతం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాగా ఈ అంశంలో వీబీసీ సంస్థకు, గీతంకు ఉన్న సంబంధం ఏమిటన్నది హైకోర్టు తేల్చుతుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

### సీఎంఆర్ కమీషన్లకు బేరసారాలు అవాస్తవం

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్) :** రైస్ మిల్లర్లపై కమీషన్ల కోసం ఎవరి ఒత్తిడీలేదని ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ స్పష్టంచేసింది. కమీషన్ల కోసం బేరసారాలు అవాస్తమని తెలిపింది. విజయవాడ ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో సోమవారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి వెంకటేశ్వరరావు, వల్లూరి సూర్య ప్రకాశరావు మీడియాతో మాట్లాడుతూ.. సీఎంఆర్ విషయంలో మంత్రులతో మిల్లర్లు కమీషన్ల కోసం బేరసారాలు కుదుర్చుకున్నారంటూ వచ్చిన వార్తల్లో ఎటువంటి వాస్తవంలేదన్నారు.

మీ పప్పులుడకవ్ అని రైస్ మిల్లర్ల ఫోన్ సార్!!

# వ్యవ'సాయం' ఎక్కడ?

## అరకొర కేటాయింపులతో అన్నదాతకు చంద్రబాబు పంగనామాలు

### ఉచిత పంటల బీమా అటకెక్కించేసి కొత్త బీమా నాటకాలు

**సాక్షి, అమరావతి :** పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాతా సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తానని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదు. కనీసం అన్నదాతకు యూరియా అందించలేని అన్యాయమైన పాలన ఇది. ఉచిత పంటల బీమా అటకెక్కింది.. ఇన్‌పుట్ సబ్సిడీ ఊసేలేదు.. సున్నా వడ్డీకి సున్నా చుట్టింది. మొత్తంగా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు సర్కార్ ఈ మూడో బడ్జెట్‌లోనూ రైతుకు మొండిచెయ్యి చూపింది. రాష్ట్రంలో గత 20 నెలలుగా అన్ని విధాలుగా నష్టపోయి తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రైతులను ఆదుకునే దిశగా వ్యవసాయ రంగంలో తగిన కేటాయింపులు జరపడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైంది. అరకొర కేటాయింపులతో రైతులకు పంగనామాలు పెట్టింది. 3.32 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.12,152 కోట్లు, అనుబంధ శాఖలకు రూ.3,589 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిపారు. అంటే మొత్తం బడ్జెట్‌లో 4.74 శాతానికి మించలేదు. పైగా అసెంబ్లీ సాక్షిగా గతేడాది 46.86 లక్షల మంది రైతులకు రూ.6,309 కోట్ల పెట్టుబడి సాయం అందజేశామని.. జోన్, నాన్ జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ యూనిట్ రూ.1.50 చొప్పున విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూ పచ్చి అబద్ధాలు చెప్పు కొచ్చారు. మరో వైపు కొత్తగా రూ.లక్ష కోట్లతో రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దుతున్నామని, ఇందులో రూ.30 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని చెబుతూ.. ఉద్యాన శాఖకు మాత్రం రూ.1,123.86 కోట్లకు మించి కేటాయింపులు జరపక పోవడం విస్మయానికి గురి చేస్తోంది.

#### పంటల బీమాకు మంగళం పాడేందుకే

ఐదేళ్ల పాటు రైతులపై పైసా భారం పడకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని అటకెక్కించేసిన చంద్రబాబు ప్రభుత్వం.. స్వచ్ఛంద నమోదు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. 2024–25 బడ్జెట్‌లో పైసా కేటాయించలేదు. 2025–26లో రూ.1,023 కోట్లు కేటాయించినా పైసా ఖర్చు చేయలేదు. రెండేళ్లుగా ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన రూ.2,419.44 కోట్ల ప్రీమియం ఎగ్గొట్టడంతో ప్రస్తుత రబీ సీజన్ నుంచి కంపెనీలు ఏపీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశాయి. ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతులకు రావాల్సిన రూ.3,500 కోట్లకుపైగా బీమా పరిహారం అందకుండా పోయింది. దీంతో ఈ ఏడాది ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తారని రైతులు ఆశపడ్డారు. కనీసం ఈ ప్రీమియం బకాయిలతో పాటు రానున్న వ్యవసాయ సీజన్‌కు తగిన నిధులు కేటాయిస్తారని భావించారు. కానీ ఇందుకు విరుద్ధంగా ఈ పథకానికి కేటాయింపులు గతేడాదితో పోలిస్తే నాలుగో వంతుకు తగ్గించి, రూ.250 కోట్లతో సరిపెట్టారు. గతేడాది అరటి, మిరప, పొగాకు బొప్పాయి, మామిడి, చీనీ, టమాట, ఉల్లి వంటి పంటలకు గిట్టుబాటు ధర దక్కలేదు. అయినప్పటికీ మార్కెట్‌లో జోక్యం చేసుకొని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకున్న దాఖలాలు లేవు.




### ఈ హామీలన్నీ అటకెక్కినట్టేనా?

- రాయితీపై సోలార్ పంప్ సెట్ల ఏర్పాటు మాటేంటి?
- గుర్తింపు కార్డులు అందజేసిన కౌలు రైతులకు అన్ని సంక్షేమ పథకాలు ఎప్పుడు అందిస్తారు?
- రైతు కూలీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు.. తద్వారా వారికి రాయితీలు, సంక్షేమ పథకాలు ఎప్పుడిస్తారు?
- దళారుల దోపిడీని అరికట్టడానికి ఏపీఎంసీ యాక్టును పటిష్టంగా ఎప్పుడు అమలు చేస్తారు?
- పాడి రైతులకు పశుగ్రాసం సాగు కోసం బంజరు భూములు కేటాయింపు ఎంత వరకొచ్చింది?
- పశువుల కొనుగోళ్లు, దాణా, మందుల కొనుగోళ్లపై సబ్సిడీలు ఏమయ్యాయి? పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఎప్పుడు కల్పిస్తారు?
- ఆక్వా రైతులకు జోన్, విస్తీర్ణంతో సంబంధం లేకుండా అందరికీ యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా సంగతేంటి?
- వీటిలో ఏ ఒక్క హామీ అమలు కోసం ఈ బడ్జెట్‌లో ఒక్క రూపాయి అయినా కేటాయించారా?

### ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లేనా?

'ధరల స్థిరీకరణ నిధి కింద గతేడాది రూ.300 కోట్లు కేటాయించాం. ఈ ఏడాది దాన్ని రూ.500 కోట్లకు పెంచాం' అని ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడం రైతులను ఆగ్రహానికి గురిచేస్తోంది. మరోవైపు నాన్ సబ్సిడీ విత్తనాలకు మంగళం పాడేశారు. సబ్సిడీ విత్తనానికి కోత పెట్టారు. గతేడాది రూ.182 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పిన ప్రభుత్వం ఈ ఏడాది రూ.240 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పుకొచ్చింది. వాస్తవానికి మార్కెట్‌లో విత్తన ధరలు భారీగా పెరిగాయి. ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవని రైతులు చెబుతున్నారు. రెండేళ్లుగా సున్నా వడ్డీ రాయితీ పథకం కింద పైసా చెల్లించలేదు. ఈ ఏడాది రూ.250 కోట్లు కేటాయించడం పట్ల రైతులు మండిపడుతున్నారు. రెండేళ్లుగా కట్ట యూరియా కోసం రైతులు ఏవిధంగా ఇబ్బందుల పాలయ్యారో అందరూ ప్రత్యక్షంగా చూశారు. బఫర్ స్టాక్ కోసం రూ.200 కోట్లు ఖర్చు చేస్తామంటూ గొప్పగా ప్రకటించిన ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.40 కోట్లకు పరిమితం చేసింది. 20 నెలల్లో ప్రకృతి వైపరీత్యాల్లో దెబ్బతిన్న రైతులకు రూ.1,100 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలుండగా, ఆ ఊసెత్తకుండా రూ.310 కోట్ల పెట్టుబడి రాయితీ ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం. పట్టు, మార్కెటింగ్, పశు సంవర్ధక, మత్స్య శాఖల కేటాయింపులు పూర్తిగా సిబ్బంది జీత భత్యాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సరిపడా తప్ప కొత్తగా ఒక్క పథకాన్ని ప్రకటించలేదు. ఒక్క రూపాయి అదనంగా కేటాయింపులు జరపలేదు.

# యూరియా..'ప్రైవేట్' దయ!

### రబీలోనూ కటకటే.. అన్నదాతల అగచాట్లు ■ బయట ఎమ్మార్పీకి మించి ఇష్టారాజ్యంగా దోపిడీ.. ■ బస్తా రూ.350 నుంచి రూ.600 దాకా బాదుడు..

#### అదనంగా రూ.13 వేల భారం

నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం లింగాపురానికి చెందిన ఎర్రం కృష్ణారెడ్డి రబీలో 20 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఎన్నిసార్లు తిరిగినా సొసైటీలో, రైతు సేవా కేంద్రాల్లో ఒక్క కట్ట కూడా యూరియా దొరకకపోవడంతో ప్రైవేట్ డీలర్ల వద్ద కొన్నాడు. ఎమ్మార్పీ ప్రకారం బస్తా యూరియా ధర రూ.266 కాగా గత్యంతరం లేని పరిస్థితుల్లో పంటను కాపాడుకోవడానికి రూ.495 చొప్పున 58 బస్తాలు కొనుగోలు చేశాడు. దీంతో రూ.13 వేలకు పైగా అదనంగా భారం పడిందని 'సాక్షి' ఎదుట రైతు వాపోయాడు. యూరియాతో పాటు బలవంతంగా అంటగట్టిన కాంప్లెక్స్ ఎరువుల కోసం మరో రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని చెప్పాడు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే కావాల్సినంత యూరియా ఇచ్చేవారని, ఐదేళ్లలో ఏ రోజూ ఎరువుల కోసం ఊరు దాటాల్సిన పరిస్థితి రాలేదని గుర్తు చేసుకున్నాడు. ఇప్పుడు ఖరీఫ్‌లో మొదలైన అగచాట్లు రబీలోనూ వెంటాడుతున్నాయని, ఇలాగైతే వ్యవసాయం చేసేదెలా? అంటూ నిర్వేదం వ్యక్తం చేశాడు.

విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జింగివలస రైతు సేవా కేంద్రం వద్ద ఈనెల ఐదో తేదీన యూరియా కోసం బారులు తీరిన రైతులు

**సాక్షి, అమరావతి:** ఖరీఫ్‌లోనే కాదు.. రబీలోనూ అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు. రబీ సీజన్ చివరి దశకు చేరుకున్నా యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పాస్ పుస్తకాలు, చెప్పులు, క్యూలైన్లలో బారులు తీరుతున్నాయి. వచ్చిన యూరియా వచ్చినట్లుగా దొడ్డి దారిన మిక్సింగ్ ప్లాంట్లకు తరలిపోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. చంద్రబాబు సర్కారు నిర్వాకాలతో బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తా రూ.350 నుంచి రూ.600 చొప్పున కొనాల్సిన అగత్యం ఏర్పడింది. మరోవైపు ఎన్నడూ లేని విధంగా ఒకే సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువుల ధరలు రెండుసార్లు పెరగడం రైతులకు పెనుభారంగా మారింది. ఇప్పటికే కూలీల కొరతతో పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అన్నదాతా సుఖీభవ కింద రెండేళ్లలో ఒక్కో రైతుకు రూ.40 వేలు చొప్పున ఇవ్వాల్సి ఉండగా.. రూ.30 వేలు ఎగ్గొట్టిన చంద్రబాబు సర్కారు రూ.పది వేలు మాత్రమే విదిల్చింది. ఏడు లక్షల మందికి ఎగనామం పెట్టింది. కౌలు రైతులకైతే రూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. సున్నా వడ్డీకి చాప చుట్టేశారు. ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టారు. ఉచిత పంటల బీమాను ఎత్తివేయడంతో బీమా పరిహారానికి రైతులు దూరమయ్యారు. ఇక 20 నెలలుగా ధాన్యం సహా ఏ ఒక్క పంటకూ మద్దతు ధరలు దక్కడం లేదు. చంద్రబాబు అధికారంలోకి రాగానే నాన్ సబ్సిడీ విత్తనాల పంపిణీని ఎత్తివేశారు. సబ్సిడీ విత్తనాల సరఫరాలో అడ్డగోలుగా కోత పెట్టారు. కనీసం యూరియా కూడా అదునుకు అందించకుండా రైతులు అధికంగా వినియోగిస్తున్నారంటూ తమ వైఫల్యాన్ని వారిపై గెంటేస్తున్నారు.

#### పక్కదారి..

రబీ సీజన్‌లో వరి, జొన్న, మొక్కజొన్న పంటలకు యూరియా ఎక్కువగా వినియోగిస్తారు. రైతులకు అందాల్సిన యూరియా పక్కదారి పడుతోంది. ఒకవైపు యూరియా కోసం రైతులు అల్లాడుతుండగా.. మరోవైపు లక్షల టన్నుల విక్రయాలు పూర్తైనట్లు ప్రభుత్వం ప్రకటించడం విస్మయం కలిగిస్తోంది. అంటే ఆ యూరియా అంతా రైతుల పొలాలకు బదులుగా ప్రైవేట్ వ్యాపారుల ఆధీనంలోని బ్లాక్ మార్కెట్‌కు చేరిపోయినట్లు స్పష్టమవుతోంది. సీజన్‌లో 9.38 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా వేయగా ఇప్పటికే 6.27 లక్షల టన్నులు విక్రయించినట్లు ప్రభుత్వం చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో రైతులు ఒక్కకట్ట కోసం పడరాని పాట్లు పడుతుండటం గమనార్హం. సీజన్ చివరి దశకు చేరుకున్నప్పటికీ యూరియా దొరకని పరిస్థితి కొనసాగుతూనే ఉంది. నంద్యాల జిల్లాలో బయట మార్కెట్‌లో బస్తా రూ.500 పెట్టి కొన్నామని జొన్న, మొక్క జొన్న రైతులు చెబుతుండగా.. నెల్లూరు జిల్లాలో రూ.450 నుంచి రూ.500 వరకు చెల్లించినట్లు వరి సాగుదారులు వాపోతున్నారు. సొసైటీలు, ఆర్ఎస్‌కేల వద్ద రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా టీడీపీ నేతల సిఫారసు ఉంటేగానీ కరుణించడం లేదు.

#### విత్తగానే లక్షల టన్నుల విక్రయాలా?

రాష్ట్రంలో లక్షలాది టన్నుల యూరియా దారి మళ్లిపోయిందని సాగు గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. నెలలవారీగా సాగు, అమ్మకాలు పరిశీలిస్తే ఏ స్థాయిలో యూరియా పక్కదారి పట్టిందో వెల్లడవుతుంది. రబీ సీజన్ ఏటా అక్టోబర్‌లో ప్రారంభమై ఫిబ్రవరి వరకు కొనసాగుతుంది. పంటలకు ఆరంభంలోనే యూరియా పెద్దగా అవసరం ఉండదు. పంటలు వేయడమే ఆలస్యం.. లక్షల టన్నుల యూరియా విక్రయాలు జరిగిపోవడం దారి మళ్లించారనేందుకు నిదర్శనంగా నిలుస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

- అక్టోబర్‌లో 1.42 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా.. కేవలం 22 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. 6,500 ఎకరాల్లో జొన్న సాగైంది. ఒక్క ఎకరాలో కూడా మొక్కజొన్న సాగవలేదు. అయినా సరే అక్టోబర్‌లో ఏకంగా 1.12 లక్షల టన్నుల యూరియా అమ్మకాలు జరిగినట్లు ప్రభుత్వం చెబుతోంది.

#### మిశ్రమ ఎరువుల ధరలిలా
(50 కిలోల బస్తాకు రూ.ల్లో)

| ఎరువుల రకం | 2023-24 | 2024-25 | 2025-26 |
|---|---|---|---|
| ఎంవోపీ | 1,400 | 1,550 | 1,850 |
| 20:26:26 | 1,375 | 1,720 | 1,950 |
| 16:16:0 | 1,250 | 1,475 | 1,650 |
| 14:35:14 | 1,450 | 1,800 | 2,150 |
| 20:20:0:13 | 1,175 | 1,300 | 1,500 |
| 28:28:0:2:18 | 1,400 | 1,550 | 1,975 |
| 15:15:15:09 | 1,375 | 1,400 | 1,650 |
| 10:26:26 | 1,275 | 1,450 | 1,950 |
| 24:24:0 | 1,450 | 1,700 | 1,950 |

- నవంబర్‌లో 7.42 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా.. 1.20 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. 82 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 57 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. నవంబర్‌లో మరో 1.14 లక్షల టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి.
- డిసెంబర్‌లో మరో 21.12 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 6.07 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. 4.15 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 68 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. కానీ డిసెంబర్‌లో ఏకంగా 1.67 లక్షల టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి.
- జనవరిలో 15.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా... 8.7 లక్షల ఎకరాల్లో వరి, 2.07 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 55 వేల ఎకరాల్లో జొన్న పంటలు సాగయ్యాయి. జనవరిలో ఏకంగా 2.24 లక్షల టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. ఫిబ్రవరిలో మరో 1.77 లక్షల టన్నులు, మార్చిలో 1.28 లక్షల టన్నుల యూరియా అమ్మకాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

#### మిక్సింగ్ ప్లాంట్లకు మళ్లుతున్న యూరియా

యూరియా సహా ఎరువుల్లో సింహభాగం ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌లను కాదని ప్రైవేట్ వ్యాపారులకే కేటాయిస్తున్నారు. పట్టుమని పది శాతం ఆర్ఎస్‌కేలకు కూడా సరఫరా చేయడం లేదు. దీనివల్ల యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. పెద్ద ఎత్తున యూరియా దారి మళ్లుతున్నట్టు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి గతంలో స్వయంగా పేర్కొనడం గమనార్హం. సారా, బీర్ల తయారీతో పాటు రంగుల కంపెనీలు, వార్నిష్, ప్లైవుడ్, యాడ్ – బ్లూ ద్రావణం, పశువుల దాణా, కోళ్లు, చేపలు, రొయ్యల మేత తయారీ, కల్తీ పాల తయారీలో విచ్చలవిడిగా వాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. మూతపడిన మిక్సింగ్ ప్లాంట్లు ఇటీవల పెద్దఎత్తున తెరుచుకుంటున్నాయి. విజిలెన్స్ దాడులు మొక్కుబడిగా మారాయి.

#### 'కాంప్లెక్స్' ధరల మోత

ఒకవైపు యూరియా దొరకక అల్లాడుతుండగా మరోవైపు మిశ్రమ (కాంప్లెక్స్) ఎరువుల ధరల మోత మోగుతోంది. సీజన్ ప్రారంభంలోనే బస్తాకు రూ.100 నుంచి రూ.500 వరకు పెంచేసిన కంపెనీలు తాజాగా మరోసారి రూ.50 నుంచి రూ.250 మేర పెంచేశాయి. సూక్ష్మసేద్యంలో వినియోగించే ప్రత్యేక ఎరువుల (వాటర్ సాల్యుబల్ ఫెర్టిలైజర్స్) ధరలను సీజన్ ఆరంభంలోనే 25–50 శాతం మేర పెంచాయి. ఎకరాకు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు అదనంగా భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. పెరిగిన ఎరువుల ధరలు, కూలీలు ఖర్చులు, యంత్రాల అద్దెలన్నీ కలిపితే వరికి రూ.6 వేలు, మొక్కజొన్నకు రూ.8 వేల వరకు ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు పెరిగాయి.

#### ఎన్నిసార్లు వెళ్లినా 'నో స్టాక్'



రబీలో 4 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగి వ్యవసాయం భారంగా మారింది. సరిపడా యూరియా లభ్యం కావడం లేదు. రైతు సేవా కేంద్రాలలో అధికార పార్టీకి చెందిన వారికే అమ్ముతున్నారు. ప్రస్తుతం వరి పంటకు మూడో కోటా యూరియా వేయాలి. ఎన్నిసార్లు వెళ్లినా నో స్టాక్ అంటున్నారు. చేసేది లేక బహిరంగ మార్కెట్‌లో బస్తా రూ.400 పెట్టి కొన్నా. కాంప్లెక్స్ ఎరువులు 20 నుంచి 30 శాతం ధరలు పెంచేశారు. ఇలా అయితే వ్యవసాయం ఎలా చేయాలో అర్థం కావడం లేదు.

– ఏలూరు శ్రీధర్ రెడ్డి మనుబోలు నెల్లూరు జిల్లా,

#### రూ.3వేలకుపైగా అదనపు భారం

ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఇప్పటి వరకు రూ.1.15 లక్షలు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. మంచి దిగుబడి రావాలంటే యూరియా చాలా అవసరం. రైతు సేవా కేంద్రం సిబ్బంది స్టాక్ లేదు అంటున్నారు. బయట బస్తా రూ.350–400 పెట్టి దాదాపు 25 బస్తాల యూరియా కొన్నా. రూ.3 వేలకు పైగా అదనపు భారం పడింది. ఖరీఫ్‌లోనూ ఇలాగే ఇబ్బందిపడ్డాం.

– జి.డి.వీరదాస్, బ్రహ్మసముద్రం, అనంతపురం జిల్లా

#### రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకనే..



అదునుకు రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. కృష్ణా,. గోదావరి డెల్టాలో ధాన్యం, మొక్కజొన్న, మినుము తదితర పంటలకు ప్రస్తుతం యూరియా ఎంతో అవసరం. ఎన్టీఆర్, నెల్లూరు, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాలలో యూరియా కొరత ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.

– వి.కృష్ణయ్య, అధ్యక్షుడు, ఏపీ రైతు సంఘం

#### ఉత్పత్తి వ్యయం పెరిగిపోయింది..



అదునుకు యూరియా దొరక్క రబీలో రైతులు చాలా ఇబ్బందిపడ్డారు. రూ.267కు లభించాల్సిన బస్తా బ్లాకులో రూ.400 నుంచి రూ.600కు కొనుక్కోవల్సి వస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడం, పెరిగిన కూలీ ఖర్చులు, యంత్రాల అద్దెల కారణంగా ఉత్పత్తి వ్యయం పెరిగిపోయింది. పంటలను మద్దతు ధరకు కొనే వారు లేక రైతులు నష్టానికి అమ్ముకుంటున్నారు. రైతు సంక్షేమం పేరిట ప్రకటనలకు పరిమితమవుతున్న చంద్రబాబు ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో విఫలమవుతోంది.

– ఎంవీఎస్ నాగిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్, ఏపీ వ్యవసాయ మిషన్

## క్లుప్తంగా...

### స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులకు బెదిరింపులు

- సమ్మెలో పాల్గొన్న 146 మంది నేతలకు వార్నింగ్ లెటర్లు

**ఉక్కునగరం:** ఈ నెల 12న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులకు యాజమాన్యం వార్నింగ్ లెటర్లు జారీ చేసింది. దేశవ్యాప్త కార్మిక సమస్యలు, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 12న దేశవ్యాప్తంగా సమ్మె జరిగింది. ఈ సమ్మెలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కూడా కొంతమంది పాల్గొన్నారు. ఈ కారణంతో 146 మంది కార్మిక నాయకులు, కార్మికులకు యాజమాన్యం వార్నింగ్ లెటర్లు అందజేసింది. సమ్మెలోని అంశాలు రీజనల్ లేబర్ కమిషనర్ వద్ద సయోధ్య దశలో ఉన్నందున సమ్మె చట్ట వ్యతిరేకమన్నారు. ఇకపై అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆమోదించిన లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక నాయకులకు వార్నింగ్ లెటర్లు ఇవ్వడంపై స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### మే 1 నుంచి గృహ గణన

**సాక్షి, అమరావతి:** కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నిబంధనల మేరకు రాష్ట్రంలో జనాభా గణనకు సంబంధించి ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి నెలాఖరు వరకు గృహాల లిస్టింగ్, గృహగణన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2027 జనాభా లెక్కల సేకరణ కార్యకలాపాలు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ మధ్య దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో గృహాల లిస్టింగ్, గృహ గణన ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి అదే నెలాఖరు వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### సమగ్ర కులగణన చేపట్టాలి

సీపీఐ డిమాండ్

**బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ):** రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం కాకినాడలో జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం బీసీ కులాలు ఐక్యంగా పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ సీనియర్ నాయకులు కె.నారాయణ, కె.రామకృష్ణ మాట్లాడుతూ జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టాలని దేశవ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

### ఆర్టీసీ డిపోలను అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్
- ఈనెల 20న నిరసనలు

**సాక్షి, అమరావతి:** విద్యుత్ బస్సు ఆపరేటర్లకు ఆర్టీసీ డిపోలను అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఆర్టీసీ హౌస్‌లో వీసీఎండీ, ఈడీ(ఏ), ఈడీ(ఈ)కి ఈ మేరకు లేఖలు సమర్పించింది. విద్యుత్ బస్సుల అంశంలో ఉద్యోగులలో నెలకొన్న ఆందోళనలను తొలగించేలా ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించాలని యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య ఆ లేఖల్లో కోరారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆర్టీసీ యాజమాన్యమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు నిరసనగా విద్యుత్ బస్సులు ప్రవేశపెడుతున్న 11 డిపోల ఎదుట ఈ నెల 20న నిరసన చేపట్టనున్నట్టు ప్రకటించారు.

### పంచాయతీ నిధులపై ఆంక్షలు ఎత్తేయండి

సర్పంచుల సంఘం డిమాండ్

**సాక్షి, అమరావతి:** గ్రామ పంచాయతీలు ఇంటి పన్నుల రూపంలో వసూలు చేసుకున్న సాధారణ నిధులతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల్ని ఎత్తివేయాలని సర్పంచుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ తీర్మానం మేరకు బిల్లులు చెల్లించేందుకు సర్పంచులకు పూర్తి అధికారాలు ఉన్నాయని, గ్రామ ప్రజల అవసరాల కోసం ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోతే గ్రామస్థాయిలో తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు. గతంలో మాదిరిగానే గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, సైడ్ డ్రెయిన్స్, విద్యుత్ పరికరాల కొనుగోలు, మోటార్ రిపేర్లు వంటి అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించుకునేలా ఆదేశాలను సడలించాలని కోరారు.

## న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మేడమల్లికి ఘన సన్మానం

**సాక్షి, అమరావతి:** హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ఇటీవల నియమితులైన జస్టిస్ మేడమల్లి బాలాజీని హైకోర్టు న్యాయవాదుల సంఘం సోమవారం ఘనంగా సత్కరించింది. సంఘం నేతలు ఆయన్ను శాలువాతో సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) చల్లా ధనంజయ, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) సాంబశివ ప్రతాప్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి చేజర్ల సుభోధ్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసం కుమ్ములాట!

- వైద్యశాఖను ఆదాయ వనరుగా మార్చుకున్న ప్రభుత్వ పెద్దలు
- కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల వ్యవహారంలో ఓ అమాత్యుడు, నామినేటెడ్ నేత మధ్య వార్
- మేం చెప్పిందే వేదం.. నామినేటెడ్ నేత డమ్మీ.. అంటూ అమాత్యుడి వర్గం ప్రచారం
- అమాత్యుడి వర్గీయులు ఏపీఎంఎస్ఐడీసీ వైపు వస్తే కొట్టిస్తానని నామినేటెడ్ నేత హెచ్చరిక



**సాక్షి, అమరావతి:** వైద్యశాఖలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకునే వ్యవహారంలో అధికార కూటమికి చెందిన ఇద్దరు నేతల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఏపీ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)లో తాము చెప్పిందే ఫైనల్ అంటూ ఓ అమాత్యుడి వర్గం ప్రచారం చేస్తోంది. దీనిపై ఓ నామినేటెడ్ పదవి పొందిన నేత రగిలిపోతున్నారని సమాచారం. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన వైద్యశాఖను ముఖ్య నేతలు ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు. ఈ శాఖలోని రూ.వేల కోట్ల కాంట్రాక్టును అడ్డదారుల్లో అస్మదీయ సంస్థకు ప్రభుత్వ పెద్దలు కట్టబెట్టేశారు. మరోవైపు మందులు, సర్జికల్స్, వైద్య పరికరాలు కొనుగోళ్లు, సెక్యూరిటీ, శానిటేషన్, ఇతర సేవల్లోనూ కమీషన్లు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారు. వీరి దోపిడీకి ఏపీఎంఎస్ఐడీసీ కేంద్రంగా మారింది. మందులు, సర్జికల్స్, వైద్య పరికరాల కొనుగోళ్లు, సెక్యూరిటీ, శానిటేషన్, ఇతర సేవల కల్పనలో కాంట్రాక్టర్ల నుంచి అమాత్యుడు ప్రత్యేక ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన్ను కలిసి వస్తేనే కాంట్రాక్ట్, బిల్లులు, పర్చేజ్ ఆర్డర్(పీవో) ఇస్తామని కాంట్రాక్టర్లకు అధికారులే బాహాటంగా చెబుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మనుషులతో కొట్టిస్తా..!

వైద్యశాఖలో అక్రమ వసూళ్ల కోసం అమాత్యుడు ప్రైవేట్ సైన్యాన్ని మోహరించారు. వీరిని కలిసి డీల్ కుదుర్చుకున్న వారికే కాంట్రాక్టులు అన్నట్టుగా పరిస్థితిని మార్చేశారు. ఏకంగా టెండర్లలోనే అవకతవకలకు పాల్పడి, తమను ప్రసన్నం చేసుకోని సంస్థలను ముప్పు తిప్పలు పెట్టి, వాటికి కాంట్రాక్ట్ దక్కకుండా చేస్తున్నారు. మరోవైపు నామినేటెడ్ నేత సైతం కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఒకవైపు అధికార యంత్రాంగం, మరోవైపు అమాత్యుడు, ఇంకోవైపు నామినేటెడ్ నేత కమీషన్ల కోసం ఇబ్బందులు పెడుతుండటంతో విసిగిపోయిన కాంట్రాక్టర్లు... ఇంతమందికి కమీషన్లు ఇవ్వడం మావల్ల కాదంటూ తేల్చి చెప్పేశారని తెలిసింది. దీంతో తాము చెప్పిందే ఫైనల్... నామినేటెడ్ నేత డమ్మీ... అంటూ అమాత్యుడి వర్గీయులు కాంట్రాక్టర్లకు సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. దీనికి తగ్గట్టుగానే ఏపీఎంఎస్ఐడీసీలో అమాత్యుడికి కమీషన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్న ఓ కీలక అధికారి సదరు నామినేటెడ్ నేత చెప్పిన సిఫార్సులను కనీసం పరిగణనలోకి తీసుకోవడం మానేశారని తెలిసింది. ఏపీఎంఎస్ఐడీసీలో తాను చెప్పిందేదీ జరగకపోవడం, అమాత్యుడి వర్గీయులు డమ్మీ అంటూ ప్రచారం చేయడాన్ని నామినేటెడ్ నేత సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. అమాత్యుడి వర్గీయులు కార్పొరేషన్ వైపు వస్తే తన మనుషులతో కొట్టిస్తానని ఆయన హెచ్చరించినట్టు తెలిసింది. పేదలకు నాణ్యమైన వైద్యసేవల కల్పనలో కీలకమైన ఏపీఎంఎస్ఐడీసీలో కమీషన్ల కోసం ఇద్దరు నేతలు జగడాలకు దిగుతుండటం ఇదే తొలిసారని వైద్యవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఇలాంటి దుస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని పలువురు వైద్యులు, అధికారులు అభిప్రాయపడుతున్నారు.

తుని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీఆర్వోలు

## బలవన్మరణాలకు పాల్పడుతున్నా పట్టదా?

- ప్రభుత్వంపై ఉద్యోగుల తిరుగుబాటు
- స్పందించకపోతే మార్చి ఒకటో తేదీ నుంచి పెన్‌డౌన్
- ఉమ్మడి 'తూర్పు'న నిరసన జ్వాల

**సాక్షి ప్రతినిధి, కాకినాడ:** పనిభారం పెంచేసి మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వ తీరుపై ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం నిరసన గళం వినిపించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగారు. కరప, ఉప్పాడకొత్తపల్లి, తుని రూరల్, నిడదవోలు తదితర మండలాల్లో ధర్నాలు చేపట్టారు. కొన్ని చోట్ల భోజన విరామ సమయంలో కార్యాలయాల వద్ద నిరసన తెలపగా, మరికొన్ని చోట్ల వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు నల్లబ్యాడ్జీలతో ధర్నాలు చేశారు. సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఇష్టమొచ్చినట్టు పనులు అప్పగించి తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తుండటంతో ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ శాఖ పరిధిలో పనిచేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్‌లు ఇలా అందరినీ డీడీవో పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు పరిష్కరించకుంటే మార్చి1 నుంచి పెన్‌డౌన్ చేపడతామని హెచ్చరించారు. ఉన్నతాధికారులకు తమ సమస్యలను తెలియజేసినా న్యాయం చేయకపోవడంతోనే రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు ఈ నెల 12న వర్క్ టు రూల్ అమలు చేస్తుంటే, కొంతమంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు.

## కులవివక్షతోనే సంక్షేమ హాస్టళ్లు నిర్వీర్యం

- వెనుకబడిన కులాలంటే సీఎం చంద్రబాబుకి చిన్నచూపు
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఫైర్

**సాక్షి, అమరావతి:** వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంటే చంద్రబాబుకి మొదటి నుంచీ చాలా చిన్నచూపని, అందువల్లే ఆయా వర్గాలకు చెందిన సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. అది కచ్చితంగా కులవివక్షే అని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో 900 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారని వెల్లడించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక ప్రకారం ఈ సంఖ్య 2019 నుంచి మూడేళ్లపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఘటనల కన్నా ఎక్కువని తెలిపారు. ఇది కచ్చితంగా చంద్రబాబు అసమర్థ పాలనకు, విద్యాశాఖను నిర్వహిస్తున్న నారా లోకేశ్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బిల్‌గేట్స్ పర్యటన కోసం చేస్తున్న ఖర్చును సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి వెచ్చించినా విద్యార్థులు ఆస్పత్రుల పాలు కావాల్సిన దుస్థితి రాదని సుధాకర్‌బాబు అన్నారు.

వెంటనే బిల్‌గేట్స్ పర్యటన ఖర్చు వివరాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్‌గేట్స్‌కు అమరావతి గ్రాఫిక్స్ చూపించి చంద్రబాబు మాయ చేయగలడేమో కానీ, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పెట్టే పురుగులన్నం బిల్‌గేట్స్‌కి పెట్టగలడా? అని ప్రశ్నించారు.

**విద్యార్థులను గాలికొదిలేసి లోకేశ్ జల్సాలు**

వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యార్థులకు రోజుకో మెనూతో మంచి పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందిస్తే, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సుధాకర్‌బాబు ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కూడా గడవకుండానే రూ.3.27 లక్షల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు విద్యార్థులకు మాత్రం నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. దుర్భర పరిస్థితుల మధ్య విద్యార్థులు చదువులు సాగించలేక ఇబ్బందులు పడుతుంటే మంత్రి లోకేశ్ మాత్రం ప్రత్యేక విమానాల్లో విదేశాలు తిరుగుతూ జల్సాలు చేస్తున్నాడని, క్రికెట్ మ్యాచ్‌లు చూసేందుకు విదేశాలకు వెళ్తున్నాడని ధ్వజమెత్తారు.

# డిజిటల్ విప్లవానికి భారత్ పునాది

- అమరావతి పర్యటనలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్
- ఈ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏపీకి కొత్త దశ దిశ: సీఎం చంద్రబాబు
- స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పాలనా విధానాలపై సీఎం ప్రజెంటేషన్

**సాక్షి, అమరావతి:** డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులున్నాయని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ చెప్పారు. తమ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే ఎక్కువని తెలిపారు. గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సోమవారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గేట్స్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందన్నారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో విద్యాబోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందని చెప్పారు. అలాగే, వ్యవసాయ రంగం చాలా ముఖ్యమైనదన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి కొత్త దశ, దిశ ఏర్పడుతుందన్నారు.ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని నంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిల్ గేట్స్, చిత్రంలో సీఎం చంద్రబాబు తదితరులు

**పది సూత్రాలతో స్వర్ణాంధ్ర–2047..**

కార్యక్రమంలో.. స్వర్ణాంధ్ర–2047 విజన్, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం.. తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం.. ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం.. నిరుద్యోగాన్ని 4.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గించడం.. మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం నుంచి 80 శాతానికి పెంచడం లక్ష్యంగా సీఎం చెప్పారు. అనంతరం.. బిల్ గేట్స్, సీఎం చంద్రబాబు కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సేంద్రీయ ఉత్పత్తులను ఆయన పరిశీలించారు.

**విమానం ల్యాండింగ్‌కు ఇబ్బందులు**

**విమానాశ్రయం(గన్నవరం):** గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బిల్‌గేట్స్ ప్రయాణిస్తున్న విమానానికి గన్నవరం విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. బిల్‌గేట్స్ ప్రత్యేక విమానంలో సోమవారం ఉదయం 8.15 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే దట్టమైన పొగమంచు రన్‌వే ప్రాంతాన్ని కప్పివేసింది. దీంతో రన్‌వే విజిబులిటీ లేక విమానం 15 నిమిషాలపాటు గాలిలో చక్కర్లు కొట్టింది. 8.30 గంటలకు పొగమంచు ప్రభావం తగ్గడంతో సురక్షితంగా రన్‌వేపై విమానం దిగింది.తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ఇక్కడికి చేరుకుని ప్రత్యేక విమానంలో వెళ్లిపోయారు.

**చట్టాలను సరళతరం చేస్తాం**

పాలనలో వివిధ ప్రక్రియలను, నిబంధనల్ని మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేస్తామన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసే విషయమై అధ్యయనం కోసం ఓ కమిటీ వేయాలని ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్షించారు. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా చెల్లింపులు ఇతర ప్రభుత్వ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కోకూడదని, ఆటోమేషన్ దిశగా అడుగులు వేయాలని ఆయన చెప్పారు.

## 'లుక్ ఔట్' జారీలో ఇంత అడ్డగోలా..?

- యాంత్రికంగా లుక్ ఔట్ సర్క్యులర్ ఇస్తున్నారని పోలీసులపై హైకోర్టు ఆగ్రహం
- 498ఏ కేసులో జారీ అయిన ఎల్ఓసీ కొట్టివేత

**సాక్షి, అమరావతి:** పోలీసులు ఇష్టారాజ్యంగా, యాంత్రికంగా లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేస్తుండడాన్ని కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. భార్యపై భర్త, అతని కుటుంబ సభ్యులు క్రూరంగా ప్రవర్తించడానికి సంబంధించి ఐపీసీ సెక్షన్ 498ఏ కింద నమోదు చేసే కేసుల్లో ఎల్ఓసీ జారీ చేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. తీవ్రమైన నేరాలు, ఆర్థిక అక్రమాలు, దేశానికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు సంబంధించిన కేసుల్లో మాత్రమే పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు నిందితులు దేశం విడిచి పారిపోకుండా ఉండేందుకు ఎల్ఓసీ జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం సరైన కారణం లేకుండా ఓ వ్యక్తి ప్రయాణాన్ని అడ్డుకోవడం అతని జీవించే హక్కును హరించడమే అవుతుందని స్పష్టం చేసింది. 498ఏ కింద నమోదయిన కేసులో నిందితుడిపై ఎల్ఓసీ జారీ చేస్తే అది ఆ వ్యక్తి ఉద్యోగ జీవితంపై ప్రభావం చూపుతుందని తెలిపింది. వైవాహిక వివాదాల కేసులు చాలా వరకు రాజీ ద్వారా ముగుస్తాయని, లేదా కేసు విచారణ ప్రారంభం కావడానికి చాలా సమయం పడుతుందని పేర్కొంది. ఇలాంటి కేసుల్లో ఎల్ఓసీ జారీ చేయాల్సిన అవసరం లేదంది. ప్రస్తుత కేసులో విశాఖపట్నానికి చెందిన ఎల్.వి.అరుణ్ కిరణ్‌పై పోలీసులు జారీ చేసిన ఎల్ఓసీని కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఇటీవల తీర్పు వెలువరించారు.

## కోనసీమలో అగ్నికుల క్షత్రియుల మహాధర్నా

కూనవరం డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్

**కాట్రేనికోన:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గచ్చకాయలపోర మొగవద్ద సోమవారం రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 14 గ్రామాలకు చెందిన 3 వేల మంది అగ్నికుల క్షత్రియులు మహాధర్నా చేపట్టారు. కూనవరం డ్రెయిన్ పూడికతీత పనులను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సముద్రం పర్ర పూడికతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మొగ మూసుకుపోవడంతో నీరు రాక మత్స్య సంపద లభించకపోవడంతో జీవనోపాధి కోల్పోతున్నామని వాపోయారు. కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల పరిధిలో 20 వేల మంది అగ్నికుల క్షత్రియులు పర్ర భూముల్లో చేపల వేట చేసుకుని జీవిస్తున్నారని నాగేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మొగ తవ్వించాలని డిమాండ్ చేశారు. గతంలో మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమా కూనవరం మేజరు డ్రైన్‌ను పరిశీలించి ఆటోమెటిక్ స్లూయిజ్ కట్టిస్తామని హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదని మండిపడ్డారు.



“ ప్రపంచం అంతా చీకటితో నిండిపోయినా, ఎప్పటికీ ఆరిపోని వెలుగులా మానవ ఆత్మ నిలిచే ఉంటుంది.

– జీవనానంద దాస్



సాక్షి

మంగళవారం, 17 ఫిబ్రవరి 2026

# వడివడిగా ఏఐ దిశగా...

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సృష్టించిన అనిశ్చితి సకల రంగాలనూ ఆవరించిన వేళ కృత్రిమ మేధ (ఏఐ) శిఖరాగ్ర సదస్సు సోమవారం దేశ రాజధాని నగరంలో ప్రారంభమైంది. ఈ మధ్య కాలంలో భారత్ 'బాధ్యతాయుత ఏఐ' అనే భావన నుంచి కోట్లాదిమంది వినియోగదారులు నేరుగా, భద్రంగా వాడుకునే పూర్తిస్థాయి ఏఐ వినియోగంలోకి తెచ్చే స్థాయికి ఎదిగింది. భారత్–విస్తార్ పేరిట 24 గంటలూ అన్ని ప్రాంతాల రైతులకూ వారి భాషల్లోనే సాగు రంగ సమస్యలపై సమాధానాలిచ్చే ఏఐ 'డిజిటల్ సాగు నిపుణుడు' రాబోతున్నాడు. ఇంకా ఆరోగ్య రంగంతో పాటు ఆరు కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అక్కరకొచ్చే ఏఐ మోడళ్లు రంగప్రవేశం చేయబోతున్నాయి. ఈ సదస్సు ద్వారా దేశ ఏఐ రంగంలో 20,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు రావాలన్నది లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఎన్విడియా, బ్లాక్‌స్టోన్ తదితర సంస్థలు 12,000 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి.

ట్రంప్ సృష్టించిన అనిశ్చితి సంగతలా ఉంచి, ఏఐ రంగంలో అంతర్లీనంగా ఇమిడి ఉన్న సమస్యలు సైతం పెట్టుబడుల విషయంలో ఊగిసలాటకు తావిస్తున్నాయి. భవిష్యత్తు ఏఐదే అనే భరోసా ఉన్నమాట నిజమే అయినా... హఠాత్తుగా ఊహించని రీతిలో దూసుకొస్తున్న సరికొత్త ఆవిష్కరణలు అప్పటికే నిలదొక్కుకున్న సంస్థల్ని అయోమయంలో పడేస్తున్నాయి. భారీ పెట్టుబడులతో తీసుకొస్తున్న ఆవిష్కరణలు కాస్తా, అంతకన్నా చవగ్గా తయారవుతుంటే... వినియోగదారులు అటువైపు పరుగులు పెడుతుంటే ఆ సంస్థలకు దిక్కుతోచటం లేదు. 1,300 కోట్ల డాలర్ల పెట్టుబడులతో ఏళ్ల తరబడి శ్రమించి చాట్ జీపీటీ మోడల్‌ను తీసుకొచ్చిన సామ్ ఆల్ట్‌మాన్ ఆధ్వర్యంలోని ఓపెన్ ఏఐ... నిరుడు జనవరిలో డీప్‌సీక్ ఉరుములేని పిడుగులా వచ్చిపడేసరికి బెంబేలెత్తిపోయింది. దాంతోపాటు దిగ్గజ సంస్థలు అనేకం నిరాశలోకి జారుకున్నాయి. కానీ ఆ వెంటనే డీప్‌సీక్‌పై భారీ స్థాయి సైబర్ దాడి జరగటం, పైగా అది చైనా నియంత్రణలకు లోబడి ఉంటుందని తెలియడం పర్యవసానంగా అనేక దేశాలు పలు నియంత్రణలు విధించాయి. దాంతో డీప్‌సీక్ దూకుడుకు కాస్త కళ్లెం పడింది. ఇటీవల ఆంత్రోపిక్ సృష్టించిన ప్రకంపనలు సామాన్యమైనవి కాదు. గూగుల్, ఓపెన్ ఏఐ వంటి దిగ్గజ సంస్థలు దాని ధాటికి విలవిల్లాడాయి. అది తీసుకొచ్చిన క్లాడ్ 3.5 సానెట్, క్లాడ్ 3 ఓపస్ మోడళ్లు చాట్ జీపీటీని తలదన్నేలా ఉండటమే అందుకు కారణం.

ఏఐ అవకాశాలను అందిపుచ్చుకుని, అందులో నాయకత్వ పాత్ర పోషించాలని మన దేశం నిశ్చయించుకుంది. క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు రెండు దశాబ్దాలపాటు పన్ను మినహాయింపునిస్తామని ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించటం అందులో భాగమే. కనుకనే భిన్న దిగ్గజ సంస్థలు భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఏఐ రంగంలో 90 శాతం పేటెంట్లు అమెరికా, యూరప్, చైనాలవే. 2024లో అమెరికా నుంచి వచ్చిన ఏఐ మోడళ్లు 40 కాగా, 15తో చైనా రెండో స్థానంలో ఉంది. మూడో స్థానంలో ఉన్న యూరప్ ఖాతాలో మూడే ఉన్నాయి. దాన్నిబట్టి మనం మరెంతగా ఎదగాలో అర్థం చేసుకోవచ్చు. పరిశోధన, అభివృద్ధికి భారీ కేటాయింపులు చేస్తేనే అందులో మనకంటూ మెరుగైన స్థానం దక్కుతుంది. మన జీడీపీలో ఇందుకోసం కేటాయిస్తున్నది అక్షరాలా 0.7 శాతం మాత్రమే. అమెరికా 3.5 శాతం, చైనా 2.7 శాతం వెచ్చిస్తున్నాయి. ట్రంప్ వ్యవహార శైలి వల్ల అంతర్జాతీయంగా అమెరికా విశ్వసనీయత దెబ్బతింది. అది హఠాత్తుగా సహాయ నిరాకరణ చేస్తే సర్వం స్తంభించిపోయే స్థితి ఏర్పడుతుందని తెలిసిరావటం వల్ల చాలా దేశాలు సార్వభౌమత్వాన్ని కాపాడుకునే స్థాయి ఏఐ కావాలని కోరుకుంటున్నాయి. మనం మెరుగైన వ్యూహంతో, అందుకు తగిన ఆచరణతో ముందుకెళ్తే ఏఐ రంగంలో నాయకత్వ స్థాయికి ఎదగటానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఈ పరిణామాలు చెబుతున్నాయి. ఏఐ నుంచి అచ్చం మనిషిలా సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలిగిన ఏజీఐ (కృత్రిమ సాధారణ మేధ) స్థాయికి సాంకేతికత చేరుకోబోతున్న ఈ దశలో ఢిల్లీ శిఖరాగ్ర సదస్సు తీసుకోబోయే నిర్ణయాలు భారత్‌ను ఈ రంగంలో అగ్రగామిగా నిలబెట్టగలవని ఆశించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** అమావాస్య సా.5.48 వరకు, తదుపరి ఫాల్గుణ శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.9.52 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.5.08 నుండి 6.46 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.35 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.48 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.01 నుండి 12.40 వరకు.

**సూర్యోదయం:** 6.30
**సూర్యాస్తమయం:** 5.57
**రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు
**యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు

## సోషల్ టాక్

### గెలిచాకే...

నేను గెలుస్తాను అని మీరు చెబితే ఈ ప్రపంచం పట్టించుకోదు. మీరు గెలిచాక మాత్రమే అది మీ మాట వింటుంది. కాబట్టి విజయం సాధించిన తర్వాతే మీరు మాట్లాడండి. అప్పుడైనా, విజయం కోసం మీరెంత కష్టపడిందీ చెబితే వినటానికి ప్రపంచం ఆసక్తి చూపదు.

– శివ కార్తికేయన్, నటుడు

### దేశభక్తి

ప్రజాస్వామ్యానికి అతి పెద్ద శత్రువు 'భయం'. మీరు మాట్లాడటానికి భయపడితే ఇప్పటికీ నియంతృత్వంలో జీవిస్తున్నట్లే! భిన్నాభిప్రాయం దేశభక్తికి అత్యున్నత రూపం. మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించటం అంటే... మీ దేశాన్ని ప్రేమించటం!

– అసీమ్ త్రివేదీ, యాక్టివిస్ట్

### సమయం

ఏడు ఈవెంట్ల హెప్టాథ్లాన్‌లో ఐదవ ఈవెంట్ తర్వాత, ఇక ఆపమని మీ శరీరం చెబుతుంది. అక్కడి నుండి ఆరవ, ఏడవ ఈవెంట్‌లలోకి మీ మనసు మిమ్మల్ని తీసుకెళుతుంది. ఏదైనా ఒక ఈవెంట్‌లో విఫలం అయితే బాధపడేందుకు కూడా అక్కడ సమయం ఉండదు.

– లిక్సీ జోసెఫ్, హెప్టాథ్లెట్

### సంపద

భారతదేశ 'సంపద' ఇక్కడి తెలివైన వ్యక్తులు, వారు సృష్టించే అపారమైన డేటా! డేటా అనేది ఏఐ ఇంజిన్‌కు ఇంధనంగా పని చేసే చోదక శక్తి. అందుకే భారత ప్రజలు మెరుగైన ఉద్యోగాలు, మెరుగైన జీవితాలకు అర్హులు. పాలకులే దీనిని సుసాధ్యం చేయాలి.

– ప్రఫుల్ పటేల్, ఎంపీ–పారిశ్రామికవేత్త

### భాగం



నా కెరీర్‌లో నేను 9,000 కంటే ఎక్కువ షాట్‌లను మిస్ అయ్యాను. దాదాపు 300 ఆటలలో ఓడిపోయాను. 26 సార్లు గెలిచే షాట్‌ల చివరి వరకూ వెళ్లి తప్పిపోయాను. నా జీవితంలోనూ పదే పదే విఫలం అయ్యాను. అందుకే నా విజయంలో వీటన్నిటికీ భాగం ఉంది. – మైఖేల్ జోర్డాన్, బాస్కెట్‌బాల్ దిగ్గజం

### పట్టుదల

పాటల రచయిత కావాలని ఉంటే, రోజూ ఒక పాట రాయండి. 5వ పాట బాగా కుదరవచ్చు. అయితే అక్కడికి చేరాలంటే మాత్రం మొదట 4 పాటలూ రాయాల్సిందే! ఆరంభంలో ప్రతిభ కంటే పట్టుదల ముఖ్యం. ప్రతిభ అన్నిచోట్లా ఉంటుంది. సంకల్ప బలమే చాలా అరుదు.

– ఎడ్ షీరన్, గాయకుడు–గేయ రచయిత

# ఎదగడానికి నాలుగు ట్రిక్కులు!

విశ్వ గురు

అమెరికాలోని మిషిగన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లను ఉద్దేశించి రచయిత, టీవీ షో క్రియేటర్ బ్రాడ్ మెల్జర్ చేసిన స్నాతకోపన్యాస సంక్షిప్త పాఠం.

వృత్తిపరమైన ఇంద్రజాలికులు వాస్తవంగా ఉన్నవి నాలుగు రకాల ట్రిక్కులేనని చెబుతారు. అవి: ఒక రూపాన్ని మన కళ్ళకు కట్టించడం; దేన్నయినా అదృశ్యం చేయడం; రెండు వస్తువుల ప్రదేశాలను తారుమారు చేయడం; చివరగా ఒక వస్తువును మరో వస్తువుగా మార్చడం. ఈ నాలుగింటినీ జీవితానికి అన్వయించుకుంటే మనమూ ఎదుటివారిని ఆశ్చర్యచకితులను చేయగలం. ఎలాగంటారా...

మొదటి ట్రిక్కు: మన ఉనికిని చాటుకోవడమంటే, భౌతికంగా ఆకర్షణీయంగా కనిపించడమే కాదు; మనల్ని మనం అత్యుత్తమమైన రీతిలో ప్రదర్శించుకోవడం! మనం ఊసరవెల్లి లాంటివాళ్ళం. తల్లితండ్రుల ముందు ఒకలా, స్నేహితుల వద్ద మరోలా ప్రవర్తిస్తాం. కానీ, ఈ బాహ్యమైన నేను కాకుండా 'లోపల మరో నేను' ఉంటాడు. మన అసలు స్వరూపం అదే! మనకు ఇష్టమైన వ్యాపకంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరింపజేసేది వాడే! మనం అరమరికలు లేకుండా ఎవరి వద్ద వ్యవహరించగలమో, ఎవరు మన 'లోపలి మనిషి'ని అభినందించగలుగుతారో అలాంటి వాళ్ళ వద్దనే ఆ 'లోపలి మనిషి' బయటపడతాడు. మిషిగన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక, బోస్టన్‌లో మొదటి ఉద్యోగంలో చేరాను. అక్కడి బాస్ నన్ను తీర్చిదిద్దుతానన్నాడు. నేనెంతో సంతోషపడ్డాను. తీరా, నేను ఉద్యోగంలో చేరేందుకు వెళ్ళేటప్పటికి, ఆయన కాస్తా ఉద్యోగం వదలి వెళ్ళిపోయారు. నా పని అయిపోయింది అనుకున్నాను.

> ఒకరు తక్కువ అంచనా వేసినంత మాత్రాన కుంగిపోనవసరం లేదు. ఎవరైనా తక్కువ అంచనావేస్తే వెయ్యనివ్వండి. నిశ్శబ్దంగా వారి అంచనాలు తప్పు అని నిరూపించండి.

### తిరస్కరణతో... జీవితం తలకిందులవదు!

''ఈ ఏడాది ఏం చేయబోతున్నానో 'నాకు లోపల' తెలిసిపోతోంది. నా కష్టాలు, కన్నీళ్ళతోనే ఓ నవల రాస్తా''నని నా స్నేహితురాలితో చెప్పాను. అందుకామె నవ్వలేదు. 'బ్రహ్మాండం. అదే పనిలో ఉండు' అంది. ఆమె నా లోపలి మనిషిని గుర్తించి అతడి సత్తాపై నమ్మకం ఉంచిందన్నమాట. అలా వెన్ను తట్టేవారు మన అమ్మ, నాన్న, తాత, బామ్మ ఎవరైనా కావచ్చు. అటువంటి బేషరతు మద్దతు లభించినపుడు మనలోని నిజమైన సామర్థ్యం బయటకు వస్తుంది. అందుకని, ఇపుడు మీ స్నేహితులను అంటిపెట్టుకుని ఉండండి. వారి ప్రేమ, నమ్మకం ముందుకు నడిపిస్తాయి.

నేనా పుస్తకాన్ని పూర్తి చేసి, ప్రచురణకు అభ్యర్థిస్తూ పంపిస్తే, ప్రచురించలేమంటూ 24 ఉత్తరాలొచ్చాయి. ప్రచురణకర్తలు ఉన్నది 20 మందే! అంటే, కొందరు రెండుసార్లు తిరస్కరించారన్నమాట. వాళ్లకు ఆ పుస్తకం నచ్చకపోతే మరో పుస్తకం రాస్తానని అనుకున్నాను. అదీ నచ్చకపోతే ఇంకోటి రాస్తానని ధైర్యం చెప్పుకున్నాను. ఆ తదుపరి పుస్తకం ప్రచురణకు నోచుకుంది.

### భయాన్ని బలంగా మలచుకోండి!

మనం అదృశ్యం చేయాల్సింది భయాన్ని! ఇదే రెండో ట్రిక్కు. హైస్కూలులో ఉండగా, ఓ చోట ఐస్‌క్రీమ్ అందించే ఉద్యోగం చేశాను. ఒకావిడ వచ్చి ఐస్‌క్రీమ్ ఆర్డరు చేసింది. ఒక్క క్షణంలో ఇస్తానన్నాను. ఈ క్షణంలోనే ఇవ్వాలంటూ పట్టుబట్టింది. కానీ నేను బెదిరిపోలేదు. దాంతో ఈ దిక్కుమాలిన షాపులో జీవితాంతం గడుపుతావంటూ తిట్టిపోసింది.

నిజం ఒప్పుకొని తీరాలి. నేను కలవరపడిన మాట వాస్తవం. కానీ, ఆ మహిళ నాలో రేకెత్తించిన భయం నాలో కసిని పెంచింది. కనుక, భయాన్ని పారదోలండి. భయం ఏదో చెరుపు చేస్తుందని కాదు. భయాన్ని ప్రేరణగా తీసుకుని ప్రయోజనం పొందే ప్రయత్నం చేయండి. ఒకరు తక్కువ అంచనా వేసినంత మాత్రాన కుంగిపోనవసరం లేదు. నిశ్శబ్దంగానే మీ విషయంలో వారి అంచనాలు తప్పు అని నిరూపించండి.

### దయాగుణంతో విప్లవం తేవచ్చు!

రెండు వస్తువుల ప్రదేశాలను తారుమారు చేయడం ఇంద్రజాలంలో మూడవ ట్రిక్కు అనుకున్నాం కదా! ఇక్కడ సహానుభూతి గురించి చెప్పుకోవాలి. ఇతరుల కష్టాలను వారి దృక్కోణం నుంచి చూడటం అలవరచుకోవాలి. నాకు 13 ఏళ్ళపుడు మా నాన్న ఉద్యోగం పోయింది. దాంతో మేం బ్రూక్లిన్ నుంచి మయామీకి మకాం మార్చాం. అక్కడ మా తాత, నాయనమ్మ ఉన్నారు. అమ్మ, నాన్న, చెల్లి, నేను, ఆ పెద్దవాళ్ళు కలిసి మొత్తం ఆరుగురం కొన్ని నెలలపాటు సింగిల్ బెడ్‌రూమ్ అపార్టుమెంట్‌లోనే తలదాచుకున్నాం. ఇంతమంది ఏమిటంటూ కొందరు గొడవకు దిగారు.

పొరుగునే ఉన్న మరో వాటా ఆవిడ తాను అపార్టుమెంటును ఖాళీ చేస్తున్నాననీ, పెద్దవాళ్ళు ఇద్దరూ అందులో ఉండ వచ్చనీ చెప్పి అనునయించింది. కాకతాళీయంగా ఆవిడ పేరు మెర్సీ. ఔను! పేరుకు తగ్గట్లు దయచూపిన మహాత్మురాలు. ఈ నిరాశావాద ప్రపంచంలో సిసలైన దయాగుణం గాయాలను మాన్పుతుంది. క్రూరంగా వ్యవహరించడం, విషం కక్కడం, అభిప్రా యాలతో ఏకీభవించనివారి పట్ల కరకుగా ప్రవర్తించడం మన సంస్కృతిలో భాగాలైపోయాయి. కానీ, క్రూరత్వం బలానికి రుజువు కాదు. బాధపడుతున్నవారి స్థానంలోకి మనం వెళ్ళ గలిగితే అది బలం అనిపించుకుంటుంది.

ఇక్కడున్నవారిలో కొందరికి రకరకాల కష్టాలు ఉండవచ్చు. నేటి గ్రాడ్యుయేట్లలో మా అబ్బాయి కూడా ఉన్నాడు. మా అమ్మ, నాన్న ఉండి ఉంటే, ఈ కార్యక్రమాన్ని చూసి ఎంత సంతోషించేవారో అని నాకూ అనిపిస్తోంది. జీవితంలో ముమ్ముందు మీకెదురయ్యే ప్రతి వ్యక్తీ మీకు పైకి కనిపించని సమస్యతో సతమత మవుతూ ఉండవచ్చు. వారి స్థానంలోకి వెళ్లి వారి గురించి ఆలోచించండి. ప్రపంచానికి మరింత సహానుభూతి, మరింత వినయ విధేయతలు, ముఖ్యంగా మానవ మర్యాదలను కనబరచడం అవసరం. మీరు నిజంగా ప్రపచాన్ని నివ్వెరపరచదలచుకుంటే, మీలోని దయా గుణాన్ని బయటకు తీయండి.

> దయాగుణం గాయాలను మాన్పుతుంది. క్రూరత్వం బలానికి రుజువు కాదు. బాధపడుతున్నవారి స్థానంలోకి మనం వెళ్ళగలిగితే అది బలం అనిపించుకుంటుంది.

### మార్పు చెందుతూనే ఉండాలి!

ఇంద్రజాలంలో చివరి ట్రిక్కు– ఒక వస్తువును మరో వస్తువుగా మార్చడం! అన్ని ట్రిక్కుల కన్నా ఇదే కష్టమైనది. రూపాంతరం చెందడం. చిన్నప్పుడు మనం రకరకాల రూపాలను ఇష్టపడినా, పెద్దయిన తర్వాత, ఒక మూసలో ఒదిగిపోయేందుకు మొగ్గు చూపుతాం. ప్రపంచం పట్ల, మీపట్ల మీకొక స్థిరమైన అభిప్రాయం ఏర్పడిపోతుంది. కానీ, మారకపోతే మకిలిపట్టిపోతాం. ఆశలు, ఆశయాలను సమయానుకూలంగా సవరించుకోవడంలో తప్పు లేదు.

మనల్ని మించినవారు లేరనుకుంటే పప్పులో కాలేసినట్లే. తమ ఆలోచనా ధోరణిని తామే ప్రశ్నించుకుని, నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉందని భావించే లక్షణాన్ని నేను కొందరు అత్యంత ప్రజ్ఞావంతులలో గమనించాను. నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలి. మారాలి. అన్నీ తెలిసిపోయాయని ఎన్నడూ అనుకోకండి. అవకాశాలు అనంతంగా ఉంటాయి. వాటిని అందుకునేందుకు సిద్ధపడాలి అంతే! ఎక్కడెక్కడ మీ ప్రతిభా నైపుణ్యాలను కనబరచడానికి అవకాశం ఉందో వాటన్నింటినీ అన్వేషించండి. ఒకటే మార్గంలో పయనించాల్సిన అవసరం లేదు. మనలో ఉన్న ఒక్కొక్క నైపుణ్యాన్ని ఒక్కొక్కచోట ఉపయోగించుకోవచ్చు. ◆

# వ్యవసాయ నిర్వీర్యమే లక్ష్యమా?

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

2026–27 సంవత్సరానికిగానూ ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 3,32,205 కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇది గత బడ్జెట్ కన్నా రూ. 9,856 కోట్లు ఎక్కువ. రెవిన్యూ వ్యయం 2,56,143 కోట్లు. మూలధనం 53,915 కోట్లు. రెవిన్యూ లోటు 22,002 కోట్లు కాగా ద్రవ్య లోటు 75,868 కోట్లు. బడ్జెట్ లెక్కలు గమనిస్తే వివిధ రంగాలకు కేటాయించిన దాని కోసం పెద్ద మొత్తంలో అప్పులు చేయాలి. గత బడ్జెట్‌లో అప్పులకు వడ్డీల కింద రూ. 24,430 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వ ఖర్చులలో 18% వరకు వడ్డీలు, అసలు చెల్లింపులకే సరిపోతోందని విశ్లేషణలు చెబుతున్నాయి.

ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, రైతులకు ఇచ్చే రాయితీలు గణనీయంగా తగ్గాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ. 48,341.14 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో 12,152.32 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రతి సంవత్సరం సేద్యపు ఖర్చులు పెరగటం, అందుకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలు లేకపోవడం, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ, ప్రభుత్వమే న్యాయమైన ధరకు పంటలు కొనుగోళ్లు చేయకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ఆనాటి వైసీపీ ప్రభుత్వం ముందస్తు పంట పెట్టుబడిని మూడు దఫాలుగా 13,500 రూపాయలు ప్రకటించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆరు వేలు కలిసి ఉన్నాయి. చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం ముందస్తు పెట్టుబడిని 20 వేలుగా ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సంవత్సరం పెట్టుబడి సహాయం ఇవ్వలేదు. ఆ తర్వాత సంవత్సరంలో కూడా ఇప్పటికి రెండు సార్లు మాత్రమే ఇచ్చింది. చాలా మంది రైతులను అర్హత పేరుతో పథకానికి ప్రభుత్వం దూరం చేయదలచినట్లుంది. గత బడ్జెట్‌లో 'అన్నదాత సుఖీభవ' పథకానికి 9,400 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈ బడ్జెట్‌లో 6,600 కోట్లు మాత్రమే కేటాయించింది. ఫలితంగా చాలామంది రైతులు పథకానికి దూరం అవుతారు. పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి ఈ బడ్జెట్‌లో రూ. 250 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది ఏమాత్రం సరిపోదు.

బహిరంగ మార్కెట్‌లో పంటల ధరలు పడిపోయినప్పుడు న్యాయమైన గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే పంటలు కొనుగోళ్ల చేయడానికి 'ధరల స్థిరీకరణ నిధి'ని ఆనాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి 3 వేల కోట్లు కేటాయించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత బడ్జెట్లో రూ. 300 కోట్లు మాత్రమే కేటాయించింది. ఫలితంగా తీవ్ర విమర్శలు రావడంతో ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించింది. ఈ నామమాత్రపు కేటాయింపు వల్ల రైతులకు ప్రయోజనం లేదు. రైతాంగానికి సున్నా వడ్డీకే పంట రుణాలు అందిస్తామనీ, కౌలు రైతులకు కూడా దాన్ని వర్తింపజేస్తామనీ చెప్పిన కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. ఈ బడ్జెట్‌లో సున్నా వడ్డీ రుణాల ప్రస్తావన గానీ, కౌలు రైతుల ప్రస్తావన గానీ ఎక్కడా కనిపించదు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ, స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించడమే రైతాంగం తక్షణ కర్తవ్యం.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

# ఎందుకీ మత వైషమ్యం?

ఇన్ బాక్స్

తెలంగాణలో జరిగిన సమ్మక్క– సారలమ్మ జాతర కేవలం ఒక ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాదు; అది తెలంగాణ సామాజిక సంస్కృతి, ఆదివాసీ ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య సమగ్రతకు ప్రతీక. వివిధ ప్రాంతాల నుండి అనేకమంది చిరు వ్యాపారులు రకరకాల వస్తువులు, పదార్థాలు అమ్ముకుంటూ అలాంటి ప్రదేశాలకు వస్తూ ఉంటారు. అలాంటి వాతావరణంలో ఒక చిరు వ్యాపారిపై ఒకరిద్దరు యూట్యూబర్లు తమ మత పైత్యాన్ని ప్రదర్శించారు. ఈ ధోరణిని ఉపేక్షిస్తే సామాజికంగా ప్రమాదానికి దారి తీస్తుంది.



జాతర ప్రాంగణంలో కోవా బన్ అమ్ముకుంటున్న ఒక చిరువ్యాపారి పేరును బట్టి అతణ్ణి టార్గెట్ చేసి వేధించినతీరు గర్హనీయం. గత కొన్నేళ్లుగా కొన్ని ప్రాంతాల్లో 'ఫుడ్ జిహాద్' వంటి నిరాధార పదజాలాన్ని సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. సాధారణంగా జాతర్లు, ఉరుసు లాంటి రద్దీ ప్రదేశాల్లో రకరకాల స్టాళ్ళు, తోపుడు బళ్ళు, నెత్తిపై గంపల్లో రకరకాల పదార్థాలు, వివిధ రకాల పచ్చళ్ళు అమ్మే వాళ్ళు లెక్కలేనంతమంది ఉంటారు. వీటన్నిటికీ మాన్యుఫాక్చరింగు, ఎక్స్‌పైరీ డేట్లు ఉంటాయని ఆశించగలమా? ఇష్టముంటే కొనడం లేకపోతే మానేయవచ్చు. ఇంకా ఏమైనా అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అలా కాదని చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవరికీ ఉండదు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమానత్వ హక్కును హామీ ఇస్తుంది (ఆర్టికల్ 14). మతం, పేరు, వ్యక్తిగత గుర్తింపుల ఆధారంగా వివక్షకు తావు లేదని స్పష్టంగా చెబుతుంది. జీవనోపాధి కోసం వృత్తిని నిర్వహించే స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)(జీ) ప్రతి పౌరుని హక్కు; గౌరవప్రదమైన జీవితం గడపడం (ఆర్టికల్ 21) అతని మౌలిక హక్కు. ఒక చిరువ్యాపారిని అతని పేరు ఆధారంగా, కులం ఆధారంగా అనుమానించి, బహిరంగంగా అవమానించడం అంటే అతని ఆర్థిక హక్కుపైనే కాదు, అతని గౌరవప్రదమైన జీవన హక్కుపై కూడా దాడి చేయడమే!

తెలంగాణలోని ఈ మహాజాతర గిరిజన ఆత్మగౌరవానికి చిహ్నం. అక్కడ మతపరమైన వైషమ్యాన్ని నాటే ప్రయత్నం ఆ జాతర ఆత్మను దెబ్బతీయడమే! ఇక్కడ మరో కీలక అంశం–మానసిక హింస. ఒక నిరపరాధిని కెమెరా ముందు నిలబెట్టి అనుమానాస్పద వ్యక్తిగా చిత్రీకరించి జనసమూహం మధ్య అవమానించడం లాంటి చర్యలు వ్యక్తి ఆత్మగౌరవాన్ని ఛిద్రం చేస్తాయి. అందుకే ఈ ఘటనను కేవలం యాదృచ్ఛికమైన, లేక వ్యక్తిగత సంఘటనగా కాకుండా, సామాజిక హెచ్చరికగా చూడాలి.

– ఎమ్‌డీ ఉస్మాన్ ఖాన్ । సీనియర్ జర్నలిస్ట్

## మూడో వంతు వాటా

డేటా పాయింట్

ఆసియా ఖండంలోని దేశాలు ప్రపంచ జీడీపీలో సుమారు 35 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 1980–2023 సంవత్సరాల లెక్కల ప్రకారం, 45 ఆసియా దేశాల జీడీపీ లెక్కలను బట్టి 'గ్లోబల్ ఎకానమీ డాట్‌కామ్' ఈ ర్యాంకులను సిద్ధం చేసింది.




ప్రపంచ జీడీపీలో టాప్ 10 ఆసియా దేశాల శాతాలు

| దేశం | దేశాల వారీగా ప్రపంచ జీడీపీలో శాతం |
|---|---|
| చైనా | 17.33 |
| జపాన్ | 4 |
| ఇండియా | 3.45 |
| దక్షిణ కొరియా | 1.62 |
| ఇండోనేషియా | 1.3 |
| సౌదీ అరేబియా | 1.16 |
| ఇజ్రాయెల్ | 0.49 |
| థాయిలాండ్ | 0.48 |
| యూఏఈ | 0.48 |
| సింగపూర్ | 0.48 |

ఆధారం: వరల్డ్ బ్యాంక్, ద గ్లోబల్ ఎకానమీ డాట్‌కామ్

# తపఃకాలం



ఫిబ్రవరి 18న విబూది బుధవారం. దీన్నే భస్మ బుధవారం అంటారు. ఈ రోజు నుంచి క్రైస్తవులు దేవుని పట్ల భయభక్తులతో కొన్ని నియమాలు పాటిస్తారు. క్రీస్తు పడిన శ్రమలను నలభై రోజుల పాటు, అనగా ఏప్రిల్ 2వ తారీఖు వరకూ స్మరించుకుంటారు. ఈ నలభై రోజుల్నీ కొందరు శ్రమ దినాలనీ, మరికొందరు తపః కాల (తపస్కాల) దినాలనీ అంటారు.

క్రీస్తు ప్రభువు బోధించిన ప్రేమ, సాటివారిపై దయ, క్షమ, వివక్ష లేని సమతాది గుణాల్ని పాటిస్తూ; ప్రతి శుక్రవారం ఉపవాసంతో ప్రభువాక్యాల్ని సమీక్షించుకొంటూ, ధ్యానించుకొంటూ; తాము గతంలో చేసిన తప్పిదాలకు పశ్చాత్తాపపడుతూ; వాటిని తమ అనుదిన జీవన చర్యలకు సమన్వయం చేసుకొంటూ నలభై రోజుల్నీ ఎంతో శ్రద్ధగా పాటిస్తారు క్రైస్తవులు. రాబోయే గుడ్ ఫ్రైడే నాటికి ఆత్మప్రక్షాళన చేసుకొని ప్రభువు మరణ – పునరుత్థానాలకు సంసిద్ధులవుతారు.

మనిషి తాను చేసిన తప్పుల్ని తెలుసుకొని మళ్ళీ కొత్తగా జన్మించాలి. క్రీస్తు 'పునరుత్థానం' మర్మం అదే! క్రీస్తు మరణ స్మరణకు పరమార్థమూ ఇదే. ఈ నలభై రోజులకూ మూడు ఆధ్యాత్మిక సూత్రాలు: 1. ఉపవాస ప్రార్థనలు, 2. పశ్చాత్తాప ప్రక్షాళన ఫలంగా తీసుకునే కొత్త నిర్ణయాలు, 2. సాటి సమాజానికి దానధర్మాది హితకార్యాలు.

అందుకే, దేవునితో ముఖాముఖీగా మనసు విప్పి తమ బాధలు చెప్పుకొంటూ కావలసిన మనోధైర్యం అడుగుతారు. అందుకు శారీరక సుఖాల్నీ, కోరికల్నీ తగ్గించుకొంటారు. ఇరుగు పొరుగుకు ఎంతగా మేలు చేయగలుగుతారో అంతగా చేసి దేవుణ్ణి మెప్పిస్తారు. ఉపవాసం అనేది కేవలం విలాస జీవితాన్ని విడనాడటానికే కాదు, శారీరకమైన అహంకారాన్ని తగ్గించుకోడానికే! ఇవన్నీ ఈ తపఃకాలంలోని ముఖ్యాంశాలు. ఈ నియమాలన్నీ పాటించేది తోటి సమాజానికి ప్రియంగా నడచుకోవడానికే!

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు

## రమణీయం.. మల్లన్న రథోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీశైలంలో అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్లకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గంగాధర మండపం వద్దకు మంగళ వాయిద్యాల నడుమ పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం సాత్విక బలి సమర్పించారు. అశేష భక్తజనం శివనామం స్మరిస్తుండగా ఆలయం పురవీధుల్లో రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవంలో ముందు కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవం వైభవంగా సాగింది.

– శ్రీశైలం టెంపుల్

## శ్రీకాళహస్తిలో వేడుకగా రథోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో సోమవారం జ్ఞానప్రసూనాంబదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరుని రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామి అమ్మవార్లు వేర్వేరు రథాలపై పురవీధుల్లో విహరించారు. పట్టణంలోని చతుర్మాడ వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. 'ఓం నమఃశివాయ, హరహర మహదేవ.. శంభో శంకరా..' అంటూ భక్తులు స్వామివారి రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. వేలాది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి కోనేరు వద్ద తెప్పోత్సవం వైభవంగా జరిగింది. – ఏర్పేడు

## హంపి గ్యాంగ్ రేప్ కేసులో ముగ్గురికి ఉరిశిక్ష

### గంగావతి న్యాయస్థానం సంచలన తీర్పు

**సాక్షి, బళ్లారి:** ప్రముఖ పర్యాటక కేంద్రం హంపీ వద్ద గ్యాంగ్ రేప్, హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు కఠిన శిక్ష పడింది. దోషులు హంది మల్లేష్ (22), చైతన్య సాయి (21), శరణ బసవ (27)లకు మరణ శిక్ష విధిస్తూ గంగావతి మొదటి జిల్లా అదనపు సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. వివరాలు.. 2025 మార్చి 6న సాయంత్రం తుంగభద్ర నదీ తీరంలో గంగావతి తాలూకా సణాపురం వద్ద ఇజ్రాయెల్‌కు చెందిన యువతి, అమెరికన్ పౌరుడు, ఒడిశా పురుషులు, స్థానిక మహిళ కాలువ వద్ద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ముగ్గురు దుండగులు పురుషుల మీద దాడి చేసి కాలువలోకి తోసేశారు. ఇజ్రాయెల్ యువతి, స్థానిక మహిళ మీద సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఒడిశా పౌరుడు కాలువలో కొట్టుకుపోయి చనిపోయాడు. మిగతా ఇద్దరూ ఈదుకుంటూ బయటపడ్డారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. గంగావతి పోలీసులు నిందితులు మల్లేష్, చైతన్యసాయి, శరణ బసవను అరెస్ట్ చేసి మూకుమ్మడి అత్యాచారం, హత్య, దాడి, దోపిడీ అభియోగాలను మోపుతూ కోర్టులో చార్జిషీటు సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో 10 రోజుల కిందటే వారిని కోర్టు దోషులుగా నిర్ధారించింది. సోమవారం నిందితులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ

**రాయచోటి:** మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. ఈ ముఠా నుంచి రూ.1.50 కోట్ల విలువైన ఆస్తులను రికవరీ చేసినట్లు సోమవారం మీడియాకు వెల్లడించారు. జాతీయ రహదారులపై వెళ్లే వాహనాలను ఈ ముఠా సభ్యులు టార్గెట్‌గా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం రామాపురం సమీపంలో రాజస్థాన్‌కు చెందిన ఇర్ఫాన్ అనే ఓ ట్రక్ డ్రైవర్‌పై దాడి చేసి వాహనాన్ని తీసుకెళ్లారని, బాధితుడి ఫిర్యాదు మేరకు రామాపురం ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదు చేశారన్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి దోపిడీ దొంగలు వినియోగిస్తున్న కారుజాడ సోమవారం సాయంత్రం గుర్తించినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే అనంతపురం గ్రామ సమీపంలో నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి కారు, ట్రక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వారు గతంలో కూడా పలు దోపిడీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు.

# గిరిజనుల 'ఎర్ర బంగారం'.. కార్పొరేట్‌పరం

కుంకుమ పువ్వు పంట

### ఏజెన్సీలోని లంబసింగిలో కుంకుమ పువ్వు సాగులో సత్ఫలితాలు

### కిలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతుండడంతో కార్పొరేట్ సంస్థల కన్ను

- పీపీపీలో కట్టబెట్టేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ఇప్పటికే ఒక కంపెనీ ప్రతిపాదనతో 18 ఎకరాలు గుర్తించిన సెరికల్చర్ అధికారులు
- రానున్న రోజుల్లో వందల ఎకరాలను ప్రైవేట్‌కు కట్టబెట్టే ప్రతిపాదనలు
- షెడ్యూల్డ్ ఏరియాలో సాగు ప్రైవేట్‌కు అప్పగిస్తే గిరిజనులకు తీరని నష్టం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలైన లంబసింగి, చింతపల్లిలో మూడేళ్ల నుంచి కుంకుమ పువ్వు సాగులో ప్రయోగాలు ఫలిస్తున్నాయి. దీంతో ఆంధ్రా కశ్మీర్‌గా పేరొందిన లంబసింగిలో మాత్రమే పండే ఎర్రబంగారం(కుంకుమపువ్వు–సాఫ్రన్)ను కొల్లగొట్టేందుకు వ్యూహాత్మకంగా రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం కుంకుమ పువ్వు సాగును పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌పరం చేసేందుకు చర్యలు చేపడుతోంది ఇప్పటికే ఒక ప్రైవేట్ కంపెనీ ఏజెన్సీలో పది ఎకరాలు కావాలని పావులు కదిపింది. దీంతో ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో సెరికల్చర్ విభాగం అధికారులు 18 ఎకరాలను గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. దీనికితోడు పీపీపీ పద్ధతి ద్వారా రానున్న రోజుల్లో వందలాది ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగును ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులకు దక్కాల్సిన ఆదాయ ఫలాలు ప్రైవేట్ కంపెనీల పరం అవుతాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎత్తయిన ప్రదేశం కావడంతో సాగుకు అనుకూలం

సముద్ర మట్టానికి సుమారు వెయ్యి మీటర్ల కంటే ఎత్తు ఉండే మన్యంలోని లంబసింగి అత్యంత శీతల ప్రాంతం. జమ్మూకశ్మీర్‌లోని పంపూర్ వంటి శీతల ప్రాంతాలకే పరిమితమైన సాఫ్రన్ సాగుకు లంబసింగి అనుకూలమని గత మూడేళ్ల ప్రయోగాలు రుజువు చేశాయి. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు ఇప్పటికే విజయం సాధిస్తున్నారు. కశ్మీర్‌లోని పంపూర్ నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న క్రోకస్ సటైవస్ రకం సాఫ్రన్ దుంపలను లంబసింగిలో నాటారు. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నాటితే నవంబర్, డిసెంబర్ నెలల్లో చలి తీవ్రత పెరిగినప్పుడు పూలు పూయడం మొదలవుతుంది. గ్లాస్ హౌస్, షెడ్ నెట్ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ దశలో ఉన్న సాఫ్రన్ సాగును వాణిజ్య పంట స్థాయికి విస్తరించేలా ప్రభుత్వం గిరిజన రైతులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, తగిన పెట్టుబడి సాయం అందించి, ఫార్మా, కాస్మోటిక్ కంపెనీలకు విక్రయించేలా మార్కెటింగ్ కల్పిస్తే వారి జీవన ప్రమాణాలు అద్భుతంగా మారతాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే దేశంలో కుంకుమ పువ్వు సాగు చేసే రెండవ హబ్‌గా లంబసింగి చరిత్ర సృష్టించడంతోపాటు పర్యాటకంగా భాసిల్లుతుంది.

### ఇది నిజంగా ఎర్ర బంగారమే..

కిలో కుంకుమ పువ్వు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల ధర పలుకుతుండడంతో ఇది నిజంగా ఎర్ర బంగారం(రెడ్ గోల్డ్) అని పేరొందింది. ఒక ఎకరానికి విత్తనం (దుంప) నాటేందుకే సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా పెట్టుబడి అవసరం. ఒక్కసారి నాటితే ఏడేళ్లపాటు పంట వస్తుంది. కుంకుమపువ్వు అరుదైన సువాసన, రంగు, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉండడంతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యంగా పరిగణించబడుతోంది. అందుకే దీన్ని 'సన్‌షైన్ స్పైస్' అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా కాస్మొటిక్స్ తయారీలో వినియోగిస్తారు. ఆయుర్వేదం, యునానీ వైద్యంలో కంటి సమస్యలు, గుండె జబ్బులు, ఆస్తమా నివారణకు వాడే మందుల్లో ఉపయోగిస్తారు. బిర్యానీలు, పులావ్, ఖీర్(పాయసం), మిఠాయిలలో వేస్తారు. గర్భిణులు ఐదో నెల నుంచి కుంకుమపువ్వు కలిపిన పాలు తాగుతుంటారు. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడంతోపాటు రక్తపోటు(బీపీ)ని అదుపులో ఉంచుతుంది. ఇది సొంతంగా తీవ్ర వేడి కలిగిస్తుందని దీన్ని ఆహారం, పాలలో రెండు, మూడు రేకలకు మించి తీసుకోకూడదని కూడా వైద్యులు సూచిస్తారు.

### పీపీపీ నిర్ణయం గిరిజనులను దెబ్బతీయడమే

లంబసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు(సాంఫ్రన్) సాగును పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చే నిర్ణయం గిరిజనుల ప్రయోజనాలను దెబ్బతీయడమే అవుతుంది. ఇదే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు తేదీన రాసిన లేఖలో పలు అంశాలు ప్రస్తావించడంతో పాటు సూచనలు చేశాను. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ ప్రాజెక్టు లేదా ఏ పథకమైనా చేపట్టే ముందు పీసా చట్టానికి అనుగుణంగా గ్రామసభల్లో ఆ ప్రతిపాదనను ప్రవేశపెట్టి స్థానిక గిరిజనుల అనుమతి తీసుకోవాలి. గిరిజనులకు తగిన శిక్షణ ఇస్తే వారే సాఫ్రన్ సాగులో కొత్త వ్యవసాయ పద్ధతులను చేపట్టగలరు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలను ప్రవేశ పెట్టడాన్ని నిషేధిస్తూ సమతా కేసులో 1997 నవంబర్ 7న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ఇంధన శాఖ విశ్రాంత కార్యదర్శి

## అభిషేకానికి అవకాశమివ్వలేదని శివ స్వాముల ఆందోళన

### అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో హైడ్రామా
### అధికారుల తీరుతో ఆందోళన చేసిన శివస్వాములు

**పెదగంట్యాడ (విశాఖపట్నం):** మహా శివరాత్రి పర్వదినాన అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి హైడ్రామా చోటు చేసుకుంది. స్వామి వారి లింగోద్భవ సమయంలో అభిషేకాలు చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో శివ మాల ధరించిన భక్తులు ఆందోళనకు దిగారు. దేవస్థానం ఈవో పద్మావతి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల చరిత్ర కలిగిన అతి పురాతన అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనతో భక్తులు ఆందోళనకు లోనయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన పలువురు శివ మాల (సోమేశ్వరస్వామి మాల) ధరించి.. ఆపై 108 రోజులపాటు దీక్ష చేస్తుంటారు. మహా శివరాత్రి రోజు స్వామి వారి లింగోద్భవ సమయంలో సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గల మరో శివ లింగానికి అభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఈ ప్రాంతానికి చెందిన 130 మంది శివ మాల ధరించారు. 108 రోజులపాటు వీరంతా దీక్ష చేశారు. ఆదివారం మహా శివరాత్రి కావడంతో అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ సమయంలో స్వామికి అభిషేకాలు చేసేందుకు ఆలయానికి చేరుకున్నారు. అయితే అభిషేకం చేసే శివ లింగం వద్దకు చేరుకోవడానికి అవకాశం లేకుండా వెనుక ఉన్న గేట్లకు దేవదాయ శాఖ అధికారులు తాళాలు వేసేశారు. ఆలయం ముందు నుంచి లోపలకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో వారంతా ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు, దేవస్థానం ఈవో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. రాత్రి 12.45 గంలకు ఈవో ఆలయ గేటుకు వేసిన తాళాలను తెరవడంతో వివాదం సద్దుమణిగింది. అధికారుల తీరు కారణంగా లింగోద్భవ సమయంలో అభిషేకం చేయలేకపోయామని... తీవ్ర ఇబ్బందులు పడ్డామని, భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరారు.

## 3న శ్రీవారి ఆలయం మూసివేత

### అదేరోజున కుమారధార తీర్థ ముక్కోటి

సమీక్షిస్తున్న టీటీడీ అదనపు ఈవో

**తిరుమల:** చంద్రగ్రహణం సందర్భంగా వచ్చే నెల 3న శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్లు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. ఆ రోజు చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల (మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 6.47 వరకు చంద్ర గ్రహణం) వరకు చంద్ర గ్రహణం కారణంగా శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్టు చెప్పారు. సోమవారం ఆయన శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు తిరుమలలో తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 20 నుంచి మార్చి 5 వరకు పుష్కరిణీ స్నానానికి భక్తులకు అనుమతి ఉండదని చెప్పారు. పుష్కరిణి, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో అవసరమైన సెక్యూరిటీ సిబ్బంది, పుష్కరిణిలో అందుబాటులో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తెప్పోత్సవాల కారణంగా ఈనెల 26, 27 తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, మార్చి 1, 2 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక, వచ్చేనెల 3న కుమారధార తీర్థ ముక్కోటి సందర్భంగా భక్తులను ఉదయం 5 నుంచి 9గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు.

## వక్ఫ్ భూముల స్వాధీనం ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

### చిత్తూరులో వైఎస్సార్‌సీపీ నేతల ధర్నా

**చిత్తూరు కలెక్టరేట్:** వక్ఫ్ భూముల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు చంద్రబాబు సర్కారు జారీ చేసిన ఉత్వర్వులపై ముస్లింలు భగ్గుమన్నారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్ వద్ద సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ చిత్తూరు జిల్లా సెక్రటరీ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ..మైనారిటీల సంక్షేమాన్ని గాలికొదిలేసి, వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు చంద్రబాబు సర్కారు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల పట్ల ముస్లింలు తీవ్ర స్థాయిలో అసంతృప్తిలో ఉన్నారని చెప్పారు. చిత్తూరు జిల్లాలో ఏళ్ల తరబడి వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

● అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు – చింతపల్లి అటవీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తక్షణమే ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోత రాంబాబు, కిల్లో సురేంద్ర సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాడేరు ఏజెన్సీ అటవీ ప్రాంతంలోని ఆరు బ్లాక్‌లలో 615 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలు తవ్వేందుకు అధికారం కల్పించాలని... లేదా వేలం వేసే అవకాశమివ్వాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను తక్షణమే రద్దు చేయాలని కోరారు.

**తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి**
చీఫ్ ఇంజనీర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.65/D3/CE/TTD/2025-26 Dt: 15-02-2026
TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో నలభై ఐదు (45) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి: SE-I: NIT నం.97 నుండి 98/SE-I/2025-26 (2 పనులు), SE-II: NIT నం.1033 నుండి 1044/SE-II/2025-26 (12 పనులు), SE-III: NIT నం.53 నుండి 54/SE-III/2025-26 (2 పనులు), EE-I: NIT నం.151 నుండి 153/EE-I/2025-26 (3 పనులు), EE-II: NIT నం.99/EE-II/2025-26 (1 పని), EE-III: NIT నం.99 నుండి 101/EE-III/2025-26 (3 పనులు), EE-V: NIT నం.109/EE-V/2025-26 (1 పని), EE-VI: NIT నం.75 నుండి 76/EE-VI/2025-26 (2 పనులు), EE-IX: NIT నం.71/EE-IX/2025-26 (1 పని), EE-XI: NIT నం.128/EE-XI/2025-26 (1 పని), EE-XII: NIT నం.200 నుండి 202/EE-XII/2025-26 (3 పనులు), EE-XIV: NIT నం.166/EE-XIV/2025-26 (1 పని), DE(Elec)-I: NIT నం.310 నుండి 312/DE(Elec)-I/2025-26 (3 పనులు), DE(Elec)-II: NIT నం.541 నుండి 548/DE(Elec)-II/2025-26 (8 పనులు), DE(Elec)-TML: NIT నం.394 నుండి 395/DE(Elec)-TML/2025-26 (2 పనులు), వివరాల కోసం www.tirumala.org కి లాగాన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.400) Dt: 16-02-2026 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

**ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ**
విద్యాభవన్, మంగళగిరి
APRS CAT-2026, మరియు APRJC & DC CET-2026 ప్రకటన
ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థచే నిర్వహించబడుచున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఈక్రింది తరగతులలో ప్రవేశానికై ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను తేది: 18/02/2026 నుండి 31/03/2026 వరకు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవలెను. (1) 5వ తరగతి (2) 6, 7, 8 తరగతులలో మిగిలివున్న ఖాళీలు (3) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (4) డిగ్రీ మొదటి సంవత్సరం పై అన్ని తరగతులలో ప్రవేశము కొరకు తేది: 24/04/2026న ప్రవేశ పరీక్ష నిర్వహించబడును. పూర్తి వివరముల కొరకు https://aprs.apcfss.in ను సందర్శించగలరు.
సం/- హెచ్.ఎం.డి. ఉబెదుల్లా. కన్వీనర్.
DIPR No.4832PP/CL/Advt/1/1/2021-22, Dt: 16.02.2026

అన్నదాన శిబిరాల వద్ద వదిలేసిన అన్నం ప్లేట్లు

# ఈ చెత్త పనులేంటి?

### శ్రీశైల క్షేత్రంలో ఎక్కడి చెత్త అక్కడే
### బ్రహ్మోత్సవాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. లక్షలాదిమంది భక్తులు వచ్చే ఈ ఉత్సవాల్లో పారిశుధ్యం పనుల్ని అధికారులు టెండరు లేకుండా ఒక ఏజెన్సీకి ఇచ్చారు. ఆ ఏజెన్సీ తక్కువ మంది కార్మికుల్ని నియమించుకుని నామమాత్రంగా పనులు చేసింది. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. కొన్ని ప్రదేశాల్లో బ్లీచింగ్ కూడా చల్లకపోవడంతో దుర్వాసన ప్రబలి భక్తులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం శ్రీశైలంలో ఎటుచూసినా పేరుకున్న చెత్త కనిపిస్తోంది. శివస్వాములు దీక్ష విరమించిన సమయంలో వదిలేసిన దీక్షావస్త్రాలు ఔటర్‌రింగ్ రోడ్డు, సాక్షిగణపతి ఆలయ పరిసరాల్లో గుట్టలుగా కనిపిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన అన్నదాన శిబిరాల వద్ద కూడా పారిశుధ్య సమస్య నెలకొంది.

**ముఖ్యనేత సిఫార్సుతో పనుల అప్పగింత!**

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో ఏటా కలెక్టర్, ఎస్పీల పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతాయి. ఈ 11 రోజులు పారిశుధ్య పనులు నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో టెండర్ పిలుస్తారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యనేత సిఫార్సుతో ఈ ఏడాది పారిశుధ్య పనుల్ని పద్మావతి హాస్పిటాలిటీ అండ్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు అప్పగించారు. ఈ నెల 8 నుంచి 18 వరకు పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.408 కూలి, అదనంగా రవాణా చార్జీలు, దేవస్థానం నుంచి ఉచిత భోజన వసతి కల్పించేందుకు ఆలయ ఈవో ఉత్తర్వులు జారీచేశారు. 8 నుంచి 11వ తేదీ వరకు నాలుగురోజులు రోజుకు 400 మంది, 12 నుంచి 18వ తేదీ వరకు రోజుకు వెయ్యిమంది కార్మికులను ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం 11 రోజుల్లో 8,600 మస్తర్లకుగాను దినసరి కూలి రూ.408 చొప్పున రూ.35,08,800 దేవస్థానం చెల్లించాల్సి ఉంటుంది. 25 నుంచి 50 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారిని మాత్రమే పారిశుధ్య విధుల్లోకి తీసుకోవాలని, నూటికి 70 మంది పురుషుల్ని, 30 మంది మహిళల్ని తీసుకోవాలని కలెక్టర్ నిర్దేశించారు. అయినా.. ఆ ఏజెన్సీ 50 ఏళ్లు పైబడిన వారినే ఎక్కువమందిని కార్మికులుగా తీసుకుంది. కలెక్టర్ ఆదేశాలను కూడా ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారీతిన పారిశుధ్య పనులు చేసిన ఆ ఏజెన్సీపై అధికారులు చర్యలు తీసుకుంటారో లేక ముఖ్యనేత సిఫార్సుతో వచ్చినందున బిల్లులు చెల్లించేస్తారో అన్నది చర్చనీయాంశంగా ఉంది.

గంగాసదన్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

ఔటర్‌రింగ్ రోడ్డులోని తాగునీటి ట్యాంకు, మల్లమ్మ కన్నీరు ఎదురుగా శివస్వాములు వదిలేసిన దీక్షా వస్త్రాలు

## మే నెల శ్రీవారి దర్శన కోటా షెడ్యూల్ విడుదల

**తిరుమల:** శ్రీవారిని మే నెలలో దర్శించుకోవాలనుకునే వారి కోసం టికెట్ల విడుదల షెడ్యూల్‌ను టీటీడీ విడుదల చేసింది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)ను లక్కీ డిప్‌లో పొందేందుకు 18 ఉదయం 10 గంటల నుంచి 20 ఉదయం 10 వరకూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వారు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నగదు చెల్లించాలి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ టికెట్లు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను 21న విడుదల చేయనున్నారు. 23న అంగ ప్రదక్షిణ టోకెన్లు, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు, వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటాను విడుదల చేస్తారు. 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా, తిరుమల, తిరుపతిలో గదుల బుకింగ్ కోటా విడుదల చేయనున్నారు. ఏప్రిల్‌కు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను 27న విడుదల చేస్తారు.

**ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED**
(A Govt. of A.P. undertaking)
**Notification for APGENCO e-Procurement**
**NIT No.610002219**
APGENCO invites open tender for Carrying out the Operation of the total Ash Handling System (excluding Bottom Ash, Coarse Ash Operation) and Mechanical Maintenance Preventive Maintenance, Emergency & Break down Maintenance, Electrical, C&I works of complete Ash Handling System of 1x600 MW Unit for the period from 01.04.2026 to 31.03.2027 for Dr. MVR RTPP/Stage-IV, through APGENCO e-procurement platform. Estimated Value of Contract: Rs.2,72,98,504/- (inclusive of all charges and GST). Schedule available date & time : from 13.02.2026 onwards. Bid submission closing date & time : 13.00 Hrs on 06.03.2026. For other details visit website viz. : www.apgenco.gov.in or https://etender.apgenco.gov.in/irj/portal.
DIPR RO No.4837PP/CL/Advt/1/1/2021-22, Dt: 16-02-2026

**PM SHRI KENDRIYA VIDYALAYA SATTENAPALLI**
RAMAKRISHNA PURAM, SATTENAPALLI, PALNADU (522403)
**WALK-IN INTERVIEW** 2026-27
Walk-in-Interview will be conducted at PM SHRI KV Sattenapalli to prepare panels for the session 2026-27 for the following posts on contractual basis, as per the following schedule:-

| Date of Interview Day & Time | POST | Venue | Scan QR Code for Google Form to apply |
|---|---|---|---|
| 23.02.2026 (Monday) 09:00AM Onwards | 1. TGT (Maths, Science, Hindi, English, Sanskrit & WE) 2. PRT 3. Balvatika Teacher | KV SATTENAPALLI | |
| 24.02.2026 (Tuesday) 09:00AM Onwards | 1. Computer Instructor 2. Counsellor 3. PRT Special Educator 4. Language Teacher (Telugu) 5. ATAL Tinkering Lab Instructor 6. Sports Coach 7. Nurse | | |

The appointment will be purely temporary and on contractual basis to prepare reserve panel for academic session 2026-27. For more details like process for applying, eligibility, qualification, bio data form etc., may be obtained from the Vidyalaya website (https://sattenapalli.kvs.ac.in/) or Vidyalaya Notice Board.
Principal

# అరుణాచల్ సమీపంలో చైనా అణ్వస్త్ర ప్లాంట్లు!

**సిచువాన్ ప్రావిన్స్‌లో ఏర్పాటు • ముమ్మరంగా వార్‌హెడ్ల తయారీ • 2030 కల్లా 1,000 వార్‌హెడ్లే లక్ష్యం?**

అణ్వస్త్రాల విషయంలో కొంతకాలంగా దూకుడు కనబరుస్తున్న చైనా, మన సరిహద్దులకు సమీపంలోనే వాటిని భారీ సంఖ్యలో తయారు చేస్తోంది! అరుణాచల్‌ప్రదేశ్‌కు 800 కి.మీ. దూరంలో సిచువాన్ ప్రావిన్స్‌లో అత్యంత రహస్యంగా నిర్మించిన జిటాంగ్, పింగ్‌టాంగ్ ప్లాంట్లలో అణ్వాయుధాల తయారీని వేగవంతం చేస్తోంది!! అత్యున్నత స్థాయి నిఘా వర్గాలను, ఉపగ్రహ చిత్రాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక ఈ మేరకు వెలువరించిన కథనం కలకలం రేపుతోంది. 2030 నాటికి కనీసం 1,000 పై చిలుకు అణు వార్‌హెడ్ల సామర్థ్యం సంతరించుకోవడమే చైనా లక్ష్యమని ఆ కథనం పేర్కొంది! అరుణాచల్ సమీపంలో చైనా కొన్నేళ్లుగా సైనిక మౌలిక సదుపాయాలను పెంచుకుంటూ, జనావాసాలను ఏర్పాటు చేస్తూ భారత్‌ను కవ్విస్తున్న విషయం తెలిసిందే. వాస్తవానికి వాయవ్య చైనాలోని సిచువాన్ పర్వత ప్రాంతాల్లో చైనా అణు ప్లాంట్లు కొత్తవేమీ కాదు. అమెరికా, నాటి సోవియట్ యూనియన్‌లకు దీటుగా ఎదిగే ఉద్దేశంతో 60 ఏళ్ల కిందట నిర్మించినవే. అప్పట్లోనే వాటిలో వేలాదిగా సైంటిస్టులు, ఇంజనీర్లు, కార్మికులను నియోగించింది. జిటాంగ్, పింగ్‌టాంగ్ ప్లాంట్లలో అణు కార్యక్రమాలను దూకుడుగా కొనసాగించింది. అయితే 1980ల నాటికి అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గిపోవడంతో అక్కడ సిబ్బందిని భారీగా తగ్గించేసింది. కానీ 20 ఏళ్లుగా ఆ రెండు ప్లాంట్లపై చైనా బాగా దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. అంతేగాక అణు వార్‌హెడ్ల తయారీకి వాటికి పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసిందట! ఆ క్రమంలో ఆ రహస్య అణు కేంద్రాలను జిన్‌పింగ్ సర్కారు నానాటికీ విస్తరిస్తూ వస్తున్నట్టు ఉపగ్రహ చిత్రాలు కూడా తాజాగా తేల్చాయి. అక్కడ అణు వార్‌హెడ్ల తయారీ పనులు ముమ్మరంగా సాగుతున్నట్టు వెల్లడైంది. ముఖ్యంగా 2019 నుంచి అక్కడ కార్యకలాపాలు అనూహ్య రీతిలో వేగం పుంజుకున్నట్టు శాటిలైట్ నిఘా నిపుణుడు రెనీ బాబియార్జ్‌ను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ''జిటాంగ్ ప్లాంటు వద్ద కొత్త బంకర్లు, అత్యంత దృఢమైన గోడలు పుట్టుకొచ్చాయి. పైపుల వ్యవస్థను బాగా విస్తృతపరిచారు. అక్కడ ప్రమాదకర అణువ్యర్థాల పరిమాణం భారీగా పెరుగుతోందనేందుకు ఇది నిదర్శనం. అత్యంత తీవ్రమైన పేలుడుతో కూడిన ప్రయోగాలను తరచూ నిర్వహిస్తున్నట్టు పలు ఆధారాలున్నాయి''అని రెనీ పేర్కొన్నారు. వీటిని హార్వర్డ్ వర్సిటీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త హుయ్ జాంగ్ కూడా ధ్రువీకరించారు. ఇక పింగ్‌టాంగ్ ప్లాంటులో యురేనియం శుద్ధి కార్యకలాపాలు సాగుతున్నట్టు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. అక్కడ ఏకంగా 360 అడుగుల ఎత్తైన నిర్మాణాలున్నట్టు తెలిపింది. ప్రధాన భవనం పరిసరాల్లో పలు కొత్త నిర్మాణాలు జోరుగా సాగుతున్నట్టు వెల్లడించింది.

### మూడో స్థానంలో చైనా

అణ్వాయుధాల విషయంలో రష్యా, అమెరికా తర్వాత చైనా ప్రస్తుతం ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. దాని వద్ద ప్రస్తుతం కనీసం 600 అణు వార్‌హెడ్లు ఉన్నట్టు అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ అంచనా వేసింది. 2030 నాటికి దాన్ని కనీసం 1,000కి పెంచుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ప్రస్తుతం రష్యా వద్ద ఏకంగా 5,400 అణు వార్‌హెడ్లు ఉండగా అమెరికా వద్ద 5,200 దాకా ఉన్నాయి. వాటితో పోలిస్తే చైనా అణు సంపత్తి తక్కువే అయినా, వాటి సంఖ్యను అది శరవేగంగా పెంచుకుంటున్న తీరు ఆందోళన కలిగించేదేనని నిపుణులు అంటున్నారు. అమెరికా, రష్యా నడుమ అమల్లో ఉన్న వ్యూహాత్మక అణు నిరాయుధీకరణ ఒప్పందం ఇటీవలే ముగియడం తెలిసిందే. దాన్ని పునరుద్ధరించే క్రమంలో చైనాను కూడా ఒప్పందం పరిధిలోకి తేవాల్సిన తరుణం ఆసన్నమైందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

---

## శబరిమల వివాదంపై విస్తృత ధర్మాసనం

### 9 మంది న్యాయమూర్తులతో ఏర్పాటు

- సీజేఐ సూర్యకాంత్ ధర్మాసనం నిర్ణయం
- ఏప్రిల్ 7 నుంచి 22 దాకా తుది విచారణ
- ముస్లిం, పార్శీ మహిళల సంబంధిత పిటిషన్లపైనా ధర్మాసనం విచారణ

**సాక్షి, న్యూఢిల్లీ:** శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి సంబంధించిన వివాదంపై 9 మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరపనుంది. శబరిమల ఆలయంలో అన్ని వయసుల మహిళలకూ ప్రవేశం కలిగిస్తూ ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2018లో తీర్పు వెలువరించడం తెలిసిందే. దాన్ని సవాలు చేస్తూ దాఖలైన 67 పిటిషన్లపై విస్తృత ధర్మాసనం తుది విచారణ జరపనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ ధర్మాసనం సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తుది విచారణకు ఏప్రిల్ 7 నుంచి 22 దాకా రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్టు వెల్లడించింది. 2018 నాటి తీర్పును వ్యతిరేకించే పక్షాల వాదనలను ఏప్రిల్ 7 నుంచి 9 వరకు ధర్మాసనం ఆలకించనుంది. ఆ తీర్పును సమర్థించే పక్షాలు ఏప్రిల్ 14 నుంచి 16 దాకా వాదనలు వినిపిస్తాయి. ఏప్రిల్ 22 నాటికి విచారణను ధర్మాసనం పూర్తి చేయనుంది. మహిళల మతపరమైన స్వేచ్ఛ, ప్రార్థన స్థలాల్లో వారిపై వివక్షకు సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు ఇతర పిటిషన్లను కూడా శబరిమల పిటిషన్లతో పాటే విచారిస్తుంది. మసీదులు, దర్గాల్లోకి మహిళల ప్రవేశంపై నిషేధం, పార్శీయేతర పురుషులను పెళ్లాడే పార్శీ మహిళలకు అగ్ని దేవాలయాల్లోకి ప్రవేశంపై నిషేధం, దావూదీ బోహ్రా సామాజిక వర్గంలో మహిళల్లో అంగవిచ్ఛిత్తి ఆచారం తదితరాలు వీటిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా మతాల్లో మహిళలకు మతపరమైన స్వేచ్ఛ, ప్రార్థన స్థలాల్లో వారి ప్రవేశంపై నిషేధం తదితరాలకు సంబంధించిన అంశాలపై కూడా ధర్మాసనం కూలంకషంగా విచారణ జరపనుంది. ''ఈ అంశాలకు సంబంధించి ధర్మాసనం లోతుగా విచారణ జరిపి పూర్తి న్యాయం చేకూరుస్తుంది. ఆ మేరకు వాటిపై న్యాయపరంగా ఒక సమగ్ర విధానాన్ని రూపొందిస్తుంది''అని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రార్థన స్థలాల నిర్వాహకులు తమ అభిప్రాయాలు, వాదనలతో మార్చి 14 లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

#### 2018 నాటి వివాదం...

కేరళలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయంలోకి రుతుక్రమంలో ఉన్న మహిళల ప్రవేశంపై శతాబ్దాలుగా నిషేధం కొనసాగుండటం తెలిసిందే. ఆ మేరకు 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ప్రవేశం లేదు. ఇది చట్టవిరుద్ధమే గాక రాజ్యాంగానికి కూడా విరుద్ధమని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2018 సెప్టెంబర్‌లో పేర్కొంది. వారి ప్రవేశంపై నిషేధాన్ని తొలగిస్తూ 4:1 మెజారిటీతో తీర్పు వెలువరించింది. దీనిపై కేరళతో పాటు దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. ఆ తీర్పును సవాలు చేస్తూ ఏకంగా 67 పిటిషన్లు దాఖలయ్యాయి. 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ సారథ్యంలోని మరో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వాటిపై విచారణ జరిపింది. శబరిమలతో పాటు మొత్తంగా ప్రార్థన స్థలాల్లో మహిళలపై వివక్ష అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదిస్తూ 3:2 మెజారిటీతో తీర్పు వెలువరించింది.



#### ఏడు అంశాలపై విచారణ

మహిళల మతపరమైన స్వేచ్ఛకు సంబంధించి మొత్తం ఏడు అంశాలపై విస్తృత ధర్మాసనం విచారణ జరుపుతుందని సీజేఐ ధర్మాసనం ప్రాథమికంగా పేర్కొంది. అవి...

- → రాజ్యాంగంలోని 25వ ఆర్టికల్‌లో పేర్కొన్న ప్రకారం మతపరమైన స్వేచ్ఛకున్న పరిధి ఏ మేరకు?
- → ఆర్టికల్ 25లో పేర్కొన్న వ్యక్తిగత మత స్వేచ్ఛ, ఆర్టికల్ 26లో పేర్కొన్న మతపరమైన సంస్థల అధికారాల మధ్య సంబంధాలు ఎలాంటివి?
- → ఆర్టికల్ 26లో పేర్కొన్న మతపరమైన అంశాలు చట్టపరమైన ఇతర నియమ నిబంధనలకు, నైతిక, ఆరోగ్యపరమైన అంశాలకు లోబడాలా?
- → ఆర్టికల్ 25, 26లో పేర్కొన్న నైతికత తాలూకు పరిధి ఏమిటి? ఈ విషయంలో రాజ్యాంగపరమైన నైతికతను ఎలా అర్థం చేసుకోవాలి?
- → ఆర్టికల్ 25లో పేర్కొన్న మతపరమైన పద్ధతులు, ఆచారాలపై న్యాయసమీక్షకు ఉన్న ఆస్కారం ఏ మేరకు?
- → ఆర్టికల్ 25 (2) (బి)లో పేర్కొన్న హిందూ వర్గాలు అంటే ఎవరు?
- → ఏదైనా మతపరమైన ఆచరణను వ్యతిరేకిస్తూ ఆ మతంతో సంబంధం లేనివారు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయవచ్చా?''

### సమీక్షకే మా ఓటు: కేంద్రం
#### ఆచితూచి నిర్ణయం: కేరళ

**న్యూఢిల్లీ/త్రివేంద్రం/కొట్టాయం:** శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై నిషేధం ఎత్తివేత తీర్పుపై సమీక్షను కేంద్రం సమర్థిస్తున్నట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సోమవారం విచారణ సందర్భంగా సీజేఐ ధర్మాసనానికి ఈ మేరకు ఆయన నివేదించారు. కేరళ ప్రభుత్వం మాత్రం ప్రస్తుతానికి సమీక్షను వ్యతిరేకిస్తోందని సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా ధర్మాసనానికి తెలిపారు. అయితే, ఈ అంశంపై సంబంధిత వర్గాలతో సమగ్రంగా చర్చించిన అనంతరమే ప్రభుత్వ వైఖరిపై తుది నిర్ణయం తీసుకుంటామని కేరళ న్యాయ శాఖ మంత్రి పి.రాజీవ్ పేర్కొన్నారు. ''ఇది చాలా సంక్లిష్టమైన వ్యవహారం. కనుక దీనిపై అవును, కాదు అని ఇప్పటికిప్పుడు స్పష్టమైన వైఖరికి రావడం సులువు కాదు. హిందూ మత విశ్వాసాలపై లోతైన అవగాహన ఉన్న నిపుణులతో దీనిపై కమిటీ వేయాలని గత అఫిడవిట్‌లో మేం పేర్కొన్నాం కూడా''అన్నారు. అయితే ఈ విషయంలో మత విశ్వాసాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. కేరళలో సీపీఎం సారథ్యంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో, శబరిమల వివాదంపై ప్రభుత్వం, పార్టీ ఏక వైఖరితో ఉండాల్సిన అవసరం లేదని సీపీఎం పేర్కొంది.

#### ప్రభుత్వ వైఖరి మారాలి

రుతుక్రమంలో ఉన్న మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించేందుకు వీల్లేదని కేరళకు చెందిన రెండు ప్రధాన హిందూ కుల సంస్థలు నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్), శ్రీ నారాయణ ధర్మ పరిపాలన (ఎస్ఎన్‌డీపీ) యోగం పునరుద్ఘాటించాయి. ఈ విషయంలో తమ వైఖరిలో మార్పు లేదని అవి స్పష్టం చేశాయి.

## నేడు ముంబైలో మోదీ, మేక్రాన్ భేటీ

### భారత్–ఫ్రాన్స్ పరస్పర వ్యూహాత్మక బంధంపై సమీక్ష

**న్యూఢిల్లీ:** నేడు భారత పర్యటనకు విచ్చేస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ వెనువెంటనే భారత ప్రధాని మోదీతో భేటీకానున్నారు. ముంబై ఇందుకు వేదికకానుంది. భారత్–ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతితో పాటు ఇరుదేశాల ద్వైపాక్షిక బంధంపై అగ్రనేతలు సమీక్ష జరపనున్నారు. వ్యూహాత్మక బంధం బలోపేతం చేయడంతోపాటు నూతన, కొత్తగా ఉద్భవిస్తున్న రంగాల్లోనూ సహకారాన్ని విస్తృత పర్చుకోవడంపై ఇరునేతలు ప్రధానంగా దృష్టిసారించనున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యాంశాల పైనా నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రధాని మోదీ ఫిబ్రవరి 17వ తేదీన ఢిల్లీ నుంచి ముంబైకి చేరుకున్నాక మేక్రాన్‌తో చర్చిస్తారని కేంద్రం ఒక అధికారిక ప్రకటన వెలువర్చింది. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొనాలంటూ ప్రధాని మోదీ ఆహ్వానించడంతో మేక్రాన్ భారత్‌లో పర్యటిస్తున్నారని ఆ ప్రకటన పేర్కొంది. మేక్రాన్ ఢిల్లీకి రావడం ఇది నాలుగోసారి కాగా ముంబైలో పర్యటించడం ఇదే తొలిసారి. మంగళవారం ముంబైలోని లోక్‌భవన్‌లో మోదీ, మేక్రాన్ చర్చలు మధ్యాహ్నం 3.15 గంటలకు మొదలు కానున్నాయి. సాయంత్రం 5.15 గంటలకు ఇండియా–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ 2026ను ఆవిష్కరిస్తారు. తర్వాత ఇరుదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు, పరిశోధకులు, ఇతర ఆవిష్కర్తలనుద్దేశించి మోదీ, మేక్రాన్ ప్రసంగిస్తారు.

---

## తొలి బోర్డు పరీక్షలకు హాజరు తప్పనిసరి

- టెన్త్ వార్షిక పరీక్షలపై సీబీఎస్ఈ
- కనీసం మూడు సబ్జెక్టులైనా రాయాలి
- లేదంటే రెండో బోర్డు పరీక్షలకు అనర్హులు
- వారు వచ్చే సంవత్సరంలో రాయాల్సిందే

**న్యూఢిల్లీ:** పదో తరగతి వార్షిక పరీక్షల విషయంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సోమవారం కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది నుంచి వార్షిక పరీక్షలను రెండుసార్లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వాటిలో తొలి విడత బోర్డు పరీక్షలను రాయడం విద్యార్థులందరికీ తప్పనిసరి అంటూ సీబీఎస్ఈ స్పష్టత ఇచ్చింది. ''విధిగా కనీసం మూడు సబ్జెక్టుల్లో పరీక్షలు రాసి తీరాల్సిందే. అలా రాయని వారిని 'ఎసెన్షియల్ రిపీట్'కేటగిరీగా పరిగణిస్తాం. వారిని మేలో జరిగే రెండో బోర్డు పరీక్షల్లో రాసేందుకు అనుమతించబోం. వారు తిరిగి వచ్చే విద్యా సంవత్సరంలోనే వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది''అని ప్రకటించింది. సీబీఎస్ఈ పదో తరగతి, 12వ తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం నుంచి మొదలవుతున్న నేపథ్యంలో బోర్డు ఈ మేరకు వెల్లడించింది. 2026 నుంచి ఏటా రెండుసార్లు వార్షిక పరీక్షలు నిర్వహించాలని సీబీఎస్ఈ బోర్డు నిర్ణయించడం తెలిసిందే. దానిప్రకారం తొలి విడత పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించి ఏప్రిల్లో ఫలితాలు వెల్లడిస్తారు. అనంతరం మేలో రెండో విడత పరీక్షలు జరుగుతాయి. ''మార్కులు పెంచుకోదలచిన విద్యార్థులు వాటిని రాయవచ్చు. అయితే ఏవైనా మూడు సబ్జెక్టుల్లో మాత్రమే రెండోసారి పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు''అని సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ వివరించారు. తొలి బోర్డు పరీక్షల్లో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులను కంపార్ట్‌మెంట్ విభాగంలో మేలో రెండో బోర్డు పరీక్షలకు అనుమతిస్తారని తెలిపారు.

తలుపు కొడుతున్న పక్షి

## ఆస్పత్రి మెట్లెక్కిన పక్షి!

**చికిత్స చేసి పంపిన సిబ్బంది • జర్మనీలో గమ్మత్తైన ఉదంతం**

**బెర్లిన్:** అది సముద్ర తీర ప్రాంతాల్లో కన్పించే పక్షి. ఎలా జరిగిందో గానీ ఓ చేపల గాలం కాస్తా దాని ముక్కులోకి గుచ్చుకుపోయింది. తాళలేని బాధతో ఆ పక్షి దగ్గర్లోని ఓ భవనం తాలూకు అద్దాల తలుపును ముక్కుతో పదేపదే కొట్టి సాయం అర్థించింది! అది ఓ ఆస్పత్రి తాలూకు ఎమర్జెన్సీ గది కావడం విశేషం! తలుపు తట్టిన చప్పుళ్లు విని అక్కడికొచ్చిన ఆస్పత్రి సిబ్బంది కాస్తా ఆ పక్షిని చూసి ముక్కున వేలేసుకున్నారు. దాని బాధ గమనించి, అగ్నిమాపక విభాగం సభ్యులతో కలిసి లోపలికి చేర్చారు. గాలాన్ని జాగ్రత్తగా తీసేసిన అనంతరం గాయానికి చికిత్స చేసి వదిలేశారు. ఈ గమ్మత్తైన ఉదంతం జర్మనీలోని బార్మెన్ నగరంలో ఆదివారం జరిగింది. ఈ పక్షులను కోర్మరాంట్‌గా పిలుస్తారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాలు వీటి ఆవాసం. చివరన కిందివైపుకు మెలి దిరిగి ఉండే ముక్కు వీటి ప్రత్యేకత.

చికిత్స అనంతరం

## ఘనంగా ప్రారంభమైన ఇండియా ఏఐ ఎక్స్‌పో!

**ప్రారంభించిన ప్రధాని మోదీ**
- పారిశ్రామిక, ఏఐ ప్రముఖుల రాక
- ఏఐ ప్రభావంపై విస్తృత చర్చలు
- సమస్యల పరిష్కారాలపై దృష్టి
- ఐదు రోజుల పాటు ఎక్స్‌పో
- పాల్గొననున్న దేశాధినేతలు

**న్యూఢిల్లీ:** ఎప్పుడెప్పుడా అని అంతా ఆసక్తిగా ఎదురు చూసిన ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ సదస్సు 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో'సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఢిల్లీలోని భారత మండపంలో సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పలు కంపెనీలు, స్టార్టప్‌లు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన కలియదిరిగారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులతో మాటలు కలిపారు. వారి పరిశోధనలు తదితరాలను గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ దాకా జరిగే ఈ ఐదు రోజుల సదస్సులో 600కు పైగా భారీ స్థాయి స్టార్టప్‌లు పాలుపంచుకోనున్నాయి. వాటితో పాటు 13 దేశాలకు చెందిన ఏఐ పెవీలియన్లు తమ ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమయ్యాయి. గ్లోబల్ సౌత్‌లో తొలిసారిగా జరుగుతున్న ఈ సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వాతో పాటు 20 మందికి పైగా దేశాధినేతలు, 60కి పైగా దేశాల నుంచి మంత్రులు పాల్గొంటున్నారు. అంతేగాక గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌తో పాటు పలు ఏఐ దిగ్గజ కంపెనీలకు చెందిన 40 మందికి పైగా సీఈఓలు కూడా హాజరై ఈ రంగంలో విస్తరణకు అమలు చేయదలచిన ప్రణాళికలు తదితరాలను ఆహూతులతో పంచుకోనున్నారు. 19వ తేదీన సదస్సును ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. అదే తేదీన మాక్రాన్ కూడా సదస్సులో పాల్గొంటున్నారు. భారత్‌కే గాక ప్రపంచమంతటికీ పలు రంగాలకు సంబంధించిన కీలక సవాళ్లకు ఈ సదస్సు సమర్థమైన పరిష్కారాలు చూపగలదని ప్రధాని విశ్వాసం వెలిబుచ్చారు. ఇన్నొవేటర్లు, పరిశోధకులు, టెక్ ఔత్సాహికుల నడుమ గడపడం ఎనలేని ఆనందాన్ని ఇచ్చినట్టు ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ''ఇండియా ఏఐ ఎక్స్‌పోను ప్రారంభించా. ఇంతటి కీలకమైన సదస్సుకు భారత్ ఆతిథ్యమిస్తుండటం హర్షణీయం''అన్నారు. 'గ్లోబల్ ఏఐ గవర్నెన్స్'కు ఈ సదస్సు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందజేస్తుందని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు. అంతకుముందు వేదిక వద్ద జియో ఏఐ ఎకో సిస్టమ్స్ స్టాల్‌ను ప్రధాని ఆసక్తిగా పరిశీలించారు.

#### తొలి రోజు విస్తృత చర్చలు

ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోకు కేంద్రం భారీస్థాయిలో ఏర్పాట్లు చేసింది. భారత్ మండపంలో 10 వేదికల్లో 70 వేల చదరపు మీటర్లకు పైగా విస్తరించిన ప్రాంతంలో స్టాళ్లు, స్టార్టప్‌లు, ఏఐ వేదికలు కనువిందు చేస్తున్నాయి. సోమవారం ఉదయానికే భారీ సంఖ్యలో తరలివచ్చిన పలు ప్రఖ్యాత ఏఐ సంస్థల సీఈఓలు, పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు తదితరులతో వేదికతో పాటు పరిసరాల్లోని హాళ్లన్నీ నిండిపోయాయి. వారంతా బృందాలుగా ఏర్పడి పలు రంగాల్లో ఏఐ ప్రభావం, దాని మంచిచెడులను గురించి చర్చోపచర్చల్లో మునిగితేలారు. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రపంచ స్థాయి దిగ్గజ ఏఐ సంస్థలు, స్టార్టప్లు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థలు, పలు దేశాలకు చెందిన ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి పరస్పరం అనుభవాలు, అభిప్రాయాలను పంచుకోనున్నాయి. ఏఐ దెబ్బకు పలు రంగాల్లో భారీగా కొనసాగుతున్న కొలువుల కోత మొదలుకుని బాలల భద్రత దాకా భిన్నమైన అంశాలు, సమస్యలపై చర్చలు, పరిష్కార మార్గాల అన్వేషణకు సదస్సు వేదిక కానుంది. 13కు పైగా దేశాలు ఇప్పటికే మండపంలో ప్రత్యేక పెవీలియన్లు ఏర్పాటు చేశాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్టోనియా, తజకిస్తాన్ వంటివి వీటిలో ఉన్నాయి. 300కు పైగా క్యూరేటెడ్ ఎగ్జిబిషన్ పెవీలియన్లు ఆకట్టుకోనున్నాయి. 'పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్' థీమ్‌తో కూడిన లైవ్ డెమాన్‌స్ట్రేషన్లు కంపెనీల ఏఐ ప్రణాళికలను కళ్లకు కట్టనున్నాయి. రెండున్నర లక్షల మందికి పైగా ఏఐ సదస్సును సందర్శిస్తారని భావిస్తున్నారు.

ఇండియా ఏఐ ఎక్స్‌పోలో ఔత్సాహికులతో మోదీ మాటామంతి

---

## పెళ్లికి ముందు ఎవరినీ నమ్మొద్దు

- అస్సలు హద్దు మీరొద్దు
- శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

**సాక్షి, న్యూఢిల్లీ:** సహజీవన ఘటనలపై సర్వోన్నతన్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ''పెళ్లికి ముందు అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ ఒకరికొకరు అపరిచితులే. బంధం ఎంత గాఢమైనదైనా సరే పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకోవడందాకా ఎందుకు వెళ్తున్నారో మాకైతే అర్థంకావట్లేదు. మేము పాతకాలం మనుషులమే కావచ్చు.. కానీ పెళ్లికి ముందు ఎవరినీ గుడ్డిగా నమ్మొద్దు. ఆచితూచి అడుగులేయాలి''అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ దాఖలైన ఓ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది.

#### అసలేం జరిగిందంటే?

నిందితుడు 2022లో ఓ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా 30 ఏళ్ల మహిళకు పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అయితే నిందితుడికి అప్పటికే వివాహమైంది. ఆ విషయాన్ని దాచిపెట్టి, సదరు మహిళతో ఢిల్లీలో పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం ఆమెను తనతో పాటు దుబాయ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ కూడా పెళ్లి ప్రస్తావన తెచ్చి సహజీవనం చేశాడు. ఈ క్రమంలో ఆమెకు తెలియకుండా సాన్నిహిత్య వీడియోలను రికార్డ్ చేశాడు. పెళ్లి గురించి అడిగితే ఆ వీడియోలను బయటపెడతానని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఇంత జరుగుతున్నా బాధితురాలిని కాదని 2024 జనవరి 19వ తేదీన నిందితుడు పంజాబ్‌లో మరో యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసులో బెయిల్ కోసం నిందితుడు ప్రయత్నించగా అక్కడ చుక్కెదురైంది. దీంతో అతను బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

#### మీకెందుకు అంత చనువు?

సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. 'పెళ్లికి ముందు ఎంత చనువున్నా సరే, వారు అపరిచితుల కిందే లెక్క. ఒకవేళ ఆ మహిళకు పెళ్లి, సాంప్రదాయంపై అంత పట్టింపు ఉంటే, పెళ్లి కాకుండానే అతనితో దుబాయ్ ఎందుకు వెళ్లింది?' అని ప్రశ్నించారు. 'నేటి కాలంలో ఇలాంటి కేసులు చూస్తుంటే మాకు అర్థం కావడం లేదు. పెళ్లికి ముందే అన్నీ జరిగిపోతున్నాయి. యువత జాగ్రత్తగా ఉండాలి'అని హితవు పలికారు. మ్యాట్రిమోనియల్ సైట్‌లో పరిచయమై, పెళ్లి చేసుకోవాలనుకున్నారు కదా అని ప్రభుత్వ న్యాయవాది బదులివ్వగా 'పెళ్లి చేసుకోవాలనుకోవడం వేరు. పెళ్లి కాకుండానే అన్నీ జరిగిపోవడం వేరు. ఎవరినీ గుడ్డిగా నమ్మకూడదు'అని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది ఇద్దరి అంగీకారంతో కొనసాగిన శారీరక బంధంలా కనిపిస్తోందని కోర్టు అభిప్రాయపడింది. 'పరస్పర సమ్మతితో కొనసాగిన ఇలాంటి కేసుల్లో విచారణలు జరిపి, దోషులుగా తేల్చి జైలుకు పంపడంలో హేతుబద్ధత లేదు. ఇద్దరూ కలిసి మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలి. అవసరమైతే బాధితురాలికి నిందితుడు తగు నష్టపరిహారం ఇవ్వాలి'అని జస్టిస్ నాగరత్న సూచించారు. ఇద్దరూ మాట్లాడుకుని వివాదపరిష్కారానికి అవకాశాన్ని పరిశీలించాలని కేసును బుధవారానికి వాయిదా వేశారు.

## 25 నుంచి మోదీ ఇజ్రాయెల్ పర్యటన

**జెరూసలేం:** ప్రధాని మోదీ ఫిబ్రవరి 25 నుంచి రెండ్రోజులపాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఆదివారం అమెరికన్ యూదు సంస్థల అధ్యక్షులతో భేటీ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రధాని మోదీ పర్యటన వివరాలను తొలిసారిగా మీడియాకు బహిర్గతం చేశారు. ''మన నెసెట్(పార్లమెంట్)నుద్దేశించి ఒక ముఖ్యనేత ప్రసంగించబోతున్నారు. వచ్చే వారం ఇక్కడికి ఎవరొస్తున్నారో తెలుసా? నరేంద్ర మోదీ''అంటూ మోదీ పర్యటనను నెతన్యాహూ ప్రకటించారు. ''భారత్‌తో మన బంధం గొప్పది. అన్ని రంగాల్లో సహకారంపై విస్తృతస్థాయిలో మోదీతో చర్చించబోతున్నా. మీరిప్పుడొకటి తెల్సుకోవాలి. భారత్ ఏరకంగానూ చిన్న దేశం కాదు. వాళ్ల జనాభా ఏకంగా 140 కోట్లు. భారత్ ఇప్పుడు శక్తివంతమైన, పరపతి గల దేశంగా ఎదుగుతోంది''అని అన్నారు. 2017 జూలైలో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించి యూదు దేశంలో అడుగుపెట్టిన తొలి భారతీయ ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఇజ్రాయెల్‌లో మోదీ పర్యటించబోతున్నారు.

## అగ్నికి ఏడు జీవితాలు బుగ్గి

- రాజస్థాన్‌లోని దుస్తుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం
- పలువురికి తీవ్ర గాయాలు

**జైపూర్:** రాజస్తాన్‌లో వస్త్ర తయారీ పరిశ్రమగా మొదలై అక్రమ బాణసంచా తయారీ కర్మాగారం అవతారమెత్తిన ఒక ఫ్యాక్టరీలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఖైథాల్–తిజారా జిల్లాలోని భివాడీ ప్రాంతంలోని ఖుష్‌ఖేరా–కరోలీ పారిశ్రామికవాడలో ఈ అగ్ని ప్రమాదం సోమవారం ఉదయం సంభవించింది. విషయం తెల్సి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నంచేశారు. ఎట్టకేలకు మంటల్ని ఆర్పినా అప్పటికే ఏడుగురి ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మరి కొందరి జాడ గల్లంతైంది. దీంతో శిథిలాల తొలగింపు తర్వాత మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్రా పాఠక్ చెప్పారు. ఫ్యాక్టరీలో చిక్కుకుపోయిన ఇద్దరిని ఎలాగోలా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. వస్త్ర పరిశ్రమ కోసం ఫ్యాక్టరీని లీజుకు తీసుకుని అక్రమంగా బాణసంచా తయారుచేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటనాస్థలి నుంచి పెద్ద మొత్తంలో గన్‌పౌడర్, బాణసంచా, బాణసంచా ప్యాకింగ్ బాక్స్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయాన్నే ఆ ప్రాంతంలో పోలీసలు సాధారణ పెట్రోలింగ్ చేస్తుండగా ఈ అగ్నిప్రమాదం వాళ్ల కంటపడింది. తొలుత మంటలు వ్యాపించి తర్వాత పేలుళ్లు జరగడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. ఘటన జరిగినప్పుడు ఫ్యాక్టరీలో 20 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. బాణసంచా పేలుడు, భారీ అగ్నికీలల ధాటికి కార్మికుల మృతదేహాలు కాలిపోయి అస్థిపంజరాలు మిగిలాయని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు.

సాక్షి
గుంటూరు
మంగళవారం । 17 । ఫిబ్రవరి । 2026



## సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 538.10 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 50,117 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



## నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.8,000, గరిష్ట ధర రూ.9,800, మోడల్ ధర రూ.9,000 వరకు పలికింది.

## శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ముప్పాళ్ల: మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగోద్భవ కాలంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

## రాష్ట్ర బడ్జెట్‌పై 'మన్‌కీ' బాత్

### నిరాశాజనకంగా రాష్ట్ర బడ్జెట్

మంగళగిరి టౌన్: రాష్ట్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. ఈ వార్షిక బడ్జెట్ ఏపీ చరిత్రలోనే అవాస్తవ బడ్జెట్‌గా నిలిచిపోతుంది. 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.1500లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. టీడీపీకి మహిళలకు ఇచ్చి హామీపై చిత్తశుద్ధి లేదు. నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని యువత ఎదురు చూసింది. రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి రాయితీలు, మేలు చేసే అంశాలు లేవు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఊసే లేదు.

– దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త

### పేదలను మోసం చేసిన బడ్జెట్

పట్నంబజారు (గుంటూరుఈస్ట్): పేదవాడికి మూడు సెంట్లు స్థలం ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం అందుకు ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవటం దారుణం. పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారాన్ని మోపటమే తప్ప బడ్జెట్ వల్ల ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. ఎన్నికల వాగ్దానాలను మేనిఫెస్టోలో పెట్టి మరీ మోసం చేశారు. వాగ్దానాలు ఇవ్వటమే కాకుండా బాండ్ల రూపంలో సంతకాలు పెట్టి మరీ ప్రజలను వంచించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం వంటి పథకాలకు అంతంత మాత్ర కేటాయింపులు చేయటం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్, సున్నా వడ్డీకే మహిళలకు రుణాలు వంటి కార్యక్రమాలకు పూర్తిగా పంగనామాలు పెట్టారు.

– అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త

### ప్రజలకు పనికిరాని బడ్జెట్

గుంటూరు రూరల్: రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేస్తూ, ప్రజలకు పనికిరాని బడ్జెట్‌ను ప్రవేశపెట్టి చంద్రబాబు ప్రభుత్వం చేతులు దులుపుకుంది. నిరుద్యోగ యువతను, మహిళాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీలు, బీసీల అభివృద్ధికి ఎటువంటి హామీ లేకుండా బడ్జెట్ రూపొందించారు. సంక్షేమాన్ని గాలికి వదిలి కేవలం చంద్రబాబు తన వర్గానికి, కార్పొరేట్ శక్తులకు ఉపయోగకరంగా బడ్జెట్‌ను రూపొందించారు. నిరుద్యోగ భృతికి నామం పెట్టారు. రైతులను నట్టేట ముంచారు. మహిళలకు నెలకు రూ.1500 అని చెప్పి మహిళల నెత్తిన టోపి పెట్టారు. జీతాల పెంపు లేకుండా ఉద్యోగులను మోసం చేశారు. చంద్రబాబు అంటేనే మోసం అని మరోసారి రుజువు చేశారు.

– బలసాని కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త

### వాస్తవాలకు దూరంగా బడ్జెట్

పట్నంబజారు (గుంటూరుఈస్ట్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్ వాస్తవాలకు దూరంగా ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలను నిలువునా వంచించారు. రైతు, మహిళలు, యువతకు తగిన ప్రాధాన్యం లేకపోవడం బాధాకరం. నిరుద్యోగ భృతి, మహిళల రుణాలు, రైతుల రుణాలు మొదలగు అంశాలను అసలు పట్టించుకోకపోవటం దారుణం. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలన్నీ నీటి మీద రాతలుగా మారాయి. ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు. అంకెల గారడీతో.. అప్పుల గుదిబండతో ప్రజలను ఎక్కువ కాలం మోసం చేయలేరు.

– ఈమని రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం

# కొండ పండుగ

# వైఫల్యం మెండుగా

- కోటప్పకొండ తిరునాళ్లలో భక్తులకు తీవ్ర ఇబ్బందులు
- కిక్కిరిసిన మెట్ల మార్గం.. భక్తులకు నరకయాతన
- దూరంగా బస్టాండ్‌తో నడవలేక అవస్థలు
- పలు చోట్ల పలుమార్లు స్తంభించిన ట్రాఫిక్
- భక్తులకు అందని స్వామి వారి ప్రసాదాలు

కోటప్పకొండలో ప్రసాదాల కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

నరసరావుపేట రూరల్: అధికారుల ప్రణాళిక లోపంతో కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చిన భక్తులు ఆదివారం తీవ్ర అవస్థలు పడ్డారు. నరసరావుపేట నుంచి వచ్చే యాత్రికుల కోసం ఘాట్ రోడ్డుకు దూరంగా ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయడంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు నడకతో ఇబ్బందులు పడ్డారు. వీఐపీల తాకిడితో సామాన్య భక్తులు గంటల కొద్దీ క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది.

■ వీఐపీల పేరుతో లిఫ్ట్ నుంచి ఆలయ ప్రాంగణంలోకి వచ్చిన వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు. దీంతో శ్రీఘ్ర దర్శనం, అభిషేక దర్శనం భక్తులకు స్వామి దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. వీఐపీల సేవలో అధికారులు తరించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందజేయడంలో ఆలయ అధికారులు వైఫల్యం చెందారు. భక్తులకు విక్రయించేందుకు రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేశామని అధికారులు ప్రకటించారు. అయితే ఆదివారం సాయంత్రం ఆరు గంటలకే లడ్డూ ప్రసాదాలు నిండుకున్నాయి. ప్రసాదాలు కోసం క్యూలైన్‌లో భక్తులు ఎదురుచూడాల్సి వచ్చింది. లడ్డూలు తయారు చేస్తున్నారు వేచి ఉండమని సిబ్బంది చెప్పడంతో భక్తులు ప్రసాదాలు స్వీకరించకుండానే వెనుతిరిగారు.

### గోనెపూడి ప్రభ వద్ద పోలీసుల హంగామా

కోటప్పకొండకు వచ్చిన గోనెపూడి ప్రభ వద్ద పోలీసులు అర్ధరాత్రి హంగామా సృష్టించారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు ప్రభను ఏర్పాటుచేశారు. ఆ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకొని పాటలకు డాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. ఇతర గ్రామాల నుంచి ప్రభల వెంట వచ్చిన టీడీపీ అభిమానులు కర్రలతో వచ్చి వీరిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. పోలీసులు అక్కడకు చేరుకుని గోనెపూడి ప్రభ లైటింగ్ నిలిపి వేయించారు. ప్రభ వద్ద ఉన్న జనంపై లాఠీచార్జీ చేసి తరిమివేశారు. వైఎస్సార్‌సీపీ జెండా రంగులతో ఉన్న పంబతాళ్లు తొలగించారు.

### స్తంభించిన ట్రాఫిక్..

■ ట్రాఫిక్ సమస్యపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టితో పలు సమావేశాలు ఏర్పాట్లు చేసినా సత్ఫలితాలు ఇవ్వలేదు. షరామాములుగానే ట్రాఫిక్ సమస్య ఎదురైంది.

■ పెట్లూరివారిపాలెం–ఉప్పలపాడు మార్గంలో సాయంత్రం రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచి పోయింది. ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్ కావడంతో బస్సుల రాకపోకలు గంటలకు పైగా నిలిచిపోయాయి. దీంతో బస్సుల కోసం కొండ మీద భక్తులు ఎదురు చూడాల్సి వచ్చింది.

బస్సుల వద్ద భక్తుల రద్దీ

■ మెట్ల మార్గంలో రద్దీ ఉండటంతో కొండ దిగువకు వెళ్లేందుకు భక్తులను అనుమతించలేదు. దీంతో కొండ మీద భక్తులు కిందకు ఎలా వెళ్లాలో తెలియక ఆందోళన చెందారు. కొంతమంది ఘాట్‌రోడ్డులో కిందకు వెళ్లేందుకు నడక ప్రారంభించారు.

■ కోటప్పకొండ– యల్లమంద రోడ్డులో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. మెట్లమార్గం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులకు తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. లైటింగ్ తక్కువగా ఉండటంతో ఆకతాయిలతో మహిళా భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది.

నేలకొరిగిన మద్దిరాల విద్యుత్ ప్రభ

### తిరునాళ్లలో అపశృతి

■ కోటప్పకొండ తిరునాళ్ళలో అపశృతి చోటుచేసుకుంది. మద్దిరాల నుంచి కొండకు వచ్చిన భారీ విద్యుత్ ప్రభ తిరుగుప్రయాణంలో నేలకొరిగింది. ప్రభలు నిలిపే నిధి నుంచి సోమవారం ఉదయం ప్రభలను గ్రామానికి తరలించడం ప్రారంభించారు. ఈ సమయంలో అదపుతప్పి పక్కకు పడిపోయింది. ఆ సమయంలో అటువైపు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. క్రేన్ సాయంతో ప్రభను పైకి లేపి గ్రామానికి తరలించారు.

### వైభవంగా లింగోద్భవ అభిషేకాలు

ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

నరసరావుపేటరూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని కోటప్పకొండలోని త్రికోటేశ్వర స్వామి వారికి లింగోద్భవ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటల నుంచి ప్రారంభమైన పూజలు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. పంచామృత ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రకు మార్‌లు అభిషేకాల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో లింగోద్భవ పూజలను తిలకించారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కుంకుమతో త్రికోటేశ్వరునికి అభిషేకం

## ప్రత్యేక అలంకరణలో బాలకోటేశ్వరస్వామి

## భక్తులకు దర్శనం

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామికి ఆదివారం రాత్రి లింగోద్భవ కాలంలో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 12 గంటల తరువాత ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకస్వాములు గూడూరు సాంబశివరావు బృందం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాలంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో నాగేశ్వరస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

క్వారీ దేవాలయంలో మహాశివరాత్రి లింగోద్భవ కాలపూజ సమయంలో ప్రత్యేక అలంకరణలో బాలకోటేశ్వరస్వామి

## రెవెన్యూ క్లినిక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### డీఆర్వో షేఖ్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్‌లో సమస్యల పరిష్కారం వేగంగా జరుగుతుందని వీటిని ప్రజలు అవసరం మేరకు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో షేఖ్ ఖాజావలి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్వో మాట్లాడుతూ అన్ని మండలాల తహసీల్దార్‌లు ఒకే వేదికపై అందుబాటులో ఉండడం వలన సమస్యల పరిష్కారం మరింత సులభతరమయ్యిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి డార్మెంటరీలో ఉన్న బ్యాంక్ అకౌంట్లను సంబంధిత శాఖల డీడీఓలు ఈకేవైసీ చేసి వెంటనే యాక్టివ్‌లోకి తీసుకురావాలని సూచించారు. కార్యాలయాల్లోని అన్ని ఫైళ్లను ఈపీటీఎస్‌లో నమోదు ప్రక్రియను నూరు శాతం వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం అందిన 217 అర్జీలను డీఆర్వోతోపాటు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ సీఈవో వి జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్ పరిశీలించారు.

అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో షేఖ్ ఖాజావలి

### అంజుమన్ భూములను కాపాడండి

అంజుమన్ ఏ ఇస్లామియా ను1915లో స్థాపించారు. చినకాకానిలో ఉన్న మన అంజుమన్–ఏ–ఇస్లామియాకు చెందిన 71.57 ఎకరాల భూమిని భూసేకరణ చట్టం కింద జిల్లా కలెక్టర్ గతేడాది డిసెంబర్ 19న ల్యాండ్ అక్విజేషన్‌కు నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిని వ్యతిరేకిస్తున్నాం. ముస్లింల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఆ భూమిని వారి అభివృద్ధికే ఉపయోగించాలి.

–షేక్ లియాఖత్ అలీ
గుంటూరు జిల్లా మైనారిటీ అడ్వకేట్స్

### రజకుల ఆస్తులు అన్యాక్రాంతం

చినకాకానిలో రజక వృత్తిదారుల కోసం 1983లో సుమారు ఏడు ఎకరాల భూమిని కేటాయించారు. అగ్రవర్ణాల పెద్దలు దానిని మట్టితో పూడ్చి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిపై రజక కమ్యూనిటీ హాలు నిర్మించి రజకుల అభివృద్ధికి ఉపయోగించాలి.

– రజక నిర్వాసితులు, చినకాకాని గ్రామం

## కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

- కల్యాణ బ్రహ్మోత్సవాలను తిలకించి పరవశించిన భక్తులు
- అన్నపూర్ణదేవిగా భ్రమరాంబ దర్శనం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన కొల్లిపర వంశీయులు
- అభిషేకాల్లో పాల్గొనేందుకు భక్తుల ఆసక్తి

భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహ శివరాత్రి కల్యాణ బ్రహోత్సవాలలో భాగంగా పెదకాకాని శివాలయంలో ఆదివారం రాత్రి వేదమంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా అర్చకులు గజవాహనంపై ఎదుర్కోల ఉత్సవం జరిపించారు. శివాలయం పునర్నిర్మాణ దాతలైన కొల్లిపర వంశీయులు భ్రమరాంబ మల్లేశ్వర స్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, పాలకవర్గసభ్యులు, అర్చకులు, భక్తులు సమక్షంలో సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువులో ముందుగా తాంబూలాలు మార్చుకున్నారు. అనంతరం తెల్లవారుజామున కనుల పండువగా గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణమంతా ఓంనమఃశివాయ నామంతో మార్మోగింది. లింగోద్భవ కాలంలో స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో జరిగే అభిషేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి భక్తిపారవశ్యంలో తరించారు. కల్యాణం అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులందరికీ స్వామివారి ప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులచే కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

శివాలయంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

### నేడు రాజరాజేశ్వరిదేవిగా దర్శనం, రథోత్సవం

పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భ్రమరాంబ అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. సాయంత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులను అనుగ్రహించారు.

### నేడు ఎయిమ్స్ ద్వితీయ స్నాతకోత్సవం

మంగళగిరిటౌన్: మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ద్వితీయ స్నాతకోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతేమ్ సింగ్ తెలిపారు. సోమవారం ఎయిమ్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, గౌరవ అతిథిగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ హాజరవుతారని వెల్లడించారు.స్నాతకోత్సవంలో 49 ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, 5 ఎండీ/ఎంఎస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 4 పోస్ట్–డాక్టొరల్ సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## నేడు డీ వార్మింగ్ డే

డీఎంహెచ్‌ఓ
డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (డీ వార్మింగ్ డే)ను మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం తెలిపారు. అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చన్నారు.

■ గుంటూరు జిల్లాలో గల 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు సుమారు 4,71,937 మందికి మాత్రలు వేయడం జరుగుతుందని చెప్పారు. 17వ తేదీన డీ వార్మింగ్ జరగని వారికి, ఈనెల 24న జరిగే మాప్–అప్ రోజున అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రను వేయాలని తెలిపారు.

■ 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు వారికి సగం మాత్ర నీటిలో కరిగించి తాగించాలన్నారు. 2 నుంచి 3 సంవంత్సరాల పిల్లలకు మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల వారికి పూర్తిగా మాత్రను చప్పరించేటట్లు చూడాలన్నారు.

■ మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తరవాత మాత్రలను వేయాలని తెలిపారు. నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలుగుతాయని. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి రుగ్మతలు ఉంటాయన్నారు.

■ నులి పురుగుల మాత్ర వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ఎవరికైనా వికారం, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.

## మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 87,018 |
| అమ్మకాలు | 82,824 |
| నిల్వ | 18,613 |

**నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 13,500–21,500 |
| నంబరు–5 | 13,500–22,500 |
| 273 | 14,000–23,000 |
| 341 | 14,000–24,500 |

**ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 13,500–20,000 |
| నంబరు–5 | 13,000–20,500 |
| 341 | 14,000–23,000 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | 13,000 – 18,500 |
| బాడిగ–355 | 14,000 – 25,000 |
| దేవనూరు డీలక్స్ | 15,500 – 27,000 |
| ఆర్మూర్ | 13,000 – 17,000 |
| తాలుకాయలు | 8,000 – 12,000 |

**ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | 13,000–18,000 |
| బాడిగ – 355 | 14,000–23,500 |
| దేవనూరు డీలక్స్ | 8,500–11,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

# అంబటిపై దాడి ఆటవికం

- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- గుంటూరులో అంబటి రాంబాబు కుటుంబ సభ్యులకు పరామర్శ

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి, చిత్రంలో మౌనిక, అంబటి మురళీకృష్ణ తదితరులు

**పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) :** మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసం, కార్యాలయంపై దాడి ఆటవిక, అరాచక చర్య అని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, మౌనిక, మనోజ్ఞలను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

➡ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అనేది లేకుండా పోయిందన్నారు. అంబటి నివాసంపై పక్కా ప్లాన్ ప్రకారమే దాడి చేశారని మండిపడ్డారు.

➡ లడ్డూ ప్రసాదంపై విషప్రచారం చేసింది కూటమి నేతలేనని, ఇదేమని ప్రశ్నిస్తే దాడులు చేస్తోంది వారేనన్నారు. చేయాల్సిన తప్పులన్నీ చేసి ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

➡ జోగి రమేష్ ఇంటిపై ప్రణాళికాబద్ధంగా దాడి చేశారని, పరిపాలన ఎలా ఉందో సరిచూసుకోవాల్సిన అవసరం ఈ ప్రభుత్వానికి ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు ఇది రాచరిక రాజ్యం కాదన్న విషయాన్ని గుర్తించాలని, ప్రతిపక్షంగా వైఎస్సార్ సీపీ ప్రశ్నిస్తుందని స్పష్టం చేశారు.

➡ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అప్పులపై మీరు అబద్ధాలు చెప్పలేదా అని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేసింది కూటమి నేతలు కాదా అని దుయ్యబట్టారు. దివిసీమ ఉప్పెన తరహాలో ప్రజా ఉప్పెనలో కూటమి ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. రైతులు, విద్యార్థులు, ఆరోగ్య శ్రీ, పేదలకు మూడు సెంట్ల స్థలాలు ఇవ్వడం గురించి ఆలోచించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు.

➡ చంద్రబాబు బిల్‌గేట్స్‌ను తీసుకొచ్చి షో చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

➡ అంబటిని పోలీస్ స్టేషన్ లో శారీరకంగా హింసించారని, దాడికి పాల్పడిన వారిని వదిలేసి... దాడికి గురైనవారిని జైలులో పెట్టే వింత పాలన ఎప్పుడూ చూడలేదన్నారు.

➡ అంబటి కుటుంబానికి అండగా వైఎస్సార్ సీపీ ఉందని, అన్ని కులాలు ఏకమై చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాడుతామన్నారు.

➡ ముందుగా ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కాపు, బీసీ సంఘాల నేతలు ర్యాలీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో అంబటి కుమార్తె మౌనిక, వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, నగర అధ్యక్షుడు మహేష్, బీసీ విభాగం నేతలు అవినాష్, రవి, ఏటి కోటేశ్వరరావు, పలు అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులను గుర్తించడమే 'శాప్ లీగ్' లక్ష్యం

**జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా**

శాప్ లీగ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**గుంటూరు వెస్ట్:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) ప్రారంభిస్తున్న క్రీడా పోటీలతో ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి శాప్ లీగ్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా శాప్ ఆధ్వర్యంలో 'శాప్ లీగ్' తో నూతన క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ లీగ్ ఫిబ్రవరి రెండో వారం నుంచి డిసెంబర్ వరకు ఏడాది పొడవునా కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు, ముఖ్యంగా పాఠశాల స్థాయి విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు. దీని కోసం పాఠశాల విద్యాశాఖ తో కలిసి పని చేస్తాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారని, ఎంపికైన వారు నేరుగా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ నెల 21న తిరుపతిలో రాష్ట్రస్థాయి చెస్ లీగ్ ప్రారంభం కానుందన్నారు. కేవలం ప్రతిభను గుర్తించడమే కాకుండా, ఎంపికైన క్రీడాకారులకు భవిష్యత్తులో కోనేరు హంపి, పి.వి. సింధు వంటి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, ఆర్డీఓ కె.శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవ పరిస్థితులకు భిన్నంగా రాష్ట్ర బడ్జెట్

మాట్లాడుతున్న ఆతుకూరి ఆంజనేయులు

**నగరంపాలెం(గుంటూరు ఈస్ట్):** ఏపీ రాష్ట్ర బడ్జెట్ వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. జిన్నాటవర్ కూడలిలోని ఐసీసీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోనూ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక, వ్యాపార, వ్యవసాయ రంగాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు విద్యుత్‌ఛార్జీలపై సబ్సిడీ అందించాలని అన్నారు. ప్రభుత్వాలు పన్నుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లను ప్రవేశపెట్టకుండా సామాన్య ప్రజల సంక్షేమ కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. పరిమిత మేర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని, మీ ఆలోచనలు, భవిష్యత్, ముందస్తు అంటూ సామాన్య ప్రజలు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత యివ్వాలని అన్నారు. ఐసీసీ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు అన్ని వర్గాలకు అనుకూలంగా ఉన్నాయని, అయితే రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పారిశ్రామిక, వ్యాపార రంగాలు కుంటుపడుతున్నాయని అన్నారు. చిన్న వ్యాపారులు బడా కంపెనీల ఏర్పాటుతో నష్టపోతున్నారని చెప్పారు. ఉపాధ్యక్షుడు టీఎల్‌వీ వీరాంజనేయులు, గొల్లపూడి రాంబాబు, కార్యదర్శి ఆతుకూరి నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గండాలయ స్వామి ఆలయంలో ప్లాస్టిక్ నిషేధం

**మంగళగిరి టౌన్:** మంగళగిరి పట్టణంలోని శ్రీ పానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండపై పర్యావరణ పరిరక్షణకై ఆలయ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. 17వ తేదీ మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఘాట్‌రోడ్ ద్వారా గండదీపానికి వెళ్లే మార్గంలో వాహనాలను ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ తెలిపారు. కొండపై ప్లాస్టిక్ వినియోగం నియంత్రణలో భాగంగా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు తదితర వస్తువులను గండాలయ స్వామి ఆలయ ప్రాంతంలో నిషేధించామని పేర్కొన్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులు శ్రీ గండాలయస్వామి వారి సన్నిధికి ప్లాస్టిక్ సామగ్రిని తీసుకురావద్దని ఆయన కోరారు. ఆలయ పరిశుభ్రతను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### 'క్వారీ' తిరునాళ్ల ఆదాయం రూ.17.30లక్షలు

**చేబ్రోలు:** మండలంలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి తిరునాళ్ల సందర్భంగా హుండీ ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు దేవదాయశాఖాధికారులు తెలిపారు. వడ్లమూడి క్వారీ దేవస్థానం వద్ద సోమవారం దేవదాయశాఖాధికారులు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హుండీలో వేసిన కానుకలను, ఇతర ఆదాయాలను దేవదాయశాఖాధికారులు, స్థానిక పెద్దల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. మొత్తం రూ.17.30లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖాధికారి నరసింహరావు తెలిపారు. వీటిలో హుండీల ఆదాయం రూ.6,03,208లు, అభిషేకం, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.7,40,500లు, కొబ్బరి చిప్పలు, కొబ్బరికాయలకు రూ.2.95లక్షలు, గ్యాస్ పొయ్యిలకు రూ.34,500లు, డొనేషన్స్ రూ.57,390ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేవస్థానానికి మొత్తంగా రూ. 17.30లక్షలు సమకూరింది. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం రూ.1.03లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధికారులు అంచనా వేశారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారులు, పోలీసు, రెవెన్యూ శాఖాధికారులు, గ్రామస్తులు, స్థానిక పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రైవేటు ఆసుపత్రులు వివరాలు సమర్పించాలి

**గుంటూరు మెడికల్:** వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యం, సిబ్బంది, వారి వద్ద పనిచేస్తున్న వైద్యుల హెచ్‌పీఆర్ ఐడీలు, వైద్య సంస్థల హెచ్‌ఎఫ్‌ఆర్ ఐడీలను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఈప్రక్రియ 30 రోజుల్లోపు పూర్తి చేసుకోకపోతే, ఆసుపత్రులు, రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాల లైసెన్సులు చెల్లనివిగా భావిస్తామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలన్నారు. మధ్యవర్తుల ద్వారా సందేశాలు, బట్వాడా ద్వారా పంపడం వంటి చర్యలను నేరపూరిత చర్యగా భావిస్తామని టవెల్లడించారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

**మంగళగిరి టౌన్:** పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలియజేశారు. మంగళగిరి పట్టణంలోని ఫిట్‌జోన్ జిమ్‌లో సోమవారం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ క్లాసిక్ (మెన్ అండ్ ఉమెన్) పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మెన్ విభాగంలో ప్రదీప్ కుమార్ (59 కేజీలు) గోల్డ్ మెడల్, జస్వంత్ (66 కేజీలు) బ్రాంజ్ మెడల్, షేక్ మొహిద్దీన్ (93 కేజీలు) సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఉమెన్ విభాగంలో లలిత్య (76కేజీలు) బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. మెన్ ఓవరాల్ టీమ్ చాంపియన్ షిప్ విభాగంలో గుంటూరు జిల్లా టీమ్‌కు 3వ స్థానం లభించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు, ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ పవర్ లిఫ్టింగ్ కోచ్ సలోమి, పతకాలు సాధించిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## కృష్ణానదిలో ఫైర్ సిబ్బందికి శిక్షణ పూర్తి

శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బందితో అగ్నిమాపక శాఖ అధికారులు

**మంగళగిరి టౌన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఫైర్ సర్వీస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి.వెంకట రమణ ఆదేశాలతో తాడేపల్లి ఉండవల్లి కరకట్ట వెంబడి వున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వద్ద పలువురు ఫైర్ సిబ్బంది స్విమ్మింగ్, వాటర్ రెస్క్యూ యాక్టివిటీస్‌పై శిక్షణ తీసుకున్నారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి విచ్చేసి సమీక్షించారు. ఆయన ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఫైర్ సిబ్బంది నదిలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో వాటర్ రెస్క్యూ మెథడ్ ద్వారా చేసి చూపించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది నదిలో నీటి లోతును, ప్రవాహ వేగాన్ని అంచనా వేసి బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంలో శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి నరసింహారావు, మంగళగిరి ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించండి

**ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు**

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న నాగేశ్వరరావు, అనిల్, వీఆర్‌ఓలు

**మాచర్ల రూరల్:** రెవెన్యూ ఉద్యోగులపై ఉన్న పని భారాన్ని తగ్గించి సమయ పాలన ఏర్పాటు చేసి మానసిక ఒత్తిడికి లోనవుతూ అనారోగ్యానికి గురౌతున్న ఉద్యోగుల సమస్యల పై ప్రభుత్వం స్పందించాలని గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ఉద్యోగుల సంఘం ఇచ్చి న పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. వేళాపాళా లేని పనితో ఉద్యోగులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు బాధ్యతలు నిర్వహించటమే కాకుండా వివిధ శాఖ ల పనులు సైతం రెవెన్యూ వారిపై మోపుతూ మ రింత ఒత్తిడికి గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ ఉద్యోగులు పనిఒత్తిడితో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. మరణించిన వీఆర్‌ఓలకు సంతాపం తెలుపుతూ వారి కుటుంబాలకు సంఘీభావంగా ఉంటామన్నారు. వీఆర్‌ఓలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. వారందరికీ రెవెన్యూ అధికారుల సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవటం వలన గ్రామస్థాయిలో వీఆర్‌ఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జాబ్ చార్ట్ ప్రకారం విధులు లేకుండా అన్నీ పనులు చేయాలని ఒత్తిడికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ విష యం పై ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖాజావలి, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ యశోదా రాణి, వీఆర్‌ఓలు నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, ఉమాదేవి, రత్నప్రకాష్, అన్నారావు, ఇషావలి, కోటయ్య తదితరులున్నారు.

## బస్సులు లేక కొండ భక్తుల అగచాట్లు

- గంటల తరబడి ఎదురుచూసిన వందలాదిమంది భక్తులు
- వినుకొండరోడ్డులో నిలిచిన ట్రాఫిక్
- పట్టణంలో తిరుగు ప్రభల సందడి

ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది భక్తులు

**నరసరావుపేట:** తిరునాళ్ల భక్తులు సకాలంలో తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయటంలో ఆర్టీసీ, పోలీసు అధికారులు ప్రదర్శించిన ఉదాశీనత భక్తుల పాలిట శాపంగా పరిమణించింది. ఆదివారం కోటప్పకొండ వద్ద జరిగిన తిరునాళ్లకు రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుంచి వచ్చి తిరిగి స్వగ్రామాలకు వెళ్లేందుకు సోమవారం ఉదయం కొండ నుంచి తిరుగు బస్సుల ద్వారా వేలాది మంది బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే బస్టాండ్ నుంచి గుంటూరు, పిడుగురాళ్ల, వినుకొండ, సత్తెనపల్లి వైపుకు వెళ్లే బస్సులు లేకపోవటంతో గంటలతరబడి ఎదురు చూశారు. అప్పుడప్పుడు అరకొరగా వచ్చిన బస్సును ఎక్కేందుకు భక్తులు నానా ప్రయాసలకు గురికావాల్సి వచ్చింది. మరికొందరు బస్సులకోసం వేచి చూసీ చూసీ రోడ్డుపై నిలబడి ఆటోలు, ఇతర వాహనాలను పట్టుకొని అధిక ప్రయాణఖర్చులు భరించి తమ గమ్యస్థానాలకు తిరిగి వెళ్లారు. దీంతో పాటు కోటప్పకొండ నుంచి బస్టాండ్‌కు వచ్చే బస్సులతో వినుకొండ రోడ్డులో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పట్టణంలోని ప్రవేశించిన తర్వాత బస్టాండ్ చేరుకునేందుకు గంటల తరబడి బస్సులోనే కూర్చోవాల్సి వచ్చింది. తెల్లవారుఝామున రెండున్నర, మూడుగంటలకు కోటప్పకొండ నుంచి బయలుదేరిన ప్రయాణీకులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునే సరికి ఉదయం ఏడుగంటలైంది. బస్సుల్లో అధిక భాగం కొండకు ఏర్పాటుచేసిన అధికారులు మరుసటిరోజు తిరుగు ప్రయాణీకులకోసం కావాల్సిన బస్సులను ఏర్పాటు చేయలేకపోవటంతో ఈ సమస్య ఉత్పన్నమైంది.

**పట్టణంలో తిరుగు ప్రభల సందడి**

పట్టణం, దాని చుట్టుప్రక్కల ప్రదేశాల నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లిన మొక్కుబడి ప్రభలు తిరిగి పట్టణంలోకి ప్రవేశించటంతో తిరునాళ్ల సందడి ఏర్పడింది. కనకతప్పెట్లు, డీజేల శబ్దాలతో ప్రభల ముందు లయబద్ధంగా నృత్యాలు చేస్తుండగా ప్రభలు కదలి వెళ్లాయి. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే పట్టణంలో మెయిన్‌బజారులో పలువురు వ్యాపారులు తమ షాపులను మూసేయగా వాటి ముందు బొమ్మలు, ఇతర తిరునాళ్ల సామాగ్రి విక్రయించుకునేందుకు చిరు వ్యాపారులు సరుకు ఏర్పాటు చేసుకున్నారు.

## శభాష్... సుభాష్‌రెడ్డి

**చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ):** మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన పాశం సుభాష్‌రెడ్డి సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో అత్యధికంగా 99.823 పర్సంటైల్ సాధించాడు. విజయవాడలోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ జేఈఈ పరీక్షకు హాజరయ్యాడు. అన్ని సబ్జెక్టులలోను 99% పర్సంటైల్ సమానంగా చేశాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. సుభాష్‌రెడ్డి అత్యధిక మార్కులు సాధించటంతో తల్లిదండ్రులు రామిరెడ్డి, అశ్విని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు సుభాష్‌రెడ్డిని అభినందించారు. పదవతరగతిలోను 586 మార్కులు సాధించాడు.

## అతివేగంతో ఢీకొన్న లారీలు

రోడ్డు పక్కన బోల్తాపడిన లారీ

రోడ్డుపై పల్టీలు కొట్టిన లారీ

**దాచేపల్లి :** అతివేగంతో వెళ్తున్న రెండు లారీ పరస్పరం ఢీకొన్నాయి. మండలంలోని శ్రీనగర్ గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం జరిగిన ఈ ఘటన నేపథ్యంలో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. స్థానికుల కథనం ప్రకారం... దాచేపల్లి వైపు నుంచి రెండు లారీలు అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై తెలంగాణకు వెళ్తున్నాయి. ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేసే వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక లారీ ఫల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన పడిపోగా మరో లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిత్య రద్దీగా ఉండే ఈ హైవేపై రెండు లారీలు ఢీకొనటంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. సంఘటన స్థలాన్ని పోలీసులు, హైవే అధికారులు పరిశీలన చేసి బోల్తాపడిన లారీలను క్రేన్ సహాయంతో పైకి లేపారు.

## మహిళా రైతు సంఘాలు బలపడాలి

**వెలుగు డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సింగయ్య**

రైతులకు గోతాలు పంపిణీ నిర్వహిస్తున్న అధికారులు

**చినగంజాం:** రైతుల ప్రయోజనాల కోసమే మహిళా రైతు సంఘం పనిచేస్తుందని వెలుగు డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ బి. సింగయ్య అన్నారు. మండల వెలుగు డీఆర్డీఏ ఆధ్వర్యంలో సోమవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన గోతాల పంపిణీ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ సింగయ్య రైతులకు గోతాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగకరమైన విధంగా మహిళా రైతు ఉత్పత్తుల సంఘం పని చేస్తుందని, దీని ద్వారా రైతుకు గిట్టుబాటు ధర, వ్యవసాయానికి కావాల్సిన పరికరాలను అద్దె రూపంలో ఇస్తారన్నారు. గోతాలను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు ఇస్తారని, మండలంలోని రైతులందరూ ఉపయోగించుకోవాలన్నారు. పండించిన పంట కూడా గిట్టుబాటు ధర తీసుకురావాలని ఉద్దేశంతో సమాఖ్య పనిచేస్తుందని, మండలంలో అత్యధికంగా శనగ, జొన్న, వరి, రాగులు మొదలైన పంటలు పండించారని తెలిపారు. వీటికన్నింటికి గిట్టుబాటు ధర తీసుకురావడానికి సమాఖ్య పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎం రవీంద్ర, సర్పంచ్ రాయని ఆత్మారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శారద, ఎఫ్ఈఓ అధ్యక్షులు అంజనీదేవి, నాయకులు పొద వీరయ్య, నరహరి శ్రీను, సందు శ్రీను, సత్యం, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యార్థిని మృతి



భోజావత్ ఝాన్సీ మృతదేహం

**రెంటచింతల:** మండలంలోని మిట్టగుడిపాడు–రెంటచింతల గ్రామాల మధ్య జాతీయ రహదారికి సమీపంలో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారికి పక్కనే ఉన్న పంటకాల్వలో పడిపోవడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. అక్కడ నున్న వ్యవసాయ కూలీలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురజాల మండలం సమాధానంపేట గ్రామానికి చెందిన భోజావత్ శ్రీనునాయక్, సైదమ్మలకు ముగ్గురు సంతానం. చివరి సంతానం అయిన ఝాన్సీ (13) గురజాల మండలం గంగవరం కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతూ మహాశివరాత్రికి ఇంటికి వచ్చింది. ఉదయం తండ్రి శ్రీనునాయక్ తన ద్విచక్ర వాహనంపై కుమార్తె ఝాన్సీని పాఠశాలకు తీసుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పంటకాల్వలో పడిన బాలికపై వాహనం పడటంతో పైకిలేవలేకపోవడం వలన ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందగా శ్రీనునాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నీటిలో పడిన ఇద్దరూ బయటకు రాలేకపోవడంతో కూలీలు బయటకు తీయగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు గమనించారు. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం పిడుగురాళ్లకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

## ఆలయంలోకి రానివ్వడం లేదు!

**నాదెండ్ల:** చిరుమామిళ్ళలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో తమను రాకుండా కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని దేవస్థానం సింగిల్ ట్రస్టీ కొల్లిపర సాంబశివరావు, ప్రధాన అర్చకుడు కొల్లిపర పాపారావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఎప్పటి నుంచో ఆలయం ట్రస్టీగా, పూజారిగా వ్యవహరిస్తున్నామని, ఆదివారం ఆలయానికి వెళ్లిన తమను గ్రామానికి చెందిన కొల్లిపర శ్రీనివాస్, కొమ్మసాని గంగిరెడ్డి అడ్డుకున్నారని వాపోయారు. తమ కుటుంబ సభ్యులను దుర్భాషలాడటమే కాక చంపుతామంటూ బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

**FINANCIAL SERVICES**

■ శింగో కంపెనీ:లోన్స్, ప్రాపర్టీ లోన్స్, ప్రాజెక్ట్ లోన్స్, పర్సనల్ లోన్స్, అగ్రికల్చర్ ప్రాజెక్టు లోన్స్, బిజినెస్ టేక్ ఓవర్ లోన్ & లోన్ ఏజెంట్ కావలెను. జీతం+కమీషన్. ✆ 9050130793

**GOLD FINANCE**

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥✆ 87907 41166

**WANTED**

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు :సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, పురుషులు మాత్రమే. విద్యార్హత: ఇంటర్ నుండి డిగ్రీ వరకు వయస్సు: 25సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు మధ్య ఉండవలెను. నెలకు 16000/– వరకు ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9248722246

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/– నుండి 21000/– వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 8978480435

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పని చేయుటకు సేల్స్ అడ్వైజర్ కావలెను. అర్హత 10th ఆపైన, వయస్సు 18 సం॥ఆపైన. Cont: 89788 55399

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి భోజనం. జీ: 17K. Ph: 9640648899, 9848999184.

■ వారాహి మోటర్స్ ఆథరైజ్డ్ డీలర్స్ ఐషర్ ట్రాక్టర్స్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఈ క్రింది మండలాల్లో గుంటూరు, మంగళగిరి, పొన్నూరు, తాడేపల్లి, మేడికొండూరు, కాకుమాను, రేపల్లె, చెరుకుపల్లిలో పని చేయుటకు కావలెను. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంప్ర: Ph: 8374550999, 9778959999. అడ్రస్: వారాహి మోటార్స్ ఆథరైజ్డ్ డీలర్స్, ఐషర్ ట్రాక్టర్స్, NH-5,ఆటోనగర్, గుంటూరు.

■ జయలక్ష్మి హోండా టూవీలర్ షోరూం గుంటూరు నందు పనిచేయుటకు సేల్స్ బ్రాంచ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, Sr అకౌంటెంట్స్, Jr అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సర్వీస్ అడ్వైజర్స్, PDI ఇంచార్జ్, PDI మెకానిక్స్, మెకానిక్స్ కావలెను. 96144 55555, 91526 55555

■ కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, వ్యాపారస్థులు, గృహిణిలు టీచర్స్ కావలెను. వయస్సు :45 to 65 yrs సంప్ర ✆ 98853 08538

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ.475/–
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
[illegible]

## క్లుప్తంగా

### పథకాల దరఖాస్తు విధానంపై అవగాహన

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సీఎస్ఈ–2 ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వివరించారని తెలిపారు. పథకం వివరాలు, అర్హత, కావాల్సిన పత్రాలు, దరఖాస్తు విధానం తదిర అంశాలను విపులంగా వివరించారని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, విభాధిపతి డాక్టర్ బి.తిరుపతిరెడ్డిలు పేర్కొన్నారు. అధ్యాపకులు బి.జోనాతన్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్ శిబిరాన్ని పర్యవేక్షించారు. డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, గ్రామ సర్పంచ్ పి.కృష్ణప్రసాద్, కార్యదర్శి సాయికృష్ణ సహకారం అందించారు.

### నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ నేడు

**దుగ్గిరాల:** నులుపురుగుల నివారణ మాత్రలను మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం పంపిణీ చేయనున్నట్లు దుగ్గిరాల వైద్యాధికారి డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం దుగ్గిరాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ డీ ఫార్మింగ్ డే సందర్భంగా ఏడాది నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ప్రతి అంగన్‌వాడీ, పాఠశాల, కళాశాలల్లో ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### కొల్లిపరలో పిచ్చికుక్క స్వైర విహారం

**కొల్లిపర:** మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో సోమవారం ఉదయం పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువుని గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది.దీనిపై స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక మాయాబజార్ సెంటర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ముగ్గురు మహిళలపై , ఒక మగ వ్యక్తి పై దాడి చేసి గాయాలు చేసినట్లు తెలిపారు. దీంతో వీరు స్థానిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వెళ్లారు. గ్రామంలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. గత నెలల్లో కూడా చాలా మంది పై కుక్కలు దాడి చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

### నేడు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ

**తెనాలిఅర్బన్:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం తెనాలి పట్టణ పరిధిలోని ఒకటి నుంచి 19 సంవత్సరాలు వయస్సు ఉన్న పిల్లలందరికి ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నులిపురుగుల వలన వచ్చే వ్యాధులను ఇవి దోహదపడతాయన్నారు. పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో వీటిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు అందరూ పిల్లలకు టాబ్లెట్స్ వేసే విధంగా చూడాలన్నారు.

### తెలుగులో తీర్పులు చెప్పిన న్యాయమూర్తి

**తెనాలిరూరల్:** తెనాలిలో న్యాయమూర్తి సోమవారం తెలుగులో తీర్పులు చెప్పారు. తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏకా పవన్‌కుమార్ సివిలు దావాలకు సంబంధించిన తీర్పులను తెలుగులో చెప్పారు. ప్రామిసరీ నోట్లకు సంబంధించిన రెండు, చెక్‌బౌన్స్ కేసులో తీర్పులను వెలువరించారు. తెలుగులో తీర్పు చెప్పడం ద్వారా ఎందుకు ఓడిపోయాం? లేదా ఎందుకు కేసు నెగ్గామన్నది అర్థమవుతుందని న్యాయమూర్తి తెలిపారు.

### అబాకస్‌లో భువిజయ్‌కు తృతీయస్థానం

**తెనాలి:** స్థానిక నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల్లో ఏడోతరగతి చదువుతున్న ఎస్.భువిజయ్ ఈనెల 14వ తేదీన విజయవాడలో విశ్వం ఎడ్యుకేట్ నిర్వహించిన అబాకస్‌లో రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం సాధించాడు. ఆ విద్యార్థిని సోమవారం స్కూలులో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అభినందించారు. అబాకస్ వంటి పరీక్షలతో విద్యార్థుల్లో గణిత నైపుణ్యం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. విజయానికి కారణమైన ఉపాధ్యాయులను అభినందించారు.

# అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

- ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలకు నోచుకోని వైనం
- నేటికీ అద్దె భవనాలే దిక్కు

చుక్కపల్లివారిపాలెంలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న అంగన్‌వాడీ భవనం

**దుగ్గిరాల:** నిర్మాణాలు పూర్తికాని అంగన్‌వాడీ భవనాలపై చంద్రబాబు సర్కారు శీతకన్ను ప్రదర్శించడంతో అవి నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తయినా మండలంలోని పలు అంగన్‌వాడీ భవనాలు నేటికీ పూర్తికాక నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. మండలంలోని చుక్కపల్లివారిపాలెం, దుగ్గిరాలలోని చెన్నకేశవ నగర్, మోరంపూడిలోని అంగన్‌వాడీ భవనాలు నిర్మాణ దశలోనే దర్శనమిస్తున్నాయి. చుక్కపల్లివారిపాలెంలోని అంగన్‌వాడీ భవనం స్లాబు వేసి వదిలేశారు. భవనం పట్టింపు లేకపోవడంతో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి అధ్వాన వాతావరణంలో భవనం దర్శనమిస్తోంది. దుగ్గిరాల చెన్నకేశవ నగర్‌లో అంగన్‌వాడీ భవనం నిర్మాణ దశలోనే ఉంది. ఈ భవనానికి తలుపులు, కిటికీలు, కిటికీల గ్రిల్స్, మరుగుదొడ్లు పూర్తిగా అమర్చలేదు. భవనం కూడా స్థానిక నివాసాలకు దూరంగా ఉండడంతో అసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారింది.

**పేక కార్డులు, సిగరెట్ ముక్కలు..**

చెన్నకేశవ నగర్‌లోని అంగన్‌వాడీ భవనం నిర్మాణ దశలోనే ఉండడంతో స్థానికులు అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మార్చేశారు. దీంతో భవనం లోపల పేక కార్డులు, సిగరెట్ ముక్కలు, పాన్ మరకలు ఇబ్బందికర వాతావరణంలో కనిపిస్తున్నాయి. సిబ్బంది పలుమార్లు శుభ్రం చేసినా అసాంఘీక కార్యకలాపాలు మాత్రం షరామామూలుగా మారాయి. భవనం భయట ఉన్న గ్రిల్స్‌కు వేసిన తాళాలను పగులగొట్టి లోపలకు చొరబడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మోరంపూడి అంగాన్‌వాడీ భవనం సైతం అసంపూర్తిగా మిగిలిపోయింది. భవనం లోపల మరుగుదొడ్లు నిర్మించలేదు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఈ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రత్యేక ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయలేదు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ఒకే ప్రవేశ ద్వారం ఉందని.. ఇరుభవనాల మధ్య ప్రహరీగోడ నిర్మించాలని ప్రాథమిక పాఠశాల కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

చెన్నకేశవ నగర్‌లో పూర్తికాని అంగన్‌వాడీ భవనం

పూర్తికాని భవనం లోపల అంసాఘీక కార్యక్రమాలు

**అద్దె భవనాలలో ఇబ్బందులు..**

చుక్కపల్లివారిపాలెం, చెన్నకేశవ నగర్, మోరంపూడిలలో నిర్మాణ దశలో అంగన్‌వాడీ భవనాలు ఉండడంతో ప్రస్తుతం వసతులను అద్దె భవనాలలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అద్దె భవనాలలో వసతులు సరిగా ఉండడంలేదని ప్రజలు వాపోతున్నారు. నీళ్లకు ఇబ్బంది పడుతున్నామని.. పిల్లల పుస్తకాల సామాగ్రి, రిజిస్టర్ల బీరువాలు, బాలింతలు, గర్భిణులకు ఇచ్చే బియ్యం, కోడిగుడ్లు ఇతర సామాగ్రి భద్రపరచడానికి వీలైనంత స్థలం లేదని చెబుతున్నారు. పాలకులు, అధికారులు శ్రద్ధచూపి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ కలయిక

పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని కలిసి సత్కరిస్తున్న వేమారెడ్డి

**తాడేపల్లి రూరల్:** వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరి మేకా అంజిరెడ్డిలు సోమవారం సుబ్బారెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. చిత్రపటాన్ని బహూకరించి మాట్లాడారు. ఇటీవల తాడేపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మేకా అంజిరెడ్డికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర జిల్లా నాయకులు రాష్ట్ర జాయింట్ సెక్రటరి పదవిని ఇచ్చారు. ఆయనకు ఈ పదవిని ఇచ్చిందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వైవీ సుబ్బారెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ గుంటూరు జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షులు సురేంద్ర, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, మంగళగిరి నియోజకవర్గ సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు భీమిరెడ్డి శరన్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో మున్సిపల్ కార్మికులకు మొండిచెయ్యి

ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**మంగళగిరి టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మున్సిపల్ కార్మికులకు అన్యాయం జరిగిందని, కార్మికులకు మొండిచెయ్యి చూపించిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. పలువురు ఫెడరేషన్ నాయకుల మాట్లాడుతూ.. సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని, సమ్మెకాలపు జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో మున్సిపల్ కార్మికులకు నిధుల కేటాయింపు జరగలేదని పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు గతంలో సమ్మె చేసిన సందర్భంగా 10 రోజుల జీతాలు చెల్లించలేదని విమర్శించారు. సమ్మె చేసిన వర్కర్లకు 137 జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య, సీఐటీయూ మంగళగిరి పట్టణ కన్వీనర్ బాలాజీ, నాయకులు వెంకటేశ్వర్లు, కమలాకర్, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

**తాడేపల్లి రూరల్:** ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన కోర్టు తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు ప్రారంభించి, కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే కార్మికులకు న్యాయం చేసే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారని.. ఇచ్చిన హామీని లోకేష్ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ న్యూ నాయకులు కె.ఆదినారాయణ, నాయకులు గురవయ్య, సుభాని, యెహోషువా, ఇమాంబి, సారమ్మ, రిబ్కా, మల్లేశ్వరి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### పెనుమూలిలో యూఎఫ్ఎస్‌పై సమీక్ష

**దుగ్గిరాల:** యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై సమీక్ష, త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ సూచనలు చేశారు. దుగ్గిరాల మండలంలోని పెనుమూలి గ్రామంలో సోమవారం డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ సిబ్బందికి సర్వేపై సమీక్ష చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### సీపీఎం నాయకులు మక్కపాటి మృతి

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరుకు చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు మక్కపాటి రామారావు(76) సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ఆయన నివాసానికి వెళ్లి రామారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుమారుడు శివకుమార్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామారావు మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, కొండయ్య, పాటిబండ్ల వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ శివన్నారాయణ, ఏసుబాబు, గ్రామ కార్యదర్శి బొప్పన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# వైవీ సుబ్బారెడ్డిని కలిసిన రాజధాని రైతులు

సమన్వయకర్త వజ్రబాబుతో కలిసి వచ్చిన రాజధాని రైతులతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

**తాడికొండ:** వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో పలువురు రాజధాని ప్రాంత రైతులు నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబుతో కలిసి పలు విషయాలపై చర్చించారు. భూములు ఇచ్చిన రైతులు రెండో విడతలో ఇవ్వాల్సిన రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, వివిధ విభాగాల నాయకులు, రైతులు ఆలూరి శ్రీనివాసరావు, నంబూరి రఘునాథరావు, చుండు వెంకటరెడ్డి, అక్కల లక్ష్మీనారాయణరెడ్డి, కాకర్ల నాగేశ్వరరావు, తుమ్మారు వరప్రసాదరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, గుమ్మా శ్రీనివాసరావు, జాని, ఆరేపల్లి జోజి, కొయ్యగూర వినోద్, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మధిర నాగేశ్వరరావుకు నివాళులు

నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో నివాసం ఉండే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమాని, వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు మధిర నాగేశ్వరరావు(85) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి చిర్రావూరులోని నాగేశ్వరరావుకు ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుమారుడు రవికుమార్‌కు ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ నుంచి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు మేకా సాంబశివరావు, గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి బాజీ గంగాధరరావు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, షేక్ జావీద్, అనుములు శెట్టి సత్యనారాయణ, జెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

**దుగ్గిరాల:** ఈమని గ్రామంలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ కె.గోపి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. ఈమని గ్రామ ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

### చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

**మేడికొండూరు:** నేరాల నియంత్రణకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాల మోహన్‌రావు అన్నారు. కళాశాలలో సోమవారం నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి భారత నూతన చట్టాల పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కోరారు. గుంటూరు జేసీ లా కళాశాల విద్యార్థులు వెంకటలక్ష్మీ, త్రిపురం సురేంద్ర ప్రసాద్(నాని), కె.పుల్లారావు, పి.శ్రీకాంత్, సాయిసింధు, హుస్సేన్ బి.మురళి, గుణశేఖర్, మౌర్య విద్యార్థులకు కళాశాలలో నూతన చట్టాలపై అవగాహన నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ (ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు), డిజిటల్ అరెస్ట్, గృహహింస, బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా, ప్రభుత్వం నుంచి పౌరులు పొందే సేవల హక్కులు వంటి తదితరాంశాలపై విద్యార్థులకు విపులంగా వివరించారు. విద్యార్థులు నూతన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఎటువంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోవచ్చునని పేర్కొన్నారు.

# ఘనంగా ఆది దంపతుల కల్యాణం

కల్యాణ మహోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

**మంగళగిరి టౌన్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ఘనంగా నిర్వహించారు. నవులూరు గోలివారి తోట, కాజ, యర్రబాలెం గ్రామాల్లోని ఆలయాలు, మంగళగిరి బైపాస్ రోడ్‌లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి వేద మంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా అర్చకులు ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. కల్యాణ వేదికను సుందరంగా అలంకరించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా ముస్తాబు చేసి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణ క్రతువు తిలకించి పరవశించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### కనులపండువగా శివపార్వతుల గ్రామోత్సవం

కల్యాణ మహోత్సవంలో విశ్వేశ్వర స్వామివారు

కళాకారుల కేరళ డప్పు వాయిద్యాలు

**మంగళగిరి టౌన్:** మంగళగిరి మండల పరిధి యర్రబాలెంలో వేంచేసియున్న శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం అర్ధరాత్రి శ్రీ స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అలానే సోమవారం రాత్రి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన స్వామివారికి దేవస్థాన చైర్ పర్సన్ నాయుడు నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామపెద్దల పర్యవేక్షణలో కల్యాణ క్రతువు సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. కళాకారుల కేరళ డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యర్రబాలెం సెంటర్‌లో చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. తొలుత ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ట్రాక్టర్‌పై స్వామివార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ అర్చకులు నాగమల్లేశ్వరరావు, అర్చక బృందం పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించి తరించారు.

# ముగిసిన మహాశివరాత్రి సంబరాలు

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

**తాడేపల్లి రూరల్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పుర్కరించుకుని తాడేపల్లి పట్టణం సుందరయ్య నగర్‌లో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జగజాగరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. శివరాత్రి జాగరణ ఉత్సవంలో చిన్నారులు, పెద్దలు అందరూ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రజా నాట్యమండలి నాయకులు ఆర్‌వీ రాఘవయ్య ప్రారంభించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. బాలికల స్వాగత నృత్యంతో మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు మూడు గంటల పాటు సాగాయని తెలిపారు. వివిధ పాఠశాలల బాలికలు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, ప్రజా నాట్యమండలి మహిళా బృందం ఆలపించిన గేయాలు, కోలాట నృత్యం అందరినీ అలరించాయని తెలిపారు.

మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ.. సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం ప్రజా నాట్యమండలి నాయకులు రాఘవయ్యకు రూ.5 వేల విరాళాన్ని అభ్యుదయ శీలి పిన్నమనేని రాజా అందజేశారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ కోశాధికారి గాదె సుబ్బారావు, యోహాను, పిన్నమనేని విజయ ఎన్.వెంకటరావు, నారిన నాగేశ్వరరావు, నాని, భుజంగరావు, కొండబాబు, ప్రభాకర్, మహిళా సంఘం బాధ్యులు జ్యోతి, భ్రమరాంబ, కల్యాణి, ఉమ, సాయి, ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

## PUBLIC NOTICE

We are under instructions of our client Sri Thummuru Kranthi Kumar Reddy, Son of Bharath Kumar Reddy, Resident of Flat No.402, Amma Paradise, Tadepalli, Tadepalli-Mangalagiri Corporation, Guntur District, Cell No:9346298490, to issue the following notice.

**SCHEDULE OF IMMOVABLE PROPERTIES**

Item No.1: An extent of 425sq.yards of house site in D.No.65/3 and D.No.65/4, part of Plot No.2 situate in Kunchanapalli Village, Tadepalli Mandal, Guntur District, being bounded on: **East :** 2nd Item 96.1'ft, **South :** Land of Ammisetty Kesava Rao, 40.3'ft, **West :** Plot No.3 in D.No.65/3 & 65/4, 95.0'ft, **North:** Joint Road in a width 40' 40.3'ft

Item No. 2: An extent of 300sq.yards of House Site in D.No.65/3 & 65/4, Plot No.2 situate in Kunchanapalli Village, Tadepalli Mandal, Guntur District, being bounded on: **East :** Plot No.3 belonging to Chukka Srinivasa Rao, 95.3'ft, **South :** Land of Ammisetty Kesava Rao, 26.9'ft , **West :** Item No.1, 95.1'ft , **North:** Joint Road in a width 40' , 29.11'ft

Item No.3: An extent of 300sq.yards of House Site in D.No.65/3 & D.No.65/4 (Plot No.2) situate in Kunchanapalli Village, Tadepalli Mandal, Guntur District, being bounded on: **East :** 1st Item, 95.0'ft, **South :** Land of Ammisetty Kesava Rao, 28.5'ft. **West :** Plot No.1 belonging to Arava Karuna, 95.0'ft. **North :** Joint Road in a width 40', 28.5'ft

Our client proposed to purchase the above mentioned schedule properties from 1)Sri Mada Chandu Babu, Son of Gurunatha Rao of Kunchanapalli Village, Tadepalli Mandal, Guntur District. 2)Jakkapala Srinivasa Rao, Son of Venkaiah, of Karmikapuram, Vijayawada City, NTR District and 3)Mada Gurunatha Rao, S/o.Veeraiah Kunchanapalli Village, Tadepalli Mandal, Guntur District, respectively.

If any person has objection or claim, he/she may send them in writing to us or our clients within 10 days from the date of Publication of their notice. Objections or claims received after the expiry of said period will not be considered.

Vijayawada — **B.Koti Reddy, B.S.Ratnakar Reddy** Advocates
Dt.28.01.2026 — Governorpet Museum Road, VIJAYAWADA.Cell 9490148500

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

## క్లుప్తంగా...

### అవమానాలు భరించలేను..

- ఎమ్మెల్యే పత్సమట్లతో కలిసి పని చేయలేను
- జనసేన పార్టీకి రాజీనామా చేస్తున్నా
- జనసేన ఉంగుటూరు మండల అధ్యక్షుడు రాంబాబు

**ఉంగుటూరు:** 'జనసేన పార్టీ అధికారంలోకి రావడానికి శక్తికి మించి పనిచేశా.. అయితే అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నాకు ఏ విషయంలోనూ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు.. అవమానాలు భరించలేను.. అందుకే జనసేన పార్టీకి రాజీనామా చేస్తున్నా' అని ఏలూరు జిల్లా ఉంగుటూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పంది రాంబాబు తెలిపారు. సోమవారం పార్టీ సభ్యత్వానికి, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ.. ప్రతిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, జిల్లా అధ్యక్షుడికి పంపించారు. అనంతరం ఉంగుటూరులో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలో తనను చిన్నచూపు చూస్తున్నారని, తనకు అన్నీ అవమానాలేనని వాపోయారు. తనకు తెలియకుండా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నాలుగు సార్లు పార్టీ మండల కార్యకర్తల సమావేశాలు నిర్వహించారని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఒక మండల అధ్యక్షుడిగా ఎప్పుడూ చూడలేదని.. కార్యకర్తల దగ్గర చులకనగా చూసేవారని వాపోయారు. ఉన్నత వర్గాలకు, ధనికులకు మాత్రమే ఎమ్మెల్యే ధర్మరాజు దగ్గర ప్రాధాన్యత లభిస్తుందని..బడుగు, బలహీన (బీసీ) వర్గాలకు ఉండదన్నారు. అందుకే ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి పని చేయలేనని చెప్పారు.

### మా తమ్ముడిని చంపేశారు

- తల, శరీరంపై బలమైన గాయాలున్నాయి
- బొగ్గుల శ్రీనివాస్ సోదరులు

బొగ్గుల శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న స్నేహితులు

**నందికొట్కూరు:** ఇటీవల ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌లోకి కారు దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ అంత్యక్రియలు సోమవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరులో జరిగాయి. స్నేహితులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సోదరులు బొగ్గుల అబ్దులయ్య, మద్దిలేటి, సుధాకర్ మాట్లాడుతూ తమ సోదరుడిని చంపేశారని ఆరోపించారు. శ్రీనివాస్ తల, శరీరంపై గాయాలున్నాయని, అతడిని చంపేశారని కుటుంబ సభ్యులు, స్నేహితులు రంగస్వామి, నాయుడు, సుబ్బారెడ్డి, జాకీర్ హుసేన్ కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీనివాస్ ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ ఎందుకు పరారయ్యాడని ప్రశ్నిస్తున్నారు. ఇది ముమ్మాటికీ హత్యేనని, హంతకులను పోలీసులు గుర్తించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌కు సైబర్ బెదిరింపులు

**బనశంకరి:** సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌కు బెంగళూరు సైబర్ సెల్ అధికారులమంటూ గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బెదిరించడానికి ప్రయత్నించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు అధికారులు బెంగళూరు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జనవరి 9న పదే పదే ఫోన్ చేసిన దుండగులు తాము బెంగళూరు సైబర్‌సెల్ పోలీసు అధికారులమని చెప్పుకుని, పలు విధాలుగా బెదిరించడానికి ప్రయత్నించారు. జస్టిస్ చలమేశ్వర్ సూచన మేరకు సుప్రీంకోర్టు అధికారులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన సైబర్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మాజీ ఎంపీ రత్నాబాయి కన్నుమూత

ప్రముఖుల నివాళి

తడపట్ల రత్నాబాయి (ఫైల్)

**రంపచోడవరం:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయి (79) అనారోగ్యంతో పోలవరం జిల్లా రంపచోడవరంలో కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆమెను ఆదివారం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమించడంతో ఆమె అర్ధ రాత్రి సమయంలో తుదిశ్వాస విడిచారు. గిరిజన సంక్షేమశాఖలోఉద్యోగిగా పనిచేస్తూ రత్నాబాయి 1972లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ తరపున ఎల్లవరం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2005 నుంచి 2007 వరకు గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్‌గా, 2008 నుంచి 2014 వరకు రాజ్యసభ సభ్యురాలిగా, తర్వాత 2020 వరకూ ఎమ్మెల్సీగా కొనసాగారు. ఆమె భర్త పి.సత్యనారాయణ కూడా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. వారికి అమర్‌మిత్ర, అరుణ్‌మిత్ర అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. రత్నాబాయి మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, వాల్మీకి సంఘం నాయకులు నివాళులర్పించారు.

# జేఈఈ మెయిన్‌లో ఏపీ విద్యార్థుల సత్తా

## మహిత్, మోహిత్‌లకు 100 స్కోర్

**100 పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు వీరే**

1. శ్రేయాస్ మిశ్రా (ఢిల్లీ)
2. నరేంద్రబాబుగారి మహిత్ (ఏపీ)
3. శుభం కుమార్ (బిహార్)
4. కబీర్ చిల్లర్ (రాజస్థాన్)
5. చిరంజీబ్ కర్ (రాజస్థాన్)
6. భవేశ్‌పాత్ర (ఒడిశా)
7. అనై జైన్ (హర్యానా)
8. అర్నవ్ గౌతమ్ (రాజస్థాన్)
9. పసల మోహిత్ (ఏపీ)
10. మాధవ్ విరాడియా (మహారాష్ట్ర)
11. పురోహిత్ నిమయ్ (గుజరాత్)
12. వివాన్ శరద్ మహేశ్వరి (తెలంగాణ)

**సాక్షి, అమరావతి:** జేఈఈ మెయిన్ 2026 సెషన్–1లో ఆంధ్రా విద్యార్థులు సత్తా చాటారు. జనరల్‌తో పాటు ఓబీసీ, ఎస్సీ విభాగాల్లో దేశంలో టాప్ స్కోర్లు సాధించారు. సోమవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ సెషన్–1 స్కోర్లలో ఏకంగా 12 మంది 100 పర్సంటైల్‌తో సత్తా చాటారు. వీరిలో రాజస్థాన్ నుంచి అత్యధికంగా ముగ్గురు, ఏపీ నుంచి ఇద్దరు, ఢిల్లీ, బిహార్, ఒడిశా, హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి ఒక్కొక్క అభ్యర్థి ఉండటం విశేషం. ముఖ్యంగా ఏపీ నుంచి 100 పర్సంటైల్ సాధించిన నరేంద్రబాబుగారి మహిత్ రాష్ట్రంలో టాపర్‌గా నిలవడమే కాకుండా ఓబీసీ–ఎన్‌సీఎల్ కేటగిరీలో దేశంలో టాపర్‌గా ఘనత సాధించారు. 100 పర్సంటైల్ సాధించిన మరో అభ్యర్థి పసల మోహిత్ జనరల్ కేటగిరీలోని టాపర్లలో ఒకరిగా నిలిచారు. ఎస్సీ కేటగిరీలో 99.99 పర్సంటైల్ స్కోర్‌తో దేవ శ్రీవేద్ దేశంలోనే టాప్ స్కోరర్‌గా నిలిచారు. మహిళల విభాగంలో హర్యానాకు చెందిన ఆషి అగర్వాల్ 99.99 పర్సంటైల్ స్కోర్‌తో టాపర్‌గా ఉన్నారు.

**96.26 శాతం హాజరు నమోదు**

జేఈఈ మెయిన్ తొలి సెషన్‌కు 13,55,293 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 13,04,653 మంది పరీక్షకు హాజరయ్యారు. అంటే నమోదు చేసుకున్న వారిలో 96.26 శాతం మంది పరీక్ష రాశారు. దేశంలోని సిటీలతో పాటు భారతదేశం వెలుపల 15 సిటీలతో కలుపుకుని మొత్తం 326 సిటీల్లో ఎన్టీఏ పరీక్షలు నిర్వహించింది. పురుషులు 8,87,476 మంది, మహిళలు 4,67,817 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా.. వీరిలో పురుషులు 8,55,085 మంది, మహిళలు 4,49,568 మంది హాజరయ్యారు. అయితే.. 68 మంది అభ్యర్థుల స్కోర్లను మాత్రం ఎన్టీఏ వెల్లడించలేదు. పరీక్షల్లో అనైతిక చర్యలకు పాల్పడిన నేపథ్యంలో చర్యలు తీసుకున్నట్టు పేర్కొంది. సెషన్–2 పరీక్షల అనంతరం ఉత్తమ స్కోర్‌లను పరిగణనలోకి తీసుకుని తుది ర్యాంకులు ప్రకటిస్తామని వివరించింది.

# చెత్త నా లం.. కొ....

- ఊళ్లోకి రారా.. నీ సంగతి తేలుస్తాం..
- విజయనగరం జిల్లా చిన్నశిర్లాం పంచాయతీ కార్యదర్శిపై టీడీపీ ఎమ్మెల్యే కొండ్రు అనుచరుడి శివాలు

ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ సమక్షంలో మాట్లాడుతున్న టీడీపీ కార్యకర్త మజ్జి శ్రీనివాసరావు (ఫైల్)

**సాక్షి ప్రతినిధి, విజయనగరం:** అధికారం అండగా తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ ఉద్యోగులపై రెచ్చిపోయిన మరో ఉదంతమిది. విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలోని రేగిడి మండలం చిన్నశిర్లాం పంచాయతీ కార్యదర్శిపై టీడీపీ కార్యకర్తలు నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ రెచ్చిపోయారు. 'ఎవడ్రా నువ్వు చెత్త నా కొడకా.. ఏ విషయం నాకు తెలియకుండా చేయవద్దని మొన్న నీకు వార్నింగ్ ఇవ్వలేదా.. నీకు చెప్పలేదా.. లం..కొ.. వేషాలు దెం...వా. ఆఫీసులో పెట్టి కొడతాను.. చెత్తనా కొ.. నోరుముయ్యి.. లం..కొ.. నువ్వు నాకు నేరుగా వచ్చి చెప్పవా.. ఎవడికి కావాలి నీ మెస్సేజ్. ఇప్పుడు చెరువు పనివారికి ఎందుకు ఫోన్‌చేశావు ? వాళ్లు ఎక్కువా ? మేం ఎక్కువా చెప్పరా వెధవ నా కొ.. ఎవడ్రా నీకు ఈ ఉద్యోగం ఇచ్చింది.. మర్యాదగా పనిచేయి.. లేకపోతే.. దెం... మాకు చెబుతావా నీతులు.. ఉద్యోగం చేస్తున్న నీకు సిగ్గులజ్జా లేవా..' అంటూ టీడీపీ ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అనుచరుడు మజ్జి శ్రీనివాసరావు ఫోన్‌లో శివాలెత్తిపోయారు. ఇంతలో మరో టీడీపీ కార్యకర్త 'చెత్త నా కొడకా.. నువ్వు ఊళ్లోకి రారా నీ సంగతి తేలుస్తాం.. ఎవరికి కంప్లైంట్ ఇస్తావో ఇవ్వరా..' అంటూ నోటికి పనిచెప్పాడు. చిన్నశిర్లాంలో సచివాలయ గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి వి.బిందుశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం సోషల్ ఆడిట్ గ్రామసభ జరిగింది. ఈ గ్రామసభకు సంబంధించి ముందుగానే ఆ గ్రామ టీడీపీ కార్యకర్తలకు సెల్‌ఫోన్ వాట్సప్ ద్వారా మెసేజ్ పెట్టి ఆహ్వానించారు. తమను నేరుగా పిలవలేదంటూ మజ్జి శ్రీనివాసరావు ఫోన్‌లో శివాలెత్తిపోయారు. ఉద్యోగి తల్లిని సైతం బూతులు తిట్టారు. ఫోన్‌లో పంచాయతీ కార్యదర్శి బతిమాలుతున్నా వినలేదు. పంచాయతీ కార్యదర్శిని బూతులు తిట్టిన టీడీపీ వారిపై ఎంపీడీవోకి, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతలు చెప్పారు.

**ఉద్యోగులకు సైతం భద్రత లేదు**

రాష్ట్రంలో ప్రజలకే కాదు ప్రభుత్వ ఉద్యోగులకు సైతం భద్రత లేదు. తెలుగుదేశం వారు గూండాల్లా వ్యవహరిస్తూ ఉద్యోగులపై రంకెలేయడం దారుణం.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి

## సైకో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు నుంచి కాపాడండి

- చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వినతి
- రఘురామ దోపిడీ, దౌర్జన్యాలపై ఆధారాలు ఇస్తానని వెల్లడి

రఘురామకృష్ణరాజుపై ఫైరవుతున్న టీడీపీ నేత వెంకటేశ్వరరాజు

**ఉండి:** సైకో ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు నుంచి ఉండి నియోజకవర్గాన్ని కాపాడాలంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు (బుడ్డియ్య రాజు) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. తనను చంపించేందుకు రఘురామ కుట్ర పన్నారని చెప్పారు. తనను చంపాలని కుటుంబ సభ్యుల ఎదుటే అనుచరుడిని ఆదేశించారని తెలిపారు. ఆయన సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం వెలివర్రులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘురామకృష్ణరాజుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీడీపీ చలవ వల్లనే రఘురామకు అధికారయోగం లభించిందని, ఇప్పుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అసహ్యం అయ్యారని విమర్శించారు. ఆయన పక్కన ఉండి వ్యవహారాలు చక్కబెట్టే మరో సైకో కొత్తపల్లి నాగరాజు సహకారంతో ఎమ్మెల్యే అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎవరైనా ఎమ్మెల్యేను ఎదిరించి మాట్లాడినా, చెప్పిన మాట వినకపోయినా వారు టీడీపీ, జనసేనకు చెందిన వారైనా సరే అక్రమంగా కేసులు పెట్టి హింసిస్తున్నారని చెప్పారు. అటువంటి వారిలో తాను ఒకడినన్నారు.

**నన్ను చంపించేయమన్నారు**

కొత్తపల్లి నాగరాజు సహకారంతో తనను చంపించేందుకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారని వెంకటేశ్వరరాజు ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే శివరామరాజుపై గొడవలు చేయాలని రఘురామకృష్ణరాజు ఆదేశిస్తే.. ఎవరూ ముందుకు రాకపోవడంతో తానే వెళ్లి శివరామరాజు కార్యాలయం ముందు తన డబ్బు తనకు తిరిగి ఇవ్వాలని రచ్చచేసినట్లు చెప్పారు. ఇంత సాయం చేస్తే ఎమ్మెల్యే కార్యాలయంలో తాను, తనతోపాటు ఎవరు వెళ్లినా చేతులు కట్టుకుని నిలబడాలని, ఎవరినీ అసలు గౌరవించరని పేర్కొన్నారు. అనుచరుడు నాగరాజు సహకారంతో ఎమ్మెల్యే ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, అవన్నీ బయటపెడతానని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సొసైటీ పదవులు అగ్రవర్ణాలకే అమ్ముకున్నారని ఆరోపించారు. ఇదేంటని అడిగితే రూ.40 కోట్లు ఖర్చుచేసి గెలిచానని, అవి తిరిగి ఇచ్చేస్తే నియోజకవర్గంలో మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోవచ్చని అధిష్టానానికి సైతం చెబుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన సంఘటనలో అది తగదని చెప్పిన తనను చంపించేయాలని తన కుటుంబసభ్యుల ముందే అనుచరుడు నాగరాజును ఆదేశించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఇప్పుడు కాకపోతే ఏదో ఒకరోజు ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చంపించేస్తారన్నారు. తనను చంపేందుకు దమ్ముంటే రఘురామకృష్ణరాజు రావాలని తొడగొట్టి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే దోపిడీ, దౌర్జన్యాలను రికార్డులతో సహా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు త్వరలోనే అందిస్తానని చెప్పారు. పేదలంటే రఘురామకృష్ణరాజుకు అసలు గిట్టదని, రోడ్డు పక్కన ఇల్లు కనబడితే చాలు పడగొట్టేయాలని ఆదేశాలు ఇస్తారని చెప్పారు. నియోజకవర్గంలో మత సామరస్యం లేకుండా పోయిందని, చర్చిలు, మసీదులు కూలదోస్తున్నారని చెప్పారు. అవన్నీ రఘురామకృష్ణరాజు ఆదేశాలతోనే జరుగుతున్నాయని వెంకటేశ్వరరాజు పేర్కొన్నారు.

## న్యాయమూర్తిపై కత్తి విసిరిన యువకుడు

**తమిళనాడులో ఘటన**

**అన్నానగర్:** తనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారన్న ఆగ్రహంతో ఓ యువకుడు న్యాయమూర్తిపైనే కత్తి విసిరిన ఘటన తమిళనాడులో సోమవారం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఆ కత్తి న్యాయమూర్తికి తగలలేదు. వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు సమీపంలో సెంగుళం ప్రాంతానికి చెందిన బాలమురుగన్, తంగామునీశ్వరి దంపతుల మధ్య విభేదాల కారణంగా విడాకులు కోరుతూ గత ఏడాది కోర్టును ఆశ్రయించారు. విచారణ పూర్తయిన నేపథ్యంలో న్యాయమూర్తి సుధాకర్ సోమవారం తీర్పును చదివి వినిపించారు. ఆ తర్వాత విడాకుల కేసుకు సంబంధించి భార్యకు భరణం చెల్లించాలని బాలమురుగన్‌ను ఆదేశించారు. ఇది విన్న బాలమురుగన్ నిరసన వ్యక్తం చేస్తూ అరిచాడు. అక్కడితో ఆగకుండా వెంట తెచ్చుకున్న కత్తిని న్యాయమూర్తిపైకి విసిరాడు.

## అంబటిపై ప్రభుత్వ కక్షపూరిత చర్యలు

**బెయిల్ పిటిషన్‌పై పొన్నవోలు వాదనలు**

**గుంటూరు లీగల్:** ప్రజల మనసుల్లో ఉన్న అంబటి రాంబాబును ప్రభుత్వం కక్షపూరితంగా వేధిస్తోందని గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నం.8/2023 కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్, కస్టడీ పిటిషన్‌లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 18వ తేదీన ఉత్తర్వులు వెలువరించనున్నట్లు సమాచారం. అంతకుముందు అంబటి తరఫున పొన్నవోలు వాదనలు వినిపిస్తూ కేసును ఆర్థిక నేరంగా చూపించే ప్రయత్నం వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల లోపు శిక్ష ఉండే కేసుల్లో కస్టడీ తప్పనిసరి అన్న చట్టబద్ధమైన నియమం ఎక్కడా లేదని అన్నారు. కాగా, అంబటికి సంబంధించిన అమెనిటీస్ పిటిషన్‌ను కోర్టు అనుమతిస్తూ, చట్టబద్ధంగా కల్పించాల్సిన సౌకర్యాలు అందించాలని ఆదేశించింది.

## డీవైఈఓ పోస్టుల ఫలితాలు విడుదల

**సాక్షి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా 2023 డిసెంబరు 22న జారీచేసిన నోటిఫికేషన్ ఆధారంగా చేపట్టిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) పోస్టుల భర్తీకోసం నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. 38 పోస్టులకుగానూ 38 మందిని ఎంపిక చేశారు. అర్హత పొందిన వారి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది.

# 'పోలవరం' అదనపు పనుల్లోనూ లాలూచీ!

- రూ.514.88 కోట్ల కాంట్రాక్టు విలువతో టెండర్ నోటిఫికేషన్ జారీ
- 4.09 శాతం అధికంగా రూ.535.99 కోట్లకు కోట్ చేసి పనులు దక్కించుకున్న మేఘా
- అధిక ధరకు పనులు అప్పగించడం వల్ల ఖజానాపై అదనంగా రూ.21.11 కోట్ల భారం
- పోలవరం ప్రాజెక్టులో 2019–24 మధ్య వైఎస్ జగన్ హయాంలో 4 టెండర్లలో ఖజానాకు రూ.686.98 కోట్లు మిగులు
- జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ వ్యవస్థను రద్దు చేసిన చంద్రబాబు సర్కార్
- మళ్లీ 2014–19 మధ్య అప్పటి బాబు పాలన తరహాలోనే నీరుగారిపోయిన టెండర్ల వ్యవస్థ
- అంచనాలు పెంచేసి, అధిక ధరకు ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు పనుల అప్పగింత
- ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు ముఖ్యనేత దోచిపెట్టి నీకింత.. నాకింత.. అంటూ పంచుకుతింటున్న వైనం

**సాక్షి, అమరావతి:** పోలవరం ప్రాజెక్టులో అదనపు పనుల టెండర్లలోనూ లాలూచీపర్వం బట్టబయలైంది. కాంట్రాక్టు విలువ కంటే 4.09 శాతం, 4.15 శాతం అధిక ధరకు రెండు కాంట్రాక్టు సంస్థలు బిడ్‌లు దాఖలు చేశాయి. 4.09 శాతం అధిక ధరకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన మేఘా సంస్థకు ఆ పనులు అప్పగించడానికి అనుమతి ఇవ్వాలంటూ పోలవరం హెడ్ వర్క్స్ ఎస్‌ఈ రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ(ఎస్ఎల్‌టీసీ)కి ప్రతిపాదనలు పంపారు. దీనివల్ల ఖజానాపై రూ.21.11 కోట్లు అదనపు భారం పడుతుంది. ఆ మేరకు కాంట్రాక్టర్‌కు అదనపు ప్రయోజనం చేకూరుతుంది. వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన జ్యుడిషియల్ ప్రివ్యూ వ్యవస్థను, రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేసిన చంద్రబాబు 2014–19 మధ్య తరహాలోనే టెండర్ల వ్యవస్థను నీరుగార్చడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలుగుతోందని ఇంజినీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లకు అధిక ధరకు పనులను ప్రభుత్వ పెద్దలు అప్పగిస్తూ... దోచిపెట్టిన ప్రజాధనాన్ని నీకింత.. నాకింత.. అంటూ పంచుకుతింటున్నారని ఆరోపిస్తున్నారు. కాగా, 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ విధానాలను అమలు చేయడం వల్ల ఒక్క పోలవరం ప్రాజెక్టులోనే రూ.8,053,24 కోట్ల కాంట్రాక్టు విలువతో నాలుగు పనులకు వేర్వేరుగా పిలిచిన టెండర్లలో కాంట్రాక్టు విలువ కంటే తక్కువ ధరకు కాంట్రాక్టర్లు కోట్ చేసి పనులు దక్కించుకున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.686.98 కోట్లు ఆదా అయ్యాయి. ఇప్పుడు చంద్రబాబు విధానాలను రద్దు చేసి అధిక ధరలకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారు.

**ఇవీ అదనపు పనుల వివరాలు...**

పోలవరం జాతీయ ప్రాజెక్టులో నాలుగు అదనపు పనులకు గత నెల 12వ తేదీన రూ.514.88 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది.

- పోలవరం మండల కేంద్రం నుంచి పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే, కుడి కాలువను జలాశయంతో అనుసంధానం చేసే టన్నెళ్లు, శాడిల్ డ్యామ్స్ వద్దకు వెళ్లేలా రహదారి నిర్మాణం.
- ప్రాజెక్టు ప్రధాన డ్యాం గ్యాప్–1 నుంచి ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్, కేఎల్ బండ్ మీదుగా ఎడమ కాలువ ప్రారంభ ప్రాంతం వరకు రోడ్డు నిర్మాణం.
- తూర్పు గోదావరి జిల్లా పురుషోత్తపట్నం గ్రామానికి సమీపంలో గండిపోచమ్మ ఆలయం నుంచి అఖండ గోదావరి ఎడమ గట్టు(ఏజీఎల్‌బీ) రక్షణ పనులు చేపట్టడం.
- స్పిల్ వే, కనెక్టివిటీస్‌కు కంట్రోల్ రూం, విద్యుత్ సబ్ స్టేషన్ అనుబంధ పనులు.

## శ్రీచైతన్య ప్రభంజనం

**సాక్షి, హైదరాబాద్:** జేఈఈ మెయిన్–2026 సెషన్–1 ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం సృష్టించింది. మోహిత్ జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచినట్టు ఒక ప్రకటనలో తెలిపింది. 300/300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించి ఇండియాలో టాప్‌గా నిలిచాడని పేర్కొంది. అలాగే 290, 285, 280 మార్కులతో అత్యధిక సంఖ్యలో విద్యార్థులతో పాటు, సబ్జెక్టుల వారీగా అత్యుత్తమ పర్సంటైల్స్, అత్యధిక 100 పర్సంటైల్ స్కోర్లు సాధించి ఈ ఏడాది తమ విద్యాసంస్థలు సత్తా చాటాయని వెల్లడించింది. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ.. ప్రస్తుత పర్సంటైల్స్‌లోనే కాకుండా, రాబోయే ర్యాంకుల్లో కూడా తమ విద్యార్థులు ఆధిపత్యాన్ని కొనసాగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

## టాపర్‌గా నిలిచిన భాష్యం విద్యార్థి

నూతలపాటి యోగ శివసాయి శ్రీరామ్

**గుంటూరు ఎడ్యుకేషన్:** జేఈఈ మెయిన్స్–2026 జనవరి సెషన్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నూతలపాటి యోగశివసాయి శ్రీరామ్ 99.99 వంటి టాప్ పర్సంటైల్‌తో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాపర్‌గా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థికి, అధ్యాపకులకు చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ అభినందనలు తెలిపారు.

## సత్తా చాటిన గౌతమ్ విద్యార్థి

**గుడివాడ టౌన్:** జేఈఈ మెయిన్స్–2026లో తమ విద్యార్థి పసల మోహిత్ 300/300 మార్కులు సాధించినట్టు కృష్ణా జిల్లా గుడివాడలోని కేకేఆర్ గౌతమ్స్ ప్రిన్సిపాల్ ఎమ్.సత్యారామ్ తెలిపారు. ఇంతటి ప్రతిభ కనబర్చిన మోహిత్‌ను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ విజయం గౌతమ్ విద్యాసంస్థలకు గర్వకారణమని పేర్కొన్నారు.

## తిరుమల విద్యార్థుల జయకేతనం

**రాజమహేంద్రవరం రూరల్:** జేఈఈ మెయిన్స్ సెషన్–1లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్ సాధించి ఎస్సీ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇప్పటివరకూ అందిన ఫలితాల్లో డి.శ్రీవేద్‌కు 99.999, ఎం.కృష్ణ శరవణ సాకేత్ 99.99, గన్నమనీడి వాత్సల్య 99.98, ఆర్.చరణ్‌తేజ 99.98, జి.ప్రభవ్‌తేజ 99.97 చొప్పున పర్సంటైల్ సాధించారని వివరించారు. సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌లతో ఎన్ఐటీ, ఐఐటీలలో సీట్లు సాధించగలరని ఆయన తెలిపారు. అత్యుత్తమ స్కోర్‌లు సాధించిన విద్యార్థులను తిరుమలరావు అభినందించారు.

## శ్రీప్రకాష్ ప్రతిభ



మోనిష్ కుమార్‌ను అభినందిస్తున్న శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు

**తుని:** జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. జె.మోనిష్ కుమార్ 99.93, టి.కృష్ణ 98.44 పర్సంటైల్ సాధించారన్నారు. వారిని విద్యాసంస్థల అధినేత సీహెచ్ వీకే నరసింహారావు, ప్రిన్సిపాల్ భానుమూర్తి అభినందించారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన 'భీరం'

భీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థుల విజయ దరహాసం

**ఖాజీపేట:** జేఈఈలో వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం చెమ్ముళ్ళలోని భీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్‌పర్సన్ సరస్వతమ్మ తెలిపారు. వరుణ్ 99.83, ఫైజాన్ 99.61, కార్తీక్ 99.52, కృష్ణచైతన్య 99.28, భరత్ సాయి 98.79, జీవీ జస్వంత్ 98.31, శ్యామ్ 98.18, మోజిత్ 98.10, విజయేశ్వర్ 97.79, ప్రణీత్ 97.68, ఎస్ భావన 97.37, నాగసాయిచరణ్ 97.30, నితీష్ 97.29, సిద్ధార్థ 96.72, ఓబుల్‌రెడ్డి 96.43, భార్గవి 96 పర్సంటైల్ సాధించారని వివరించారు. కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలోనే ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

## సత్తా చాటిన 'శశి'

**తాడేపల్లిగూడెం:** జేఈఈ మెయిన్ సెషన్–1 ఫలితాల్లో శశి వైజాగ్, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లు సత్తా చాటాయని ఆ సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ సోమవారం తెలిపారు. వి.భరత్ గోపాల స్వామి 99.95, శీలం శ్రీరామ్ భవదీప్ 99.83, కేజీవీ ఉదయ తేజారెడ్డి 99.77, కె.సాయిదుర్గా సుభాష్ 99.76, వై.తపస్‌సాయి లక్ష్మణ్ 99.71, ఒ.హర్ష సాయి రామ్ 99.65, బి.సాయివంశీ 99.52, ఎస్.సాయిరామ్ 99.45, జి.భరత్‌కుమార్ 99.39, కె.ధనుష్‌నాయుడు 99.27, జి.చరణ్ 99.06 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. 99కి పైగా పర్సంటైల్ 11 మంది సాధించారని తెలిపారు.

## శ్రీచైతన్య ప్రభంజనం

విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** జేఈఈ మెయిన్స్–2026 మొదటి సెషన్ ఫలితాల్లో శ్రీచైతన్య గుంటూరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. పి.చెన్నకేశవ్ 300 మార్కులకు 285 మార్కులతో 99.9979 పర్సంటైల్, ఎం.సాకేత్ 270 మార్కులతో 99.9949 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారన్నారు. 99.90 పర్సంటైల్‌కు పైగా 11 మంది, 99.5 పర్సంటైల్‌కు పైగా 23 మంది ఉన్నారని వివరించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను, ప్రిన్సిపాల్స్‌ను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ అభినందించారు. కార్యక్రమంలో డీన్ సురేష్‌బాబు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జేఈఈలో నారాయణ ఐఐటీ విద్యార్థి సత్తా

**తిరుపతి సిటీ:** జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో తిరుపతి ఎమ్మార్ పల్లిలోని నారాయణ ఐఐటీ అకాడమి విద్యార్థి ఎన్.మహిత్ జాతీయ స్థాయిలో సత్తా చాటి 100 పర్సెంటైల్ మార్కులు సాధించాడు. అదే కళాశాలలో పదుల సంఖ్య విద్యార్థులు 98 పర్సెంటైల్‌కు పైగా మార్కులు సాధించారు. మహిత్‌ను, ఇతర విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

# How many tangents can be drawn from a point outside a circle?

## SOME APPLICATIONS OF TRIGONOMETRY

### 8 MARKS QUESTIONS

**1. From a point on a bridge across a river, the angles of depression of the banks on opposite sides of the river are 30° and 45° respectively. If the bridge is at a height of 3m from the banks. Find the width of the river.**

***Sol:*** C,D represent points on the bank on opposite sides of the river

CD = Width of the river = DB + BC

height of the bridge = AB = 3m




From ΔABC

$\tan 45° = \frac{3}{y}, 1 = \frac{3}{y}, y = 3 \rightarrow (1)$

From ΔABD

$\tan 30° = \frac{3}{x}, \frac{1}{\sqrt{3}} = \frac{3}{x}, x = 3\sqrt{3} \rightarrow (2)$

∴ Width of river = CD = $x$ + y

= 3√3+ 3 = 3(√3+ 1)m

**2. As observed from the top of a 75m high light house from the sea- level, the angles of depression of two ships are 30° and 45°. If one ship is exactly behind the other on the same side of the lighthouse, find the distance between the two ships.**

***Sol:*** AB = height of light house = 75m

CD = Distance between two ships = $x$ (let)

Let BC = d




From ΔABC

$Tan\ 45° = \frac{75}{d} \Rightarrow 1 = \frac{75}{d}$

d = 75 → (1)

From ΔABD

$Tan 30° = \frac{75}{x+d} \Rightarrow \frac{1}{\sqrt{3}} = \frac{75}{x+75}$

$x$ + 75= 75√3 $x$ = 75√3 – 75

$x$ = 75 (√3–1)

∴ Distance between two ships

= 75(√3_1)m

**3. A tree breaks due to storm, the broken part bends. So that the top of the tree touches the ground by making 30° angle with the ground. The distance between the foot of the tree, the top of the tree on the ground is 6m. Find the height of the tree before falling down.**

***Sol:*** AC = initial height of the tree

BC = The broken part of tree = BD

AD = 6m.




From the figure

$\tan 30° = \frac{AB}{AD}$

$\Rightarrow \frac{1}{\sqrt{3}} = \frac{AB}{6}$

$AB = \frac{6}{\sqrt{3}} = \frac{2 \times 3}{\sqrt{3}} = 2\sqrt{3}$

Again cos 30° $= \frac{AD}{BD} \Rightarrow \frac{\sqrt{3}}{2} = \frac{6}{BD}$

$\Rightarrow BD = \frac{12}{\sqrt{3}} = \frac{4 \times 3}{\sqrt{3}} = 4\sqrt{3}$

Hence, the height of the tree

AB + BD = 2√3 + 4√3 = 6√3m.

**4. A 1.5m tall boy is standing at some distance from a 30m tall building. The angle of elevation from his eyes to the top of the building increases from 30° to 60° as he walks towards the building. Find the distance he walked towards the building.**

***Sol:*** Height of the building CD = 30m

Height of the boy = AB = 1.5m




Let the distance between the boy and building= $x$ m

Let the distance the boy walked = d m

From ΔAED, right angled at E

Tan 30° $= \frac{DE}{AE} = \frac{28.5}{x}$

$\frac{1}{\sqrt{3}} = \frac{28.5}{x} \Rightarrow x = 28.5\sqrt{3}m \rightarrow (1)$

From ΔFDE

tan 60° $= \frac{DE}{FE} = \frac{28.5}{x-d} \Rightarrow \sqrt{3} = \frac{28.5}{x-d}$

(x – d)√3 = 28.5, (28.5√3– d)√3 = 28.5

3 × 28.5 – √3d = 28.5

3 × 28.5 – 28.5 = √3d

2 × 28.5 = √3d ⇒ √3d = 57,

$d = \frac{57}{\sqrt{3}} = \frac{57}{\sqrt{3}} \cdot \frac{\sqrt{3}}{\sqrt{3}} = \frac{57\sqrt{3}}{3} = 19\sqrt{3}$

∴ Distance he walked towards building =19√3m

**5. The shadow of a tower standing on a level ground is found to be 40m longer when the sun's altitude is 30° than when it is 60°. Find the height of the tower.**

***Sol:*** Let AB = tower of height = h m

CD = 40m, Let BC = $x$ m

BD = BC + CD = $x$ + 40




$\tan 60° = \frac{AB}{BC}: \sqrt{3} = \frac{h}{x}, h = \sqrt{3}x \rightarrow (1)$

From ΔABD

$\tan 30° = \frac{AB}{BD} = \frac{h}{x+40}, \frac{1}{\sqrt{3}} = \frac{h}{x+40}$

h√3=$x$ +40

(√3$x$)√3 = $x$ + 40 (∵ From (1))

3$x$ = $x$ + 40

3x – x = 40, 2x = 40, x = $\frac{40}{2}$ = 20

From h =√3x = √320 = 20√3m

∴height of the tower h = 20√3m

**6. Two poles of equal heights are standing opposite each other on either side of the road, which is 80m wide. From a point between them on the road, the angles of elevation of the top of the poles are 60° and 30°, respectively. Find the height of the poles and the distances of the point from the poles.**

***Sol:*** Let AB and CD are the two poles of same height AB = CD = h m

Let E be the point of observer between the foots of the two poles.




Let BE = $x$ m

distance between two poles BD = 80 m

BE + ED = BD

$x$ + ED = 80

ED = 80 - $x$

From ΔABE

Tan 60°

$= \frac{AB}{BE} = \frac{h}{x}$

$\sqrt{3} = \frac{h}{x}, h = \sqrt{3}x \rightarrow (1)$

From ΔCDE

$\tan 30° = \frac{CD}{ED} = \frac{h}{80-x}$

$\frac{1}{\sqrt{3}} = \frac{h}{80-x}, h\sqrt{3} = 80 - x$

$\sqrt{3}x.\sqrt{3}$ = 80 – $x$ (∵ From eq (1))

3$x$ = 80 – $x$

3$x$ + $x$ = 80

4$x$ = 80

$x = 80/4 = 20$

80 – $x$ = 80 – 20 = 60

∴Point from first pole = 20m and second pole = 60 m

From eq (1) h = $\sqrt{3}x = 20\sqrt{3}$ m

Continued on next page..

## CIRCLES

1. If the circle and a line have no point in common, then we say that the line is a **non-intersecting** line with respect to the circle.



2. If the circle and a line have two common points, then we say that line is a **secant** of the circle.



3. If the circle and a line have only one point in common, then we say that the line is a **tangent** to the circle. The common point of the tangent, and the circle is called the **point of contact.**



» The tangent at any point of a circle is perpendicular to the radius through the point of contact.
» No tangent can be drawn to a circle from a point lying inside the circle.
» There is one and only one tangent to a circle passing through a point lying on the circle.
» Exactly two tangents can be drawn to a circle from a point lying outside the circle.
» The length of tangents drawn from an external point to a circle are equal.



### 1 MARK QUESTIONS

1. **Draw a rough sketch as a tangent of a circle passes through the end point of its radius.**

*Sol:*




OA - radius   AP - tangent

2. **Create a geometrical design involving two tangents drawn from an external point to the circle.**

*Sol:*




3. **The common point of a tangent to a circle and the circle is called ——**
   **Ans:** point of contact
4. **A tangent to a circle intersects it in —— points**
   **Ans:** only one point
5. **A line intersecting a circle in two points is called a ——**
   **Ans:** secant

### 2 MARKS QUESTIONS

1. **From a point Q, the length of the tangent to a circle is 24 cm and the distance of Q from the centre is 25 cm. The radius of the circle is**
   A) 7cm   B) 12cm
   C) 15cm   D) 24.5cm




*Sol:* The length of the tangent QP = 24 cm
Distance between O and Q is 25 cm
radius of the circle OP = r cm
$\Delta OPQ$ is a right angled triangle
From $\Delta OPQ$, $OQ^2 = OP^2 + PQ^2$
$25^2 = r^2 + 24^2$
$r^2 = 25^2 - 24^2 = 625 - 576 = 49$
$r = \sqrt{49} = 7$cm
$\therefore$ The radius of the circle = 7cm

2. **Define 'tangent of a circle'.**

*Sol:* A line which intersects a circle in only one point is called a tangent to the circle.

3. **How many tangents can be drawn from a point outside a circle?**

*Sol:* We can draw only two tangents from a point outside a circle.

4. **How can you mark the centre of a circle if the circle is given without centre?**

*Sol:* We draw any two non parallel chords and again draw the perpendicular bisectors of the chords. The intersecting point of the two perpendicular bisectors is the centre of the circle.

5. **Calculate the length of a tangent from a point 13cm away from the centre of a circle of radius 5cm.**

*Sol:* Here r = 5cm and d = 13cm
Length of tangent $= \sqrt{d^2 - r^2}$
$= \sqrt{13^2 - 5^2} \Rightarrow \sqrt{144} = 12$

6. **Draw a circle and two lines parallel to a given line such that one is a tangent and the other is a secant to the circle.**

*Sol:*




### 4 MARK QUESTIONS

1. **Prove that the lengths of tangents drawn from an external point to a circle are equal**

*Sol:* Given that a circle with centre O, a point P lying outside the circle
Two tangents PQ, PR on the circle from P
we are required to prove PQ = PR
From $\Delta OPQ$, $\Delta OPR$




OQ = OR (Radii of the same circle)
OP = OP (common)
$\angle OQP = \angle ORP = 90°$
(radius is perpendicular to tangent)
$\because \Delta OQP \cong \Delta ORP$ ($\because$ RHS rule)
PQ = PR (CPCT)

2. **Two tangents TP and TQ are drawn to a circle with centre O from an external point T. Prove that $\angle PTQ = 2\angle OPQ$**

*Sol:* Given a circle with centre O
an external point T and two tangents TP, TQ
P, Q are points of contact.
Now required to prove that
$\angle PTQ = 2\angle OPQ$




Let $\angle PTQ = \theta$
We know that TP = TQ
($\because$ Tangents to a circle are equal)
So, $\Delta TPQ$ is a Isosceles triangle
$\therefore \angle TPQ = \angle TQP = \frac{1}{2}(180 - \theta)$
$= 90 - \frac{1}{2}\theta$ ——(i)
We know that $\angle OPT = 90°$
($\because$ radius is perpendicular to tangent)
$\angle OPQ = \angle OPT - \angle TPQ$
$= 90 - (90 - \frac{1}{2}\theta)$ ($\because$ from equation (i))
$= \frac{1}{2}\theta \qquad = \frac{1}{2}\angle PTQ$
$\therefore \angle PTQ = 2\angle OPQ$

3. **In figure, If AP, AQ are the two tangents to a circle with centre 'O'.**
   **so that $\angle POQ = 130°$ then $\angle PAQ$ is equal to ——**

*Sol:* Given $\angle POQ = 130°$
we know that $\angle OPA = 90°$
$\angle OQA = 90°$ ($\because$ Angle between tangent, radius through the point of contact is 90°)



In quadrilateral OPAQ
$\angle POQ + \angle OQA + \angle OPA + \angle PAQ = 360°$
$130° + 90° + 90° + \angle PAQ = 360°$
$\Rightarrow \angle PAQ = 50°$

**Y. Vanamraj**
Subject Expert
Kurnool

## Daily Quiz

1. **They are coming tomorrow, ___?**
   A) aren't they   B) are they
   C) won't they   D) don't they
2. **Change the following sentence from the active voice to the passive voice.**
   ***The company has hired a new manager.***
   A) A new manager has been hired by the company.
   B) A new manager is hired by the company.
   C) A new manager was hired by the company.
   D) A new manager will be hired by the company.
3. **Change the following sentence from direct speech to indirect speech.**
   ***He said, "I have finished my work."***
   A) He said that he has finished his work.
   B) He said that he had finished his work.
   C) He said that he finishes his work.
   D) He said that he will finish his work.
4. **___ the letter, she felt sad.(Participle Clause)**
   A) Reading   B) Read
   C) To read   D) Reads
5. **This is ___ book I've ever read.**
   **(Degree of Comparison)**
   A) interesting   B) more interesting
   C) the most interesting   D) interestingly

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
మంగళవారం ॥ 17-2-2026

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో తమంతట తామే పనిచేసే (ఆటోమేటెడ్ గైడెన్స్) డిజిటల్ యాప్‌లతో పెను ప్రమాదాలే వచ్చి పడుతున్నాయంటూ చాలా ఫిర్యాదులు అందుతున్నాయి. దాంతో అవి చేసే సిఫార్సులు ఒక్కోసారి పెద్దపెద్ద ముప్పులు తెచ్చిపెడుతున్నాయంటూ ప్రముఖ వార్తా సంస్థ 'రాయిటర్స్' హెచ్చరిస్తోంది.

# డాక్టర్ ఏఐతో తస్మాత్ జాగ్రత్త!

ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) కాలూనని రంగమంటూ ఏదీ లేదు. చట్టాలూ, సాఫ్ట్‌వేర్, విద్యా, వినోదంతో పాటు ఆఖరికి లక్షలాది మెడికల్ కేసుల అనుభవంతో వైద్య విద్య, చికిత్సల్లో కూడా అది పాలుపంచుకుంటోంది. ఇక చైనా లాంటి దేశాలైతే ఏఐతో నడిచే క్లినిక్‌లూ, హాస్పిటళ్లు సైతం ఏర్పాటు చేసుకుంటున్నాయి. మిగతా రంగాలెలా ఉన్నప్పటికీ... వైద్యరంగంలో మాత్రం ఏఐతో కొన్ని తప్పులూ, పొరబాట్లు జరుగుతున్నాయనీ, ఇవి ఆందోళన గొలిపేలా ఉన్నాయంటూ డాక్టర్లు, మెడికల్ ప్రొఫెషన్‌లో ఉన్న నిపుణులు బెంబేలెత్తుతున్నారు. ఒకవేళ పేషెంట్లు తమంతట తామే ఏఐకు తమ సమస్య చెప్పుకుని ఆ మేరకు వైద్య సలహా పొందితే అది ఆందోళనకరంగా పరిణమించేందుకు అవకాశాలు లేకపోలేదంటూ హెచ్చరిస్తున్నారు.

టర్కీ (తుర్కియా) రాజధాని అంకారాలోని ఒక హాస్పిటల్‌కు వచ్చిన ఒక పేషెంట్ తాలూకు కేస్‌స్టడీతో ఒక సంఘటన వెలుగుచూసింది. అదేమిటంటే... ఆ హాస్పిటల్‌లో పనిచేసే డాక్టర్ సెమ్ అక్సోయ్ అనే డాక్టర్ దగ్గరికి కౌమార వయస్సులో ఉన్న ఓ పద్దెనిమిదేళ్ల పిల్లాడు వచ్చాడు. అతడికి కాలిలో క్యాన్సర్ గడ్డ ఉందని నిర్ధారణ అయ్యాక తన కేసు వివరాలను 'ఏఐ'కి సంబంధించిన చాట్ జీపీటీకి తెలిపి తనకు సలహా ఇవ్వాలంటూ కోరాడు. అంతే... ''నువ్వు ఐదేళ్లకు మించి బతకవు'' అంటూ ఏఐ సమాధానమిచ్చింది. ఈ సమాచారం ఆ కుర్రాడిని ఎంతగా ఆందోళనపరిచి ఉంటుందో ఎవరైనా ఊహించవచ్చు. కానీ ఓ సర్జికల్ ఆంకాలజిస్టూ, ఓ ప్లాస్టిక్ సర్జన్ నిర్వహించిన సర్జరీల తర్వాత అతడు పూర్తిగా కోలుకున్నాడు. అంతేకాదు... ''ఇప్పుడు నీలోంచి క్యాన్సర్ తొలగిపోయినట్టే'' అంటూ భరోసా కూడా ఇచ్చారు.

అయితే మళ్లీ అదే అబ్బాయి కొన్ని వారాల తర్వాత డాక్టర్ అక్సోయ్‌కు మరోసారి ఫోన్ చేశాడు. ఈసారి వచ్చిన ఫోన్ సందేశంలోని సందేహమేమిటంటే... ''నాకు తరచూ దగ్గు వస్తోంది. అంటే మొన్నటి క్యాన్సర్ ఇప్పుడు ఊపిరితిత్తులకు సోకిందంటారా?'' అని అతడు ప్రశ్నించాడు. అయితే డాక్టర్లు అతడి ఊపిరితిత్తులను పూర్తిగా పరీక్షించాక తేలిందేమిటంటే అతడికి క్యాన్సర్ ఏమాత్రం లేదు. అయితే... ఆ పిల్లాడు ఈమధ్య సిగరెట్లు తాగడం మొదలుపెట్టడమే అతడి దగ్గుకు కారణమని తేలింది.

''ఏదైనా వ్యాధి నిర్ధారణ చేయాలంటూ కేవలం లక్షణాలను మాత్రమే చూడకూడదు. అతడికి ఆ లక్షణాలు కనిపిస్తున్న సందర్భాలనూ పరిశీలించాలి. ఆ యువకుడు ఇటీవల పొగతాగడం మొదలుపెట్టినందువల్ల దగ్గు వచ్చిందని తేలింది. వైద్యవిజ్ఞాన సమారమంతా ఓ దట్టమైన అడవి అయితే... ఇలా అరకొర పరిజ్ఞానంతో అందులో తిరగడమన్నది దారీతెన్నూ తెలియకుండా అందులో తప్పిపోవడం లాంటిదం''టూ డాక్టర్ అక్సోయ్ వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా 'ఏఐ' సంస్థలకు సంబంధించిన ఓ ప్రతినిధి మాట్లాడుతూ... ''ఇలాంటి అనుభవాల తర్వాత... ఏఐ అడగాల్సిన ప్రశ్నలను నమోదు చేస్తూ కృత్రిమ మేధ మరింత సమర్థంగా, పరిపుష్టంగా పని చేసేలా మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. అయితే కృత్రిమ మేధ ఎప్పటికీ ఓ డాక్టర్ / మెడికల్ ప్రొఫెషనల్‌కు మంచి ప్రత్యామ్నాయం కాబోదంటూ ఆయన తెలిపారు.

ఇక్కడ ఈ టర్కిష్ అబ్బాయి ఉదంతం రెండు అంశాలను సూచిస్తోంది. మొదటిది... ప్రపంచంలోని చాలామంది వ్యక్తులు... తాము హాస్పిటళ్ల వరకూ వెళ్లాల్సిన శ్రమ తప్పడం కోసం అలాగే తమ ప్రైవసీని కాపాడుకోవడం కోసం టెక్నాలజీ ఆధారిత సలహాల మీద ఎలా ఆధారపడుతున్నారనే అంశం. ఇక రెండోది... ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లు తమకున్న పరిజ్ఞానంతో సమాజాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నాయో తెలపడం కోసం ఈ టర్కీ అబ్బాయి ఉదంతమే ఒక తార్కాణం.

## మేర దాటుతున్న మేధ...

ఈ నేపథ్యంలో చూసినప్పుడు కొన్ని మెడికల్ యాప్స్ తమ నైతిక పరిధులను దాటుతున్నాయి. ఉదాహరణకు 'యురేకా హెల్త్' అనే ఓ యాప్ తనను తాను ''ఆల్ ఇన్ వన్ హెల్త్ కంపెనియన్'గా ప్రకటించుకుంది. అంటే... ఆరోగ్యం విషయంలో అన్ని వ్యాధుల నిపుణుడూ తానే అయిపోయి ఆరోగ్య సమాచారాన్ని తెలుపుతానంటూ గొప్పలు చెప్పుకుంటోంది. అయితే ఆపిల్ యాప్ స్టోర్ మాత్రం కొంత సంయమనం పాటిస్తూ... ''ఇది కేవలం తగిన సమాచారాన్ని తెలుసుకోవడం కోసం మాత్రమే. తాను వ్యాధి నిర్ధారణగానీ లేదా చికిత్సగానీ చేయడానికి తగనం''టూ'' స్పష్టం చేస్తోంది. కానీ దాన్ని అభివృద్ధి చేసిన సంస్థవాళ్లు మాత్రం 'మీకు మీరే మీ డాక్టర్' అంటూ ప్రచారాలు చేసేస్తున్నారు.

అలాగే ''ఆస్క్, డయాగ్నోజ్, ట్రీట్'' అనే మరో సైట్ వాళ్లు మరికాస్త ముందుకెళ్లి ''మా ఏఐ వ్యాధి నిర్ధారణా చేసేస్తుంది. వాడాల్సిన మందుల్ని సూచిస్తూ ప్రిస్క్రిప్షన్ కూడా రాసేస్తుంది. ఈ ప్రపంచంలోని హాస్పిటల్స్‌లో వాస్తవంగా మీకు ఎలాంటి చికిత్స దొరుకుతుందో దాన్ని ఇక్కడే మీకు సూచిస్తుంది'' అంటూ గొప్పలకు పోతున్నారు.

అయితే... రాయిటర్స్ సంస్థలో వచ్చిన వార్తల వల్ల... ''యురేకా హెల్త్'' యాప్ కారణంగా జరిగిన అనర్థాలను తెలుసుకున్న తర్వాత 'ఆపిల్' సంస్థ సదరు యాప్‌ను తమ స్టోర్ నుంచి తొలగించింది. అంతే కాదు... ఏ సమాచారం ఆధారంగా; ఏ పద్ధతుల ద్వారా; ఏయే అంశాల సహాయంతో వ్యాధి నిర్ధారణ విషయంలో ఆ నిర్ధారణకు వస్తున్నారో స్పష్టంగా తెలపాలంటూ యాప్‌ను అభివృద్ధి చేసే నిపుణులకు స్పష్టమైన సూచనలు చేసింది.

– యాసీన్

### మెడికల్ యాప్స్!

ఇటీవల కృత్రిమమేధ (ఏఐ) సహాయంతో గూగుల్ లేదా ఆపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే మెడికల్ యాప్‌ల సంఖ్య బాగా పెరిగింది. నిజానికి అవి ఎలాంటి వ్యాధి నిర్ధారణా చేయకూడదు. అయినప్పటికీ వాటిని ఆశ్రయించి... తమ సమస్య ఏమిటో తెలుసుకోవడమన్నది చాలా ఎక్కువైంది. అయితే ఇక్కడ ఒక చిక్కుముడి ఉంది. నిజానికి ఏఐ ఎలాంటి వ్యాధినిర్ధారణా (డయాగ్నోజ్) చేయకూడదు. కానీ యూఎస్ ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) సంస్థ నియమాల ప్రకారం... ప్రజల ప్రాథమిక అవగాహన కోసమే సమాచారం తెలిపే సందర్భాల్లో ఆ చాట్‌బాట్‌లు ఎవరి అనుమతులూ తీసుకోనక్కర్లేదు. అందుకోసమే ''తాము డాక్టర్‌కు ప్రత్యామ్నాయం కానేకాదనీ,వ్యాధిని నిర్ణయించడంలో విషయంలో తాము చేసేది 'తుది నిర్ధారణ' కాదం''టూ స్పష్టంగా సూచన (డిస్క్లెయిమర్) చేస్తుంటాయి.



'పగటి కలలు కనకు' అంటారే గానీ 'రాత్రి కలలు కనకు' అనరు. జలుబు చేసినప్పుడు తుమ్మినంత సహజంగా రాత్రి నిద్రలో మనకు కలలు వస్తాయి. ఆ కలలకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు...

# స్వప్నలిపి

**4-7**
దాదాపు ప్రతి ఒక్కరికి సగటున నాలుగు నుంచి ఏడు వరకు కలలు వస్తాయి.

**5-20**
ప్రతి కల అయిదు నుంచి ఇరవై నిమిషాల మధ్య ఉంటుంది. ఎక్కువ కలలు రాత్రి ఆలస్యంగా వస్తాయి.

**2**
రాత్రి సుమారు రెండు గంటలు స్వప్నావస్థలోనే గడుపుతాము.

**95 శాతం**
95 శాతం కలలు ఎక్కువ కాలం గుర్తుండవు.

**0.9-6.8 శాతం**
తరచుగా వచ్చే పీడకలలు (కనీసం వారానికి ఒకసారి) 0.9 శాతం నుంచి 6.8 శాతం వరకు ప్రభావితం చేస్తాయి.

➡ అధ్యయనాలు వివిధ రకాల కలల గురించి చెప్పాయి. అందులో ఒకటి... కలలు అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉంటాయి.
➡ కలలకు సంబంధించి స్లీప్ ఎక్స్‌పర్ట్‌ల మధ్య భిన్నమైన సిద్ధాంతాలు ఉన్నాయి. 'జ్ఞాపకశక్తిని బలోపేతం చేయడంలో కలలు ఉపకరిస్తాయి' అనేవారు ఉన్నారు. 'కలలకు అర్థం, పరమార్థంలాంటివేమీ లేవు. కల అంటే ఇన్సిడెంటల్ బ్రెయిన్ యాక్టివిటీ, నిద్రకు సంబంధించి బై-ప్రొడక్ట్' అనే వారూ ఉన్నారు.

**50 శాతం**
ఒక అధ్యయనంలో 50 శాతం మంది తాము కలర్‌ఫుల్ కలలు కన్నామని చెప్పారు.

**12 శాతం**
ఒక అధ్యయనం ప్రకారం పన్నెండు శాతం మంది తాము నలుపు, తెలుపు రంగులలో మాత్రమే కలలు కంటామని చెప్పారు.

**25**
25 ఏళ్లలోపు వయసు ఉన్నవారు తమకు నలుపు, తెలుపు కలలు అరుదుగా వస్తాయని చెప్పారు.

### కలలలో లింగ భేదాలు!

➡ కలల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య ఉండే తేడాను పరిశోధకులు కనుగొన్నారు. పురుషులు ఎక్కువగా ఆయుధాల గురించి కలలు కంటారని, మహిళల కలలు సున్నితంగా ఉంటే పురుషుల కలలు దూకుడుగా ఉంటాయని చెబుతున్నారు.
➡ పురుషులతో పోల్చితే స్త్రీలకు ఎక్కువగా పీడకలలు వస్తాయట!

**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఫిబ్రవరి 16న ముగింపు రూ.లలో

| హైదరాబాద్ | | విజయవాడ | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,58,120 | బంగారం (24 క్యారెట్లు) | 1,58,530 | బంగారం (24 క్యారెట్లు) | 1,56,440 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,45,308 | బంగారం (22 క్యారెట్లు) | 1,43,400 | బంగారం (22 క్యారెట్లు) | 1,43,400 |
| వెండి | 2,53,000 | వెండి | 2,53,000 | వెండి | 2,65,000 |

| రాజమండ్రి | | ప్రొద్దుటూరు | | చెన్నై | |
|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,58,530 | బంగారం (24 క్యారెట్లు) | 1,57,200 | బంగారం (24 క్యారెట్లు) | 1,57,530 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,47,700 | బంగారం (22 క్యారెట్లు) | 1,44,620 | బంగారం (22 క్యారెట్లు) | 1,44,400 |
| వెండి | 2,53,000 | వెండి | 2,50,500 | వెండి | 2,80,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

# సాక్షి సినిమా

## ఫౌజి షూటింగ్‌లో...

● ప్రభాస్

వరుస పాన్ ఇండియన్ ఫిల్మ్స్‌తో ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రాల్లో 'ఫౌజి' ఒకటి. 'సీతా రామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్. జయప్రద, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, భాను చందర్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. టి-సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న 'ఫౌజి' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలోని ఓ కీలక సన్నివేశం కోసం గుర్రపు స్వారీ సీన్స్ తెరకెక్కిస్తుండగా అదుపు తప్పి ప్రభాస్ కింద పడటంతో చేతులకు స్వల్ప గాయాలు అయ్యాయట. ఈ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన అభిమానులు ఆందోళన పడ్డారు. ఈ వార్తలపై ప్రభాస్ టీమ్ స్పందించింది. ''ఏదైనా సినిమా షూటింగ్స్‌లో చిన్నచిన్న ప్రమాదాలు జరగడం సహజమే. ప్రభాస్‌కి పెద్ద గాయాలు కాలేదు. ఆయన చేతి వద్ద చిన్న గీటు మాత్రమే పడింది. అది కూడా చికిత్స అవసరం లేనంతగా ఉండటంతో ఆయన షూటింగ్‌లో పాల్గొన్నారు. అభిమానులు కంగారుపడొద్దు'' అంటూ పేర్కొనడంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే.. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో దసరా పండుగ సందర్భంగా 'ఫౌజి' విడుదల కానుంది. కాగా ప్రభాస్ చేతిలో ప్రస్తుతం 'స్పిరిట్, కల్కి 2898 ఏడీ 2' వంటి సినిమాలున్నాయి.

## చిన్న సర్జరీ జరిగింది

– చిరంజీవి

హీరో చిరంజీవి భుజానికి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. కాగా అల్లు శిరీష్-నయనికల వివాహం మార్చి 6న జరగనుంది. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రులు అల్లు అరవింద్, నిర్మలతో కలిసి మావయ్య చిరంజీవికి తొలి శుభలేఖను అందించారు అల్లు శిరీష్. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఫోటోల్లో చిరంజీవి చేతికి పట్టీ ఉండటంతో ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఈ విషయంపై చిరంజీవి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''చేతికి పట్టీ ఉండటం గమనించి నా అభిమానులు, శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్నపాటి కీ హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను కోలుకున్నాను. నా దినచర్య సజావుగా సాగుతోంది. ఈ సర్జరీని ఎంతో నైపుణ్యంతో, సాఫీగా నిర్వహించిన ఆర్థోస్కోపీ సర్జన్ నితిన్‌గారికి ధన్యవాదాలు. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు'' అని పోస్ట్‌లో పేర్కొన్నారు చిరంజీవి. కాగా.. చిరంజీవి హీరోగా నటించిన 'విశ్వంభర' సినిమా ఈ ఏడాదిలో రిలీజ్ కానుంది. అలాగే ఆయన హీరోగా బాబీ దర్శకత్వం వహించనున్న సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది.

## డేట్స్ ఫిక్స్

● విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా

హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికా మందన్నా పెళ్లిపీటలు ఎక్కనున్న విషయం తెలిసిందే. 2025 అక్టోబరులో వీరి నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు హల్‌చల్ చేశాయి. అదేవిధంగా ఈ నెల 26న వీరి పెళ్లి జరగనుందనే న్యూస్ నెట్టింట గత కొద్ది రోజులుగా చక్కర్లు కొడుతోంది. ఈ వార్తలపై ఇటు విజయ్ కానీ, అటు రష్మిక కానీ స్పందించ లేదు. తాజాగా వీరి వివాహ శుభలేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్ వేదికగా ఈ నెల 26న విజయ్-రష్మిక పెళ్లి పీటలెక్కనున్నారు. ఇరు కుటుంబ సభ్యులు, అతి కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో సింపుల్‌గా పెళ్లి చేసుకోబోతున్నారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో సాయంత్రం 7గంటలకు ఘనంగా రిసెప్షన్‌ని ఏర్పాటు చేశారు. ఆ విషయాన్ని పెళ్లి పత్రికలో ముద్రించారు. ఈ మేరకు పలువురు సినీ ప్రముఖులకు ఇదివరకే ఆహ్వానాలు అందించారట. తాజాగా విజయ్-రష్మిక హైదరాబాద్ విమానాశ్రయంలో కనిపించడంతో పెళ్లి పనుల కోసం ఉదయ్‌పూర్‌కి వెళుతున్నారని సమాచారం. ఇదిలా ఉంటే.. విజయ్-రష్మిక 'గీతగోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో నటించారు. ప్రస్తుతం 'రణబాలి' అనే చిత్రంలో వీరిద్దరూ మూడోసారి కలిసి నటిస్తున్నారు.

## పెద్ద తెరపైనే చూడాలి

– మణిరత్నం



శనయ కపూర్, ఆదర్శ్ గౌరవ్ ప్రధాన పాత్రల్లో నటించిన బాలీవుడ్ మూవీ 'తు యా మైన్'. బిజోయ్ నంబియార్ దర్శకత్వం వహించారు. కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ పతాకంపై ఆనంద్ ఎల్. రాయ్, హిమాన్షు శర్మ, భానుశాలి స్టూడియోస్ లిమిటెడ్‌పై వినోద్ భానుశాలి, కమలేష్ భానుశాలి నిర్మించారు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీ ప్రేమికుల రోజు కానుకగా ఈ నెల 13న విడుదలై ప్రేక్షకాదరణతో దూసుకెళుతోంది. దక్షిణాదిలో నిర్వహించిన 'తు యా మైన్' ప్రత్యేక స్క్రీనింగ్‌కి ప్రముఖ దర్శకుడు మణిరత్నం హాజరయ్యారు. ఈ మూవీని వీక్షించిన తర్వాత చిత్రబృందంపై ప్రశంసల జల్లు కురిపించారాయన. ''తు యా మైన్'కు బిజోయ్ నంబియార్ ఒక కైనెటిక్ ఎనర్జీని తీసుకువచ్చారు. థియేటర్లలో ప్రేక్షకుల మధ్య కూర్చొని పెద్ద తెరపైనే చూడాల్సిన సినిమా ఇది. అప్పుడే ఆ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించగలం'' అని మణిరత్నం పేర్కొన్నారు.

## పవర్‌ఫుల్ సెయాన్

● శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న సినిమాకు 'సెయాన్' టైటిల్ ఖరారైంది. శివ కుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా పతాకాలపై కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్నారు. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మాణ సంస్థలో శివ కార్తికేయన్ చేస్తున్న రెండో సినిమా ఇది. సోమవారం 'సెయాన్' సినిమా టైటిల్‌ని ప్రకటించి, శివ కార్తికేయన్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'సెయాన్'. పవర్‌ఫుల్ అండ్ డైనమిక్ క్యారెక్టర్‌లో శివ కార్తికేయన్ కనిపిస్తారు. కమర్షియల్ మాస్ అంశాలు, భావోద్వేగాలు, వినోదం.. వంటి అంశాల మేళవింపుతో ఈ సినిమా కథనం సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణన్.

## పిలిచే మల్లికా...

● డ్యాన్సర్స్‌తో సునీల్

ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మలయాళ యాక్షన్ డ్రామా 'కాటాలన్'. ఈ చిత్రంలో దుషారా విజయన్, సునీల్, కబీర్ దుహాన సింగ్, తరందాసు, పార్థ్ తివారీ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. పాల్ జార్జ్ దర్శకత్వంలో క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై షరీఫ్ మహమ్మద్ నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ సినిమా మే 14న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ 'మజాకో మల్లికా..' అనే పాట లిరికల్ వీడియోను తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేశారు. 'రాజ రా.. రాజ రా రాజా.. పిలిచే మల్లిక... మజాకో మల్లికా..' అంటూ 'మజాకో మల్లికా...' అంటూ తెలుగు వెర్షన్ సాంగ్ లిరిక్స్ వినిపిస్తాయి. అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు. ఈ పాటకి రాంబాబు గోసాల లిరిక్స్ అందించగా, అరుణ్, సమీర పాడారు.

## ప్రేక్షకుల నోట ఆ మాట వినాలని ఉంది

– శివానీ నాగారం

''వేగంగా వంద సినిమాలు చేయడం కంటే.. నటిగా ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఐదు సినిమాలు చేసినా చాలు' అనుకునే మనస్తత్వం నాది. వెంట వెంటనే సినిమాలు చేయకపోతే ఇండస్ట్రీలో కనిపించకుండా పోతావు అని కొందరు నాతో అన్నారు. కానీ, ఈ అమ్మాయి ఎప్పుడూ మంచి సినిమాలే చేస్తుంది అనే మాట ప్రేక్షకుల నోట వినాలని ఉంది. సెలక్టివ్‌గా సినిమాలు చేసే సాయిపల్లవి, నిత్యామీనన్‌గార్ల బాటలోనే నేను కూడా పయనిస్తాను'' అని చెప్పారు హీరోయిన్ శివానీ నాగారం. సుహాస్ హీరోగా నటించిన చిత్రం 'హే బల్‌వంత్!' (హే భగవాన్ టైటిల్‌ను హే భల్‌వంత్! గా మార్చారు). గోపీ అచ్చర దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజ్ కానుంది. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ మూవీని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శివానీ మాట్లాడుతూ–''నా స్వస్థలం హైదరాబాద్. గాయనిగా కెరీర్‌ను ప్రారంభించాను. యాక్టర్‌గా తొలిసారి సుహాస్‌తో 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' సినిమా చేశాను. ఆ తర్వాత 'లిటిల్ హార్ట్స్' మూవీ చేశాను. ఇప్పుడు మళ్లీ సుహాస్‌తో 'హే బల్‌వంత్' చేశాను. నా పాత్రలో అమాయకత్వంతో పాటు కామెడీ కూడా ఉంటుంది.నరేశ్, వెన్నెల కిషోర్, సుదర్శన్‌గార్ల కామెడీ నవ్విస్తుంది. సెకండాఫ్‌లో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ ఉంది. తెలుగు అమ్మాయిలకు ఇప్పుడు ఎక్కువగా అవకాశాలు వస్తుండటం సంతోషంగా ఉంది. ప్రస్తుతం తెలుగులో రెండు, తమిళంలో రెండు సినిమాలకు చాన్స్ వచ్చింది.. వివరాలు త్వరలోనే చెబుతాను. మంచి కథ, క్యారెక్టర్ ఉంటే ఓటీటీ ప్రాజెక్ట్స్ చేస్తాను. అవకాశం వస్తే సింగర్‌గాను నిరూపించుకోవాలని ఉంది'' అని చెప్పారు.

## హారర్ డ్రామా

● గోర్ధన్ సింగ్

రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'డేంజరస్' సినిమా ద్వారా 2022లో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు గోర్ధన్ సింగ్. ఆ సినిమాలో చేసిన కుకీ పాత్ర ఆయనకి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆయన 'మా ఊరి బావి' అనే తెలుగు సినిమాలో ప్రధాన విలన్ పాత్రలో కనిపించనున్నారు. శశాంక్ దర్శకత్వంలో ప్రమోద్ కులకర్ణి ఈ మూవీ నిర్మిస్తున్నారు. ''హారర్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది. అదేవిధంగా 'దుల్హనియాన్ లే ఆయేగి' అనే హిందీ చిత్రంలో మహేష్ మంజ్రేకర్, పీయూష్ మిశ్రా, ఓంకార్ కపూర్లతో కలిసి నటించాను'' అని గోర్ధన్ సింగ్ తెలిపారు.

## స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| | |
|---|---|
| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
| 650 | 212 |
| 83,277 | 25,683 |

**విదేశీ సూచీలు**

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 22,547 | ▽ | 50 |
| డోజోన్స్ | 49,501 | ▲ | 49 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 10,475 | ▲ | 28 |
| డాక్స్ | 24,856 | ▲ | 59 |
| షాంఘై (శుక్రవారం ముగింపు) | 4,082 | ▽ | 52 |
| నికాయ్ | 56,806 | ▽ | 136 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 88.80 | 91.81 |
| £ | బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 121.18 | 125.55 |
| € | యూరో | థామస్‌కుక్ | 105.38 | 109.41 |
| ¥ | జపాన్ యెన్ (100) | థామస్‌కుక్ | 48.00 | 61.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 61.73 | 65.63 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 69.47 | 73.23 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 23.27 | 24.78 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 23.79 | 25.05 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 12.24 | 14.07 |

# కొండ దిగిన వెండి

- రూ. 2.5 లక్షలకు తగ్గిన ధర
- రూ. 700 పెరిగిన బంగారం

**న్యూఢిల్లీ:** వెండి మరో 2 శాతం నష్టపోగా.. బంగారం స్వల్పంగా లాభపడింది. ఢిల్లీ మార్కెట్లో సోమవారం కిలో వెండి ధర రూ.5,000 నష్టపోయి రూ.2.5 లక్షలకు (పన్నులు సహా) దిగొచ్చింది. బంగారం 10 గ్రాములకు రూ.700 లాభపడి రూ.1,59,200 స్థాయికి చేరింది. ''వెండి గత వారం ర్యాలీ చేయడంతో.. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపించారు. అయితే కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, పెట్టుబడి సాధనంగా డిమాండ్, బలహీన డాలర్ వెండి మరింత నష్టపోకుండా మద్దతిచ్చాయి''అని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరంగ్‌గార్గ్ పేర్కొన్నారు. విదేశీ మార్కెట్లో వెండి స్పాట్ ధర ఔన్స్‌కు 1% తగ్గి 76.94 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్స్‌కు 40 డాలర్లు నష్టపోయి 5,003 డాలర్లకు చేరింది.

# రివర్స్ ర్యాలీ

- సెన్సెక్స్ 650 పాయింట్లు జంప్
- నిఫ్టీ 212 పాయింట్లు అప్
- బ్యాంకులు, విద్యుత్ షేర్లకు డిమాండ్

**ముంబై:** బ్యాంకులు, విద్యుత్, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం దాదాపు 1% మేరకు లాభపడింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 650 పాయింట్లు పెరిగి 83,277 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 212 పాయింట్లు బలపడి 25,683 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. వెంటనే తేరుకొని లాభాల్లోకి మళ్లాయి. ట్రేడింగ్ ఆద్యంతం స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 706 పాయింట్లు బలపడి 83,277 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 226 పాయింట్లు దూసుకెళ్లి 25,697 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. డిసెంబర్ క్వార్టర్‌లో రుణ వృద్ధి, ఆస్తుల నాణ్యత మెరుగుపడటంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు డిమాండ్ లభించింది. భారత విద్యుత్ డిమాండ్ జనవరిలో 16 ఏళ్ల గరిష్టానికి చేరుకోవడంతో విద్యుత్ రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

➤ కన్జూమర్ డి్స్క్రెషనరీ, ఆటో షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ రంగాల వారీగా ఇండెక్సుల్లో విద్యుత్ 2.40%, వినిమయ 2.15%, పీఎస్‌యూ బ్యాంక్స్ 1.65%, రియల్టీ 1.44% బ్యాంకెక్స్ 1.20%, ఇంధనం 1.13%, క్యాపిటల్ గూడ్స్ 1.05%, ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ 1.04% రాణించాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.95% పెరిగింది. స్మాల్ క్యాప్ సూచీ 0.16% నష్టపోయింది.

➤ స్టాక్ మార్కెట్ దాదాపు ఒక శాతం రాణించడంతో ఒక్క రోజే రూ.3.11 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.468.58 లక్షల కోట్లకు చేరింది.

**లిస్టింగ్ నిరాశ**

➤ ఏఐ సొల్యూషన్స్ సేవల సంస్థ ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేరు లిస్టింగ్‌లో తేలిపోయింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.900 వద్దే లిస్టయ్యింది. ఇంట్రాడేలో 7.50% పతనమై రూ.832 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టంతో రూ.847 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 14,572 కోట్లుగా నమోదైంది.

➤ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ ఆయ్ ఫైనాన్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.129 వద్దే లిస్టయ్యింది. ఇంట్రాడేలో 4% లాభపడి రూ.134 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 0.16% స్వల్ప నష్టంతో రూ.128.80 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,181 కోట్లుగా నమోదైంది.

## క్యూ1లో విరూపాక్ష ఆర్గానిక్స్ ఐపీవో

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** సెబీ ఆమోదం లభించడంతో వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఐపీవో ఉంటుందని ఔషధ రంగ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్ ఎండీ చంద్రమౌళీశ్వర్ రెడ్డి గంగవరం తెలిపారు. ఈలోగా రోడ్‌షోలు ఉండగలవని చెప్పారు. ఇష్యూ పూర్తిగా తాజా షేర్ల జారీ రూపంలోనే ఉంటుందని వివరించారు. ఆఫర్ పరిమాణం రూ. 740 కోట్లుగా ఉండనుంది. ఇందులో రూ. 360 కోట్లను ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు, మిగతా మొత్తాన్ని రుణాల చెల్లింపు, కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనుంది. హైదరాబాద్‌లో 4, కర్ణాటకలో 2 కలిపి మొత్తం 6 తయారీ ప్లాంట్లున్నాయి. స్మాల్ మాలిక్యూల్ ఏపీఐలు, ఇంటర్మీడియెట్స్ మొదలైన ఉత్పత్తులను అందిస్తోంది. 2025 మార్చి 31 నాటికి కంపెనీ పోర్ట్‌ఫోలియోలో 54 ఉత్పత్తులు ఉండగా, 2024–25లో రూ. 811 కోట్ల ఆదాయం, రూ. 78 కోట్ల లాభం నమోదు చేసింది.

# వంటింటిపై ధరల దాడి రెట్టింపైన ఖర్చుల వేడి

- జనవరిలో 1.81 శాతానికి చేరిన టోకు ధరల ద్రవ్యోల్బణం
- కేవలం నెల వ్యవధిలోనే రెట్టింపు స్థాయికి చేరిన సూచీ
- భగ్గుమన్న లోహాలు, వస్త్రాలు, ఆహార ఉత్పత్తుల ధరలు

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో ధరల పెరుగుదల మళ్లీ ఆందోళన రేకెత్తిస్తోంది. గడచిన కొన్ని నెలలుగా కాస్త శాంతించినట్లు కనిపించిన టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) కొత్త ఏడాది ఆరంభంలోనే సామాన్యుడికి షాక్ ఇచ్చింది. 2026 జనవరి నెలకు టోకు ద్రవ్యోల్బణం రేటు ఏకంగా 1.81 శాతానికి ఎగబాకింది. డిసెంబర్ 2025లో ఇది కేవలం 0.83 శాతంగా ఉండగా.. ఒక్క నెల వ్యవధిలోనే 1% పెరగడం గమనార్హం. నవంబర్‌లో మైనస్‌లో ఉన్న ద్రవ్యోల్బణం, ఇప్పుడు వేగంగా పెరుగుతుండటం ఆర్థిక వర్గాలను సైతం కలవరపెడుతోంది. సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ మేరకు అధికారిక గణాంకాలను విడుదల చేసింది. తయారీ రంగం, ఆహార పదార్థాల ధరలు పెరగడమే ఈ ద్రవ్యోల్బణం పెరుగుదలకు ప్రధాన కారణమని కేంద్రం పేర్కొంది.

**ఎందుకింతలా పెరిగింది?**

ప్రధానంగా తయారీ రంగంలో ధరల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. గతేడాది జనవరితో పోల్చితే ఈసారి 'బేసిక్ మెటల్స్' (లోహాలు), టెక్స్‌టైల్స్ (వస్త్రాలు), రసాయనాలు, మోటారు వాహనాలు, యంత్ర పరికరాల ధరలు ప్రియమయ్యాయి. ఫ్యాక్టరీ గేటు వద్దే ధరలు పెరగడంతో, అది అంతిమంగా వినియోగదారుడిపై భారం మోపే అవకాశముంది. అలాగే ఆహారేతర వస్తువులు, ఆహార పదార్థాల ధరలు కూడా పెరగడంతో ద్రవ్యోల్బణం సూచీ పైకి ఎగసింది.

**రంగాలవారీగా పరిస్థితి ఇలా..**



టోకు ధరల సూచీలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం విభాగంలో ద్రవ్యోల్బణం 2.86 శాతానికి చేరింది. ప్రధానంగా లోహాలు, వస్త్రాలు, రబ్బరు, ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ ఖర్చులు పెరగడం ఇందుకు కారణం. ఆహార పదార్థాలు, ఖనిజాలు ఉండే ప్రాథమిక వస్తువులు విభాగంలో ద్రవ్యోల్బణం 2.21 శాతంగా నమోదైంది. డిసెంబర్‌తో పోల్చితే (3.12%) ఇది కాస్త తగ్గినప్పటికీ, ఇప్పటికీ ధరలు ఎగువ స్థాయిలోనే ఉన్నాయి. సామాన్యుడికి నేరుగా సంబంధమున్న ఆహార ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో సున్నా (0.00%) వద్ద ఉండగా, జనవరి నాటికి 1.41 శాతానికి పెరిగింది. పప్పుధాన్యాలు, గోధుమలు, పండ్లు, కూరగాయల ధరల్లో కదలికలు ఇందుకు కారణమయ్యాయి. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, విద్యుత్ వంటి అంశాలున్న ఇంధనం, విద్యుత్ విభాగం మాత్రం ప్రజలకు కాస్త ఊరటనిచ్చింది. ఇందులో ద్రవ్యోల్బణం –4.01 శాతం (మైనస్)గా నమోదైంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల్లో మార్పులు దీనికి కారణమని భావిస్తున్నారు.

**గత మూడు నెలల ట్రెండ్..**

టోకు ధరల సూచీ గమనాన్ని గమనిస్తే.. స్పష్టమైన పెరుగుదల కనిపిస్తోంది.

**నవంబర్ 2025:** –0.13% (ధరల తగ్గుదల)
**డిసెంబర్ 2025:** 0.83% (స్వల్ప పెరుగుదల)
**జనవరి 2026:** 1.81% (భారీ పెరుగుదల)

నవంబర్, డిసెంబర్ 2025 నెలలకు సంబంధించిన తుది గణాంకాలను కేంద్రం సవరించింది. నవంబర్ రేటును –0.13 శాతంగా ఖరారు చేసింది. మొత్తం మీద టోకు ధరల పెరుగుదల ప్రభావం రానున్న రోజుల్లో చిల్లర ధరలపై పడే అవకాశం లేకపోలేదు.

## ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ నుంచి రూ. 2,000 కోట్ల బాండ్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ నాన్–కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ. 2,000 కోట్ల వరకు సమీకరించనుంది. రూ. 1,500 కోట్ల వరకు ఓవర్–సబ్‌స్క్రిప్షన్‌ని అట్టే పెట్టుకునేలా గ్రీన్ షూ ఆప్షన్‌తో ఇష్యూ పరిమాణం రూ. 500 కోట్లుగా ఉంటుందని ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ జోనల్ హెడ్ శ్రీకాంత్ రేమల, అసోసియేట్ డైరెక్టర్ పి. మనోహర్ సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఫిబ్రవరి 17న ఇష్యూ ప్రారంభమై మార్చి 4న ముగుస్తుందని చెప్పారు. కాలావధిని బట్టి వార్షికంగా 9 శాతం వరకు ఈల్డ్ ఉంటుందని వివరించారు.

## క్వాలిటీ వాల్స్.. వీక్ లిస్టింగ్

**26 శాతం డిస్కౌంట్‌లో షురూ**

**న్యూఢిల్లీ:** ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన క్వాలిటీ వాల్స్ ఇండియా(కేడబ్ల్యూఐఎల్) స్టాక్స్ ఎక్స్ఛేంజీలలో డిస్కౌంట్ ధరలో లిస్టయ్యింది. సంకేత ధర రూ. 40.20కాగా.. ఎన్‌ఎస్ఈలో 26 శాతం తక్కువగా రూ. 29.80 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. బీఎస్ఈలోనూ రూ. 38.15 సంకేత ధరతో పోలిస్తే 22 శాతం క్షీణతతో రూ. 29.90 వద్ద లిస్టయ్యింది. చివరికి ఎన్‌ఎస్ఈలో రూ. 29.20 వద్ద, బీఎస్ఈలో రూ. 29.50 వద్ద నిలిచింది. వెరసి కంపెనీ మార్కెట్ విలువ రూ. 6,900 కోట్లకు(అటూ ఇటుగా) చేరింది. కార్నెటో, మేగ్నమ్, ట్విస్టర్ బ్రాండ్ల ఐస్‌క్రీమ్ బిజినెస్‌ను హెచ్‌యూఎల్ ప్రత్యేక కంపెనీగా విడదీసి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేసేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎన్‌సీఎల్‌టీ ఇందుకు ఆమోదించడంతో 2025 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

# వాణిజ్య లోటు సెగ

- బంగారం దిగుమతులు 349% అప్
- ఎగుమతులు 36.56 బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:** పసిడి, వెండి దిగుమతులు దేశ వాణిజ్య ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. జనవరిలో వస్తు ఎగుమతులు 0.61 శాతం పుంజుకుని 36.56 బిలియన్ డాలర్లకు చేరాయి. కానీ, దిగుమతులు 19.2 శాతం ఎగసి 71.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం, వెండి దిగుమతులు గణనీయంగా పెరగడమే ఈ పరిస్థితికి కారణం. ఫలితంగా వాణిజ్య లోటు మూడు నెలల గరిష్ట స్థాయిలో 34.68 బిలియన్ డాలర్లకు చేరింది. టారిఫ్‌ల కారణంగా జనవరిలో అమెరికాకు మన దేశ వస్తు ఎగుమతులు తగ్గాయి. క్రితం ఏడాది జనవరితో పోల్చితే 21.77 శాతం తగ్గి 6.6 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

➜ బంగారం దిగుమతులు జనవరిలో 349 శాతం పెరిగి 12 బిలియన్ డాలర్లుకాగా, వెండి దిగుమతులు సైతం 127 శాతం జంప్‌చేసి 2 బిలియన్ డాలర్లకు చేరాయి.

➜ చమురు దిగుమతులు మాత్రం 0.24 శాతం తగ్గి 13.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

➜ ప్రస్తుత ఏడాది (2025–26) ఏప్రిల్ నుంచి జనవరి వరకు వస్తు ఎగుమతులు 2.22 శాతం పెరిగి 366.63 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ కాలంలో దిగుమతులు 7 శాతానికి పైగా పెరిగి 649.86 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దీంతో వాణిజ్య లోటు మొదటి పది నెలల్లో 247.38 బిలియన్ డాలర్లకు చేరింది.

➜ జనవరిలో సేవల ఎగుమతులు 43.90 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2025 జనవరిలో ఇవి 34.75 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. సేవల దిగుమతులు 19.60 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి.

➜ ఏప్రిల్–జనవరి మధ్య వస్తు, సేవల ఎగుమతులు కలసి 720.76 బిలియన్ డాలర్లకు పెరిగాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 679 బిలియన్ డాలర్లు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

రూ.215 లక్షల కోట్లకు రిటైల్ మార్కెట్ | జేఎస్‌డబ్ల్యూ ఎంజీ నుంచి 'మెజెస్టర్' ఎస్‌యూవీ

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: భౌతిక శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ భూగోళ శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

# అటవీ రక్షకుడు.. ఐఎఫ్‌ఎస్

**ఐఎఫ్‌ఎస్.. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్. దేశంలోని అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెన్ సర్వీస్) తర్వాత అంత ప్రాముఖ్యం ఉన్న సర్వీస్‌గా గుర్తింపు పొందింది. ఈ సర్వీస్‌లో చేరిన వారు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించి.. ప్రిన్సిపుల్ చీఫ్ కన్జర్వేటర్ స్థాయికి చేరుకోవచ్చు. సివిల్స్ అభ్యర్థుల్లో సైన్స్, టెక్ గ్రాడ్యుయేట్లు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. తాజాగా ఐఎఫ్‌ఎస్-2026 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఎఫ్‌ఎస్ 2026 వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర సమాచారం..**

» ఐఎఫ్‌ఎస్–2026 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మొత్తం 80 పోస్టలతో యూపీఎస్సీ నోటిఫికేషన్
» సైన్స్, టెక్ గ్రాడ్యుయేట్లకు సదవకాశం
» సివిల్స్ ప్రిలిమ్స్‌నే ఐఎఫ్‌ఎస్ ప్రిలిమ్స్

### మొత్తం ఖాళీలు 80

ఐఎఫ్‌ఎస్–2026 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 80 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. – ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ.

### అర్హత

యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల్లో కనీసం ఒక సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా అగ్రికల్చర్/ ఫారెస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ (లేదా) ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

### వయసు

ఆగస్ట్ 1, 2026 నాటికి 21 – 32 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో మూడేళ్ల సడలింపు లభిస్తుంది

### అటెంప్ట్‌ల పరిమితి

జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఆరు సార్లు, ఓబీసీ అభ్యర్థులు తొమ్మిది సార్లు ఐఎఫ్ఎస్ పరీక్షకు హాజరు కావొచ్చు. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు అటెంప్ట్‌ల విషయంలో ఎలాంటి పరిమితి లేదు. వయోపరిమతి ముగిసేలోపు ఎన్నిసార్లయినా పరీక్షకు హాజరు కావచ్చు.

### సివిల్స్ ప్రిలిమ్స్‌నే ఐఎఫ్‌ఎస్ ప్రిలిమ్స్‌గా

మూడు దశలుగా ఉండే ఐఎఫ్ఎస్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ పిలిమినరీ పరీక్ష. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షనే ఐఎఫ్ఎస్ ప్రిలిమినరీగా యూపీఎస్సీ పేర్కొంది. అంటే ఐఎఫ్ఎస్ అభ్యర్థులు ముందుగా సివిల్స్ ప్రిలిమ్స్‌కు హాజరై అర్హత సాధించాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్ తర్వాత ఐఎఫ్ఎస్ కు ప్రత్యేకంగా మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు.

### ప్రిలిమినరీ పరీక్ష

ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి.. జనరల్ స్టడీస్ పేపర్–1, జనరల్ స్టడీస్ పేపర్–2 (సీ–శాట్). ఒక్కో పేపర్‌కు 200 మార్కులు చొప్పున మొత్తం నాలుగు వందల మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిస్తారు.

### మెయిన్‌లో ఆరు పేపర్లు

- ప్రిలిమినరీలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఐఎఫ్ఎస్ రెండో దశలో నిర్వహించే పరీక్ష మెయిన్ ఎగ్జామినేషన్. ప్రిలిమ్స్ దరఖాస్తు సమయంలో ఐఎఫ్ఎస్ అభ్యర్థుల సంఖ్యను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని.. ఒక్కో పోస్ట్‌కు 12 లేదా 13 మందిని ఐఎఫ్ఎస్ మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. ప్రిలిమ్స్‌లో అభ్యర్థులు రెండో పేపర్‌లో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఐఎఫ్ఎస్ మెయిన్‌ను ఆరు పేపర్లలో పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఈ ఆరు పేపర్లలో రెండు పేపర్లు ఉమ్మడి పేపర్లుగా, మిగిలిన నాలుగు పేపర్లను ఆప్షనల్ సబ్జెక్టులకు సంబంధించిన పేపర్లుగా నిర్వహిస్తారు.
- పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 300 మార్కులకు, పేపర్–2 జనరల్ నాలెడ్జ్ 300 మార్కులకు, పేపర్–3 ఆప్షనల్ సబ్జెక్ట్–1 పేపర్–1, 200 మార్కులకు; పేపర్–4 ఆప్షనల్ సబ్జెక్ట్–1 పేపర్ –2, 200 మార్కులకు; పేపర్–5 ఆప్షనల్ సబ్జెక్ట్ –2 పేపర్–1, 200 మార్కులకు; పేపర్–6 ఆప్షనల్ సబ్జెక్ట్–2 పేపర్–2, 200 మార్కులకు ఉంటాయి. ఇలా మెయిన్ ఎగ్జామ్ మొత్తం 1400 మార్కులకు జరుగుతుంది.

### ఆప్షనల్ సబ్జెక్ట్స్ ఎంపిక

- ఐఎఫ్ఎస్ మెయిన్ ఎగ్జామినేషన్‌లో అభ్యర్థులు రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవాలనే నిబంధన ఉంది. యూపీఎస్సీ నిర్దిష్టంగా ఆప్షనల్ సబ్జెక్ట్‌ల జాబితాను రూపొందించింది. అవి.. అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ.
- అయితే.. ఇలా రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లను ఎంచుకునే క్రమంలో ఒకే తరహాలో ఉన్న రెండు సబ్జెక్ట్‌లను ఆప్షనల్‌గా ఎంచుకోకూడదని యూపీఎస్సీ స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో కొన్ని కాంబినేషన్లకు అనుమతి లేదు. ఇలా అనుమతి లేని ఆప్షనల్ కాంబినేషన్ సబ్జెక్ట్‌ల వివరాలు..
- అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్; అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ
- కెమిస్ట్రీ అండ్ కెమికల్ ఇంజనీరింగ్; మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్. ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఏదైనా ఒక ఇంజనీరింగ్ బ్రాంచ్‌ను మాత్రమే ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవాలి. మరో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా యూపీఎస్సీ నిర్దేశించిన నాన్–ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల నుంచి ఎంచుకోవాలి.

### చివరగా పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ

అభ్యర్థులు మెయిన్ ఎగ్జామినేషన్‌లో పొందిన మార్కులు, అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ తర్వాత 1:2 (ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు చొప్పున) నిష్పత్తిలో పర్సనాలిటీ టెస్ట్ పేరుతో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులు, మెయిన్ ఎగ్జామినేషన్‌లో పొందిన మార్కులను కలిపి తుది విజేతలను ప్రకటిస్తారు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2026, ఫిబ్రవరి 24
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2026, మే 24
- **మెయిన్ ఎగ్జామినేషన్:** 2026, నవంబర్ 22 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **మెయిన్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

## విజయం సాధించాలంటే

### ప్రిలిమ్స్ నుంచే పకడ్బందీగా

అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్ష సన్నద్ధత నుంచే పకడ్బందీగా వ్యవహరించాలి. ముందుగా సిలబస్‌ను పరిశీలించి స్పష్టత తెచ్చుకోవాలి. ఆ తర్వాత గత ప్రశ్న పత్రాల పరిశీలన ద్వారా ఏఏ అంశాలకు ఎంత వెయిటేజీ ఉంటోంది? పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు? ప్రశ్నలు అడిగే తీరు ఎలా ఉంది?తదితర అంశాలపై అవగాహన లభిస్తుంది.

### కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక ఫోకస్

గత కొన్నేళ్ల ప్రిలిమ్స్ పేపర్ల సరళిని పరిగణనలోకి తీసుకుంటే.. కరెంట్ అఫైర్స్ సంబంధిత అంశాలు, అదే విధంగా కోర్ అంశాలను సైతం సమకాలీన పరిణామాలతో కలిపి ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభ్యసనం సాగించాలి.

### జీకే

మెయిన్‌లో పేపర్–2గా జనరల్ నాలెడ్జ్ ఉంటుంది. అభ్యర్థులు ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్ పేపర్–1ను మెయిన్స్ జనరల్ నాలెడ్జ్ పేపర్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. తద్వారా రెండు పేపర్లకు ఒకే సమయంలో సన్నద్ధత పూర్తి చేసుకోవచ్చు.

### మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు

ఐఎఫ్ఎస్ అభ్యర్థులు మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి. వాటి ఫలితాలను విశ్లేషించుకుని స్వీయ బలాలు, బలహీనతలను తెలుసుకోవాలి. వాటి ఆధారంగా తాము ఇంకా పదును పెట్టుకోవాల్సిన అంశాలపై ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి.

### ప్రిలిమ్స్ పేపర్-2

ఇది అర్హత పరీక్షే కానీ.. ఇందులో 33 శాతం మార్కులు పొందితేనే మిగతా పేపర్ల మూల్యాంకన చేస్తారు. ఇందుకోసం బేసిక్ మ్యాథమెటిక్స్, న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై పట్టు సాధించాలి.

### మెయిన్స్‌కు ప్రత్యేకంగా

మెయిన్స్‌కు అభ్యర్థులు మరింత ప్రత్యేకంగా ప్రిపరేషన్ సాగించాలి. జనరల్ నాలెడ్జ్‌లో హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్ట్‌లు మొదలు సమకాలీన సమస్యల వరకు ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ప్రస్తుత వాస్తవ పరిస్థితుల్లో సంబంధిత విభాగాల్లో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

### ఆప్షనల్స్‌లో స్కోర్ కోసం

మెయిన్ ఎగ్జామినేషన్‌లో రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లు, ఒక్కో సబ్జెక్ట్‌లో రెండు పేపర్లు చొప్పున మొత్తం నాలుగు పేపర్లకు సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. కాబట్టి ఆప్షనల్ ఎంపికలో స్పష్టమైన అవగాహనతో వ్యవహరించాలి. తమకు బాగా పట్టున్న సబ్జెక్ట్‌లనే ఎంచుకోవాలి. ఆప్షనల్స్‌ను ఎంచుకున్నాక ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్స్, కాన్సెప్ట్స్, ఫార్ములాస్, థీరమ్స్ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. వాటిని ప్రాక్టికల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆప్షనల్ సబ్జెక్ట్ ఎంపికలో కాంబినేషన్ల నిబంధన ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఒక ఆప్షనల్‌ను తమ డొమైన్ సబ్జెక్ట్ నుంచి ఎంచుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. రెండో ఆప్షనల్ విషయంలో సిలబస్‌ను పరిశీలించి తాము రాణించగలం అనుకున్న సబ్జెక్ట్‌ను ఎంచుకోవడం మేలు చేస్తుంది.

### రైటింగ్‌కూ ప్రాధాన్యం

మెయిన్స్ ఎగ్జామినేషన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు రీడింగ్‌కే పరిమితం కాకుండా, రైటింగ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్ష సమయంలో ఒక ప్రశ్నకు లభించే సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ప్రాక్టీస్ చేయాలి. ఆప్షనల్ సబ్జెక్టులు కోర్ సబ్జెక్టులు కాబట్టి వీటిపై పూర్తి పట్టు సాధించడం తప్పనిసరి. బేసిక్స్‌పై పట్టు, గత పేపర్ల సాధన చేయాలి.

### నిర్దిష్ట ప్రణాళిక

ఐఎఫ్ఎస్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో అన్ని సబ్జెక్ట్‌లకు సమయం కేటాయించేలా టైంప్లాన్ రూపొందించుకోవాలి. కనీసం రోజుకు పది గంటలు చదివేలా సమయ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అదే విధంగా ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దిష్టంగా సమయం కేటాయించుకొని.. ఆ సమయంలో ఆ సబ్జెక్ట్‌నే చదవాలి. ఆ తర్వాత మరో సబ్జెక్ట్‌వైపు దృష్టి పెట్టాలి. ఇలా ప్రిలిమ్స్ నుంచే నిర్దిష్ట వ్యూహాలు అనుసరిస్తూ అభ్యసనం సాగించడం వల్ల ఆశాజనక ఫలితం వచ్చే అవకాశం ఉంది.

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు నాన్-కంబాటెంట్ పోస్టులు

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నాన్–కంబాటెంట్(ఇన్‌టేక్ 02/2026) నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌ఫోర్స్ కేంద్రాలలో హాస్పిటాలిటీ అండ్ హౌస్‌కీపింగ్ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అభ్యర్థులు మెట్రిక్యులేషన్/పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణులై ఉండాలి. కేవలం అవివాహిత పురుషులు మాత్రమే అర్హులు. ఎత్తు కనీసం 152 సెం.మీ ఉండాలి.
» **వయసు:** 21 ఏళ్లు మించకూడదు. 02.07.2005 నుంచి 02.01.2009 మధ్య జన్మించి ఉండాలి.
» **వేతనం:** మొదటి ఏడాది నెలకు రూ.30,000 +ఇతర అలవెన్సులు.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల పరిశీలన, రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్ష, ఎస్ఎస్‌టీ, వైద్య పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 23.02.2026.
» **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

### ఐవోసీఎల్‌లో 637 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) పానిపట్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ వివిధ విభాగాల్లో ట్రేడ్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 637.
» **విభాగాలు:** కెమికల్ ప్లాంట్, ఫిట్టర్, కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, అకౌంట్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఎస్సీ/బీఏ/బీకాం/బీఈ/బీటెక్/ఎంబీఏ/సీఏ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.01.2026 నాటికి 18 ఏళ్ల నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 07.02.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.02.2026
» **వెబ్‌సైట్:** https://iocl.com

## పోరాడి ఓడిన కరణ్ సింగ్

ఢిల్లీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత క్రీడాకారుడు కరణ్ సింగ్‌కు నిరాశ ఎదురైంది. 'వైల్డ్ కార్డు'తో నేరుగా సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో బరిలోకి దిగిన కరణ్ ఈ అడ్డంకిని దాటలేకపోయాడు. ఢిల్లీ లాన్ టెన్నిస్ సంఘం (డీఎల్‌టీఏ) కాంప్లెక్స్‌లో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 436వ ర్యాంకర్ కరణ్ సింగ్ 6–4, 6–7 (5/7), 3–6తో ప్రపంచ 260వ ర్యాంకర్ డేనియల్ మైకెల్‌స్కీ (పోలాండ్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. 2 గంటల 28 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కరణ్ ఏడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. రామ్‌కుమార్ రామనాథన్ 2–6, 2–6తో హ్యోయెన్ చుంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోగా... మనీశ్ సురేశ్ కుమార్ 6–3, 7–5తో యసుంగ్ పార్క్ (దక్షిణ కొరియా)పై గెలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు. మెయిన్ 'డ్రా'లో భారత్ నుంచి సుమిత్ నగాల్, దిగ్విజయ్ ప్రతాప్ సింగ్, మానస్ ధామ్నె బరిలో ఉన్నారు.

# ఇంగ్లండ్ దర్జాగా...

- 'సూపర్–8'కు అర్హత సాధించిన మాజీ చాంపియన్
- ఇటలీపై 24 పరుగుల తేడాతో గెలుపు
- విల్ జాక్స్ ధనాధన్ ఫిఫ్టీ

విల్ జాక్స్

**కోల్‌కతా:** టి20 ప్రపంచకప్‌లో తదుపరి దశకు అర్హత పొందాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ మెరిపించింది. తొలిసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఇటలీ జట్టు కడదాకా పోరాడింది. చివరకు మాజీ చాంపియన్ చేతిలో 24 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ గెలుపుతో గ్రూప్ 'సి' నుంచి ఇప్పటికే 'సూపర్–8'కు చేరిన వెస్టిండీస్ సరసన ఇంగ్లండ్ చేరింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హ్యారీ బ్రూక్ బృందం నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్ (15 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు మెరిపించినా... బట్లర్ (3) మళ్లీ నిరాశపరిచాడు. ఈ మెగా ఈవెంట్‌లో నాలుగో మ్యాచ్ ఆడిన బట్లర్ ఇప్పటివరకు కనీసం మూడు పదుల స్కోరైనా చేయలేకపోయాడు. జాకబ్ బెథెల్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), బాంటన్ (30; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ బ్రూక్ (14), స్యామ్ కరన్ (25; 2 సిక్స్‌లు) ఇలా టాప్–6 బ్యాటర్లు ఇటలీ బౌలింగ్‌కు ఇబ్బంది పడితే... ఏడో వరుస బ్యాటర్ విల్ జాక్స్ (22 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ సిక్స్‌లతో తేలికపడింది. అతను 21 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. జాక్స్ మెరుపుల వల్లే ఇంగ్లండ్ 200 పైచిలుకు స్కోరు చేసింది. గ్రాంట్ స్టీవార్ట్, కలుగమగే చెరో 2 వికెట్లు తీశారు.

**'సిక్స్'ల పిడుగు మనెంటి**

కొండంత లక్ష్యం ఎదురైనా... టాప్–3 బ్యాటర్లలో ఆంథోని మోస్కా (0), స్మట్స్ (0) డకౌటైనా... ఇటలీ ఆందోళన చెందలేదు. పోరాటం వీడలేదు. లక్ష్యఛేదన కోసం కడదాకా పోరాడి 20 ఓవర్లలో 178 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ జస్టిన్ మోస్కా (34 బంతుల్లో 43; 7 ఫోర్లు), బెన్ మనెంటి (25 బంతుల్లో 60; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగారు. జస్టిన్ బౌండరీలతో ధాటిగా ఆడితే... మనెంటి భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో బెన్ 22 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. దీంతో ఇటలీ 22/3 దయనీయ స్థితి నుంచి 114/4 స్కోరుతో రేసులో పడింది. స్వల్ప వ్యవధిలో ఇద్దరు అవుట్ కావడంతో లక్ష్యానికి దూరమైంది. అయినా సరే ఇటలీ ఆట ఆగిపోలేదు. గ్రాంట్ స్టీవార్ట్ (23 బంతుల్లో 45; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) సైతం ఇంగ్లండ్ శిబిరంపై విరుచుకుపడటంతో ప్రత్యర్థి జట్టు ఆఖరి బంతిదాకా చెమటోడ్చింది. కరన్, ఓవర్టన్ చెరో 3 వికెట్లు తీయగా... ఆర్చర్‌కు 2 వికెట్లు దక్కాయి.

**గ్రూప్ 'సి' టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| వెస్టిండీస్ | 3 | 3 | 0 | 6 | 1.820 |
| ఇంగ్లండ్ | 4 | 3 | 1 | 6 | 0.201 |
| స్కాట్లాండ్ | 3 | 1 | 2 | 2 | 0.359 |
| ఇటలీ | 3 | 1 | 2 | 2 | -0.588 |
| నేపాల్ | 3 | 0 | 3 | 0 | -1.942 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

**టి20 ప్రపంచకప్‌లో నేడు**

న్యూజిలాండ్ X కెనడా
వేదిక: చెన్నై; ఉ.గం. 11 నుంచి
ఐర్లాండ్ X జింబాబ్వే
వేదిక: పల్లెకెలె; మ.గం. 3 నుంచి
నేపాల్ X స్కాట్లాండ్
వేదిక: ముంబై; రాత్రి గం. 7 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

# 'శత'క్కొట్టిన నిసాంక

- 'హ్యాట్రిక్' గెలుపుతో 'సూపర్–8'కు శ్రీలంక
- 8 వికెట్లతో ఆస్ట్రేలియా పరాజయం
- జింబాబ్వే చేతిలో ఆసీస్ భవిత

**పల్లెకెలె:** పాథుమ్ నిసాంక (52 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) 'శతక' విధ్వంసంతో ఆస్ట్రేలియా గల్లంతైంది. ఈ టి20 ప్రపంచ కప్‌లో తొలి సెంచరీని ఆతిథ్య శ్రీలంక బ్యాటర్ నిసాంక అజేయంగా లిఖించాడు. దీంతో 'హ్యాట్రిక్' విజయాలతో లంక జట్టు 'సూపర్–8'కు అర్హత సాధించింది. కీలకమైన మ్యాచ్‌లో ఓటమి పాలైన ఆస్ట్రేలియా ముందుకెళ్లే అవకాశాల్ని క్లిష్టం చేసుకుంది. ఇప్పుడు జింబాబ్వే 'వరుస ఓటమి'లపైనే ఆసీస్ 'సూపర్–8' భవితవ్యం ఆధారపడింది. గ్రూప్ 'బి'లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో దాసున్ షనక నేతృత్వంలోని లంక 8 వికెట్ల తేడాతో ఆసీస్‌పై జయభేరి మోగించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు కెప్టెన్ మిచెల్ మార్ష్ (27 బంతుల్లో 54; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ట్రావిస్ హెడ్ (29 బంతుల్లో 56; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 104 పరుగులు జోడించారు. 8.2 ఓవర్ల వరకు వికెట్ కోల్పోలేదు. ఇంతవరకు జోరుగా సాగిన ఆసీస్ అనూహ్యంగా మిగతా 11.4 ఓవర్లలో మరో 77 పరుగులే చేసి 10 వికెట్లను కోల్పోయింది. ఇన్‌గ్లిస్ (27; 3 ఫోర్లు), మ్యాక్స్‌వెల్ (22; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండు పదుల స్కోర్లు చేశారు. మిగతా వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. మ్యాక్స్‌వెల్ రివర్స్ స్వీప్‌తో బౌండరీకి యత్నించగా... బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద నిసాంక కళ్లు చెదిరే క్యాచ్‌తో అబ్బురపరిచాడు. లంక బౌలర్లలో హేమంత 3, చమీర 2 వికెట్లు తీశాడు. అనంతరం లంక 18 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసి గెలిచింది. నిసాంక రెండో వికెట్‌కు కుశాల్ మెండిస్ (38 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్)తో 97 పరుగులు, తర్వాత పవన్ రత్నాయకే (28 నాటౌట్; 6 ఫోర్లు)తో అబేధ్యమైన మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించి జట్టును గెలిపించాడు. ఆస్ట్రేలియా తమ చివరి లీగ్ మ్యాచ్‌లో 20న ఒమన్ జట్టుతో ఆడుతుంది. ఆసీస్ కంటే ముందే జింబాబ్వే మిగిలిన రెండు మ్యాచ్‌లు (నేడు ఐర్లాండ్‌తో; 19న శ్రీలంకతో) ఆడుతుంది. ఈ రెండింటిలో జింబాబ్వే ఒక్కటి గెలిచినా 'సూపర్–8'కు అర్హత పొందుతుంది. ఒకవేళ జింబాబ్వే రెండింటిలో ఓడిపోయినా... రన్‌రేట్‌లో ఆస్ట్రేలియాకంటే మెరుగ్గా ఉంటేచాలు 'సూపర్–8' బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది.

**గ్రూప్ 'బి' టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| శ్రీలంక | 3 | 3 | 0 | 6 | 2.462 |
| జింబాబ్వే | 2 | 2 | 0 | 4 | 1.984 |
| ఆస్ట్రేలియా | 3 | 1 | 2 | 2 | 0.414 |
| ఐర్లాండ్ | 3 | 1 | 2 | 2 | 0.150 |
| ఒమన్ | 3 | 0 | 3 | 0 | -4.546 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఒమర్జాయ్

# గెలిచి నిలిచిన అఫ్గానిస్తాన్

- యూఏఈపై 5 వికెట్ల విజయం
- ఒమర్జాయ్ ఆల్‌రౌండ్ షో
- 700 వికెట్ల క్లబ్‌లో రషీద్ ఖాన్

**న్యూఢిల్లీ:** గ్రూప్‌లోని గట్టి ప్రత్యర్థులు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా చేతుల్లో ఓడిపోయిన అఫ్గానిస్తాన్ టి20 ప్రపంచకప్‌లో ఎట్టకేలకు మూడో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది. 'సూపర్–8' చేరే అవకాశాలను నిలబెట్టుకుంది. సోమవారం గ్రూప్ 'డి'లో జరిగిన మ్యాచ్‌లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (4 వికెట్లు; 21 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అఫ్గానిస్తాన్ 5 వికెట్ల తేడాతో యూఏఈపై గెలుపొందింది. మొదట యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. సోహైబ్ ఖాన్ (48 బంతుల్లో 68; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచేశాడు. అజ్మతుల్లా (4–0–15–4) నిప్పులు చెరిగే స్పెల్‌తో యూఏఈ బ్యాటర్లను కట్టడి చేశాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో అఫ్గానిస్తాన్ కెప్టెన్, లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ బౌలింగ్‌లో అర్యాన్ హిట్‌వికెట్‌గా వెనుదిరిగాడు. దాంతో టి20 క్రికెట్ చరిత్రలో 700 వికెట్లు సాధించిన తొలి బౌలర్‌గా రషీద్ ఖాన్ గుర్తింపు పొందాడు. అంతర్జాతీయ టి20ల్లోనూ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రషీద్ ఖానే (191) అగ్రస్థానంలో ఉన్నాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసి గెలిచింది. ఇబ్రహీం జద్రాన్ (41 బంతుల్లో 53; 6 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా రాణించారు. ఈ గ్రూప్‌లో దక్షిణాఫ్రికా ఆడిన మూడూ గెలిచి 6 పాయింట్లతో ఇప్పటికే 'సూపర్–8'కు చేరింది. రెండు మ్యాచ్‌లు నెగ్గిన న్యూజిలాండ్ 4 పాయింట్లతో అఫ్గానిస్తాన్ కంటే మెరుగైన స్థితిలో ఉంది. ఈరోజు కెనడాతో జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే అఫ్గానిస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. న్యూజిలాండ్ 'సూపర్–8'కు చేరుతుంది.

## పడిక్కల్ డబుల్ సెంచరీ

స్మరణ్ అజేయ శతకం ● కర్ణాటక 689/6

**లక్నో:** కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (232; 29 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీ... స్మరణ్ (121 బ్యాటింగ్; 11 ఫోర్లు) అజేయ శతకం... వెరసి ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో కర్ణాటక భారీ స్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 355/2తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక ఆట ముగిసే సమయానికి 180 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 689 పరుగులు సాధించింది. కరుణ్ నాయర్ (60; 8 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి పడిక్కల్ మూడో వికెట్‌కు 129 పరుగులు ... స్మరణ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 59 పరుగులు జత చేశాడు. శ్రేయస్ గోపాల్ (0) డకౌట్‌కాగా ... కృతిక్ కృష్ణ ( 60; 6 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి స్మరణ్ ఆరో వికెట్‌కు 123 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో స్మరణ్ కెరీర్‌లో ఐదో ఫస్ట్ క్లాస్ సెంచరీ సాధించాడు. కృతిక్ వెనుదిరిగాక ... విద్యాధర్ పాటిల్ (35 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్), స్మరణ్ మరో వికెట్ పడకుండా రెండో రోజు ఆటను ముగించారు.

**జమ్మూకశ్మీర్ 198/5**

పారస్ డోగ్రా

కల్యాణిలో బెంగాల్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ రెండో సెమీఫైనల్లో జమ్మూకశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 131 పరుగుల దూరంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 249/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 97.1 ఓవర్లలో 328 పరుగులకు ఆలౌటైంది. జమ్మూకశ్మీర్ బౌలర్లలో ఆకిబ్ నబీ 5 వికెట్లు, సునీల్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్మూకశ్మీర్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. కెప్టెన్ పారస్ డోగ్రా (58; 7 ఫోర్లు), అబ్దుల్ సమద్ (82; 12 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. పారస్ డోగ్రా వ్యక్తిగత స్కోరు 11 పరుగులకు చేరుకోగానే... వసీం జాఫర్ (ముంబై/విదర్భ; 156 మ్యాచ్‌ల్లో 12,038 పరుగులు) తర్వాత రంజీ ట్రోఫీ చరిత్రలో 10 వేల పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు.

# పాత ప్రణాళికలే.. కొత్తగా!

- ఏపీఈఆర్‌సీకి 2026–27 ప్రణాళికలు సమర్పించిన ట్రాన్స్‌కో, డిస్కంలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూపొందించిన ప్రణాళికలే బాబు సర్కారుకు దిక్కు
- ఆ ప్రకారమే 2026–27 నుంచి 2028–29 వరకు ప్రణాళికలకు ఆమోదం తెలపాలని విజ్ఞాపన

**ఉత్పత్తి మార్గాలవీ**

| వనరు | ఉత్పత్తి (మెగావాట్లలో) |
|---|---|
| ఏపీ జెన్‌కో | 8,789 |
| లోయర్ సీలేరు | 230 |
| పోలవరం 1–7 యూనిట్లు | 560 |
| పోలవరం 8–12 యూనిట్లు | 400 |
| అప్పర్ సీలేరు 1–8 యూనిట్లు | 1,200 |
| సెకీ | 3,000 |

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లతో పాటు ఏపీ ట్రాన్స్‌కో 2026–27 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ ప్రణాళికలను విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి సమర్పించాయి. 2024–25 నుంచి 2028–29 వరకూ (5వ నియంత్రణ కాలం), 2029–30 నుంచి 2033–34 (6వ నియంత్రణ కాలం) ఆర్థిక సంవత్సరానికి కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అంచనాలు తయారుచేసి ఏపీఈఆర్‌సీకి సమర్పించారు. 5వ నియంత్రణ కాలానికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఏపీఈఆర్‌సీ నుంచి అనుమతి లభించింది. ఇప్పుడు కూడా దాని ప్రకారమే 2026–27 నుంచి 2028–29 వరకు విద్యుత్ ప్రణాళికకు ఆమోదం తెలపాల్సిందిగా ఏపీఈఆర్‌సీని విద్యుత్ సంస్థలు కోరాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో రూపొందించిన ప్రణాళికలనే సమర్పించిన విద్యుత్ సంస్థలు టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలాంటి మార్పులు, కొత్తగా అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు లేకుండానే సమర్పించడం గమనార్హం. వీటిపై కొత్తగా అభిప్రాయాలు, అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 18వ తేదీతో గడువు ముగుస్తోంది. అనంతరం ఈనెల 25లోగా విద్యుత్ సంస్థలు.. ప్రజలు/సంస్థల నుంచి వచ్చిన అభ్యంతరాలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

**2024-25 నుంచి 2028-29 వరకు ఇదీ ప్రణాళిక**

| కేటగిరీ | ప్రస్తుత వినియోగం | 2028–29 నాటికి పెంచాల్సిన లక్ష్యం (మిలియన్ యూనిట్లలో) |
|---|---|---|
| గృహ విద్యుత్ | 17,330 | 31,374 |
| వాణిజ్య విద్యుత్ | 5,283 | 7,351 |
| వీధి దీపాలు | 315 | 392 |
| వాటర్ వర్క్స్ | 1,262 | 2,020 |
| ఇరిగేషన్ | 15,011 | 23,107 |
| చిన్న పరిశ్రమలు | 1,531 | 1,919 |
| భారీ పరిశ్రమలు | 20,173 | 32,877 |
| విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్లకు | 33 | 267 |
| రైల్వే శాఖ | 2,011 | 3,524 |
| ఎలక్ట్రిసిటీ రీసెల్లర్స్ | 1,165 | 1,473 |
| ఇతర అవసరాలు | 1,149 | 2,327 |
| అన్ని కేటగిరీలకూ కలిపి | 65,228 | 99,150 |
| సాంకేతిక, పంపిణీ నష్టాలతో కలిపి | – | 1,10,203 |



# దామోదరనాయుడికి చుక్కెదురు

**పశు సంవర్థక శాఖ డైరెక్టర్‌గా పునర్నియామకంపై హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు అమలు నిలుపుదలకు ధర్మాసనం నిరాకరణ**

**సాక్షి, అమరావతి:** పశు సంవర్థక శాఖ డైరెక్టర్‌గా తన నియామకాన్ని రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్న విశ్రాంత అధికారి టి.దామోదర నాయుడు అభ్యర్థనను హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి తీర్పును అమలు చేయాలని స్పష్టం చేసింది. పూర్తిస్థాయి వాదనలు వినకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని తేల్చి చెప్పింది. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ దామోదర నాయుడు దాఖలు చేసిన రెండు అప్పీళ్లతో పాటు ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను సైతం కలిపి విచారిస్తామంది. తదుపరి విచారణను ఈనెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. 'పదవీ విరమణ చేసిన అధికారి పునర్నియామకం వల్ల ఆ పోస్టుకు అర్హులైన అధికారులకు అన్యాయం చేసినట్లు అవుతుంది. అర్హతల ఆధారంగా పశు సంవర్థక శాఖ డైరెక్టర్‌గా నియమితులు కావాల్సిన అధికారులు నైతికస్థైర్యాన్ని కోల్పోతారు.' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# రూ. కోటి బీమా కాజేసేందుకు..

- ఓ యువకుడికి బీమా చేయించి, ఆపై హత్యాయత్నం
- తీవ్రంగా కొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం

**బూర్గంపాడు:** రూ.కోటి బీమా సొమ్ము కోసం ఇద్దరు వ్యక్తులు ఓ యువకుడిని హత్య చేసేందుకు పథక రచన చేశారు. తీవ్రంగా కొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈ ఘటన గత శనివారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోతె పట్టీనగర్ వద్ద జరిగింది. తాజాగా బాధితుడి బంధువుల కథనం ప్రకారం.. ఏపీలోని పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నవరానికి చెందిన కట్టా యశ్వంత్‌కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అదే గ్రామానికి చెందిన మేనమామ ములిశెట్టి శ్రీనివాసరావు సంరక్షణలో ఉన్నాడు. ఆరు నెలల క్రితం వరకు యశ్వంత్ సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేశాడు. అదే గ్రామానికి చెందిన కట్టా సాయిదీపక్‌తో ఆరునెలలుగా స్నేహం చేస్తూ అతని వ్యక్తిగత పనులకు సహాయకారిగా ఉంటున్నాడు. ఇదే సమయంలో భద్రాచలానికి చెందిన ఓ ప్రైవేట్ బ్యాంక్ ఇన్సూరెన్స్ సేల్స్ ఆఫీసర్ కొండ భానుప్రకాశ్ కూడా వీరితో జత కలిశాడు. భానుప్రకాశ్, యశ్వంత్ మధ్య బంధుత్వం కూడా ఉంది. వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాయిదీపక్, ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా ఉన్న భానుప్రకాశ్ కలిసి తల్లిదండ్రులు లేని యశ్వంత్ పేరిట బీమా చేయించి అతడ్ని హతమారిస్తే బీమా సొమ్ము దక్కించుకోవచ్చని ప్రణాళిక వేసుకున్నారు. కులాలు వేరైనా యశ్వంత్ ఇంటిపేరు, సాయిదీపక్ ఇంటి పేరు ఒకటే (కట్టా) కావడం వీరికి కలిసొచ్చింది. ఇందులో భాగంగా నాలుగు నెలల క్రితం యశ్వంత్ పేరిట ప్రీమియం చెల్లించి రూ.కోటి బీమా చేయించారు. ఇంటి పేరు ఒకటే కావడంతో కట్టా సాయిదీపక్‌ను సోదరుడిగా పేర్కొంటూ నామినీగా నమోదు చేయించారు.

**పరిహారం కాజేసేలా...**

పథకంలో భాగంగా శనివారం రాత్రి భద్రాచలంలో యశ్వంత్‌కు ఓ స్కూటీ ఇప్పించి మద్యం తీసుకుని సారపాకకు సమీపంలోని మోతె పట్టీనగర్‌కు రమ్మన్నారు. సాయిదీపక్, భానుప్రకాశ్ కారులో ముందుగా అక్కడికి చేరుకున్నారు. యశ్వంత్ వచ్చాక సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో రోడ్డు పక్కన మద్యం తాగి యశ్వంత్ తలపై తీవ్రంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం తీసుకెళ్లి రోడ్డుపై పడుకోబెట్టారు. కొంతదూరంలో ఆయన వేసుకొచ్చిన స్కూటీని పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పథకం వేశారు. అటుగా వస్తున్నవారు రక్తం మడుగులో ఉన్న యశ్వంత్‌ను గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. యశ్వంత్‌కు స్కూటీ ఎవరు ఇచ్చారని మేనమామ ప్రశ్నిస్తే తామే ఇచ్చామని సాయిదీపక్, భానుప్రకాశ్ చెప్పడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పథకం ప్రకారమే యశ్వంత్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించారని గుర్తించారు.

## క్లుప్తంగా...

### సౌదీలో ఉద్యోగాలు.. రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి: సౌదీ అరేబియాలో ఉద్యోగాల కోసం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని ఓఎంసీఏలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. సౌదీ అరేబియాలో కేబుల్ జాయింటర్, టెస్టింగ్–కమిషనింగ్ టెక్నీషియన్, మెకానికల్ టెక్నీషియన్, ప్లంబర్ ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.మనోహర్ సోమవారం తెలిపారు. 22 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఐటీఐ లేదా డిప్లొమా అర్హతతోపాటు సంబంధిత విభాగాల్లో తగిన అనుభవం, హిందీ, ఇంగ్లిష్ భాషలపై అవగాహన ఉండాలని తెలిపారు. ఉద్యోగం ఆధారంగా నెలకు రూ.28,000 నుంచి రూ.72,000 వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఇంటర్వ్యూకు హాజరయ్యేటప్పుడు బయోడేటా, విద్యార్హతలు, అనుభవం సర్టిఫికెట్లు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని, అభ్యర్థులు తమ వివరాలను https://naipunyam.-ap.gov.in/portalలో నమోదు చేసుకోవాలని సూచించారు.

### ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రచురణకు నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: గ్రేడ్–2 హెడ్ మాస్టర్స్, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా రూపకల్పన, ప్రచురణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 25న తొలి సీనియారిటీ జాబితా ప్రచురించాలని డీఈవోలను ఆదేశించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం మార్చి 5న రెండో సీనియారిటీ జాబితా, అదే నెల15న మూడో జాబితా, 30న తుది సీనియారిటీ జాబితా ఖరారు చేయాలని పేర్కొన్నారు. తుది జాబితా ఖరారైన తర్వాత పదోన్నతుల సమయంలో ఎలాంటి అభ్యంతరాలు వచ్చినా పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టంచేశారు.

# 2028లో చంద్రయాన్–4

**చంద్రయాన్-4 ల్యాండింగ్‌కు ఎంఎం-4 ప్రాంతాన్ని ఎంపిక చేసిన ఇస్రో**

**చంద్రుడిపై నుంచి మట్టినమూనాలు తీసుకొచ్చి అధ్యయనం చేసేందుకు ఏర్పాట్లు**

సూళ్లూరుపేట: చంద్రుడిపై పరిశోధనలను కొనసాగించే దిశగా భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వడివడిగా అడుగులు వేస్తోంది. చంద్రయాన్ సిరీస్‌లో చంద్రయాన్–3 ఇచ్చిన విజయంతో చంద్రయాన్–4 ప్రయోగానికి కార్యాచరణ ప్రారంభించింది. 2028లో చంద్రయాన్–4 ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఇస్రో.. చంద్రుడి దక్షిణ ధృవంపై వ్యోమనౌక లాండింగ్ ప్రాంతాన్ని ఇటీవల ఖరారు చేసింది. అక్కడి నుంచి మట్టి నమూనాలను భూమికి తీసుకురావడమే లక్ష్యంగా ఇస్రో చంద్రయాన్–4ను రూపొందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా దీనికి ఆమోదం తెలిపినట్టుగా శాస్త్రవేత్తలు చెప్పారు. చంద్రుడిపైకి ఇప్పటివరకు పంపిన మూడు మిషన్లకంటే చంద్రయాన్–4 ఎంతో సంక్లిష్టమైనదని తెలిపారు. 2023లో చంద్రయాన్–3 మిషన్‌ను జాబిల్లిపై దక్షిణ ధృవంలో విజయవంతంగా దించిన తరువాత చేపడుతున్న ప్రాజెక్టు ఇది. చంద్రుడి దక్షిణ ధృవం ప్రాంతంలో ల్యాండర్‌ను దించిన మొదటి దేశంగా భారత్ ఖ్యాతి దశదిశలా వ్యాపించింది. జాబిల్లిపై దక్షిణ ధృవం ప్రాంతంలో మాన్స్ మౌటన్ (ఎంఎం) వద్ద 1, 3, 4, 5 అనే నాలుగు ప్రాంతాలను ల్యాండింగ్ కోసం ఇస్రో పరిశీలించింది. ఇందులో ఎంఎం–4 ప్రాంతాన్ని ఎంపిక చేసింది. చంద్రుడి కక్ష్య (హాలో కక్ష్య)లో పరిభ్రమిస్తున్న చంద్రయాన్–2 ఆర్బిటర్ మిషన్‌లో ఉన్న హై రిజల్యూషన్ కెమెరా అందించిన ఫొటోలు, సైంటిఫిక్ డేటా ఆధారంగా ఈ ప్రదేశాన్ని ఎంపిక చేసినట్లు ఇస్రో తెలిపింది.

### ఏంటీ మాన్స్ మౌటన్ ప్రాంతం..



చంద్రయాన్-4 మిషన్ కోసం చంద్రుడిపై ఇస్రో ఎంపిక చేసిన మాన్స్ మౌటన్ ప్రాంతం ఇది

మాన్స్ మౌటన్ అనేది చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతానికి సమీపంలోని ఒక ఎత్తయిన పర్వత ప్రాంతం. ఈ ప్రాంతం చంద్రుడి పుట్టుకకు సంబంధించిన ఆధారాలను అందజేస్తుందని నమ్ముతున్నారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా నీడ ఉండి క్రేటర్లకు దగ్గరగా ఉంటుంది. అక్కడ ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉంటాయని, కోట్ల సంవత్సరాలుగా నీరు–మంచు నిక్షేపాలున్నాయని భావిస్తున్నారు. ఈ మంచు నిక్షేపాలు భవిష్యత్తులో మానవ అన్వేషణకు కీలకమని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే అవి తాగునీరు, ఆక్సిజన్, రాకెట్ ఇంధనాన్ని కూడా అందజేస్తాయని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

### సంక్లిష్టమైన టెక్నాలజీ చంద్రయాన్-4

గడిచిన మూడు చంద్రయాన్ ప్రయోగాలకంటే చంద్రయాన్–4 ఎంతో సంక్లిష్టమైంది. చంద్రయాన్–4లో ల్యాండర్, రోవర్ ఆరోహణ మాడ్యూల్, నమూనాల సేకరణ అనంతరం మళ్లీ భూమికి తిరిగివచ్చే మాడ్యూల్ వంటి బహుళ విభాగాలను పొందుపరుస్తున్నారు. ఇప్పటిదాకా ఇస్రో చేపట్టిన అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో ఇది ఒకటని చెబుతున్నారు. అత్యంత శీతలంగా ఉండే మాన్స్ మౌటన్ వాతావరణం నుంచి నమూనాలను విజయవంతంగా సేకరించి భూమికి తీసుకురావడంలో కచ్చితమైన ల్యాండింగ్, రోబోటిక్ నమూనా, మిషన్ సమన్వయం, భూమికి తిరిగొచ్చే సాంకేతికతలో భారత్ సామర్థ్యాన్ని ప్రదర్శించబోతోంది. వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించి తిరిగి తీసుకురావడానికి ఇది ప్రయోగాత్మక ప్రయోగంగా ఇస్రోకు ఉపయోగపడనుంది. ఈ ప్రయోగం సక్సెస్ అయి చంద్రుడిపై మట్టి నమూనాలు సేకరించి భూమికి తీసుకొచ్చి అధ్యయనం చేస్తే సౌరవ్యవస్థ గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అంటే సౌరవ్యవస్థలో భూమి, చంద్రుడు ఎలా ఏర్పడ్డాయనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకునే వీలుంటుందని వారు చెబుతున్నారు. అమెరికా, రష్యా, చైనా చంద్రుడిపై నుంచి మట్టి నమూనాలను తీసుకొచ్చి పరిశోధనలు చేసినప్పటికీ.. చంద్రుడిపై దక్షిణ . ధృవం ప్రాంతం నుంచి ఏ దేశం కూడా ఇప్పటి వరకు నమూనాలను సేకరించలేదు. అందుకే శాస్త్రీయంగా, సాంకేతికంగా చరిత్రలో మైలురాయిగా నిలిచేలా ఇస్రో ఈ ప్రాంతాన్ని ఎంచుకుని ప్రయోగానికి సిద్ధమవుతోంది.

## రూ.400 కోట్ల దోపిడీ తూచ్!

- మహారాష్ట్ర సిట్ నివేదిక
- దోపిడీ నిజమే అంటున్న ఫిర్యాదుదారు

బనశంకరి: కర్ణాటక–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం బెళగావి చోర్లాఘాట్‌లో రూ.400 కోట్ల దోపిడీ అనేది అబద్ధమని పోలీసులు తేల్చారు. గోవా నుంచి మహారాష్ట్రకు రెండు కంటైనర్లలో రూ.400 కోట్లు తరలిస్తుండగా బెళగావి జిల్లా చోర్లాఘాట్ వద్ద 2025 అక్టోబరు 25న కంటైనర్లు మాయమయ్యాయని మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన సందీప్‌దత్తా పాటిల్ ఇటీవల మహారాష్ట్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ డబ్బు గుజరాత్‌కు చెందిన బిల్డర్ కిశోర్ సేఠ్‌కు చెందినదని తెలిపాడు. దేశ వ్యాప్తంగా ఈ వార్త సంచలనం రేకెత్తించింది. దానిపై రాజకీయ దుమారం కూడా రేగింది. ఆ డబ్బు ఫలానా పార్టీది అని.. కాదు.. కాదు వారిదే అని రాజకీయ పార్టీలు ఆరోపణలు చేసుకున్నాయి. అలాంటి సంచలనమైన కేసు దర్యాప్తు చేపట్టిన మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రూ.400 కోట్ల దోపిడీ తూచ్... అని తేల్చింది. నగదుపోయినట్టు ఎలాంటి ఆధారాలు లేవని కొట్టిపడేసింది. మోసపూరిత ఫిర్యాదు చేశారంటూ సందీప్ దత్తా పాటిల్‌పై చర్యలకు సిద్ధమవుతోంది.

**నెల రోజులు దర్యాప్తు**

నెలరోజులుగా దర్యాప్తు చేసినా దోపిడీ జరిగినట్టు ఎలాంటి సాక్ష్యాలు లభించలేదని మహారాష్ట్ర సర్కారుకు సిట్ నివేదిక అందించింది. నగదుతో కంటైనర్లు మాయమయ్యాయని ఫిర్యాదు ఇచ్చిన సందీప్‌దత్తా పాటిల్ ఫోన్‌కాల్స్, వాహనాల ప్రయాణ మార్గం తదితరాల విషయంలో పొంతన కుదరడం లేదని సిట్ పేర్కొంది. దీన్ని బట్టి చోర్లాఘాట్‌లో ఎలాంటి దోపిడీ జరగలేదని స్పష్టం చేసింది. ఈ కేసులో పలువురిని అరెస్టు చేయగా, సాక్ష్యాలు లేకపోవడంతో విడుదల చేసే అవకాశం ఉంది. కాగా, సందీప్‌దత్తా పాటిల్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి నాసిక్ పోలీసులు సిద్ధమయ్యారు. అయితే, దోపిడీ నిజమని, సిట్ అధికారులు సక్రమంగా దర్యాప్తు చేయలేదని ఫిర్యాదుదారు సందీప్‌దత్తా పాటిల్ చెప్పాడు.

## సముద్రంలో మునిగి ఒకరి మృతి.. మరొకరి గల్లంతు

**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘటన**

బిట్రగుంట: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం తాటిచెట్లపాలెం వద్ద సముద్రంలో ఈతకెళ్లి ఇద్దరు యువకులు మునిగిపోయారు. వారిలో ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చెన్నైకి చెందిన కొంకి దీపక్ (18) సోదరుడికి నాలుగు రోజుల క్రితం ఉలవపాళ్లలో వివాహం జరిగింది. దీనికి హాజరైన దీపక్... అదే గ్రామానికి చెందిన నూనె లోకేశ్ (23), కప్పల ఇమ్మానుయేల్‌తో కలిసి సోమవారం తాటిచెట్లపాలెం వద్ద సముద్రంలో ఈతకు వెళ్లారు. ఇమ్మానుయేల్ సముద్రం ఒడ్డునే ఉండగా దీపక్, లోకేశ్ ఈతకు దిగారు. అలల ఉధృతి పెరగడంతో ఇద్దరూ సముద్రంలో గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న ఇమ్మానుయేల్ పెద్దగా కేకలు వేయడంతో అక్కడున్న మత్స్యకారులు వారిని కాపాడేందుకు యత్నించారు. దీపక్‌ను బయటకు తీసుకురాగా, అప్పటికే మృతి చెందాడు. లోకేశ్ కోసం మెరైన్ పోలీసులు గాలిస్తున్నారు.

దీపక్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

### మార్చి 14, 15 తేదీల్లో దక్షిణాది హైకోర్టు న్యాయమూర్తుల భేటీ

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది హైకోర్టుల న్యాయమూర్తుల సమావేశానికి తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 14, 15 తేదీల్లో ఇక్కడ నిర్వహించనున్న భేటీ కోసం రూ.2 కోట్లు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మద్రాస్, కేరళ హైకోర్టుల న్యాయమూర్తులు ఈ సమావేశంలో పాల్గొంటారు. భేటీపై తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఇటీవల సర్కార్‌కు లేఖ రాశారు. దీంతో నిర్వహణ ఏర్పాట్లకు ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసింది.

## ఏఎన్‌యూలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

**ఈ నెల 27 వరకు రోజూ రాత్రి వేళలోనే నిర్వహణ... హాజరుకానున్న 8,598 మంది**

ఏఎన్‌యూ (పెదకాకాని): గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు ర్యాలీ జరుగుతుంది. దీనికోసం విశ్వవిద్యాలయంలో ఉన్న 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను సిద్ధం చేశారు. ఎంపిక ప్రక్రియ రాత్రి సమయంలోనే చేపట్టనున్నందున ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. శారీరక, వైద్య పరీక్షలకు ఇండోర్ బ్యాడ్మింటన్, జిమ్ భవనాలను సిద్ధం చేశారు. సింథటిక్ ట్రాక్‌కు ఆనుకుని అభ్యర్థుల హాజరు నమోదు, శారీరక దారుఢ్య పరీక్షలు, డ్రగ్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశారు. ఈ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 8,598 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ తెలిపారు.

**అగ్నివీర్‌కు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభం**

సింధియా (విశాఖపట్నం): భారత సైన్యంలో వివిధ విభాగాల్లో నియామకాలకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించినట్లు భారత సైనికదళ అధికారులు తెలిపారు. విశాఖపట్నం ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలోని జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అగ్నివీర్ విభాగాలకు గరిష్ట వయో పరిమితి 21 నుంచి 22 సంవత్సరాలకు పెంచారని, అభ్యర్థులు www.indianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే ఈ ఏడాది ఏప్రిల్ 1లోగా దరఖాస్తు చేయాలని కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## క్లుప్తంగా...

### అనలిస్ట్ గ్రేడ్- II పరీక్ష సిలబస్‌లో మార్పులు

**ఏపీపీఎస్సీ ప్రకటన**

**సాక్షి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అనలిస్ట్ గ్రేడ్ – II పోస్టుకు సంబంధించిన పరీక్ష విధానం, సిలబస్‌లో మార్పులు చేసినట్లు కమిషన్ అధికారికంగా ప్రకటించింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలిలో భర్తీచేయనున్న ఈ పోస్టుకు సంబంధించి పేపర్ – II ను ఇకపై సంబంధిత సబ్జెక్ట్ పేపర్‌గా కాకుండా 'కామన్ పేపర్'గా నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే పేపర్– I (జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ)లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టంచేసింది. పూర్తి వివరాలు కమిషన్ అధికారిక వెబ్‌సైట్ https:// psc.ap.gov.inలో అందుబాటులో ఉంచినట్లు తెలియజేసింది.

### 'బీసీ సింహగర్జన'కు అనుమతి కోసం హైకోర్టులో పిటిషన్

**సాక్షి, అమరావతి:** బీసీ సింహగర్జన పేరుతో ఈ నెల 22న తాను తలపెట్టిన బహిరంగ సభకు అనుమతి ఇచ్చే విషయంలో పోలీసులు ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. నాగార్జున యూనివర్సిటీకి ఎదురుగా ఉన్న మైదానంలో తలపెట్టిన బహిరంగ సభకు అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఆయన సోమవారం పిటిషన్ దాఖలు చేశారు.

### దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్‌గా రత్నరాజు

**సాక్షి, అమరావతి :** దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రత్నరాజుకు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. కమిషనర్ కార్యాలయంలోనే ఆయన భూ వ్యవహారాలను పర్యవేక్షించే ఎస్టేట్స్ జాయింట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం ఏర్పాటు

**సాక్షి, అమరావతి:** అంటు వ్యాధులు, ఫుడ్ పాయిజన్ కేసుల నమోదుతోపాటు, ఇతర సమస్యల పర్యవేక్షణ కోసం మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం ఏర్పాటు చేసినట్టు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో వైద్య, విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక, పోలీసు, ఇతర శాఖల సమాచారం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందన్నారు.

### ఎంఎస్ఎంఈ రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**సాక్షి, అమరావతి:** బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 15 పార్కులు అందుబాటులోకి రాగా, 82 పార్కులకు శంకుస్థాపన పూర్తిచేసి మౌలిక సదుపాయాల కల్పనా కార్యకలాపాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రుణ భరోసా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ అమలులోకి వచ్చిందని, దీని కింద 95 శాతం వరకు రుణ గ్యారెంటీ లభిస్తుందన్నారు.

# రేల రేల రేలారే!

**అది'రేలా'.. అందరి మనసు దోచేలా.. రేల రేల రేలారే అంటూ చేసే కొమ్ము కోయ నృత్యం మన్యసీమకే వన్నె తెస్తోంది.. గిరిసీమ ప్రత్యేకతను చాటుతోంది.. గిరిజనుల సంప్రదాయంలో భాగమైంది.. ఇది కామన్‌వెల్త్, ఐపీఎల్‌లోనూ ప్రదర్శించడంతో ఇక్కడి కీర్తిని ఎగురవేస్తోంది.. అలాగే గిరిజన కళాకారులకు ఆదాయ వనరుగా మారింది. ఆ సంప్రదాయ నృత్యం పుట్టుక గురించి తెలుసుకుందాం రండి..**

పతాక స్థాయిలో కొమ్ముకోయ నృత్యం

- కొమ్ముకోయ నృత్యం అదిరేలే
- గిరిజన సంప్రదాయంలో ప్రత్యేకం
- కామన్‌వెల్త్, ఐపీఎల్‌లో ప్రదర్శనలు

**చింతూరు:** గిరిజన సంస్కృతీ సంప్రదాయంలో ఆదివాసీ కొమ్ముకోయ నృత్యం ప్రధానమైంది. ఇది గిరిజన కళాకారులకు ఆదాయ వనరుగా మారింది. అలాంటి కొమ్ముకోయ నృత్యం పేరు చెబితే పోలవరం జిల్లా చింతూరు మండలం తుమ్మలకు చెందిన గిరిజన కళాకారులే ముందుగా గుర్తొచ్చేది.

పూర్వం తమ సొంత ఇళ్లలో శుభ కార్యాలతో ప్రారంభమైన కొమ్ముకోయ నృత్యం రాను రాను రాష్ట్రంలో వివిధ పండగలు, రాజకీయ పార్టీల కార్యక్రమాల సందర్భంగా జరిగే ఉత్సవాల్లో ఓ భాగమైంది. అనంతర కాలంలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు కామన్‌వెల్త్ గేమ్స్, ఐపీఎల్ ప్రారంభం, ముగింపు సంబరాల్లో సైతం ఈ నృత్యం ఎంతో ప్రాచుర్యం పొందింది.

#### నృత్యం ప్రారంభం ఇలా..

చింతూరు మండలం తుమ్మలకు చెందిన పట్రా ముత్యం తమ గ్రామానికి చెందిన కొంతమంది కళాకారులతో కలిసి ఓ బృందాన్ని ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా కొమ్ముకోయ నృత్య ప్రస్థానం ప్రారంభమైంది. ముత్యం మృతి అనంతరం అతని కొడుకు రమేష్ ఈ పరంపరను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం తుమ్మలతో పాటు బుర్కనకోట, సరివెల, వేకవారిగూడెం, సుద్దగూడెం తదితర గ్రామాలకు చెందిన కళాకారులు సైతం ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలా చింతూరు మండలంలో ప్రస్తుతం 20 బృందాల వరకూ కొమ్ముకోయ నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. ఒక్కో ట్రూపులో ఈవెంట్‌ను బట్టి 20 నుంచి 40 మంది వరకూ సభ్యులు ఉంటారు. సభ్యుల్లో మహిళలు, పురుషులు ఉంటారు.

#### సాంస్కృతిక విభాగాల ఆధ్వర్యంలో..

సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేశం, రాష్ట్రంలో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో కొమ్ముకోయ నృత్య కళాకారుల ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నారు. వివిధ పండగల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా వీరు పాల్గొంటున్నారు. దీంతో పాటు కొన్ని సినిమాల్లో సైతం కొమ్ముకోయ నృత్య ప్రదర్శనను దర్శకులు పెడుతున్నారు. పుష్ప–2, గేమ్ ఛేంజర్, దేవదాసు–2, ఊరిపేరు భైరవకోన, దొంగలబండి, అమ్మాయినవ్వితే, శ్లోకం వంటి చిత్రాల్లో తమకు అవకాశం కల్పించినట్లు కొమ్ముకోయ నృత్య కళాకారులు తెలిపారు. ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు రవాణా ఖర్చులు, వసతి కల్పించడంతో పాటు ఒక్కొక్కరికీ రోజుకు రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తారని వారు తెలిపారు.

#### నృత్య ప్రదర్శన.. ప్రత్యేక ఆకర్షణ

గిరిజన సంస్కృతికి తగ్గట్టుగా దుస్తులు ధరించి పురుషులు ఎద్దు కొమ్ములు, నెమలి ఈకలతో కూడిన తలపాగా చుట్టుకుని, పెద్ద డోలు పట్టుకుని దానిని వాయిస్తూ ఉంటారు. మహిళలు తమ తలకు రిబ్బన్ చుట్టుకుని అందులో నెమలి ఈకలను పెట్టుకుని, కాళ్లకు గజ్జెలు కట్టుకుని పురుషులు వాయించే డోలు వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తుంటారు. ముందుగా నెమ్మదిగా ప్రారంభమయ్యే ఈ నృత్యం క్రమేపీ వేగం పుంజుకొంటుంది. నృత్యం ముగింపులో పొట్టేళ్ల మాదిరిగా పురుషులు తమ కొమ్ములతో ఒకరినొకరు కొట్టుకోవడం ఈ నృత్యానికే ఆకర్షణగా నిలుస్తోంది. దుస్తుల అలంకరణలో సైతం వీరు వైవిధ్యాన్ని పాటిస్తారు. పురుషులు ఎర్ర దుస్తులు ధరిస్తే మహిళలు పచ్చ దుస్తులు ధరిస్తారు.

కొల్లూరు రిసార్ట్‌ల వద్ద కొమ్ముకోయ నృత్య ప్రదర్శన

#### ఐటీడీఏ సహకారం అందించాలి

కొమ్ముకోయ నృత్యం ద్వారా ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను దేశవ్యాప్తంగా చాటుతున్న మాకు ఐటీడీఏ సహకారం అందించాలి. ఐటీడీఏ ద్వారా అవకాశాలు కల్పిస్తే మరిన్ని ప్రదర్శనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ప్రదర్శనల ద్వారా కూడా ఆర్థికంగా ఎంతో లాభం చేకూరుతుంది.

–పట్రా రమేష్, కొమ్ముకోయ ట్రూపు నిర్వాహకుడు, తుమ్మల

#### ఎంతో ఆదరణ లభిస్తోంది

ఆదివాసీ సంస్కృతిలో భాగంగా ప్రకృతి ఒడిలో నేర్చుకున్న ఈ నృత్యానికి ఇతర ప్రాంతాల్లో ఎంతో ఆదరణ లభిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనల ద్వారా అక్కడి సంస్కృతిని తెలుసుకునే అవకాశం కలుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే దేశవ్యాప్తంగా మరిన్ని ప్రదర్శనలు ఇస్తాం.

–వుయికా సీత, కొమ్ముకోయ నృత్య కళాకారిణి, తుమ్మల

క్యాంప్ ఫైర్ వద్ద నృత్యం చేస్తున్న కళాకారులు

# ఆకలి చేయిస్తున్న విన్యాసం

**'తీగలపై అలవోకగా నడుస్తారు.. శూలాలపై నిర్భయంగా నిద్రిస్తారు... గ్లోబులో బైక్‌పై గింగరాలు తిరుగుతారు... తాళ్లపై పరుగులు తీస్తారు... వారి బతుకు జీవనం ఆశ్చర్యం.. సాహసాలతో సహవాసం. విన్యాసాలతో వినోదం.. బతుకంతా ఆకలి పోరాటం. సర్కస్ కళాకారుల జీవితం కడు దుర్భరం. స్థానిక పెద్దచెరువు రోడ్డులో మాన్సాస్ గ్రౌండ్‌లో బింగో సర్కస్ ప్రారంభమైంది. పిడికెడు మెతుకుల కోసం కళాకారులు జీవితాంతం సాగిస్తున్న బతుకు విన్యాసాలపై సాక్షి ప్రత్యేక కథనమిది.**




- బతుకంతా కష్టాలు.. కన్నీళ్లు
- సర్కస్ ప్రదర్శనలకు కొరవడిన ఆదరణ
- ఇంటర్‌నెట్ వీక్షణంతో తగ్గిన ప్రేక్షకులు

**విజయనగరం టౌన్:** సర్కస్ అంటే ఓ జిమ్నాస్టిక్ ప్రదర్శన మాత్రమే కాదు. ఎందరో యువతీ యువకులకు కడుపు నింపే ఉద్యోగం. ప్రపంచమంతా తిరుగుతూ సాహస ప్రదర్శనలిస్తారు. ప్రాణాలను పణంగా పెట్టే విన్యాసాలకు చప్పట్లు కొడిచే చాలు పరవశించిపోతారు. జంతువులపై నిషేధం విధించినప్పటి నుంచి సర్కస్ కళాకారులకు కన్నీటి కష్టాలు మొదలయ్యాయి. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సర్కస్ ప్రదర్శనలను చూసేవారు కరువవ్వడం ఆ కళాకారులను కలవరపరుస్తోంది.

#### పూట గడిచేందుకు ఫీట్లు

విజయనగరంలోని పెద్దచెరువు రోడ్డు ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న మాన్సాస్ గ్రౌండ్స్‌లో ఇటీవల ప్రారంభమైన బింగో సర్కస్‌లో మంగోలియన్, ఆఫ్రికా, రష్యా, చైనా తదితర దేశాలు, మణిపూర్, మిజోరాం, మహారాష్ట్ర, అసోం, వెస్ట్ బెంగాల్, తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 150 మందికి పైగా కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. కొన్నేళ్లుగా సర్కస్‌కు ఆదరణ తగ్గిపోవడంతో సరైన ఆదరణ లేక కళాకారులు పొట్ట నింపుకోలేని దుస్థితిలో ఉన్నారు. తమకు రావాల్సిన రాయితీలపై అధికారులు కనీసం దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని వారు వాపోతున్నారు. 2017లో జిల్లాకు సత్యఅనసూయమాత ఆఫ్రికన్ సర్కస్ వచ్చింది. తర్వాత ఇన్నేళ్లకు బింగో సర్కస్ వచ్చింది. ఇప్పటికే 80శాతం సర్కస్ కంపెనీలు మూసేశారు. కోవిడ్‌లో పది శాతం మూతబడ్డాయి. మరో పదేళ్ల తర్వాత సర్కస్ అనేది కనిపిస్తుందా అనేది ప్రశ్నార్థకమే..

#### జిమ్నాస్టిక్ విన్యాసాలతోనే నిర్వహణ

ప్రస్తుతం జిమ్నాస్టిక్ విన్యాసాలపైనే సర్కస్ ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. జంతువుల ప్రదర్శనను ప్రభుత్వం నిషేధించడంతో వీరి ప్రదర్శనలకు ఆదరణ కరువైంది. ఎంతో కష్టపడి నేర్చుకున్న విద్యను ఇంటర్‌నెట్‌లో చూస్తుండడంతో మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. నేరుగా సాహస ప్రదర్శనలను తిలకిస్తేనే ఆనందాన్ని ఆస్వాదించవచ్చని నిర్వాహకులు పేర్కొంటున్నారు. మణిపూర్ సాహసికులు, కత్తులు నోట్లో పెట్టుకునే విన్యాసాలు, ఒక గ్లోబ్‌లో మూడు బైక్‌లు ఏకకాలంతో తిరిగే ప్రదర్శనలు ఒళ్లు గగుర్పొడుస్తాయి. 25 నుంచి 30 ప్రదర్శనలు రెండు గంటల పాటూ నిర్విరామంగా అందించే వీరికి మూడు పూటలా తినడానికే డబ్బులు చాలక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### దామోదర్‌నాయుడును తొలగించాలి

- కౌలు రైతు సంఘం డిమాండ్

**సాక్షి, అమరావతి:** పదవీ విరమణ తర్వాత డాక్టర్ టి.దామోదర్ నాయుడుని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పునర్నియమించడాన్ని ఏపీ హైకోర్టు రద్దు చేసినందున తక్షణమే ఆయన్ను ఆ పోస్టు నుంచి తప్పించి అర్హత కలిగిన వారిని నియమించాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నియామకం చెల్లదని ఏపీ పశుసంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీ పశుసంవర్ధక ఆఫీసర్ల అసోసియేషన్, ఏపీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్‌తోపాటు అదనపు డైరెక్టర్ పాముల సత్యకుమారి దాఖలు చేసిన రిట్ పిటిషన్లపై హైకోర్టు తీర్పు ఇచ్చి 20 రోజులు అవుతోందన్నారు. అయినప్పటికీ దామోదర నాయుడుని తప్పించకపోవడం సరికాదన్నారు. నేటికీ ఆయన పశుసంవర్ధక శాఖలోని ఆర్థిక, పరిపాలన వ్యవహారాల్లో కొనసాగుతుండడం కోర్టు ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. హైకోర్టు తీర్పును అనుసరించి, ఆయన్ని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించి, 'రూల్ ఆఫ్ లా'ను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

# గంజాయి గుప్పుచుప్‌గా..

కోరుమిల్లిలో పట్టుబడిన గంజాయి బస్తాలు (ఫైల్)

ఇటీవల రంపచోడవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ఈ సీలేరు నదిని దాటించే గంజాయి తరలిస్తున్నారు

**గంజాయి స్మగ్లర్లు కొత్త వ్యహాలు అనుసరిస్తున్నారు.. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నూతన మార్గాలను ఎంచుకుంటున్నారు.. ఇలా గుట్టుచప్పుడు అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఒకవేళ దొరికితే, అమాయక గిరిజనులను బలి చేస్తున్నారు.. ఇలా అనేకమంది జైలులో మగ్గుతున్నారు.. ప్రస్తుతం గంజాయిని వాడపల్లి, కోట మీదుగా తరలించేస్తున్నారు. ఆ గుట్టు తెలుసుకుందాం రండి..**

- రవాణాకు కొత్త మార్గాలు
- పోలీసులకు దొరక్కుండా తరలింపు
- స్మగ్లర్ల కొత్త వ్యూహాలు
- వారి వలకు అమాయక గిరిజనుల బలి

**రంపచోడవరం:** గంజాయి స్మగ్లర్లు రూటు మార్చారు. ఈ మాదక ద్రవ్యం తరలింపునకు కొత్త మార్గాలను ఎంచుకున్నారు. పోలీసుల నిఘా పెరగడంతో పాత దారులను వదలి కొత్త మార్గాల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఒడిశా ప్రాంతంలో పండించిన గంజాయిని ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాకు అమాయక గిరిజనులను పావులుగా వాడుకుంటున్నారు. గంజాయి బస్తాలను రాత్రి వేళల్లో మోసే కూలీలకు రూ. 3 వేల చొప్పున చెల్లిస్తున్నారు. గంజాయితో పట్టుబడితే వారి జీవితాలను జైలు పాలు చేస్తున్నారు.

#### సీలేరు నది దాటించి..

ఒడిశా ప్రాంతంలో పండించిన గంజాయిని సీలేరు నది దాటించి పోలవరం జిల్లా నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. సీలేరు నదికి ఆనుకుని ఉన్న ఒడిశా రాష్ట్రం సరిహద్దు గ్రామాలు రాసిబేరా, పప్పులూరు, కుర్మానూరు తదితర ప్రాంతాల్లో గంజాయిని ఎక్కువగా పండిస్తున్నారు. ఆ పంటను సీలేరు నదిలో దోనెలపై దాటించి మంగంపాడు, జెండాకూపి గ్రామాల అటవీ ప్రాంతం నుంచి కాలినడకన కూలీలు తరలిస్తారు. వారికి ముందుగా కాలినడకన చేరాల్సిన గమ్యాన్ని చెబుతారు. అక్కడ వరకూ కూలీలు ఆ బస్తాలను మోసుకుంటూ వెళ్లి స్మగ్లర్లు చెప్పిన చోట చేరవేస్తారు. తర్వాత అనుకూలతను బట్టి వాహనాల్లో తరలిస్తారు. గతంలో డొంకరాయి, మోతుగూడెం మీదుగా చింతూరు, భద్రాచలం, ఇటు మారేడుమిల్లి వైపు తరలించేవారు. పోలీసు నిఘా వ్యవస్థ పెరగడం, విస్తృత తనిఖీల నేపథ్యంలో స్మగ్లర్లు గంజాయి రవాణా రూటు మార్చారు. మంగంపాడు నుంచి అటవీ మార్గంలో పాతకోట మీదుగా కోట, వాడపల్లి గ్రామాల సరిహద్దు అటవీ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. తాజాగా రంపచోడవరం పోలీసులు కోట రోడ్డులో 370 కిలోల గంజాయిని పట్టుకున్నారు. గతంలో ఇదే రోడ్డులో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా స్మగ్లర్లు ట్రాన్స్‌కో 220 కేవీ టవర్ మార్గం ద్వారా చింతూరు – మారేడుమిల్లి ఘాట్ రోడ్డుకు సమీపంలో గంజాయి బస్తాలు చేరవేస్తారు. అక్కడి నుంచి అనుకూలతను బట్టి మారేడుమిల్లి వైపు లేదా చింతూరు మీదుగా భద్రాచలం నుంచి విజయవాడ, బెంగళూరు వంటి మెట్రోపాలిటన్ నగరాలకు తరలిస్తున్నారు. ఇటీవల కాలంలో చింతూరు మండలం కొత్తపల్లి, గూడూరు మీదుగా చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక సరిహద్దులో గోదావరి నది దాటించి జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వైపు గంజాయి తీసుకెళ్తున్నారు. గత ఏడాది తెలంగాణ, ఆంధ్రా పోలీసులు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ నిర్వహించి గోదావరి దాటించేందుకు ప్రయత్నిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి.

#### యువత జీవితం జైలు పాలు

గిరిజన యువత గంజాయి కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి జైల్లో మగ్గుతున్నారు. స్మగ్లర్లు గిరిజన యువతకు డబ్బులు ఎరవేసి వేసి గంజాయి అక్రమ రవాణాకు వాడుకుంటున్నారు. ఈ సమయంలో పట్టుబడితే కేసుల నుంచి బయటకు తీసుకువస్తామని చెప్పిన స్మగ్లర్లు ఆ కటుంబాల వైపే చూడడం లేదు. గంజాయి రవాణాకు అలవాటు పడిన వారిపై ఐదు నుంచి పది కేసులు వరకూ ఉన్నాయి. బయటకు వచ్చిన మళ్లీ గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో పాడేరు ఏజెన్సీ నుంచి భద్రాచలం సరిహద్దు వరకూ అనేక మంది గిరిజన యవత జైలు జీవితం గడుపుతున్నారు.

#### వారిదే కీలక పాత్ర

గంజాయి స్మగ్లింగ్‌కు పైలెట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు. గంజాయి లోడుతో వాహనం చెక్‌పోస్టులు దాటించేందుకు అక్కడ పోలీస్ నిఘా ఉందా లేదా అనేది సమాచారం ఇస్తూ గంజాయి అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇలా వాహనాలకు పైలెట్‌లుగా వెళ్లి కేసుల్లో ఇరుక్కున సందర్భాలు ఉన్నాయి. దీనికోసం పైలెట్లకు లోడును బట్టి రూ. 25 వేల నుంచి రూ.50 వేల వరకూ చెల్లిస్తున్నారు.

లిక్విడ్ గంజాయి

#### కొనేది రూ.3 వేలు.. అమ్మేది రూ.50 వేలు

ఒడిశా ప్రాంతంలో పండించిన గంజాయి కిలో రూ.1,500 నుంచి రూ. 3 వేల వరకూ ఇచ్చి స్మగ్లర్లు కొనుగోలు చేస్తారు. అక్కడి నుంచి హైదరాబాద్, చైన్నై, బెంగళూరు, ముంబయి, పూణే, కేరళ ప్రాంతాలకు చేరుకునే సరికి కిలో రూ. 30 వేల నుంచి రూ.50 వేలు పలుకుతోంది. గంజాయిని కోసి ఆరబెట్టిన తరువాత ప్యాకింగ్ చేస్తారు. కిలో నుంచి ఐదు కిలోల వరకూ ప్యాకింగ్ ఉంటుంది. ఎటువంటి పరిస్థితుల్లోనైనా గంజాయి పాడవకుండా పాలిథిన్ కవర్లలో నింపి వాటికి చుట్టూ ప్లాస్టర్లను చుట్టివేస్తారు. దీంతో వర్షానికి తడిచినా దానిలో గంజాయి పాడవదు. గంజాయి తరలింపు కష్టతరం కావడంతో పొడి గంజాయిని లిక్విడ్ గంజాయిగా మార్చి తరలిస్తున్నారు. దీనికోసం వారు గంజాయిని బాయిల్ చేసి ఆవిరి నుంచి వచ్చిన ద్రవాన్ని సీసాల్లో పడుతున్నారు. ఇలా కొత్త పంథాను అనుసరిస్తున్నారు.

#### అవగాహన కల్పిస్తున్నాం

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది 188 కిలోల గంజాయిని పట్టుకున్నాం. గంజాయితో కలిగే నష్టాలను గిరిజనులకు తెలియజేస్తున్నాం. రవాణాకు సహకరిస్తే జైలు శిక్ష పడుతుందని అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యం తీసుకువస్తున్నాం. అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం చేరవేసి సహకరించాలి.

– శ్రీధర్, ఎక్సైజ్ సీఐ, రంపచోడవరం

**ఫెయింట్ అయిపోవడం అనే మాట చాలామంది వినే ఉంటారు. తెలుగులో చెప్పాలంటే స్వాధీనం తప్పిపోవడం. ఇది స్పృహతప్పి అలాగే ఉండిపోవడం కాదు... కాసేపట్లో మళ్లీ మామూలైపోవడం. ఇలా స్వాధీనం తప్పిపోయి... కొద్దిక్షణాల్లోనే మళ్లీ మామూలైపోవడాన్ని వైద్యపరిభాషలో 'సింకోప్' అంటారు. అయితే కొద్దిసేపట్లోనే మళ్లీ మామూలైపోయినప్పటికీ ఇలా జరగడం కొన్నిసార్లు ప్రమాదాలకూ దారితీయవచ్చు. ఉదాహరణకు ఏ వాహనం నడుపుతున్నప్పుడో ఇలా జరిగితే అది పెను ప్రమాదం తెచ్చిపెట్టవచ్చు. ఈ సమస్యకు చాలా కారణాలుంటాయి. సింపుల్‌గా దేహంలో నీళ్లు / ద్రవాలు తగ్గిపోవడం (డీహైడ్రేషన్) మొదలుకొని వేగస్ నరం అతిగా స్పందించడం వరకు అనేక కారణాలతో వచ్చే ఈ 'సింకోప్' సమస్యపై అవగాహనతో పాటు దీనికి పరిష్కారాలేమిటో తెలుసుకుందాం...**

డాక్టర్
సుధీర్ కోగంటి
సీనియర్ కార్డియాలజిస్ట్

# సింకోప్ పడి లేచే ప్రమాదం



కొందరు ఏదైనా తట్టుకోలేని దృశ్యం చూడగానే స్పృహ తప్పినట్లుగా అయిపోతారు. మరి కొందరిలో వారి ఆందోళన స్థాయి మితిమీరిపోతే వెంటనే స్వాధీనం తప్పి పడిపోతారు. ఎందుకిలా అవుతుంది. ఎందుకంటే... గుండె స్పందనల లయ (రిథమ్)లో ఏమాత్రం తేడా రాకూడదు. స్పందన పెరిగినా, తగ్గినా అది ప్రమాదకరమే. గుండె స్పందనలు తగ్గడంతో... మన దేహంలో అత్యంత కీలక అవయవమైన మెదడుకు రక్తసరఫరా తగ్గిపోతుంది. అలా తగ్గినప్పుడు స్పృహ తప్పి పడిపోయే కండిషన్‌ను సింకోప్ అంటారు. ఇది సాధారణంగా చాలాసార్లు నిరపాయకరమే అయినప్పటికీ... కొన్నిసార్లు మాత్రం అది ప్రమాదకరంగా పరిణమించవచ్చు. సింకోప్ లక్షణాలు, నివారణ, చికిత్సలేమిటో చూద్దాం.

## సింకోప్‌లో రకాలు

- **న్యూరల్లీ మీడియేటెడ్ :** బాగా తీవ్రమైన నొప్పి రావడం లేదా చాలా ఎక్కువగా భావోద్వేగాలకు గురికావడం, అత్యంత తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురికావడం వల్ల. సింకోప్ కండిషన్ రావచ్చు.
- **ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ :** దేహంలో నీళ్లు / ద్రవాలు తగ్గడం వల్లగానీ లేదా ఏవైనా మందులు వాడుతున్నప్పుడు వాటి వల్ల అకస్మాత్తుగా ఒక్కసారిగా రక్తపోటు (బ్లడ్‌ప్రెషర్) తగ్గిపోవడం వల్ల.
- **కార్డియాక్ సింకోప్ :** గుండె రిథమ్‌లో తేడా రావడం వల్ల (అరిథ్మియా అనే కండిషన్‌లో) గుండెవేగం పెరగడమో లేదా తగ్గడమో జరిగినప్పుడు.
- **సిచ్చువేషనల్ సింకోప్ :** గట్టిగా దగ్గడం లేదా మింగడం లేదా మూత్రవిసర్జన చేస్తున్నప్పుడు అకస్మాత్తుగా స్వాధీనం తప్పిపోవడం.

## సింకోప్ కారణమయ్యే మెకానిజమ్



1) మెదడుకు గుండెనుంచి తగినంత రక్తం అందకపోవడం / గుండె తగినంత రక్తాన్ని మెదడుకు అందించలేకపోవడం

2) గుండె పంపింగ్ సరిగా ఉన్నప్పటికీ మెదడుకు ఆ రక్తం అందడానికి అవసరమైన బ్లడ్‌ప్రెషర్‌ను మెయిన్‌టెయిన్ చేయడానికి సదరు రక్తనాళానికి తగినంత సామర్థ్యం లేకపోవడం.

3) రక్తనాళానికి సామర్థ్యం ఉన్నప్పటికీ రక్తనాళంలో తగినంత రక్తం లేకపోవడం... ఈ మూడింటిలో ఏదో ఒకటిగానీ, లేదా ఒకటి కంటే ఎక్కువగా అంటే... ఏవైనా రెండు కారణాల వల్ల గానీ ఇలా జరగవచ్చు.

## ఎందుకిలా జరుగుతుందంటే...

గుండె ఒక కండర నిర్మితమైన ఒక ఎలక్ట్రిక్ పంపు లాంటి అవయవం అన్న విషయం తెలిసిందే. ఎస్ఏ నోడ్ (సైనో ఏట్రియల్ నోడ్) అనే ఒక కీలకమైన చోటి నుంచి గుండె స్పందించడానికి అవసరమైన కరెంటు మన శరీరంలోనే నిత్యం ఉత్పత్తి అవుతూ ఉంటుంది. ఆ ఎలక్ట్రిసిటీ సరఫరాలో తేడాల వల్ల ఒక్కోసారి గుండె కండరాలు వేగంగానైనా కొట్టుకోవచ్చు లేదా ఒక్కోసారి అకస్మాత్తుగా స్పందనలు తగ్గవచ్చు. కార్డియాక్ సింకోప్‌లో ఇలా జరుగుతుంది.

### వేగం పెరిగితే...

కొన్ని సార్లు గుండె స్పందనల్లో వేగం బాగా పెరిగిపోయి 'టాకికార్డియా' అనే కండిషన్ ఏర్పడుతుంది. దీని వల్ల గుండె పై గదుల్లోగాని, కింది గదుల్లోగాని వేగం పెరుగుతుంది. అంటే గుండెలో పంప్ చేయడానికి అవసరమైన రక్తం చేరుకోకముందే గుండె ముడుచుకోవడం... అంటే గుండె స్పందన జరుగుతుందన్నమాట. దాంతో గుండె నుంచి కీలకమైన అవయవాలకు అందాల్సినంత రక్తం రక్తనాళాల్లోకి వెలువడదు. ఈ టాకికార్డియా అనే కండిషన్ ఏ వయసు వారికైనా రావచ్చు.

### వేగం తగ్గితే...

గుండె స్పందనల్లో వేగం తగ్గితే ఆ కండిషన్‌ను బ్రాడికార్డియా అంటారు. బ్రాడి... అంటే నెమ్మదించడం (స్లో కావడం). ఇక 'కార్డియా' అంటే గుండె అని అర్థం. గుండె స్పందనల వేగం తగ్గడం వల్ల కూడా కీలకమైన అవయవాలకు రక్తసరఫరా తగ్గుతుంది. మనుషుల్లో తమ వయసు పెరుగుతున్న కొద్దీ వారి గుండె స్పందనలకు అవసరమైన ఎలక్ట్రికల్ సరఫరాల్లో తేడాలు వస్తుండవచ్చు. లేదా కొందరిలో పుట్టుకతోనే గుండెలో బ్లాక్స్ ఉండవచ్చు. గుండెకు అవసరమైన ఎలక్ట్రిసిటీలో తేడాలు రావడం వల్ల వచ్చే సమస్య అన్నది గుండెలో బ్లాక్స్ ఉండటం వల్ల వచ్చే సమస్య కంటే వేరుగా ఉంటుంది.

## చికిత్స

సింకోప్ అన్న కండిషన్ నిజానికి అంత సీరియస్ కాదు. కానీ ఇలా ఫెయింట్ కావడం తరచూ జరుగుతుంటే మాత్రం సింకోప్‌ను నిర్లక్ష్యం చేయడమన్నది ఏమాత్రం తగదు. ఏవైనా ఇతరత్రా ఆరోగ్య సమస్యల (అండర్‌లైయింగ్ కాజెస్) వల్ల ఇలా జరుగుతుందేమో చూసేందుకు అవసరమైన వైద్యపరీక్షలు జరపాలి. ఇందుకోసం తొలుత డాక్టర్ సలహా తీసుకుని, బాధితుడికి చికిత్స అవసరమా కాదా అన్నది నిర్ధారణ చేసుకోవాలి. ఇతరత్రా సమస్యలతో (అండర్‌లైయింగ్ కాజెస్‌తో) ఇలా జరుగుతుంటే మాత్రం బాధితుడికి అవసరమైన చికిత్స అందించాలి. ● సింకోప్ అన్నది ఒకసారి స్వల్పంగా వచ్చి, దాని వల్ల ఎలాంటి గాయాలు జరగకపోతే ప్రైమరీ మెడికల్ కేర్ సెంటర్‌లో డాక్టర్లు కూడా సాధారణ చికిత్స అందించవచ్చు. అయితే సరిగ్గా నాడిగానీ, శ్వాసగానీ అందని పరిస్థితిని మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించి పరిగణించి వెంటనే పెద్ద హాస్పిటల్స్‌కు (టెరిషియరీ హెల్త్ కేర్ సెంటర్‌కు) తరలించాల్సి ఉంటుంది.

## పేస్ మేకర్ అమర్చడం



గుండె స్పందనల లయ (రిథమ్)లో మార్పులు వచ్చిన వారికి, గుండె స్పందనల వేగం తగ్గిన వారిలో కొందరికి పేస్ మేకర్ అమర్చాల్సి రావచ్చు. ఈ పేస్‌మేకర్ అనేది గుండె స్పందనల వేగం తగ్గడాన్ని... అంటే 'బ్రాడీకార్డియా'ను ముందుగానే పసిగట్టి... గుండె స్పందనల వేగం తగ్గిపోకుండా చూస్తుంది. ఇలా పేస్ మేకర్ అన్నది తగ్గిపోయే గుండె స్పందనలను మళ్లీ మామూలయ్యేలా (నార్మల్‌గా స్పందించేలా) చేసేందుకు వాడే ఒక ఉపకరణం. అలాగే టాకీకార్డియా కండిషన్‌లో ఒక షాక్ ద్వారా గుండె స్పందనలు మళ్లీ నార్మల్ అయ్యేలా చూడటం; అలాగే ఇది గుండెలో పైన, కింద ఉండే గదులు కదలికలు సమన్వయంతో జరిగేలా చూడటం; గుండెలోని ఎడమ, కుడి భాగాలు స్పందనల్లో సమన్వయం ఉండేలా చూడటం వంటి పనులనూ చేస్తుంది. ఈ పనులన్నింటినీ పేస్ మేకర్ సహాయంతో జరిగేలా చూసే / చేసే చికిత్సను 'కార్డియాక్ రీ-సింక్రనైజేషన్ థెరపీ' (సీఆర్‌టీ) అని అంటారు. గుండె లయలో వచ్చే మార్పుల వల్ల వచ్చే ప్రమాదాలను నివారించడానికి ఈ చికిత్స చేయాల్సి ఉంటుంది. ఈ పేస్ మేకర్లలో కూడా తాత్కాలికంగా అమర్చేవి, శాశ్వతంగా అమర్చేవి అని రెండు రకాలుగా ఉంటాయి. డాక్టర్ల సలహా మేరకు అవసరమైనవారు (సాధారణంగా 'బ్రాడీ-కార్డియా' సమస్య ఉన్నవారు) దీన్ని వాడాల్సి ఉంటుంది. పేస్‌మేకర్ అమర్చాక పేషెంట్స్ తాము అంతకుమునుపు చేసే రోజువారీ పనులన్నింటినీ నార్మల్‌గానే చేసుకోవచ్చు.

## తక్షణం అందించాల్సిన సపర్యలు

- సింకోప్‌కు గురైన వ్యక్తిని కాస్తంత చల్లగా ఉన్న ప్రదేశంలోకి తీసుకెళ్లి సౌకర్యంగా పడుకోబెట్టాలి. లేదా అతడి తల రెండు మోకాళ్ల మధ్య ఉండేలా చూస్తూ రిలాక్స్‌డ్‌గా కూర్చోబెట్టాలి.
- అలా పడుకోబెట్టడం / కూర్చోబెట్టడం జరిగాక... అతడు స్పృహలోకి వచ్చిన కొద్దిసేపటి తర్వాత కాస్తంత ఉప్పు కలిపిన ద్రవాన్నిగానీ లేదా ఓఆర్ఎస్ ద్రావణాన్ని గానీ నెమ్మదిగా తాగించాలి. ఒకవేళ రక్తపోటు పడిపోవడం (హైపోటెన్షన్) వల్ల సింకోప్ ఏర్పడితే... ఇలా చేయడం వల్ల బాధితుడు మామూలుగా మారిపోతాడు.

**నివారణ :** నిజానికి సింకోప్‌కు దారితీసే అసలు కారణాలను కనుగొంటే అందుకు అవసరమైన తదుపరి చర్యలను తీసుకోవచ్చు. ఉదాహరణకు...

- వేసోవేగల్ నరం అతి స్పందన వల్ల ఈ సమస్య వస్తుంటే దానికి కారణాలు కనుగొని చికిత్స అందించడం వల్ల ఆ తర్వాత వచ్చే సింకోప్‌లను నివారించవచ్చు.
- అకస్మాత్తుగా లేవడం, అకస్మాత్తు కదలికల వల్ల వచ్చే పోష్చురల్ హైపోటెన్షన్ సింకోప్‌ను అకస్మాత్తు కదలికలు లేకుండా చూసుకోవడం ద్వారా నివారించవచ్చు. ఉదాహరణకు పక్క మీద నుంచి లేచేప్పుడు మెల్లగా లేవడం, వెంటనే నిలబడకుండా కొద్ది సేపు కూర్చోవడం.. ఇలా కదలికలు క్రమంగా ఉండేలా చూసుకోవడంతో ఈ తరహా సింకోప్ రాకుండా చూసుకోవచ్చు.
- ఇది డీ హైడ్రేషన్ సమస్య వల్ల వస్తే తగినన్ని ద్రవాలు అందేలా చూసుకోవడం వల్ల కూడా సింకోప్‌ను నివారించవచ్చు.

## సింకోప్‌కు కారణాలు

- **గుండె నిర్మాణపరమైనవి :** కొన్నిసార్లు గుండెలో నిర్మాణపరంగా ఏవైనా తేడాలు ఉండటం వల్ల మెదడులాంటి కీలక అవయవాలకు తగినంత రక్తాన్ని పంప్ చేయలేకపోవచ్చు. ఉదాహరణకు గుండె కండరాలు బలహీనంగా మారడం వల్లనో, లేదా కార్డియోమయోపతి అన్న కండిషన్‌లో సింకోప్ రావచ్చు.
- **గుండె కవాటాల్లో మార్పులు :** గుండె కవాటాలు రక్తాన్ని నిర్దిష్టంగా ఒకే దిశలో ప్రవహించేలా చూస్తుంటాయి. కొన్నిసార్లు గుండె కవాటాలు సన్నబడవచ్చు. ఇలా జరగడాన్ని 'స్టెనోసిస్' అంటారు. కొన్నిసార్లు అవి లీక్ కావచ్చు. ఇలా జరగడాన్ని 'ఇన్‌సఫిషియెన్సీ' లేదా 'రీ-గర్జిటేషన్' అంటారు. ఈ కండిషన్స్‌లో దేనివల్లనైనా సింకోప్ రావచ్చు.
- **మితిమీరిన వ్యాయామం :** కొందరు వ్యక్తుల్లో... అంటే మరీ ముఖ్యంగా క్రీడాకారులు / అథ్లెట్లలో గుండె కండరాలు మందం కావడం వల్ల కూడా సింకోప్ రావచ్చు. అతి వ్యాయామంతో గుండెపై విపరీతమైన భారం పడేలా పనిచేయించడం వల్ల ఈ కండిషన్ ఏర్పడే అవకాశముంది.
- **పోష్చురల్ హైపోటెన్షన్ :** కొన్ని సందర్భాల్లో పక్క మీద పడుకున్న వ్యక్తి స్థిమితంగా కాకుండా హడావుడిగా లేదా అకస్మాత్తుగా నిల్చునప్పుడు... అతడి కదలికలకు తగ్గట్లుగా గుండె తన స్పందనలను అంతే వేగంగా పెంచుకోలేదు. దాంతో వేగంగా జరిగే శరీర కదలికకు అనుగుణంగా గుండె స్పందన వేగం పెరగకపోవడంతో... కీలక అవయవాలకు రక్త ప్రసరణ తగ్గుతుంది. ఇలా జరగడాన్ని 'పోష్చురల్ హైపోటెన్షన్' అంటారు.
- **వేసోవేగల్ సింకోప్ :** నరాల పనితీరు వ్యవస్థలో మన సంకల్పం లేకుండా దానంతట అవే జరిగేపోయేవి, మన సంకల్పంతో జరిగేవి అని రెండు రకాలు ఉంటాయి. ఈ రెండిటికీ మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కూడా కొన్నిసార్లు 'సింకోప్' కండిషన్ వస్తుంది. వేగస్ అనే నరం గుండె వేగాన్ని నెమ్మదించేలా చేస్తుంది. అది ఒక్కోసారి గుండె వేగాన్ని బాగా తగ్గిస్తుంది. ఇలా వేగస్ నరం వల్ల గుండె వేగం మందగిస్తే దాన్ని వేసోవేగల్ సింకోప్ అంటారు.

తీవ్రమైన నొప్పి వచ్చినప్పుడు ఒక్కోసారి ఆ విపరీతమైన నొప్పి వేగస్ నరాన్ని ప్రేరేపిస్తుంది. ఒక్కోసారి తీవ్రమైన / విపరీతమైన ఒత్తిడులు (సివియర్ స్ట్రెస్) కూడా వేగస్ నరాన్ని ప్రేరేపిస్తాయి. ఏదైనా దుర్వార్త విన్నప్పుడు కొందరు స్పృహ తప్పడానికి కారణం కూడా ఈ సింకోపే. కొందరు రక్తం చూసినప్పుడు లేదా కత్తులు- కటార్ల వంటి మారణాయుధాలు చూసినప్పుడు కూడా ఇలా స్పృహ తప్పడం దీనివల్లనే.

---

## మరికొన్ని కారణాలు

- **పేగుల కదలికలు తగ్గడం :** కొందరిలో జీర్ణక్రియలో జరుగుతుండే పేగుల కదలికలు (బవెల్ మూవ్‌మెంట్స్), విపరీతంగా తగ్గడం కూడా వేగస్ నరం మీద ఒత్తిడి కలిగింవచ్చు. అప్పుడు కూడా సింకోప్ కండిషన్ వస్తుంది.
- **అకస్మాత్తుగా తల తిప్పడం వల్ల...** కొందరు అకస్మాత్తుగా తలతిప్పడం వల్ల వేగస్ నరం మీద ఒత్తిడి పెరుగుతుంది. ఆ వెంటనే అది మళ్లీ సింకోప్ కండిషన్‌కు దారితీస్తుంది.
- **రక్తహీనత ...** అనీమియా అనే రక్తహీనత కండిషన్ కూడా సింకోప్‌కు కారణం. అనిమియా కండిషన్‌లో రక్తంలో తగినన్ని ఎర్రరక్తకణాలు లేకపోవడంతో మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో కూడా సింకోప్ రావచ్చు.
- **శరీరంలో నీరు / ద్రవాలు తగ్గడం :** ఒక్కోసారి దేహంలో నీరు / ద్రవాలు తగ్గడం (డీ-హైడ్రేషన్) వల్ల కూడా సింకోప్ రావచ్చు. కొందరిలో చాలా ఎక్కువగా వాంతులు కావడం వల్లగానీ లేదా నీళ్ల విరేచనాల (డయేరియా) వల్ల గానీ లేదా విపరీతంగా చెమటలు పట్టడం వల్ల శరీరంలో దేహంలో నీటి / ద్రవాల మోతాదులు తగ్గవచ్చు. డయాబెటిస్ సమస్య ఉన్న కొందరిలో వారు మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సిరావడం వల్ల కూడా వాళ్ల శరీరం డీ హైడ్రేషన్‌కు లోనుకావచ్చు.

ఈ కండిషన్లు కొందరిలో సింకోప్‌కు దారితీసేందుకు అవకాశముంది.

## చివరగా...

ప్రతినిత్యం తగినన్ని నీళ్లు తాగుతూ, అన్ని రకాల పోషకాలనూ తీసుకుంటూ, మానసిక ఒత్తిడికి దూరంగా ఉన్నవారిలో సింకోప్ సమస్య చాలా అరుదు. అందుకే అందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తూ ఉండటం అన్నది కేవలం సింకోప్ నివారణకు మాత్రమే కాకుండా అన్నివిధాలా ఆరోగ్యంగా ఉండటానికీ దోహదపడుతుందని గుర్తుంచుకోవాలి.

నిర్వహణ: యాసీన్

## బిజినెస్ రీల్

### ఒప్పో కే14ఎక్స్ ఫోన్ల అమ్మకాలు షురూ

రూ. 14,999 నుంచి ధర ప్రారంభం

**న్యూఢిల్లీ:** కే14ఎక్స్ 5జీ ఫోన్ల అమ్మకాలు ప్రారంభించినట్లు స్మార్ట్‌ఫోన్ల దిగ్గజం ఒప్పో ఇండియా తెలిపింది. దీని ధర వేరియంట్‌ని బట్టి రూ. 14,999 నుంచి ప్రారంభమవుతుంది. కాగా తమ ఈ–స్టోర్, ఫ్లిప్‌కార్ట్‌పై సేల్ రోజున రూ. 1,500 వరకు తక్షణ డిస్కౌంటుతో రూ. 13,499 నుంచి పొందవచ్చని సంస్థ తెలిపింది. ఫిబ్రవరి 20 తర్వాత నుంచి రెండు వేరియంట్లపై రూ. 1,000 డిస్కౌంటు ఉంటుందని పేర్కొంది. ఇందులో 6.75 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, 45 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్, 50 ఎంపీ ఏఐ కెమెరా, కలర్‌ఓఎస్ 15 మొదలైన ఫీచర్లు ఉన్నాయి.

### బజాజ్ అలయంజ్ ఇన్సూరెన్స్ నుంచి 'ఎన్ఆర్ఇన్సూర్'

**పుణె:** ప్రవాస భారతీయుల (ఎన్నారైలు, ఓసీఐలు) కోసం మై హెల్త్ కేర్ ప్లాన్‌కి (ఎంహెచ్‌సీపీ) యాడ్ ఆన్‌గా ఎన్ఆర్ఇన్సూర్‌ను ప్రవేశపెట్టినట్లు బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. దీనితో ఎంహెచ్‌సీపీ ప్లాన్లవ్యాప్తంగా బేస్ పాలసీ ప్రీమియంలో 35 శాతం డిస్కౌంట్ పొందవచ్చని వివరించింది. కొత్తగా పాలసీని కొనుగోలు చేసేటప్పుడే ఈ యాడ్–ఆన్‌ని ఎంచుకోవచ్చు. అర్హత గల కస్టమర్లు తమ ఎన్నారై/ఓసీఐ హోదాకు సంబంధించిన పత్రాలను సమర్పించిన మీదట డిస్కౌంటు పొందవచ్చు. విదేశాల్లో ఉంటూ, స్వదేశానికి తిరిగి వచ్చే ప్రణాళికల్లో ఉన్న ఎన్నారైల ఆరోగ్య బీమా అవసరాలను తీర్చే విధంగా ఇది ఉంటుందని కంపెనీ సీటీవో అమర్నాథ్ సక్సేనా తెలిపారు.

### ఐస్‌మేక్ రిఫ్రిజిరేషన్ ఆదాయం 39 శాతం వృద్ధి

**ముంబై:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో పారిశ్రామిక రిఫ్రిజిరేషన్ సొల్యూషన్స్ సంస్థ ఐస్‌మేక్ రిఫ్రిజిరేషన్ ఆదాయం 39 శాతం వృద్ధి చెందింది. రూ. 111 కోట్ల నుంచి రూ. 153 కోట్లకు చేరింది. లాభం రూ. 2.81 కోట్ల నుంచి రూ. 1.45 కోట్లకు తగ్గింది. ముడివస్తువులు, ఫైనాన్స్ వ్యయాలతో మార్జిన్లపై ఒత్తిడి నెలకొందని, రెండు కొత్త విభాగాలను కూడా ప్రారంభించామని సంస్థ తెలిపింది. డైవర్సిఫైడ్ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోతో మార్కెట్లో విస్తరిస్తున్నట్లు సంస్థ సీఈవో ఎం శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

17-2-2026

| | |
|---|---|
| విశాఖ | 515–00 |
| చిత్తూరు | 593–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 515–00 |
| విజయవాడ | 525–00 |
| రిటైల్ ధర (డజను) | 75.00 |
| హైదరాబాద్ | 520–00 |
| వరంగల్ | 522–00 |
| రిటైల్ ధర | 5.80 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BHARTIARTL | 2,104.90 | 1.7 |
| TITAN | 3,930.00 | 1.65 |
| TATACONSUM | 1,172.00 | 1.26 |
| M&M | 3,628.90 | 0.58 |
| BAJAJ-AUTO | 8,989.00 | 0.55 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| AXISBANK | 1,219.00 | -5.12 |
| ETERNAL | 284.5 | -4.67 |
| JSWSTEEL | 1,085.10 | -2.66 |
| HCLTECH | 1,651.80 | -1.91 |
| TATASTEEL | 169.8 | -1.78 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,506 |
| ఎన్ఎస్ఈ | 89,436 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,69,728 |
| ఎఫ్ఐఐ | - 972 |
| డీఐఐ | + 1,667 |

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 63.44 (రాత్రి 11.30కు) | $ 62.75 (క్రితం ముగింపు) |
| బ్రెంట్ | 68.46 (రాత్రి 11.30కు) | $ 67.75 (క్రితం ముగింపు) |

# రూ.215 లక్షల కోట్లకు రిటైల్ మార్కెట్

- పదేళ్లలో రెట్టింపు స్థాయికి
- అత్యుత్తమ నిర్వహణతోనే విజయం
- బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ నివేదిక

**న్యూఢిల్లీ:** దేశ రిటైల్ మార్కెట్ వేగవంతమైన వృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. 2025 నాటికి భారత రిటైల్ మార్కెట్ రూ.90–95 లక్షల కోట్ల పరిమాణంతో ఉండగా, 2035 నాటికి అంటే వచ్చే పదేళ్లలో రూ.210–215 లక్షల కోట్ల స్థాయికి విస్తరిస్తుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) అంచనా వేసింది. ప్రపంచంలోని ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలకు మించి భారత్ మంచి పనితీరు చూపిస్తుండడంతోపాటు, మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి చేరుకోనున్నట్టు గుర్తు చేసింది. భారత రిటైల్ రంగం తదుపరి వృద్ధి దశలోకి ప్రవేశించిందంటూ.. స్పష్టత, క్రమశిక్షణతో కూడిన నిర్వహణ, ఏఐ ఆధారిత పరివర్తనపై దృష్టి సారించిన సంస్థలను విజయం వరిస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఒక నివేదికను బీసీజీ, రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా విడుదల చేశాయి. వినియోగదారులతో అనుబంధం, నిర్వహణ నమూనాలు, నైపుణ్యాల విషయంలో నిర్మాణాత్మక మార్పులను స్వీకరించే సంస్థలు రూ.200 లక్షల కోట్ల రిటైల్ మార్కెట్‌లో గణనీయమైన విలువను సొంతం చేసుకుంటాయని ఈ నివేదిక తెలిపింది. కస్టమర్లకు ప్రత్యేకమైన విలువను అందించడం, స్థిరమైన లాభదాయకతను కొనసాగించేందుకు క్రమశిక్షణతో కూడిన నిర్వహణ ఎంతో కీలకమని పేర్కొంది. వినియోగదారుల నిర్ణయాలను, ముఖ్యంగా ఏఐ ప్రభావితం చేస్తుండడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది.

#### టెక్నాలజీ పాత్ర కీలకం..

''భారత రిటైల్ ఒక స్ఫూర్తిదాయక ప్రయాణం. వచ్చే దశాబ్ద కాలంలో రూ.200 లక్షల కోట్లకు విస్తరించనుంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రిటైల్ సంస్థల నగదు ప్రవాహాలు స్పష్టమైన పురోగతిని చూపిస్తున్నాయి. విస్తరణలో ఏఐ వంటి టెక్నాలజీల విస్తృత వినియోగం, అత్యుత్తమ నిర్వహణ, ప్రత్యేకమైన విలువను అందించే సంస్థలే విజేతలుగా నిలుస్తాయి''అని బీసీజీ ఎండీ అభీక్‌సింఘి తెలిపారు. ఏజెంటిక్ కామర్స్ అన్నది ప్రయోగాత్మక దశ నుంచి ఆచరణ దశకు వచ్చేసిందని.. పరిశోధన, కొనుగోలు నిర్ణయాలను జెన్‌ఏఐ ప్రభావితం చేస్తోందని ఈ నివేదిక తెలిపింది. అమెరికాలో ఇప్పటికే 42 శాతం మంది వినియోగదారులు జెన్‌ఏఐని వినియోగిస్తున్నట్టు పేర్కొంది. ''వినియోగదారులు ఉత్పత్తిని గుర్తించడం, పరిశీలించడం, కొనుగోలు చేయడాన్ని అంతర్జాతీయంగా ఏజెంటిక్ కామర్స్ ప్రభావితం చేస్తోంది. భారత్‌లో డిజిటల్ వినియోగం బలంగా ఉంది. కనుక పట్టణ ప్రాంతాల్లో ఏఐ ఆధారిత షాపింగ్, ముఖ్యంగా జెన్ జెడ్‌లో వేగవంతం అవుతుంది''అని బీసీజీ ఎండీ, పార్ట్‌నర్ భారత్ మిమానీ తెలిపారు. ఉత్పత్తులు, సరఫరా చైన్, మార్కెటింగ్, సేవలు ఇలా అన్నింటా ఏఐ వినియోగంతో 40–60 శాతం అధిక ప్రయోజనాలను రిటైలర్లు పొందగలరని ఈ నివేదిక తెలిపింది. ''డిమాండ్ బలంగా ఉంది. వినియోగదారులు వివేకంతో వ్యవహరిస్తున్నారు. రిటైలర్లు ఆవిష్కరణలకు ఆసక్తి చూపిస్తున్నారు. డిజిటల్ పరివర్తనను ఒక ప్రాజెక్టుగా కాకుండా క్రమశిక్షణగా పరిగణించే సంస్థలు, అన్ని ఫార్మాట్లలో స్థిరమైన సేవలు అందించేవి వచ్చే దశాబ్దంలో విజేతలుగా నిలుస్తాయి'' అని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో కుమార్ రాజగోపాలన్ అభిప్రాయపడ్డారు.

## టీసీఎస్‌తో ఏఎండీ బంధం బలోపేతం

### భారత్‌లో ర్యాక్-స్కేల్ ఏఐ మౌలిక సదుపాయాల డిజైనింగ్



**న్యూఢిల్లీ:** అమెరికన్ దిగ్గజం ఎన్‌విడియాకి భారత మార్కెట్లో దీటుగా పోటీనిచ్చేందుకు ఐటీ దిగ్గజం టీసీఎస్, అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ (ఏఎండీ) తమ భాగస్వామ్యాన్ని మరింతగా విస్తరించాయి. టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏఐ డేటా సెంటర్ లిమిటెడ్‌తో కలిసి అమెరికన్ సంస్థ ఏఎండీ తమ హీలియోస్ ప్లాట్‌ఫాం ఆధారంగా పెద్ద కంపెనీలకు అవసరమయ్యే 'ర్యాక్–స్కేల్ ఏఐ' మౌలిక సదుపాయాలను డిజైన్ చేయనుంది. పనితీరును మరింత మెరుగుపర్చుకునేందుకు, ఎంటర్‌ప్రైజ్ ఏఐని అమలు చేసేందుకు పట్టే సమయాన్ని తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుంది. సోమవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన ఏఐ ఇంపాక్ట్ సమిట్ సందర్భంగా కంపెనీలు దీన్ని ప్రకటించాయి. భాగస్వామ్యం ప్రకారం ఏఎండీ తమ ఫుల్–స్టాక్ ఏఐ కంప్యూట్ ప్లాట్‌ఫాంను, టీసీఎస్ తమ డేటా సెంటర్ ఇంజినీరింగ్, ఇంటిగ్రేషన్ సామర్థ్యాలను ఉపయోగించనున్నాయి. లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్, ఏఐ శిక్షణ మొదలైన వాటి కోసం కంపెనీలు, ప్రభుత్వాలు కంప్యూట్ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న నేపథ్యంలో ఏఐ మౌలిక సదుపాయాల సెగ్మెంట్లో ఏఎండీ నేరుగా జీపీయూల తయారీ దిగ్గజం ఎన్‌విడియాతో పోటీపడనుంది.

## జేఎస్‌డబ్ల్యూ ఎంజీ నుంచి 'మెజెస్టర్' ఎస్‌యూవీ

### మే నాటికి మార్కెట్లోకి

**న్యూఢిల్లీ:** ఆటోమొబైల్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా తమ కొత్త ప్రీమియం ఎస్‌యూవీ 'మెజెస్టర్'ని ఆవిష్కరించింది. ఇది ఈ ఏడాది ఏప్రిల్–మే నాటికి మార్కెట్లోకి రానుంది. టయోటా ఫార్చ్యూనర్ తదితర మోడల్స్‌కి పోటీగా ఉండనుంది. ఈ ఏడాది మొత్తం మీద 4 మోడల్స్‌ని ప్రవేశపెట్టనున్నట్లు, ఇవన్నీ ఎస్‌యూవీలేనని కంపెనీ ఎండీ అనురాగ్ మెహ్రోత్రా తెలిపారు. ప్రస్తుతం వార్షికంగా 1.2 లక్షల యూనిట్లుగా ఉన్న ఉత్పత్తిని వచ్చే ఐదేళ్లలో 3 లక్షలకు పెంచుకోనున్నట్లు చెప్పారు. దేశీయంగా తయారీని పెంచుకోవడంతో పాటు కొత్త మోడల్స్‌ని తేనున్నామని తెలిపారు. ప్లాంటు విస్తరణపై రూ. 4,000 కోట్ల నుంచి రూ. 5,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయనున్నామని మెహ్రోత్రా చెప్పారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు సుమారు 18 నెలలు పట్టొచ్చని వివరించారు. జీఎస్‌టీ క్రమబద్ధీకరణ తర్వాత ప్యాసింజర్ వాహనాల పరిశ్రమ వృద్ధి రెండంకెల స్థాయిలో ఉంటుందని అంచనా వేస్తున్నట్లు మెహ్రోత్రా తెలిపారు. 2025లో 4.5 శాతంగా ఉన్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం 2026లో 7–8 శాతానికి పెరగొచ్చని వివరించారు.

## జీప్ మెరీడియన్ ట్రాక్ ఎడిషన్

### ధర రూ. 35,95,000 నుంచి ప్రారంభం

**న్యూఢిల్లీ:** మెరీడియన్ వాహనానికి సంబంధించి ట్రాక్ ఎడిషన్‌ని ప్రవేశపెట్టినట్లు జీప్ ఇండియా వెల్లడించింది. దీని ధర రూ. 35,95,000 నుంచి ప్రారంభమవుతుందని తెలిపింది. 18 అంగుళాల డైమండ్ కట్ అలాయ్ వీల్స్, డార్క్ ఎస్‌ప్రెసో గ్రిల్, సిగ్నేచర్ ట్రాక్ ఎడిషన్ హుడ్ డెకాల్ తదితర ఫీచర్లు ఈ 7 సీటర్‌లో ఉంటాయి. జీప్ కాన్ఫిడెన్స్ ఓనర్‌షిప్ ప్రోగ్రాం కింద ఏడేళ్ల పాటు వారంటీ, అష్యూర్డ్ బైబ్యాక్, మెయింటెనెన్స్ ప్యాకేజ్ మొదలైన ప్రయోజనాలు పొందవచ్చని సంస్థ తెలిపింది.

## బీమా కంపెనీల్లో 100 శాతం ఎఫ్‌డీఐలు

### నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖలో భాగమైన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఆటోమేటిక్ పద్ధతిలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మాత్రం 20 శాతానికే అనుమతి ఉంటుంది. విదేశీ పెట్టుబడులున్న భారతీయ బీమా కంపెనీల విషయంలో బోర్డ్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లలో కనీసం ఒక్కరైనా రెసిడెంట్ భారతీయ పౌరులై ఉండాలి. ఇన్సూరెన్స్ చట్టాల సవరణకు సంబంధించిన సబ్‌కా బీమా సబ్‌కీ రక్షా బిల్లు 2025ని డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదముద్ర వేసింది.

## దశాబ్దంలో 2 బిలియన్ డాలర్లకు పెట్ ఫుడ్ విభాగం

**న్యూఢిల్లీ:** దేశీయంగా పెట్ ఫుడ్ మార్కెట్ దశాబ్ద కాలంలో 2 బిలియన్ డాలర్ల స్థాయికి వృద్ధి చెందనుందని డైవర్సిఫైడ్ వ్యాపార దిగ్గజం మార్స్ భారత పెట్ న్యూట్రిషన్ విభాగం కొత్త ఎండీ మనీష్ స్యాగ్ తెలిపారు. ఈ నేపథ్యంలో తమ పోర్ట్‌ఫోలియోను మరింత పటిష్టం చేసుకుంటున్నట్లు వివరించారు. సలిల్ మూర్తి స్థానంలో మనీష్ నియమితులైనట్లు మార్స్ తెలిపింది. పెడిగ్రీ, విస్కాస్, షెబాలాంటి పెట్ ఫుడ్ బ్రాండ్స్ వ్యాపారానికి ఆయన సారథ్యం వహిస్తారని వివరించింది. ఎఫ్‌ఎంసీజీ విభాగంలో మనీష్‌కి రెండు దశాబ్దాల పైగా అనుభవం ఉంది.

## టీజీఐ గ్రూప్‌తో ఆర్‌సీపీఎల్ జట్టు

**న్యూఢిల్లీ:** నైజీరియాకి చెందిన ట్రోపికల్ జనరల్ ఇన్వెస్ట్‌మెంట్స్ గ్రూప్ (టీజీఐ)తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్) వెల్లడించింది. ఈ జేవీలో తమకు మెజారిటీ వాటా ఉంటుందని పేర్కొంది. ఆఫ్రికాలో అతి పెద్ద మార్కెట్లలో ఒకటైన నైజీరియాలో కార్యకలాపాలను పటిష్టం చేసుకోవడం ద్వారా అంతర్జాతీయంగా మరింతగా విస్తరించనున్నట్లు వివరించింది. ఈ ఒప్పందం ప్రకారం టీజీఐ నెట్‌వర్క్‌ని ఉపయోగించుకుని ఆర్‌సీపీఎల్ తమ ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులను నైజీరియాలో ప్రవేశపెడుతుంది. టీజీఐ గ్రూప్‌నకు ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, ఆసియా దేశాల్లో ఎఫ్‌ఎంసీజీ, పారిశ్రామిక రసాయనాలు, ఫార్మా తదితర విభాగాల్లో కార్యకలాపాలు ఉన్నాయి. 2025 డిసెంబర్‌లో రిలయన్స్ రిటైల్ నుంచి విడదీసిన ఆర్‌సీపీఎస్ భారత్‌లో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాల్లో ఒకటి. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం వార్షికంగా 60 శాతం ఎగిసి రూ. 5,065 కోట్లకు చేరింది.

## ఇంటెల్‌పై సీసీఐ రూ. 27 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ:** పోటీని దెబ్బతీసే విధానాలను పాటించినందుకు గాను ఇంటెల్ కార్పొరేషన్‌పై కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) రూ. 27.38 కోట్ల జరిమానా విధించింది. డెస్క్‌టాప్స్‌లో ఉపయోగించే బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్లకు (బీఎంపీ) సంబంధించి భారత్‌కి మాత్రమే పరిమితమయ్యే వారంటీ పాలసీని వర్తింప చేయడం ద్వారా మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కంపెనీ దుర్వినియోగం చేసిందని సీసీఐ పేర్కొంది. చైనా, ఆస్ట్రేలియా, ఇతరత్రా ప్రపంచదేశాల్లో కంపెనీల పాటించే వారంటీ పాలసీలతో పోల్చినప్పుడు భారత్‌లో అమలు చేస్తున్న విధానం వివక్షపూరితమైనదని తెలిపింది. భారత్‌లోని అధీకృత పంపిణీదారు నుంచి కొనుగోలు చేస్తేనే బీఎంపీలకు వారంటీ చెల్లుబాటయ్యేలా, మిగతా ఎక్కడా లేని విధంగా ఇండియాకు మాత్రమే పరిమితమయ్యే విధంగా పాలసీని ఇంటెల్ అమలు చేయడం సరికాదంటూ మ్యాట్రిక్స్ ఇన్ఫో సిస్టమ్స్ చేసిన ఫిర్యాదుపై సీసీఐ ఈ ఆదేశాలిచ్చింది.

## యూపీలో మెగా కంప్యూట్ హబ్ అభివృద్ధి ప్రారంభం: ఏఎం గ్రూప్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఉత్తర్‌ప్రదేశ్‌లో తలపెట్టిన 1 గిగావాట్ హై పర్ఫార్మెన్స్ ఏఐ కంప్యూట్ హబ్ ప్రాజెక్టు అభివృద్ధి ప్రక్రియ ప్రారంభమైనట్లు ఏఎం గ్రూప్ వెల్లడించింది. రెండు దశల్లో 350 మెగావాట్ సామర్థ్యం మేర పనులు పూర్తి చేయడం కోసం అనుబంధ సంస్థ ఏఎం ఏఐ ల్యాబ్స్‌కి స్థలాన్ని కేటాయిస్తూ యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తాజాగా లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ని జారీ చేసినట్లు పేర్కొంది. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించి జనవరి 20న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వంతో ఏఎం గ్రూప్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం 2028 నాటికి 350 మెగావాట్లు, 2030 నాటికి మొత్తం 1 గిగావాట్ కంప్యూట్ సామర్థ్యం అందుబాటులోకి రానుంది. 25 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రణాళికలున్నాయి. ఇందులో 5,00,000 హై పర్ఫార్మెన్స్ చిప్‌లను ఉపయోగించనున్నారు. గ్రీన్ హైడ్రోజన్, అమోనియా తరహాలోనే అత్యంత చౌకైన, సమర్థవంతమైన ఏఐ టోకెన్లను అందుబాటులోకి తేవడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఏఎం గ్రూప్ చైర్మన్ అనిల్ చలమలశెట్టి తెలిపారు.

## బ్యాంకుల్లో మిస్ సెల్లింగ్‌కు ముగింపు!

### ప్రోత్సాకాలు వద్దన్న ఆర్‌బీఐ

**ముంబై:** బ్యాంకుల్లో బీమా సహా ఇతర ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడాన్ని (మిస్ సెల్లింగ్) నిరుత్సాహపరిచే నిబంధనలను ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ''ఉత్పత్తులు/సేవల విక్రయాలను పెంచుకునేందుకు గాను, మిస్ సెల్లింగ్ లేదా ఉద్యోగులను ప్రోత్సహించే విధంగా బ్యాంక్ విధానాలు, పద్ధతులు లేకుండా చర్యలు తీసుకోవాలి''అని ఆర్‌బీఐ తన ముసాయిదా నిబంధనల్లో పేర్కొంది. ఉత్పత్తులు/సేవల విక్రయాలకు సంబంధించి వివిధ యూనిట్ల మధ్య పోటీలను నిర్వహించడాన్ని ఉదాహరణగా ఆర్‌బీఐ పేర్కొంది. థర్డ్ పార్టీ (బ్యాంకు సొంతం కానివి) ఉత్పత్తులు/సేవల మార్కెటింగ్/విక్రయాలపై ఉద్యోగులకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ప్రోత్సాహకాలు ఉండరాదని స్పష్టం చేసింది. అలాగే, బ్యాంక్‌లు తన ఉత్పత్తికి జోడింపుగా (బండిల్డ్) థర్డ్ పార్టీ ఉత్పత్తి విక్రయాన్ని చేపట్టరాదని కోరింది. ఈ విషయంలో కస్టమర్లకు ఒకటికి మించి ఆప్షన్లు అందించాలని నిర్దేశించింది. ఒకవేళ కస్టమర్‌ను తప్పుదోవ పట్టించి ఉత్పత్తిని విక్రయించినట్టు తేలితే.. అంత మొత్తాన్ని తిరిగి వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీనికి అదనంగా కస్టమర్‌కు ఏదైనా నష్టం కలిగితే అంత మేర పరిహారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

## బీఈ పోలియో టీకాకి డబ్ల్యూహెచ్‌వో ప్రీ-క్వాలిఫికేషన్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** బయోలాజికల్ ఈ–లిమిటెడ్ (బీఈ)కి చెందిన ఓరల్ పోలియో వేక్సిన్ టైప్2కి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) రెండో విడత ప్రీ–క్వాలిఫికేషన్‌ని మంజూరు చేసింది. దీనితో ఒకే సైటులో ఎన్‌వోపీవీ2 టీకా ముడిపదార్థాల నుంచి అంతిమ ఉత్పత్తి వరకు పూర్తి తయారీ ప్రక్రియకు సర్టిఫికేషన్ లభించినట్లయిందని బీఈ తెలిపింది. ఇప్పటికే 70 కోట్ల పైగా ఎన్‌వోపీవీ2 డోసులను అంతర్జాతీయంగా సరఫరా చేసినట్లు పేర్కొంది. సమగ్ర మౌలిక సదుపాయాలు, ఆమోదముద్ర పొందిన ప్రక్రియలు, ఎగుమతులకు నియంత్రణ సంస్థల నుంచి అన్ని అనుమతులు ఇప్పటికే అందుబాటులో ఉన్న నేపథ్యంలో డిమాండ్‌కి తగ్గట్లు గ్లోబల్‌గా సరఫరా చేయగలమని కంపెనీ ఎండీ మహిమా దాట్ల తెలిపారు.

# 5 కంపెనీల లిస్టింగ్ బాట

- సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్
- జాబితాలో డ్యురోఫ్లెక్స్
- విరూపాక్ష ఆర్గానిక్స్...

రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల కారణంగా సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతూనే ఉన్నాయి. తాజాగా ఐదు కంపెనీల లిస్టింగ్ ప్రణాళికలకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఐపీవోల జోరు కొనసాగనుంది. వివరాలు చూద్దాం..

ఐపీవో స్ట్రీట్

**న్యూఢిల్లీ:** కొత్త కేలండర్ ఏడాదిలోనూ 2025 బాటలో పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగుతోంది. తాజాగా సెబీ ఐదు కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు అనుమతించింది. జాబితాలో విరూపాక్ష ఆర్గానిక్స్, డ్యురోఫ్లెక్స్, ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, హెక్సాగాన్ న్యూట్రిషన్, ఓమ్ పవర్ ట్రాన్స్‌మిషన్ చేరాయి. ఈ కంపెనీలన్నీ సెబీకి 2025 సెప్టెంబర్– అక్టోబర్ కాలంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. కాగా.. 2025లో తొలిసారి దేశీ ప్రైమరీ మార్కెట్ల చరిత్రలోనే అత్యధికంగా 103 కంపెనీలు రూ. 1.76 లక్షల కోట్లను సమీకరించిన విషయం విదితమే.

### ఆర్అండ్‌డీ ఫార్మా

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించిన ఫార్మాస్యూటికల్ రంగ కంపెనీ విరూపాక్ష ఆర్గానిక్స్ ఐపీవోకు వస్తోంది. ఇందుకు అనుగుణంగా రూ. 740 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అయితే ఐపీవోకు ముందుగా రూ. 148 కోట్ల విలువైన ప్లేస్‌మెంట్‌కు వీలున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 360 కోట్లు సామర్థ్య విస్తరణ కోసం పెట్టుబడి వ్యయాలకు కేటాయించనుంది. మరో రూ. 195 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ పరిశోధన– అభివృద్ధి(ఆర్అండ్‌డీ) ఆధారిత ఫార్మాస్యూటికల్ కంపెనీగా నిలుస్తోంది. సంబంధిత ఏపీఐలు, ఇంటర్మీడియేట్స్ తయారీ చేపడుతోంది.

### పరుపుల తయారీ

పరుపుల తయారీలో సుప్రసిద్ధమైన డ్యురోఫ్లెక్స్ పబ్లిక్ ఇష్యూ చేపట్టనుంది. దీనిలో భాగంగా రూ. 184 కోట్ల విలువైన ఈక్విటీ జారీతోపాటు.. కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు 2.25 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను ముంబై కంపెనీ 120 సొంత, నిర్వహణా స్టోర్ల ఏర్పాటుకు వెచ్చించనుంది. అంతేకాకుండా ప్రస్తుత కోకో స్టోర్ల లీజ్, రెంట్, లైసెన్స్ ఫీజులతోపాటు తయారీ యూనిట్ ఏర్పాటుకు సైతం వినియోగించనుంది. 1963లో ఏర్పాటైన డ్యురోఫ్లెక్స్ మార్కెట్ వాటా రీత్యా దేశీయంగా పరుపుల తయారీలోని టాప్–3 కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. ఫర్నీచర్‌సహా బెడ్డింగ్ సంబంధిత ప్రొడక్టులను సైతం తయారు చేస్తోంది.

### విస్తరణపై దృష్టి

వెల్డింగ్ కన్జూమబుల్స్ పరిశ్రమలో వినియోగించే పౌడర్లు, వైర్ల తయారీ చేపట్టే ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఐపీవోకు రానుంది. దీనిలో భాగంగా రూ. 2.25 కోట్ల విలువైన ఈక్విటీ జారీతోపాటు.. ప్రస్తుత వాటాదారులు 54 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను హోసడ్, ఖాలాపూర్(మహారాష్ట్రలోని రాయ్‌గఢ్) వద్ద కొత్తగా వైర్ తయారీ ప్లాంటును ఏర్పాటు చేయడంతోపాటు.. వాడా, పాల్ఘర్(మహారాష్ట్ర)లో గల యూనిట్ విస్తరణకు వినియోగించనుంది. అంతేకాకుండా మరికొన్ని నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం వెచ్చించనుంది.

### పెట్టుబడి వ్యయాలకు

హైవోల్టేజీ, ఎక్స్‌ట్రా హైవోల్టేజీ విద్యుత్ ప్రసార లైన్లు, సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసే ఓమ్ పవర్ ట్రాన్స్‌మిషన్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా 90 లక్షల షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 10 లక్షల షేర్లు ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను మెషీనరీ, పరికరాల కొనుగోలు, రుణ చెల్లింపులు, దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లతో పాటు.. భూగర్భ కేబుళ్ల ప్రాజెక్టులు, సమీకృత నిర్వహణా సర్వీసులు తదితర కార్యకలాపాలు సైతం చేపడుతోంది.

### వెల్‌నెస్ ప్రొడక్టులతో

విభిన్న మైక్రోన్యూట్రియంట్ ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్న హెక్సాగాన్ న్యూట్రిషన్ ఐపీవోకు వస్తోంది. దీనిలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు 3.08 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. 1993లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా వివిధ మైక్రోన్యూట్రియంట్ ప్రీమిక్స్‌లతోపాటు.. బ్రాండెడ్ వెల్‌నెస్, క్లినికల్ న్యూట్రిషన్, థెరప్యూటిక్ ఫార్ములేషన్స్, వినియోగానికి సిద్ధంగా ఉండే(రెడీ టు యూజ్) ఆహారోత్పత్తులను తయారు చేస్తోంది.

ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల సన్నద్ధతలో భాగంగా సోమవారం పట్నాలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న యాంటీ టెర్రరిజం స్క్వాడ్ సిబ్బంది

పశ్చిమబెంగాల్‌లో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి మోర్టార్ షెల్‌ను సురక్షితంగా పేల్చేస్తున్న ఆర్మీ బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్

జర్మనీలోని డసెల్‌డోర్ఫ్‌లో కార్నివాల్ సంబరాల్లో ఆకట్టుకుంటున్న రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్యారికేచర్లు

# అంతరిక్ష ఏఐ రేసులో భారత్ మాస్టర్ స్ట్రోక్!

**మస్క్ సామ్రాజ్యానికి 'అగ్నికుల్' జర్క్**

ప్రపంచ కుబేరుడు ఎలోన్ మస్క్ వేలాది కృత్రిమ ఉపగ్రహాలతో అంతరిక్షాన్ని ఆక్రమించాలని చూస్తున్న వేళ ఒక భారతీయ స్టార్టప్ ఆయన వ్యూహాలకు గట్టి జర్క్ ఇచ్చింది. ఖరీదైన శాటిలైట్లతో పనిలేకుండా వాడి పారేసే రాకెట్ వ్యర్థాలనే బంగారంగా మారుస్తూ అంతరిక్షంలో ఏఐ క్లౌడ్ సామ్రాజ్యాన్ని నిర్మించేందుకు చెన్నైకి చెందిన 'అగ్నికుల్ కాస్మోస్'సిద్ధమైంది. 2026 ఏడాది చివరి నాటికి జరగనున్న ఈ ప్రయోగం ఎలాన్ మస్క్ 'స్పేస్ ఎక్స్'ఆధిపత్యానికి గట్టి సవాల్ విసురుతోంది.

**మస్క్ వర్సెస్ అగ్నికుల్..**

ఎలాన్ మస్క్ ఇప్పటికే అమెరికా ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (ఎఫ్‌సీసీ)లో ఒక దరఖాస్తు సమర్పించారు. ఏకంగా 10 లక్షల కంప్యూటింగ్ శాటిలైట్లను ప్రయోగించి, నింగిలో ఒక 'సూపర్ కంప్యూటర్ నెట్‌వర్క్' నిర్మించాలనేది మస్క్ మహా ఆలోచన. దీనికోసం వేల కోట్ల రూపాయల పెట్టుబడి, భారీగా ఇంధనం ఖర్చు అవుతుంది. కానీ, అగ్నికుల్ తన పేటెంట్ టెక్నాలజీ 'సూరజ్' ద్వారా ఒక అద్భుతం చేస్తోంది. రాకెట్ తన లక్ష్యాన్ని చేరాక మిగిలిపోయే పైభాగాన్ని పారేయకుండా, దాన్నే ఒక శక్తివంతమైన ఏఐ డేటా సెంటర్‌గా మారుస్తోంది. మస్క్ కొత్త ఇల్లు కడుతుంటే, అగ్నికుల్ పాత ఇటుకలతోనే రాజప్రసాదం కడుతున్నట్టుగా ఈ 'జర్క్'టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది.

**అంతరిక్షమే ఎందుకంటే?**

భూమిపై డేటా సెంటర్లు నడపాలంటే కోట్ల లీటర్ల నీరు, నిరంతరాయంగా అత్యధిక స్థాయిలో విద్యుత్ అవసరం. పైగా పవర్ గ్రిడ్ విఫలమైతే, ఇక్కడి సెంటర్లు కేవలం 72 గంటల వరకు మాత్రమే బ్యాకప్‌తో నడవగలవు. అదే అంతరిక్షంలో అయితే సూర్యుని నుంచి అంతులేని సౌరశక్తి నిరంతరం లభిస్తుంది. సెమీకండక్టర్ వ్యవస్థలను చల్లబరిచేందుకు ప్రత్యేకంగా నీరు అక్కర్లేదు. అంతరిక్షంలోని శూన్యమే వాటిని చల్లబరుస్తుంది. అత్యంత తక్కువ ఖర్చులో మన అగ్నికుల్ ఈ అవసరాలు తీర్చనుంది.

**విశ్వ యుద్ధంలో సరికొత్త ఆర్కిటెక్ట్!**

చైనా ఇప్పటికే 2,00,000 శాటిలైట్లను ప్రయోగించాలని తలపోస్తోంది. ఎన్‌విడియా మద్దతున్న స్టార్‌క్లౌడ్ కూడా రేసులో ఉంది. కానీ భారత్ చూపుతున్న 'పునర్వినియోగ'వ్యూహం అంతర్జాతీయంగా ప్రశంసలు పొందుతోంది. నిన్నటి వరకు విదేశీ శాటిలైట్లను మోసుకెళ్లే 'లారీ డ్రైవర్' లాంటి స్థాయి నుంచి నేడు అంతరిక్షంలో మేధో సంపత్తిని నిర్మించే 'ఆర్కిటెక్ట్'స్థాయికి భారత్ ఎదిగింది. తాజాగా కేంద్ర బడ్జెట్–2026లో ప్రకటించిన ప్రోత్సాహకాలతో 2027 నాటికి భారత్ తన మొదటి అంతరిక్ష ఏఐ సేవలను ప్రపంచానికి అందించనుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

# సందర్శనలకు తులిప్ గార్డెన్ సిద్ధం

**జమ్మూకశ్మీర్‌లో 14 పర్యాటక ప్రాంతాల్లోకి సందర్శనలకు అనుమతి మంజూరు**

జమ్మూ: ఆసియాలోనే అతిపెద్దదైన సుందర తులిక్ పుష్పాల తోట సహా 14 పర్యాటక ప్రాంతాలు సందర్శనలకు సిద్ధమయ్యాయి. శ్రీనగర్‌లోని తులిప్ గార్డెన్ సహా తమ కేంద్రపాలిత ప్రాంతంలోని 14 టూరిస్ట్ స్పాట్‌లలోకి పర్యాటకులను అనుమతిస్తామని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సోమవారం ప్రకటించారు. హిమాలయ పర్వత సానువుల్లో యూస్‌మార్గ్ పచ్చికబయళ్ల వెంట విస్తరించిన ఆల్పైన్ చెట్ల సౌందర్యాన్ని ఇప్పుడు సందర్శకులు ఆస్వాదించవచ్చు. గత ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లోని బైసారన్ పచ్చికబయళ్లలో ఉగ్రవాదుల పాశవిక దాడి తర్వాత పర్యాటక ప్రాంతాల్లోకి సందర్శకుల రాకపై నిషేధం అమల్లోకి వచ్చింది. దీంతో జమ్మూకశ్మీర్ పరిధిలోని దాదాపు 50 టూరిస్ట్ స్పాట్‌లలో పర్యాటకరంగం కుదేలైంది. తాజాగా భద్రతా సమీక్షలు, తాజా పరిస్థితిని సమీక్షించాక మళ్లీ సందర్శకులను అనుమతించాలని నిర్ణయించామని లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం సోమవారం తమ సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది. యూస్‌మార్గ్, దూధ్‌పత్రి, దండిపోర పార్క్, పీర్ కీ గలీ, దూబ్‌జాన్, పాద్‌పవన్, ఆస్తాన్‌పొర, థాజ్వాస్ గ్లేసియర్, హంగ్ పార్క్, వులార్, వత్లాబ్, తులిప్ గార్డెన్‌లలోకి వెంటనే సందర్శనలకు అనుమతిస్తున్నామని సిన్హా వెల్లడించారు. జబర్వాన్ హిల్స్ సమీప మైదానంలో చక్కటి వరసల్లో రంగురంగుల లక్షలాది తులిప్ పువ్వులతో సిద్ధమైన 'ఇందిరా గాంధీ మెమోరియల్ తులిప్ గార్డెన్'కు ఈసారి భారీగా పర్యాటకులు పోటెత్తవచ్చని అధికారులు ఆశిస్తున్నారు. ఖత్రా, శ్రీనగర్ మధ్య వందే భారత్ రైలు అందుబాటులోకి రావడంతో పర్యాటకులు వేగంగా ఆయా పర్యాటక ప్రాంతాలకు చేరుకునే అవకాశం లభించింది.

## కర్ణాటకలో పులి మృతి

**ఉచ్చులో చిక్కుకుని మరణించినట్లు అనుమానం**

చామరాజనగర్: కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలో పులి మృతి చెందింది. బిలిగిరి రంగనాథ స్వామి ఆలయం టైగర్ రిజర్వ్‌లోని గుండాల్ జలాశయం సమీపంలో బ్యాక్ వాటర్‌లో ఒక మగ పులి మృతదేహాన్ని కనుగొన్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. అటవీశాఖ పెట్రోలింగ్ చేస్తున్న అటవీ అధికారులు ఐదారేళ్ల వయసున్న పులి మృతదేహం లభించిందన్నారు. ఉచ్చులో చిక్కుకున్న పులి.. ఆ తరువాత ఆనకట్ట సమీపానికి చేరుకుని చనిపోయి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వన్యప్రాణుల నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వ్యవసాయ రంగంలో 10.4 శాతం వృద్ధి

- రికార్డు స్థాయికి చేరిన ఆహార ధాన్యాల ఉత్పత్తి
- 2024–25లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 3577 లక్ష మెట్రిక్ టన్నులు
- కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: 2024–25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగ స్థూల విలువ జోడింపు(జీవీఏ) 10.4 శాతం వృద్ధి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత ధరల ప్రకారం గత ఐదేళ్లలో వ్యవసాయ, అనుబంధ రంగాలు (పంటలు, పశుసంవర్ధక, మత్స్య, ఉద్యానవనం) వృద్ధిరేటు గణనీయంగా పెరిగినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. 2020–21లో 10.0 శాతం, 2021–22లో 10.6శాతం, 2022–23లో 8.5 శాతం, 2023–24లో 9.6 శాతం కాగా 2024–25లో 10.4శాతం నమోదుతో రికార్డు నెలకొల్పినట్లు ఠాకూర్ చెప్పారు. 2024–25లో దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 3577.32 లక్ష మెట్రిక్ టన్నులు అని మంత్రి ప్రకటించారు. ఇది 2023–24లో నమోదైన 3322 లక్ష మెట్రిక్ టన్నులతో పోలిస్తే 254 లక్ష మెట్రిక్ టన్నులు (7.65 శాతం) కంటే ఎక్కువ అని ఐజీవీఏ లోక్‌సభలో మంత్రి పేర్కొన్నారు.

**ఫీల్డ్‌స్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నాం**

''వ్యవసాయ వృద్ధిని ప్రభావితం చేసే కీలక అంశాలైన రైతుల ఆదాయం, ఇన్‌పుట్ వ్యయాలు, వాతావరణ మార్పులు, సాగునీటి విస్తరణ, రుణ సౌకర్యం, మార్కెట్ అనుసంధానంపై ప్రభుత్వం నిరంతర సమీక్షలు, అధ్యయనాలు, ఫీల్డ్‌స్థాయి పర్యటనలు నిర్వహిస్తోంది. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ రంగ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర వ్యూహాన్ని అమలు చేస్తోంది. పంటల ఉత్పత్తి పెంపు, ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు, మెరుగైన ధరల సాధన, పంటల వైవిధ్యీకరణ, కొత్త అనంతర విలువ ఆధారం, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం వంటి అంశాలపై దృష్టి సారించాం''అని మంత్రి తెలిపారు. ఇందుకోసం 2013–14లో రూ.21,933 కోట్లు కేటాయించగా, 2025–26 తాజా బడ్జెట్‌లో రూ.1,27,290 కోట్లు కేటాయించాం. 2018–19 నుంచి ఖరీఫ్, రబీ, వాణిజ్య పంటలకు కనీస మద్దతు ధరలు ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం లాభం వచ్చేలా నిర్ణయించాం. రైతుల సంక్షేమం, ఆదాయం పెంపు, ఉత్పత్తి విస్తరణ కోసం పలు కేంద్ర రంగ, కేంద్ర ప్రాయోజిత పథకాలు అమలులో ఉన్నాయి''అని మంత్రి పేర్కొన్నారు.

# ఎస్పీ మద్దతుదారుల ఓట్లను తొలగించారు : అఖిలేష్ యాదవ్

లక్నో: రాష్ట్రంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు ఎన్నికల సంఘానికి మెమోరాండం సమర్పించనున్నట్టు ఆయన తెలిపారు. అసెంబ్లీలోనూ పార్టీ ఈ అంశాన్ని లేవనెత్తుతుందని అఖిలేష్ చెప్పారు. తమ పార్టీ మద్దతుదారుల పేర్లను కావాలనే తొలగిస్తున్నారని ఎస్పీ చీఫ్ ఆరోపించారు. తప్పుడు తొలగింపుల డేటాను పార్టీ ఎన్నికల సంఘానికి నివేదించిందని, కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తలిపారు. ఎస్పీ గెలిచిన నియోజకవర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల పేర్లను తొలగించాలని బీజేపీ నిర్ణయించిందని, అసెంబ్లీ, బూత్ స్థాయిలో దీనిని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కన్నౌజ్‌లో 3 లక్షల ఓట్లు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఆదేశాల మేరకు ఈసీ పనిచేస్తోందని, ఈసీ తన కార్యాలయంలో ఆ పార్టీ జెండాను ఉంచితే మంచిదని సూచించారు. వారు ఎన్నికల్లో గెలవాలని మాత్రమే కోరుకుంటున్నారని, ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనుకుంటున్నారని విమర్శించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల సమస్యలు, శాంతిభద్రతలు, వాణిజ్య ఒప్పందాలు, బలహీనపడుతున్న రూపాయి, బంగారం, వెండి ధరలు పెరగడం, రాష్ట్రానికి నిధులు మళ్లించకపోవడం వంటి అంశాల నుంచి దృష్టిని మళ్లించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

# గ్రాండ్ ముఫ్తీతో మోదీ భేటీ

న్యూఢిల్లీ: గ్రాండ్ ముఫ్తీ ఆఫ్ ఇండియా షేఖ్ అబూబకర్ అహ్మద్‌తో ప్రధాని మోదీ సోమవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఇరువురూ విస్తృత అంశాలపై లోతుగా చర్చించారు. తర్వాత భేటీ పై ప్రధాని మోదీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో స్పందించారు. ''షేఖ్ అబూబకర్ అహ్మద్ సాబ్‌తో భేటీ చక్కగా కొనసాగింది. పలు కీలక రంగాల్లో మా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాం. మరింతగా సామాజిక సామరస్యం, సోదరభావం, విద్య మెరుగుదలకు అబూబకర్ ఎంతగానో కృషిచేస్తున్నారు''అని పేర్కొంటూ తమ చర్చల తాలూకు ఫొటోను ప్రధాని మీడియాతో పంచుకున్నారు. షేక్ అబూబకర్ పదో, ప్రస్తుత గ్రాండ్ ముఫ్తీ ఆఫ్ ఇండియాగా కొనసాగుతున్నారు.

# దేశంలో లౌకికవాదాన్ని కేరళ బలోపేతం చేయాలి: అమర్త్య సేన్

తిరువనంతపురం: భారతదేశంలో లౌకికవాదాన్ని రక్షించడంలో కేరళ కీలక పాత్ర పోషించాలని, లౌకికవాదాన్ని బలోపేతం చేయడంలో రాష్ట్రం నాయకత్వం వహించాలని నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన 'విజన్ 2031: డెవలప్‌మెంట్ అండ్ డెమోక్రసీ'సదస్సులో ఆయన ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. రాష్ట్రంలో లౌకికవాదం బలంగా ఉందని, అయితే దేశవ్యాప్తంగా అది బలహీనపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవాభివృద్ధి, విద్య, లింగ నిష్పత్తి, అక్షరాస్యతలో కేరళ సాధించిన పురోగతిని ఆయన ప్రశంసించారు, ఇది దేశానికే ఆదర్శమన్నారు. బయటి ప్రపంచం నుంచి ఆలోచనలను స్వీకరించడంలో కేరళ చారిత్రకంగా ముందుందని ఆయన పేర్కొన్నారు. భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు, ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట పాటలీపుత్రలో నివసించారని, కానీ ఆయన కేరళ నుంచి వచ్చాడని గణనీయమైన ఆధారాలున్నాయని సేన్ అన్నారు. ప్రస్తుతం భారతీయ మేధోగొప్పతనం గురించి సనాతన వారసత్వం గురించి ప్రచారం జరుగుతోందన్నారు. ప్రాచీన భారతంలో మేధో విజయాలున్నాయని, కానీ అవి బయటి ప్రపంచం నుంచి వచ్చే ఆలోచనలను విస్మరించకుండా విశాల దృక్పథంతో ఉనఆయని తెలిపారు. సుమారు 2వేల ఏళ్ల కిందట గ్రీకు, బాబిలోనియన్ గణిత శాస్త్ర ప్రభావంతో భారతీయ గణితం ప్రారంభమైందని, ఆ తరువాత ప్రపంచ గణిత శాస్త్రంపై అపారమైన ప్రభావాన్ని చూపిందని వెల్లడించారు. దేశానికి ప్రవేశ ద్వారాంగా కేరళ మొత్తం దేశానికే విలువైనదని కొనియాడారు.

## నేడే బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ ప్రమాణం

ఢాకా: కీలక సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి బంగ్లాదేశ్‌లో మెజారిటీ ప్రభుత్వానికి బాటలు వేసిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ మంగళవారం ఆ దేశ నూతన ప్రధానిగా ప్రమాణంచేయనున్నారు. గత ప్రధానులు బంగభవన్‌లో ప్రమాణంచేయగా సంప్రదాయానికి భిన్నంగా ఈయన పార్లమెంట్ భవన ప్రాంగణంలోని సౌత్ ప్లాజాలో ప్రమాణం చేయనున్నారు. తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు జాతీయ సంసద్‌లోని సౌత్ ప్లాజాలోనే కొత్త కేబినెట్ సభ్యులతో దేశాధ్యక్షుడు మొహమ్మద్ షాహబుద్దీన్ ప్రమాణంచేయిస్తారు. అంతకుముందు పార్లమెంట్ కొత్త సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం నజీరుద్దీన్ ప్రమాణంచేయిస్తారు. 13వ జాతీయ సంసద్‌కు ఎన్నికైన మొత్తం 297 మంది తొలుత ఎంపీలుగా, తర్వాత రాజ్యాంగ సంస్కరణల మండలికి సభ్యులుగా ప్రమాణంచేస్తారు. అంతకుముందే మంగళవారం ఉదయం 11.30 గంటలు బీఎన్‌పీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించి పార్లమెంటరీ పార్టీ లీడర్‌ను ఎన్నుకోనుంది. ప్రధానిగా తారిఖ్ రెహ్మాన్ ప్రమాణానికి భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరవుతున్నారు.

# అస్సాం కాంగ్రెస్‌లో కలకలం

**పీసీసీ మాజీ చీఫ్ బోరా రాజీనామా**

- వెనక్కు తీసుకున్నారన్న అధిష్టానం
- రేపట్లోగా తుది నిర్ణయమన్న నేత
- బీజేపీలోకి ఆహ్వానించిన సీఎం

గువాహటి: అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీకి పీసీసీ మాజీ చీఫ్ భూపేన్ కుమార్ బోరా రాజీనామా వ్యవహారం సోమవారం రాష్ట్రంలో రాజకీయ కలకలానికి దారితీసింది. బోరా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపారు. పార్టీ నాయకత్వం తనను విస్మరిస్తోందని, రాష్ట్ర విభాగంలోనూ సముచిత గౌరవం దక్కడం లేదని ఆక్షేపించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయలేదని ఆయన మీడియాతో అన్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం బోరా రాజీనామాను ఆమోదించలేదు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి జితేంద్ర సింగ్ హుటాహుటిన అస్సాం చేరుకుని బోరాతో ఆయన నివాసంలో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పీసీసీ చీఫ్ గౌరవ్ గొగొయ్ కూడా వాటిలో పాల్గొన్నారు. బోరా రాజీనామాను వెనక్కు తీసుకున్నట్టు అనంతరం జితేంద్రసింగ్ మీడియాకు తెలిపారు. ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ జోక్యంతో ఆయన నిర్ణయం మార్చుకున్నట్టు చెప్పారు. కానీ బోరా మాత్రం దాన్ని ధ్రువీకరించలేదు. పైగా, పునరాలోచనకు మంగళవారం ఉదయం దాకా అధిష్టానాన్ని సమయం కోరానని చెప్పి సస్పెన్స్ పెంచారు. బోరాను రాష్ట్ర కాంగ్రెస్‌కు మూలస్తంభంగా గొగొయ్ అభివర్ణించారు. ఏ విషయంలోనైనా ఆయన మనస్తాపానికి లోనై ఉంటే తమను క్షమించాలని కోరారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన బోరా 2021 నుంచి 2025 దాకా పీసీసీ చీఫ్‌గా కొనసాగారు.

**చివరి హిందూ నేత: హిమంత**

సామాన్యులకు కాంగ్రెస్ పార్టీలో ఎదుగుదల ఉండదని బోరా ఉదంతం మరోసారి నిరూపించిందంటూ అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ ఎద్దేవా చేశారు. ఆయన్ను అస్సాం కాంగ్రెస్‌లో చివరి హిందూ నేతగా అభివర్ణించారు. ''బోరాకు బీజేపీ తలుపులు తెరిచే ఉన్నాయి. మా పార్టీలో చేరితే సురక్షిత స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం''అంటూ హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం బోరా నివాసానికి వెళ్లి భావి ప్రణాళికలపై చర్చిస్తానని పేర్కొన్నారు.

# న్యూస్‌క్లిక్, ప్రబీర్‌లపై ఈడీ రూ.184 కోట్ల పెనాల్టీ

న్యూఢిల్లీ: చైనా అనుకూలంగా వార్తాకథనలు రాస్తూ దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నమైనందుకు శిక్షగా డిజిటల్ మీడియా సంస్థ 'న్యూస్‌క్లిక్'పై, దాని వ్యవస్థాపకుడు, ఎడిటర్–ఇన్–చీఫ్ ప్రబీర్ పురకాయస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మొత్తంగా రూ.184 కోట్ల పెనాల్టీ విధించింది. న్యూస్‌క్లిక్ మాతృసంస్థ అయిన పీపీకే న్యూస్‌క్లిక్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్‌పై రూ.120 కోట్లు, ప్రబీర్‌పై రూ.60 కోట్ల పెనాల్టీ విధించింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఫెమా) నిబంధనలను ఉల్లంఘించినందుకే పెనాల్టీ వేశామని ఈడీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశాల నుంచి చెల్లింపు నిబంధనలు ఉల్లంఘనకు గురయ్యాయని ఆ ప్రకటనలో ఈడీ వ్యాఖ్యానించింది. పెనాల్టీ వార్తపై న్యూస్‌క్లిక్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. న్యూస్‌క్లిక్ పోర్టల్‌పై గతంలోనే ఈడీ విడిగా మనీలాండరిగ్ ఆరోపణలతో మరో కేసు నమోదుచేసింది. తొలిసారిగా 2021 సెప్టెంబర్‌లో ఢిల్లీలోని సైదులాజాబ్‌లోని న్యూస్‌క్లిక్‌కు చెందిన చోట్ల సోదాలుచేసింది. తర్వాత ఫెమా చట్టం కింద మరో కేసు వేసింది. కథనాల ద్వారా చైనా అనుకూల అజెండాను న్యూస్‌క్లిక్ భారతదేశంలో ప్రచారంలోకి తెస్తోందని, ఇందుకు కోట్ల రూపాయల విదేశీ నిధులు అందుకుందని 2023లో తొలిసారిగా బీజేపీ ఆరోపించింది. 2018–19 కాలంలో న్యూస్‌క్లిక్ అక్రమంగా రూ.9.59 కోట్ల విరాళాలు అందుకుందని ఈడీ గతంలో తన దర్యాప్తు సమయంలో వెల్లడించింది. మనీలాండరింగ్ చట్టం కింద భారత విదేశాంగ శాఖ ద్వారా చైనాలోని షాంఘైలో ఉన్న అమెరికా కుబేరుడు నెవిల్లే రాయ్ సింగంకు ఈడీ నోటీసులు పంపిన విషయం తెల్సిందే.

# కరాచీ నగల దుకాణంలో భారీ చోరీ

**30 కోట్ల పాక్ రూపాయల విలువైన వజ్రాభరణాలు కొట్టేసిన దొంగలు**

కరాచీ: పాకిస్తాన్‌లోని కరాచీ నగరంలోని ఇక్బాల్ నగల దుకాణంలో భారీ చోరీ జరిగింది. దాదాపు 30 కోట్ల పాక్ రూపాయల విలువైన బంగారు, వజ్రాభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. మలీర్ ప్రాంతంలోని 'పాకిస్తాన్ కాలనీ'లో ఈ చోరీ జరిగింది. వజ్రాభరణాలను భద్రపరచిన వాల్ట్ గది వెనక వైపు చిన్న కన్నం పెట్టిన దొంగలు అందుల్లోంచి వాల్ట్ గదిలోకి చొరబడి అందినకాడికి దోచుకెళ్లారు. ఫిబ్రవరి 12వ తేదీ గురువారం రాత్రి అంతా సవ్యంగా చూసుకుని దుకాణం మూసేశాం. శుక్రవారం, శనివారం మార్కెట్‌లకు సెలవు. రెండ్రోజుల తర్వాత ఆదివారం తెరచి చూస్తే స్వర్ణాభరణాలు, బంగారు కడ్డీలు, వజ్రాలు అన్నీ పోయాయి''అని దుకాణ యజమాని అయూబ్ ఖాన్ కన్నీరుమున్నీరయ్యాడు. 700 తులాల స్వచ్ఛమైన బంగారం కడ్డీలు సైతం గల్లంతయ్యాయని యజమాని ఫిర్యాదుచేశారని, కేసు నమోదచేసి దర్యాప్తు మొదలెట్టామని పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇక్బాల్ దివాన్ చెప్పారు.

## బ్రిటన్, కెనడా పౌరులకూ చైనా వీసారహిత ప్రయాణాలు

బీజింగ్: మంగళవారం నుంచి బ్రిటన్, కెనడా పౌరులు సైతం తమ దేశంలోకి ఎలాంటి వీసా లేకుండా ప్రయాణాలుచేయొచ్చని చైనా సోమవారం ప్రకటించింది. దీంతో చైనాలోకి వీసాలేకుండా ప్రయాణించే సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్న దేశాల సంఖ్య తాజాగా 79కి పెరిగింది. గత రెండేళ్లుగా ఈ వీసా రహిత సందర్శనలకు చైనా భారీగా అనుమతులు ఇస్తున్న విషయం విదితమే. వ్యాపారం, పర్యాటకం, సందర్శన నిమిత్తంగా గరిష్టంగా 30 రోజులపాటు ఎలాంటి వీసాలేకుండా చైనాలో ఉండొచ్చు. లాటిన్ అమెరికా, దక్షిణాసియా, మధ్యాసియా దేశాలతోపాటు యురోపియన్ కూటమిలోని చాలా దేశాలకు ఇప్పుడు చైనా వీసారహిత సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అమెరికా, ఇండోనేసియా లాంటి దేశాల వాళ్లు మాత్రం గరిష్టంగా పది రోజులే చైనాలో ఉండొచ్చు. అదికూడా వేరేదేశానికి వెళ్తూ మార్గమధ్యంలో చైనాలో ఆగి ఆ 10 రోజులు పర్యటించేందుకే ఈ దేశస్తులను అనుమతిస్తారు.

## వడోదర, అహ్మదాబాద్‌లో 34 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

అహ్మదాబాద్/వడోదర: గుజరాత్‌లోని వడోదర, అహ్మదాబాద్ నగరాల్లోని తలో 17 పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఖలిస్తాన్ వేర్పాటువాదులమని చెప్పుకుని కొందరి ఈమెయిళ్ల నుంచి బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు హుటాహుటిన రంగప్రవేశం చేశారు. మొత్తం 34 పాఠశాలల్లో ముమ్మర తనిఖీలు చేశారు. బాంబు గుర్తింపు, నిర్వీర్య దళాలతో సోదాలు చేయించారు. చివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. బెదిరింపు మెయిల్ అనేది కంప్యూటర్ జనరేటెడ్ ఇ–మెయిల్‌లాగా ఉందని వడోదర నేర విభాగ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాహుల్ త్రిపాఠి అభిప్రాయపడ్డారు.

## జైలు అధికారిగా నమ్మించిన భారతీయునికి జైలు

సింగపూర్: తానో జైలు అధికారిని అంటూ ఏకంగా సింగపూర్ అధ్యక్షుడు థర్మాన్ షణ్ముగరత్నం, సింగపూర్ పార్లమెంట్ సెక్రటేరియట్‌కు ఇ–మెయిల్ పంపిన భారతీయమూలాలున్న వ్యక్తికి సింగపూర్ న్యాయస్తానం తొమ్మిది నెలల కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పుచెప్పింది. అయితే గత నేరాలకు సంబంధించిన వివరాలు రాబట్టేందుకే అతను మెయిళ్లు పంపాడని ప్రకాశ్ పరమశివం(25) తరఫు లాయర్లు చేసిన వాదనలను కోర్టు పట్టించుకోలేదు. తప్పుడు కమ్యూనికేషన్ నేరాలకు గాను 2018, 2023 మధ్యకాలంలో కొంతకాలంపాటు జైళ్లో గడిపినట్లు తెలుస్తోంది. అయితే కుటుంబ విషయాల్లో సాయం చేయాలంటూ నాటి జాతీయాభివృద్ధి మంత్రి, ప్రస్తుత విద్యామంత్రి డెస్మండ్ లూకు ప్రకాశ్ పరమశివం ఇ–మెయిళ్లు పంపాడు. జైలు అధికారినంటూ చెప్పిన మాటల్లో నిజం లేదని తేలడంతో గత ఏడాది జూలై 8న ప్రకాశ్‌ను అరెస్ట్‌చేశారు.

## రాజ్‌పాల్ యాదవ్‌కు తాత్కాలిక బెయిల్

న్యూఢిల్లీ: చెక్ బౌన్స్ కేసులో అరెస్టయిన బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. మార్చి 18వ తేదీదాకా ఆయన జైలు శిక్షను స్తంభింపజేస్తూ తాత్కాలికంగా ఆయనకు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పు చెప్పారు. చెక్ బౌన్స్ కేసులో పిటిషనర్ అయిన మురళి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంక్ ఖాతాలోకి రాజ్‌పాల్ రూ.1.5 కోట్ల నగదు జమచేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. ఫిబ్రవరి 19వ తేదీన కుటుంబంలో వివాహవేడుక ఉన్నందున బెయిల్ ఇవ్వాలని రాజ్‌పాల్ కోరడంతో మార్చి 18దాకా కోర్టు బెయిల్ ఇవ్వడం గమనార్హం. బెయిల్ మీద బయటికొచ్చాక విదేశాలకు వెళ్లొద్దని, పాస్‌పోర్ట్ వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను మార్చి నెల 18వ తేదీకి వాయిదావేసింది. 2018 ఏప్రిల్ నాటి చెక్‌బౌన్స్ కేసులో మేజిస్ట్రియల్ కోర్టు విధించిన ఆరు నెలల శిక్షను రాజ్‌పాల్ సెషన్స్‌కోర్టులో 2019లో సవాల్‌చేయగా అక్కడ ఆయనకు చుక్కెదురైంది. దాంతో ఆయన ఈ తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్‌చేశారు. తప్పని పరిస్థితుల్లో ఇటీవల రాజ్‌పాల్ తిహార్ జైలులో లొంగిపోవడం తెల్సిందే.

## వందేళ్ల పూజారిని తొక్కి చంపిన ఏనుగు

బహ్రెయిచ్(యూపీ): ఒక మదపుటేనుగు బీభత్సానికి వందేళ్ల వృద్ధ పూజారి ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర ప్రదేశ్‌లోని కటార్నియాఘాట్ వన్యప్రాణా సంరక్షణా కేంద్రంలోని కటియారా బీట్ వద్ద ఒక ప్రాచీన ఆలయాన్ని బాబా సురేశ్ దాస్ అనే వృద్ధుడు గత 60 ఏళ్లుగా సందర్శిస్తున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆయన అక్కడే బసచేయగా అటుగా వచ్చిన ఒక అడవి ఏనుగు ఆయనను తొక్కిచంపింది. గుడిసె ఆకారంలో ఉండే ఈ ఆలయానికి స్థానికంగా కటియారాకుటి అని పేరుంది. పులులకు ఆవాసమైన ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో గత 30 గంటల్లో ఇది రెండో మరణంకావడం గమనార్హం. శనివారం సాయంత్రం ఇదే ప్రాంతంలో మిహిన్‌పుర్వా–లఖీంపూర్ రోడ్డులో కుమారులతో వెళ్తున్న 45 ఏళ్ల మహిళపై అడవి ఏనుగు దాడిచేసి మహిళను తీవ్రంగా గాయపర్చింది.దీంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఏనుగులు దాడిచేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలూ లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## డేటా రక్షణ చట్టంపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీస్

న్యూఢిల్లీ: డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం(డీపీడీపీ)–2023లోని పలు నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారణకు స్వీకరించేందుకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. అయితే ఆయా నిబంధనల అమలును నిలుపుదలచేస్తూ మధ్యంతర స్టే ఇవ్వడం కుదరదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం తేల్చిచెప్పింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)కు సవరణలు చేస్తూ తెచ్చిన డీపీడీపీ చట్టం, డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ నిబంధనలు2025 తెచ్చారు. వీటి చట్టబద్ధతను పిటిషన్లు దాఖలుకావడంతో మీ సమాధానం చెప్పాలంటూ కేంద్ర ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎలాంటి అనుమతులు లేకుండా సమాచారాన్ని సేకరించే స్వేచ్ఛ కొత్త చట్టంతో కేంద్రానికి దఖలుపడిందని, ఇది ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు చట్టం, వ్యక్తిగత స్వేచ్ఛలను ఉల్లంఘించడమేనని పిటిషనర్లు పేర్కొన్నారు.

## అబూసలేం పాతికేళ్ల శిక్ష ముగింపు పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో 1993లో ముంబై వరస పేలుళ్ల కేసులో దోషిగా తేలి 25 సంవత్సరాల శిక్ష అనుభవించిన గ్యాంగ్‌స్టర్ అబూసలేం తన శిక్షాకాలం పూర్తయిందని, ఇకనైనా విడుదచేయాలంటూ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించలేదు. పోర్చుగల్‌లో తలదాచుకుంటున్న అబూసలేంను 2005 నవంబర్ 11న భారత్‌కు అప్పగించడం తెల్సిందే. అతనికి మరణశిక్ష విధించకూడదని, పాతికేళ్లకు మించి జైలుశిక్ష వేయొద్దనే షరతుతో పోర్చుగల్ అతడిని భారత్‌కు అప్పగించిన విషయం విదితమే. ప్రాథమిక సాక్ష్యాధారాలను చూస్తే సలేం 25 ఏళ్ల శిక్షకాలం పూర్తికాలేదు అంటూ బాంబే హైకోర్టు 2025 జూలైలో ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ సలేం వేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం పరిశీలించింది. ''మధ్యంతర ఉపశమనం ఇచ్చేందుకే హైకోర్టు నిరాకరించింది. మళ్లీ అదే కోర్టుకు వెళ్లి తాడోపేడో తేల్చుకోండి''అంటూ సలేం పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.

## 'పరిశ్రమ' విస్తృత అర్థంపై మార్చి 17న సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ: పారిశ్రామిక వివాదాల చట్టం,1947 ప్రకారం ఇండస్ట్రీ అంటే చట్టపరిధిలో ఉన్న విస్తృతార్థం ఎంటనేది తేల్చేందుకు 9 మంది న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. ఇది మార్చి నెల 17వ తేదీన ఈ అంశంపై విచారణ చేపట్టనుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం తేల్చిచెప్పింది. విచారణ వేళ సంధించాల్సిన ప్రశ్నలను ఈ త్రిసభ్యధర్మాసనం ఇప్పటికే సిద్ధం చేసింది. ప్రభుత్వ సంస్థలు, అనుసంధ విభాగాలు చేపట్టే సంక్షేమ పథకాలు, సామాజిక కార్యక్రమాలు సైతం పారిశ్రామిక వివాదాల చట్టపరిధిలోకి వస్తాయా రావా? అనే అంశాన్ని త్వరలో తేల్చేస్తామని ధర్మాసనం వెల్లడించింది.

# 'ద సోషల్ కాంట్రాక్ట్' గ్రంథ రచయిత ఎవరు ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



### భారతీయ సమాజం
### సమాజ శాస్త్ర మౌలికాంశాలు - కులం

1. 'సమాజ శాస్త్రం' (Sociology) అనే పదాన్ని మొదట రూపొందించిందెవరు?
ఎ) సోక్రటీస్ బి) అరిస్టాటిల్
సి) ఆగస్ట్ కోమ్ట్ డి) దుర్ఖైహిమ్
2. 2011 జనాభా లెక్కల ప్రకారం కింది వాటిని జతపరచండి?
1) హిందువులు ఎ) 79.8 శాతం
2) ముస్లింలు బి) 14.2 శాతం
3) క్రైస్తవులు సి) 2.3 శాతం
4) సిక్కులు డి) 1.7 శాతం
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
డి) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి
3. సమాజ శాస్త్రం పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) దుర్క్ హైమ్ బి) మాక్స్ వెబర్
సి) అరిస్టాటిల్ డి) ఆగస్ట్ కోమ్ట్
4. భారతీయ సమాజం వివిధ జాతుల ప్రదర్శన శాల (Ethnological Museum) అని పేర్కొన్నవారు?
ఎ) వి.ఎ.స్మిత్ బి) జిమ్మెల్
సి) పరేటో డి) మాకియవెల్లీ
5. సమాజ శాస్త్రం శాస్త్రీయంగా దేన్ని అధ్యయనం చేస్తుంది?
ఎ) మానవుడిని
బి) మానవ సంఘాలను
సి) వ్యక్తుల మధ్య ఉన్న సామాజిక సంబంధాలను
డి) పౌరుల హక్కులు, విధులను
6. భారత రాజ్యాంగం ఎన్ని భాషలను గుర్తించింది?
ఎ) 22 బి) 24 సి) 25 డి) 26
7. ది పీపుల్ ఆఫ్ ఇండియా గ్రంథాన్ని ఎవరు రచించారు?
ఎ) మలినో విస్కీ బి) బి.ఎస్. గుహా
సి) రిస్లీ డి) హెడన్
8. సమాజ శాస్త్రం (Sociology) అనే పదం లాటిన్ భాషలోని సొసైటస్(Societus), గ్రీకు భాషలోని లోగోస్(Logos) అనే పదాల నుంచి ఉద్భవించింది. దీని అర్థం?
ఎ) సమాజం, శాస్త్రం
బి) సమాజం, సూత్రాలు
సి) సామూహిత, శాస్త్రం
డి) సామాహికత, శాస్త్రం
9. కింది వాటిలో దక్షిణ భారత సాంస్కృతిక అంశం కానిది?
ఎ) హిందుస్తానీ సంగీతం
బి) జల్లికట్టు సి) యక్షగానం
డి) భరతనాట్యం
10. 'మానవుడు సామాజిక జంతువు' అని చెప్పినవారు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) దుర్క్ హైమ్
సి) హెర్బర్ట్ స్పెన్సర్ డి) అరిస్టాటిల్
11. సమాజం అంటే 'సామాజిక సంబంధాల అల్లిక' అని చెప్పిందెవరు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) మెక్ ఐవర్ డి) మాక్స్ వెబర్
12. పరిణామ సిద్ధాంతాన్ని మొదట ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) దుర్క్ హైమ్ డి) చార్లెస్ డార్విన్
13. 'ది సోషల్ సిస్టమ్' గ్రంథ రచయిత?
ఎ) మార్టన్ బి) పార్సన్స్
సి) కార్ల్‌మార్క్స్ డి) ఆగస్ట్ కోమ్ట్
14. సోషల్ థియరీ అండ్ సోషల్ స్ట్రక్చర్ గ్రంథ రచయిత?
ఎ) రాబర్ట్ కె మర్టన్ బి) రాబర్ట్ పార్క్
సి) రాడ్‌క్లిఫ్ బ్రౌన్ డి) దుర్ఖెయిమ్
15. 'ఎక్కడైతే జీవితం ఉందో, అక్కడ సమాజం ఉంది' అని చెప్పింది?
ఎ) మెక్ ఐవర్ బి) కింగ్స్‌లీ డేవిస్
సి) దుర్క్ హైమ్ డి) మాక్స్ వెబర్
16. సంస్కృతి అంటే?
ఎ) వేషభాషలు, నడవడి విధానం, మతం, కళలు మొదలైన వాటి సమ్మేళనం
బి) శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి
సి) ఒక సముదాయం సాధించిన ఉన్నత అంశాలు
డి) పైవన్నీ
17. 'సోషల్ చేంజ్ ఇన్ మోడర్న్ ఇండియా' అనే గ్రంథ రచయిత?
ఎ) రామ్ అహుజా బి) కుప్పుస్వామి
సి) కేట్కార్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
18. 'ద సోషల్ కాంట్రాక్ట్' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) టానీస్ బి) రూసో
సి) అరిస్టాటిల్ డి) ప్లేటో
19. 'ఇంత వరకు ఉన్న సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రయే' అని పేర్కొన్నవారు? (గ్రూప్-2, 2000 బ్యాగ్‌లాగ్ పోస్ట్)
ఎ) లెనిన్ బి) మావో
సి) కార్ల్ మార్క్స్ డి) హిట్లర్
20. కులం అభివ్యక్తీకరణల్లో అస్పృశ్యతను అతినికృష్టమైందిగా పరిగణించిన వారు? (సీడీపీవో-2013)
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్ బి) సర్దార్ పటేల్
సి) నెహ్రూ డి) గాంధీ
21. 'క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) హట్టన్ బి) ఘుర్యే
సి) కుప్పుస్వామి డి) ఎం.ఎన్. శ్రీనివాస్
22. ఉన్నత అంతస్తును సాధించడానికి తొలి మెట్టుగా... ఉన్నత కులాల వారి ఆచారాలు, నమ్మకాలను నిమ్న కులాల వారు సమష్టిగా అవలంబించే ప్రక్రియను ఏ పేరుతో పిలుస్తారు? (సీడీపీవో-2013)
ఎ) ఆధునికీకరణ బి) సంస్కృతీకరణ
సి) పాశ్చాత్యీకరణ డి) నగరీకరణ
23. గ్రామాల్లో కులాల మధ్య సంబంధాలను నియంత్రించే వ్యవస్థ ఏది? (సీడీపీవో-2013)
ఎ) బంధుత్వం బి) వర్గం
సి) స్నేహం డి) జాజ్‌మాని(Jajmani)
24. బ్రహ్మ ఏ అవయవం నుంచి క్షత్రియులు ఆవిర్భవించారు? (సీడీపీవో-2013)
ఎ) పాదాలు బి) తొడలు
సి) చేతులు డి) భుజాలు
25. కుల క్రమానుగత శ్రేణిలో అన్నిటికంటే పై శ్రేణిలో ఉండేవారు? (సీడీపీవో-2013)
ఎ) వైశ్యులు బి) బ్రాహ్మణులు
సి) శూద్రులు డి) క్షత్రియులు
26. 'ది అన్‌టచబుల్స్' అనే గ్రంథాన్ని రాసిందెవరు?
ఎ) శ్రీనివాస్ బి) అంబేద్కర్
సి) ఘుర్యే డి) గాంధీ
27. అస్పృశ్యులను 'హరిజనులని' సంభోదించింది? (సీడీపీవో-2013)
ఎ) లాల్ బహదూర్ శాస్త్రి
బి) అంబేద్కర్
సి) విద్యాసాగర్ డి) గాంధీ
28. కింది వాటిలో ఏది కుల లక్షణం కాదు?
ఎ) అంతర్వివాహం
బి) వృత్తి అనుబద్ధత
సి) ఛాయ(Colour)
డి) సహపంక్తి భోజన కట్టుబాటు
29. ఒక వ్యక్తి కుల సభ్యత్వం దేని ఆధారంగా నిర్ణయిస్తారు?
ఎ) అంతస్తు బి) సంపద
సి) పుట్టుక డి) ఆరోగ్యం
30. కులం ఒకే _____ సమూహం.
ఎ) బహిర్వివాహిత బి) సంవృత
సి) అంతర్వివాహిత డి) అనివార్య
31. కులం, వర్గం, అధికారం(Caste, Class and Power) గ్రంథం రచించింది ఎవరు?
ఎ) పి.వి.బెయిలీ బి) అంద్రె బీటెల్లీ
సి) ఎం.ఎన్. శ్రీనివాస్
డి) హట్టన్
32. ఎలాంటి అంటరానితనాన్ని అయినా నిషేధించే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్-14 బి) ఆర్టికల్-17
సి) ఆర్టికల్-16 డి) ఆర్టికల్-18
33. కుల వ్యవస్థకు ____ స్వభావం ఉంటుంది?
ఎ) క్రమానుగత శ్రేణి(Hierarchical)
బి) సౌష్ఠవ(Symmetrical)
సి) పరస్పర వ్యతిరేక(Contradictory)
డి) సహకార(Co-operative)
34. కిందివాటిలో కులవ్యవస్థను బలహీన పరచని కారణాలేవి?
ఎ) పారిశ్రామికీకరణ, నగరీకరణ
బి) రవాణా సౌకర్యాలు పెరగడం
సి) రాజ్యాంగం
డి) రిజర్వేషన్ పాలసీ
35. కింది వాటిలో కుల వ్యవస్థ లక్షణం కానిది?
ఎ) శుచి- అశుచి
బి) క్రమానుగత శ్రేణి ఆరాధన
సి) క్రమానుగత శ్రేణి
డి) వారసత్వ రీత్యా వచ్చే ప్రత్యేకీకరణ
36. కులస్తరీకరణకు ఇది ఆధారం?
ఎ) పునర్జన్మ
బి) వర్ణాశ్రమ వ్యవస్థ – చతుర్వర్ణాలు
సి) పురుషార్థాలు డి) మత విభాగం
37. రుగ్వేదంలో పేర్కొనని వర్ణాలు ఏవి?
ఎ) ఆర్య, శూద్ర వర్ణాలు
బి) ఆర్య, దాస వర్ణాలు
సి) బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు
డి) క్షత్రియ, శూద్ర వర్ణాలు
38. భారతీయ కులవిధానం గురించి ప్రస్తావన మొట్టమొదట దేనిలో కనిపిస్తుంది?
ఎ) మహాభారతం బి) ఉపనిషత్తులు
సి) వేదాలు డి) రామాయణం
39. క్యాస్ట్(Caste)అనే పదం ఏ భాషలోని కాస్టా (Casta) అనే పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) స్పానిష్, పోర్చుగీసు
బి) జర్మన్ సి) లాటిన్
డి) ఏదీకాదు
40. అస్పృశ్యులు ముందంజ వేయక పోవడానికి కారణం?
ఎ) విజ్ఞాన లేమి బి) నిరక్షరాస్యత
సి) అల్పులమనే భావన
డి) సంప్రదాయ ధోరణులు
41. కుల వ్యవస్థలో లేని అంశం?
ఎ) ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం
బి) శ్రామికులు గతిశీలతను తిరస్కరించడం
సి) వ్యక్తులకు వృత్తులను ఇవ్వడం
డి) సహకారాన్ని అందించడం
42. కుల వ్యవస్థను బ్రాహ్మణులే, బ్రాహ్మణుల కోసం సృష్టించారని పేర్కొన్నవారు?
ఎ) ఆబె దుబాయ్(Abbe Dubois)
బి) జి.ఎస్. ఘుర్యే(G. S. Ghurye)
సి) కేట్కర్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
43. భారతీయ సమాజంలోని స్తరీకరణ రూపం?
ఎ) సామాజిక వర్గం బి) అంతస్తు సమూహం
సి) ఎస్టేట్ డి) కులం
44. 'ఒకే పేరును కలిగి, ఒకే పూర్వీకుడి సంతతి అని భావిస్తూ ఒకే సజాతీయ సముదాయంగా మెలుగుతూ ఉండే కొన్ని కుటుంబాల మొత్తమే కులం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్ బి) హెర్బర్ట్ రిస్లే
సి) మెకైవర్ డి) హట్టన్
45. వెలికి గురైనవారు(Out castes).. కుల వ్యవస్థాపన ఫలితమే. కుల వ్యవస్థను నిర్మూలిస్తే తప్ప వారిని స్వతంత్రులను చేయలేమని భావించిన వారు?
ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
బి) మహాత్మాగాంధీ సి) కామరాజ్
డి) బి.ఆర్.అంబేద్కర్
46. సరైన క్రమాన్ని తెల్పండి?
1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
3) వైశ్యులు 4) శూద్రులు
ఎ) 1, 2, 3, 4 బి) 4, 3, 2, 1
సి) 4, 3, 1, 2 డి) 2, 1, 3, 4
47. సంస్కారపరమైన అశుచి(Ritual Pollution)కి ఆధారాలు?
ఎ) జన్మ
బి) శరీరం నుంచే వచ్చే వాసనలు
సి) మరణం
డి) జనన, మరణాలు
48. కింది వాటిలో సరికానిది?
ఎ) కులం సంస్కృతి వాహకంగా పనిచేస్తుంది
బి) కులం సామాజిక గతిశీలతను ప్రోత్సహిస్తుంది
సి) కులం రాజకీయాలతో ముడిపడి ఉంటుంది
డి) కులం సామాజిక జీవనానికి కావలసిన ప్రకార్యాలను తీరుస్తుంది.

### సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) ఎ; 5) సి;
6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి;
11) సి; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ;
16) డి; 17) డి; 18) బి; 19) సి; 20) సి;
21) డి; 22) బి; 23) డి; 24) డి; 25) బి;
26) బి; 27) డి; 28) సి; 29) సి; 30) సి;
31) బి; 32) బి; 33) ఎ; 34) బి; 35) బి;
36) బి; 37) బి; 38) సి; 39) ఎ; 40) సి;
41) ఎ; 42) ఎ; 43) డి; 44) బి; 45) డి;
46) ఎ; 47) ఎ; 48) బి.

# విశ్వం గురించి అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?

### గ్రహాలు
### మాదిరి ప్రశ్నలు

1. గ్రీకు భాషలో ప్లానెట్ అనే పదం దేన్ని సూచిస్తుంది?
ఎ) విశ్వంలో ఒక వస్తువు
బి) ఎల్లప్పుడూ తిరుగుతున్న వస్తువు
సి) స్వయం ప్రకాశకత్వం
డి) ఉపగ్రహాలను కలిగింది
2. సూర్యుడు ఏ రకమైన నక్షత్రం?
ఎ) పెద్ద పరిమాణం ఉన్న నక్షత్రం
బి) చిన్న పరిమాణం ఉన్న నక్షత్రం
సి) మరుగుజ్జు నక్షత్రం
డి) మధ్యతరహా పరిమాణం ఉన్న నక్షత్రం
3. సూర్యుడి తర్వాత దగ్గరగా ఉన్న నక్షత్రం?
ఎ) ప్రాక్సిమా సెంటారీ
బి) సీరియస్ సి) QBI-352
డి) మెఘాలినిక్ మేఘం
4. సౌరకుటుంబం కలిగిన మన పాలపుంతకు భారతీయులు పెట్టిన పేరు?
ఎ) శివగంగ బి) పాతాళగంగ
సి) ఆకాశగంగ డి) హిమగంగ
5. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) కోపర్నికస్ బి) టాలమీ
సి) భాస్కరాచార్యుడు డి) న్యూటన్
6. సౌరకుటుంబాన్ని మొదట పరిశీలించినవారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఐన్‌స్టీన్ డి) పౌల్సన్
7. భూమిపై ఉన్న ప్రతి వస్తువుపైనా గురుత్వ బలం సమానంగా ఉంటుందని నిరూపించిన వారు?
ఎ) కోపర్నికస్ బి) జిల్లెట్
సి) గెలీలియో డి) డాప్లర్
8. బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) జార్జియస్ లైమెట్రీ
బి) హబుల్ సి) గెలీలియో
డి) న్యూటన్
9. ప్రస్తుతం సౌరకుటుంబంలో గుర్తించిన గ్రహాల సంఖ్య?
ఎ) 7 బి) 8
సి) 9 డి) 10
10. భూమికి దగ్గరగా ఉన్న ఖగోళ వస్తువు?
ఎ) సూర్యుడు బి) అంగారకుడు
సి) చంద్రుడు డి) బుధుడు
11. సూర్యుడి నుంచి గ్రహాలకు మధ్య దూరాన్ని కొలవడానికి ఉపయోగించే ప్రమాణం?
ఎ) కాంతి సంవత్సరం
బి) ఖగోళ ప్రమాణం
సి) పార్-సెక్
డి) పైవన్నీ
12. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఏ మార్గంలో పరిభ్రమిస్తున్నాయి?
ఎ) సరళరేఖ బి) వృత్తాకార
సి) దీర్ఘవృత్తాకార డి) వక్రమార్గం
13. సూర్యుడికి దగ్గరగా ఉన్న గ్రహం?
ఎ) శుక్రుడు బి) బుధుడు
సి) భూమి డి) శని
14. ధ్రువ నక్షత్రం పేరు?
ఎ) జొడాయిక్ బి) ఎప్సిలాన్ అరిగా
సి) పొలారిస్ డి) ఆండ్రోమెడ్
15. హేలీ తోకచుక్క ఎన్నేళ్లకు ఒకసారి కనిపిస్తుంది?
ఎ) 66 బి) 76
సి) 86 డి) 100
16. కిందివాటిలో ఏ గ్రహం పగలు ఎక్కువ వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది?
ఎ) శుక్రుడు బి) అంగారకుడు
సి) బృహస్పతి డి) బుధుడు
17. సౌరకుటుంబంలో పరిమాణంలో భూమి ఏ స్థానంలో ఉంది?
ఎ) 1 బి) 2
సి) 4 డి) 5
18. సౌరకుటుంబంలోని గ్రహాల చలనాలను పరిశీలించిన దేశస్థులు?
ఎ) భారతీయులు
బి) చైనీయులు సి) గ్రీకులు
డి) జపనీయులు
19. రెండు గ్రహాల మధ్య దూరం రెండింతలు అయినప్పుడు వాటి మధ్య విశ్వగురుత్వాకర్షణ బలం?
ఎ) రెండు రెట్లు తగ్గుతుంది
బి) రెండు రెట్లు పెరుగుతుంది
సి) నాలుగు రెట్లు పెరుగుతుంది
డి) నాలుగు రెట్లు తగ్గుతుంది
20. ఒక ఇనుపగోళం, అల్యూమినియం గోళాలను ఒకే ఎత్తు నుంచి శూన్యంలో ఒకేసారి జారవిడిచినప్పుడు ఏది ముందుగా కిందికి చేరుతుంది?
ఎ) ఇనుపగోళం
బి) అల్యూమినియం గోళం
సి) రెండూ ఒకేసారి కిందికు చేరుతాయి
డి) రెండూ పైకి వెళ్తాయి
21. ఒక వస్తువు భారం ఎక్కడ ఎక్కువగా ఉంటుంది?
ఎ) భూమి కేంద్రం వద్ద
బి) భూమధ్యరేఖ వద్ద
సి) ధ్రువాల వద్ద
డి) పైవన్నీ
22. ప్రదేశాన్ని బట్టి ఒక వస్తువుకు చెందిన ఏ భౌతికరాశి మారుతుంది?
ఎ) ద్రవ్యరాశి బి) ఘనపరిమాణం
సి) ఆకారం డి) భారం
23. చంద్రుడిపై గురుత్వ త్వరణం విలువ?
ఎ) $9.8ms^{-2}$ బి) $9.8cms^{-2}$
సి) $1.67cms^{-1}$ డి) $1.67ms^{-2}$
24. భూమిపై పలాయన వేగం?
ఎ) $11.2\ kms^{-1}$ బి) $11.2\ ms^{-1}$
సి) $11.2\ cms^{-1}$ డి) $1.12\ ms^{-1}$

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

25. విశ్వగురుత్వాకర్షణ నియమాన్ని ప్రతిపాదించిన వారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) అరిస్టాటిల్ డి) కోపర్నికస్
26. భూస్థిర ఉపగ్రహం ఆవర్తన కాలం?
ఎ) 24 సెకన్లు బి) 24 నిమిషాలు
సి) 24 గంటలు డి) 24 రోజులు
27. ఇప్పటివరకు కనుగొన్న ఉపగ్రహాల్లో అతి పెద్దది?
ఎ) చంద్రుడు బి) గనిమెడ
సి) యూరోపా డి) ఫోబోస్
28. భూమిని పోలిన ఉపగ్రహం?
ఎ) చంద్రుడు బి) ఫోబోస్
సి) టైటాన్ డి) పైవన్నీ
29. శాస్త్రవేత్తలు ఇటీవల భూమిని పోలిన గ్రహాన్ని కనుగొన్నారు. దానిపేరు?
ఎ) సూపర్ నోవా బి) సూపర్ ఎర్త్
సి) సుప్రీం ఎర్త్ డి) న్యూ ఎర్త్ గ్లోబ్
30. ప్లూటో ఉపగ్రహం చరాన్ గురించి పరిశోధించడానికి ప్రయోగించిన అంతరిక్ష నౌక పేరు?
ఎ) న్యూహారిజాన్ బి) కేసిని
సి) హ్యూగన్స్ డి) స్పీట్జర్
31. మరుగుజ్జు గ్రహం హోదా పొందిన గ్రహం?
ఎ) బుధుడు బి) అంగారకుడు
సి) భూమి డి) ప్లూటో
32. భూమిపై సముద్రంలో ఆటుపోటులు ఏర్పడటానికి కారణం?
ఎ) భూమి, సూర్యుడికి మధ్య ఉన్న విశ్వ గురుత్వార్షణ బలం
బి) భూమి, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వ గురుత్వాకర్షణ బలాలు
సి) సూర్యుడు, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
డి) భూమి, అంగారకుడి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
33. విశ్వం గురించి అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?
ఎ) కాస్మాలజీ బి) ఆస్ట్రానమీ
సి) స్పేస్ డి) జియాలజీ
34. భూమికి ఇతర వస్తువులను ఆకర్షించే గురుత్వాకర్షణ బలం ఉందని వివరించిన తొలి భారతీయ శాస్త్రవేత్త?
ఎ) ఆర్యభట్ట
బి) భాస్కరాచార్యుడు
సి) బ్రహ్మగుప్తుడు
డి) వరాహమిహిరుడు
35. సూర్యుడిలో పొరలు ఏవి?
ఎ) ఫొటోస్ఫియర్
బి) క్రోమోస్ఫియర్ సి) కరోనా
డి) పైవన్నీ
36. ఏ గ్రహాన్ని ఉదయతార, సాయంత్రం తారగా పిలుస్తారు?
ఎ) అంగారకుడు బి) శుక్రుడు
సి) శని డి) యురేనస్
37. అరుణ గ్రహం అని దేన్ని పిలుస్తారు?
ఎ) శని బి) భూమి
సి) అంగారకుడు డి) బృహస్పతి
38. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం స్థానాన్ని కింది కక్ష్య నుంచి పై కక్ష్యవరకు పెంచినప్పుడు దాని కక్ష్యావేగం?
ఎ) పెరుగుతుంది
బి) తగ్గుతుంది
సి) మారదు
డి) రెండు రెట్లు పెరుగుతుంది
39. బృహస్పతి ఉపగ్రహం పేరు?
ఎ) గనిమెడ బి) యూరోపా
సి) కెలిస్టో డి) పైవన్నీ
40. సౌరకుటుంబంలో గరిష్ఠ సాంద్రత ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) శని
సి) బృహస్పతి డి) బుధుడు
41. సంవత్సర కాలవ్యవధి తక్కువగా ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) బుధుడు
సి) యురేనస్ డి) శని
42. భూస్థిర ఉపగ్రహాలను భూమి కేంద్రం నుంచి ఎన్ని కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెడతారు?
ఎ) 3,600 కి.మీ. బి) 36,000 కి.మీ.
సి) 42,400 కి.మీ. డి) 56,500 కి.మీ.
43. మన పాలపుంత వ్యాసం సుమారు ఎన్ని కాంతి సంవత్సరాలు?
ఎ) 102 బి) 103
సి) 104 డి) 105
44. కాస్మిక్ సంవత్సరం దేని ప్రమాణం?
ఎ) దూరం బి) కాలం
సి) ద్రవ్యరాశి డి) పరిమాణం
45. భూ కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు?
ఎ) టాలమీ బి) కోపర్నికస్
సి) గెలీలియో డి) న్యూటన్
46. గ్రహం ఏ భౌతికరాశిపై పలాయనవేగం ఆధారపడి ఉంటుంది?
ఎ) ద్రవ్యరాశి బి) వ్యాసార్ధం
సి) గురుత్వ త్వరణ విలువ
డి) ఆకారం
47. చంద్రుడిపై పలాయన వేగం?
ఎ) $2.42\ ms^{-1}$ బి) $2.42\ kms^{-1}$
సి) $2.42\ cms^{-1}$ డి) $11.2\ kms^{-1}$
48. సౌరకుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలకు కావలసిన అభికేంద్రక బలాన్ని అందించేవి?
ఎ) విద్యుత్ బలాలు
బి) విశ్వగురుత్వాకర్షణ బలాలు
సి) అయస్కాంత బలాలు
డి) పైవన్నీ
49. సంవత్సర కాలవ్యవధి గరిష్ఠంగా ఉన్న గ్రహం?
ఎ) శని బి) బృహస్పతి
సి) నెప్ట్యూన్ డి) శుక్రుడు
50. భూమికి అతిచేరువలో పరిభ్రమిస్తోన్న కృత్రిమ ఉపగ్రహ ఆవర్తన కాలం (సుమారుగా)?
ఎ) 24 గంటలు బి) 10 గంటలు
సి) 500 సెకన్లు డి) 5000 సెకన్లు

### సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) సి;
5) ఎ; 6) బి; 7) సి; 8) ఎ;
9) బి; 10) సి; 11) బి; 12) సి;
13) బి; 14) సి; 15) బి; 16) డి;
17) డి; 18) సి; 19) డి; 20) సి;
21) సి; 22) డి; 23) డి; 24) ఎ;
25) ఎ; 26) సి; 27) బి; 28) సి;
29) బి; 30) ఎ; 31) డి; 32) సి;
33) ఎ; 34) సి; 35) డి; 36) బి;
37) సి; 38) బి; 39) డి; 40) ఎ;
41) బి; 42) సి; 43) డి; 44) బి;
45) ఎ; 46) డి; 47) బి; 48) బి;
49) సి; 50) డి.

## విద్య, ఉద్యోగ సమాచారం

### సీఈఆర్సీ, న్యూఢిల్లీలో అడ్వైజర్ (లా) పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(సీఈఆర్సీ) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ అడ్వైజర్(లా), అడ్వైజర్(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ అడ్వైజర్(లా)-01, అడ్వైజర్(లా)-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ(లా) ఉత్తీర్ణులవ్వాలి.దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ అడ్వైజర్‌కు రూ.2,25,000, అడ్వైజర్‌కు రూ.1,50,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీఈఆర్సీ, ఎనిమిదో అంతస్తు, టవర్-బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, ఢిల్లీ-110029 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.02.2026.
» **వెబ్‌సైట్:** https://www.cercind.gov.in

### ఎన్ఐఏబీ, హైదరాబాద్‌లో టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ టెక్నికల్ ఆఫీసర్-01, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.01.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.02.2026
» **వెబ్‌సైట్:** www.niab.org.in

### యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** tpr@uohyd.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 02.03.2026.
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

# కుంతాల జలపాతం ఏ ఉమ్మడి జిల్లాలో ఉంది?

తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ఎత్తైన కొండలు, గుట్టలతో; ఎగుడు, దిగుడులతో శిలాప్రాంతంగా ఉండేది. కొన్ని మిలియన్ ఏళ్ల కాలంలో క్రమక్షయానికి గురై వికోశీకరణ చెంది అవశిష్ట పీఠభూమిగా ఏర్పడింది. నదుల కోతల వల్ల అక్కడక్కడా సమతల ప్రదేశాలతో పెనిప్లేన్లు ఏర్పడ్డాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### తెలంగాణ భూగోళ శాస్త్రం

### తెలంగాణ నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం పురాతన గోండ్వానా ప్రాంతం నుంచి విడిపోయిన ద్వీపకల్ప భారతదేశంలో భాగం. ఇది దక్కన్ పీఠభూమి ప్రాంతానికి చెందింది. సముద్రమట్టానికి 150–600 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

### పీఠభూమి:

- దక్కన్ పీఠభూమి మీసోజోయిక్ కాలానికి చెందింది. ఈ పీఠభూమిలో అగ్నిమయ ఉదర విచ్ఛేదనం వల్ల లావా పెల్లుబుకి, ఘనీభవించడం ద్వారా బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.
- తెలంగాణ పీఠభూమిలో హైదరాబాద్.. సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది రాష్ట్ర రాజధాని.
- పడమటి పీఠభూమి ఆర్కియన్ శిలలతో ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి 450 నుంచి 600 మీటర్ల వరకు ఎత్తు ఉంది.
- తెలంగాణ పీఠభూమి ఉత్తరాన ఆదిలాబాద్‌లోని నిర్మల్ గుట్టల నుంచి దక్షిణాన మహబూబ్‌నగర్‌లోని అమ్రాబాద్ గుట్టల వరకు వ్యాపించి ఉంది.
- ఉత్తర భాగంలో గోదావరి నదీలోయలో గోండ్వానా శిలలు ఉన్నాయి.
- గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం–బొగ్గు.

*తెలంగాణ పీఠభూమిలో*

*2 రకాల శిలలు ఉన్నాయి. అవి.*

1. గోండ్వానా శిలలు
2. దక్కన్ శిలలు

**గోండ్వానా శిలలు:** పురాతన యుగం తర్వాత ప్రకృతి ఉత్పాతాల వల్ల ఏర్పడిన వృక్ష సంబంధిత అవక్షేప శిలలను 'గోండ్వానా శిలలు' అంటారు. ఈ శిలల్లో అత్యధికంగా దొరికే ఖనిజం – బొగ్గు.

**దక్కన్ శిలలు:** అగ్ని పర్వత ఉద్భేదనం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఇవి తెలంగాణలోని గోదావరి నది పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

- ఉత్తర తెలంగాణ (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం)లో గొండ్వానా శిలలతో బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయి. ఇవి గోదావరి నది వెంబడి ఉన్నాయి.
- హైదరాబాద్‌లో దక్కన్ పీఠభూమి సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా–తుంగభద్ర నదీ లోయల మధ్య 350–450 మీటర్ల ఎత్తులో, భీమా–గోదావరి నదుల మధ్య 730 మీటర్ల ఎత్తులో ఉంది.
- మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య ఈ పీఠభూమి 600–900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

### పర్వతాలు (కొండలు, గుట్టలు):

తెలంగాణ ప్రాంతంలో అనేక రకాల కొండలు, గుట్టలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పర్వత శ్రేణులకు సంబంధించిన ముఖ్యాంశాలు..

- పడమటి కనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతా శ్రేణి నుంచి విడిపోయి ఆగ్నేయ దిశగా తెలంగాణ ప్రాంతంలోకి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఈ పర్వతాలు కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వరకు విస్తరించాయి.

ఈ పర్వతాలను కింద చూపిన విధంగా వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

| జిల్లా పేరు | పర్వతాల స్థానిక పేరు |
|---|---|
| ఆదిలాబాద్ | నిర్మల్ గుట్టలు |
| కరీంనగర్ | రాఖీ గుట్టలు |
| వరంగల్ | కందికల్ గుట్టలు |
| ఖమ్మం | పాపి కొండలు |

తెలంగాణ పీఠభూమిలో తూర్పు కనుమలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించి, రంగారెడ్డి, నల్గొండ వరకు విస్తరించాయి. వీటిని కూడా వివిధ జిల్లాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

| జిల్లా | పర్వతాలు |
|---|---|
| మహబూబ్‌నగర్ | నల్లమల కొండలు, అమ్రాబాద్ కొండలు |
| రంగారెడ్డి | అనంతగిరి గుట్టలు, రాచకొండ గుట్టలు |
| నల్గొండ | నంది కొండలు, యాదగిరి గుట్ట. |

- తెలంగాణ పీఠభూమి సముద్రమట్టానికి 531 మీ. ఎత్తులో లేదా 1741 అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది.
- హైదరాబాద్ – సికింద్రాబాద్ జంట నగరాలను హుస్సేన్‌సాగర్ వేరు చేస్తోంది. దీన్ని మూసీ ఉపనది అయిన కల్వలేరు నదికి అడ్డుకట్ట వేసి నిర్మించారు. హిమాయత్‌సాగర్ లేదా ఉస్మాన్‌సాగర్‌ను మూసీ ఉపనది అయిన ఈసా వాగుపై నిర్మించారు. ఇది హైదరాబాద్ నగరానికి పశ్చిమాన 25 కి.మీ. దూరంలో ఉంది.
- పోచారం సరస్సును మంజీరా ఉపనది అయిన ఆలేరు పాయపై నిర్మించారు. ఇది నిజామాబాద్ జిల్లాలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ హస్తకళలకు, పెయింటింగ్స్‌కు ప్రఖ్యాతి చెందింది. అదే జిల్లాలోని కడెం నదిపై 45 మీటర్ల ఎత్తులో కుంతాల జలపాతం ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం.
- మల్లూరు ఉగ్రనరసింహస్వామి దేవాలయం వరంగల్ జిల్లాలోని మంగపేటలో ఉంది.
- కంచర్ల గోపన్న నిర్మించిన భద్రాచలం దేవాలయం ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉంది.
- 1980లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మారిన తెలుగు ఫిలిం కల్చర్ (టాలీవుడ్ ఇండస్ట్రీ) దేశంలోనే రెండో అతిపెద్ద సినీ పరిశ్రమ.

### తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు

- **ఓరుగల్లు:** నాటి కాకతీయ రాజధాని. నేడు ఖిలా వరంగల్‌గా పేర్కొంటున్నారు. 12వ శతాబ్దంలో మట్టికోట, రాతి కోటలను నిర్మించారు. వీటి మధ్యలో కాకతీయుల చిహ్నంగా నిలిచిన కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్‌లు ఉన్నాయి.
  - ఇక్కడ భద్రకాళీ దేవాలయం, రుద్రేశ్వర ఆలయం (వెయ్యి స్తంభాల గుడి) వంటి చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి.
  - దీనికి సమీపంలో రామప్ప ఆలయం అద్భుత శిల్పకళా సౌందర్యానికి ప్రతీక.
- **పిల్లల మర్రి:** మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న మహావృక్షం. దీని మొదలు, కొమ్మక్కెడో గుర్తించడానికి వీలు లేకుండా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది పట్టణ కేంద్రానికి సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంది.
- **మెదక్ చర్చి:** ఆసియాలోనే అతి పెద్దదైన మెదక్ డయాసిస్‌లో ఈ చర్చిని గోథిక్ నిర్మాణ శైలిని అనుసరిస్తూ 1914లో నిర్మించారు. ఈ చర్చి టవర్ ఎత్తు దాదాపు 173 అడుగులు. ఇక్కడ ఒకేసారి 5000 మంది ప్రార్థన చేసుకోవచ్చు.
- **వేములవాడ:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. రాజరాజేశ్వర దేవాలయానికి ప్రసిద్ధి. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీ అంటారు. ఇది తెలంగాణలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే, అత్యధిక భక్తులు దర్శించే ఆలయాల్లో ఒకటి.
- **కొలనుపాక జైన మందిరం:** ఇది హైదరాబాద్–వరంగల్ రోడ్డుపై ఆలేరు దగ్గరలోని కొలనుపాకలో ఈ దేవాలయం ఉంది. ఇది తెలంగాణలోని అత్యంత ప్రాశస్తి కలిగిన జైన మందిరం.
- **జ్ఞాన సరస్వతీ దేవాలయం:** ఇది ఆదిలాబాద్‌లోని బాసరలో ఉంది. దేశంలో ఉన్న రెండు సరస్వతీ దేవాలయాల్లో ఇది ఒకటి. ఆదిలాబాద్ నుంచి సుమారు 157.6 కి.మీ. దూరంలో ఉంది.
- **శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయం:** ఇది నల్గొండ జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

### మాదిరి ప్రశ్నలు

1. రాఖీ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా?
   1) ఆదిలాబాద్
   2) కరీంనగర్
   3) వరంగల్
   4) ఖమ్మం
2. కుంతాల జలపాతం ఏ ఉమ్మడి జిల్లాలో ఉంది?
   1) వరంగల్
   2) కరీంనగర్
   3) ఆదిలాబాద్
   4) ఖమ్మం
3. తెలంగాణలో 'దక్షిణ కాశీ'గా పేరొందిన దేవాలయం?
   1) వేములవాడ రాజరాజేశ్వరాలయం
   2) బాసర సరస్వతీ ఆలయం
   3) యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి
   4) ఆలంపూర్ నవబ్రహ్మ ఆలయం
4. పిల్లలమర్రి ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్
   2) రంగారెడ్డి
   3) నల్గొండ
   4) మహబూబ్‌నగర్
5. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారుగా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
   1) 200 మీ. 2) 450 మీ.
   3) 600 మీ. 4) 1000 మీ.
6. పశ్చిమ కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో మొదట ప్రవేశిస్తాయి?
   1) నిజామాబాద్
   2) రంగారెడ్డి
   3) మహబూబ్‌నగర్
   4) ఆదిలాబాద్
7. ఆదిలాబాద్ జిల్లాలో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?
   1) కందికల్ గుట్టలు
   2) నిర్మల్ గుట్టలు
   3) రాచ కొండలు
   4) పాపి కొండలు
8. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తులో విస్తరించి ఉంది?
   1) 600-900 మీటర్లు
   2) 350-450 మీటర్లు
   3) 700-850 మీటర్లు
   4) 200-375 మీటర్లు
9. అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) నల్గొండ
   2) మెదక్
   3) రంగారెడ్డి
   4) కరీంనగర్
10. అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
    1) రంగారెడ్డి
    2) మహబూబ్‌నగర్
    3) నల్గొండ
    4) ఆదిలాబాద్

### సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 3; 6) 4; 7) 2; 8) 1; 9) 3; 10) 2.

# USB in data cables stands for?

## BANK EXAMS

### COMPUTER AWARENESS

### Model Questions

1. To make the number keypad act as directional arrows you press the _______ key.
   a) Num lock b) Caps lock
   c) Arrow lock d) Shift
   e) None of these
2. The skill to find an individual item in a file instantly ___ is used
   a) File allocation table
   b) Directory
   c) equential access
   d) Direct access
   (e) None of these
3. _____ memory improves processing by acting as a temporary high-speed holding area between the memory and the CPU.
   a) RAM
   b) ROM
   c) Cache memory
   d) Flash memory
   e) EPROM
4. A DVD is an example of a(n) _____
   a) Hard disk
   b) Optical disc
   c) Output device
   d) Solid-state storage device
   e) None of these
5. A ___ is a resourcefully designed "empty" document that can be adapted to the user's needs
   a) File
   b) Guide
   c) Template
   d) User guide file
   e) None of these
6. The hardware device normally referred to as the 'brain' of the computer is the___
   a) RAM chip
   b) Data input
   c) CPU
   d) Secondary storage
   e) None of these
7. One of the oldest calculating devices was
   a) Arithmometer
   b) Ready reckoner
   c) Abacus
   d) All of these
   e) None of these
8. All formula in Excel start with
   a) % b) + c) =
   d) – e) None of these
9. The Recycle Bin stores discarded items until _______
   a) Another user logs on
   b) The computer is shut down
   c) The end of the day
   d) You empty it
   e) None of these
10. Which of the following special effects can you use for the slide background?
    a) Gradient b) Texture
    c) Picture d) All of these
    e) None of these
11. Which of the following is not a valid formula in Microsoft Excel?
    a) = A2 + A1 b) = A2 + 1
    c) = A1 + A3 d) = 1A + 2
    e) = A1 + A2
12. What does the acronym ISP stands for?
    a) Internal Service Provider
    b) International Service Provider
    c) Internet Service Provider
    d) Internet Service Providing
    e) Internet Service Provision
13. What is the full form of WWW?
    a) Work Wide Web
    b) World Wide Web
    c) World with Wet
    d) World Wide Wet
    e) World Weak Web
14. Which of the following is hardware?
    a) Assembler b) Server
    c) Compiler d) Interpreter
    e) OS
15. USB in data cables stands for?
    a) Unicode Smart Bus
    b) Universal Structural Bus
    c) Unicode Serial Bus
    d) Universal Smart Bus
    e) Universal Serial Bus
16. Which of the following is not a binary number?
    a) 11101 b) 110 c) 233
    d) 1001 e) 100110
17. ____ is approximately one billion bytes.
    a) Megabyte b) Kilobyte
    c) Terabyte d) Gigabyte
    e) Bit
18. A normal compiler takes source code as input and produces ___ as output
    a) Machine code
    b) Object code
    c) Assembly code
    d) C++
    e) None of these
19. ______ is an internet forum to discuss spacious range of topics like current news, articles and current affairs, etc.
    a) E-Learning b) Chatting
    c) E-Discussions
    d) Newsgroup e) None of these
20. A technique in which a number of similar items or transactions to be processed are grouped and processed in a designated sequence during a machine run is _____.
    a) Batch processing
    b) Online processing
    c) Real time processing
    d) All of these e) None of these
21. Ada is a/an ________
    a) High-level programming language for the development of defense
    b) Structured programming language
    c) Association of data processing
    d) All of the above
    e) None of the above
22. What is the number of bit patterns provided by a 7-bit code?
    a) 256 b) 128 c) 64
    d) 512 e) All of these
23. Regarding a VDU, which statement is more correct?
    a) It is a peripheral device
    b) It is an input device
    c) It is an output device
    d) It is a hardware item
    e) None of the above
24. Which printer is very commonly used for desk top publishing?
    a) Dot matrix printer
    b) Ink Jet Printer
    c) Daisy wheel printer
    d) Laser printer
    e) None of these
25. The radix of a hexadecimal system is
    a) 8 b) 3 c) 16
    d) 2 e) 10
26. Which of the following are types of sound files?
    a) LOG files b) DAT files
    c) WAV files d) DAV files
    e) None of these
27. Permanent Memory in computer is called
    a) RAM b) Auxiliary storage
    c) CPU d) CD ROM
    e) None of these
28. Apple Macintoshes (Macs) and PCs use different CPU's to process data and different__
    a) Languages b) Methods
    c) Operating system
    d) Storage devices
    e) None of these
29. Smaller and less expensive PC based servers are replacing _______ in many businesses today
    a) Super computers
    b) Clients
    c) Laptops
    d) Mainframes
    e) None of the above
30. After a picture has been taken with a digital camera and processed appropriately, the actual print of the picture is considered
    a) Data b) Output
    c) Input d) The process
    e) None of these
31. _____ is the science that attempts to produce machines that display the same type of intelligence that humans do.
    a) Nanoscience
    b) Nanotechnology
    c) Simulation
    d) Artificial intelligence
    e) None of the above
32. SMTP, FTP and DNS are applications of the ____ layer.
    a) Data link b) Network
    c) Transport d) Application
    e) None of these
33. ____ provides a common address space and routes the packets of data across the entire internet?
    a) IP b) TCP c) UDP
    d) ALU e) None of these
34. ____ was the precursor to internet as we know it today?
    a) ARPANET b) USENET
    c) TELNET d) DBMS
    e) None of these
35. Hardware that adds two numbers is:
    a) The control unit
    b) An internal CPU register
    c) Arithmetic Unit
    d) Browser
    e) None of these
36. What is the decimal from of 3b4?
    a) 846 b) 848 c) 946
    d) 948 e) None of these
37. The term _______ designate equipment that might be added to a computer system to enhance its functionality.
    a) Digital device
    b) System add
    c) Disk pack
    d) Peripheral device
    e) None of these
38. A device designed to read information encoded onto a small plastic card is..
    a) Light pen
    b) Pun chard card
    c) Magnetic tape
    d) Magnetic e) Badge reader
39. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is
    a) Generalization
    b) Inheritance
    c) Encapsulation
    d) Information hiding
    e) None of these
40. This part of operating system manages the essential peripherals, such as the keyboard, screen, disk drives, and parallel and serial ports_____
    a) Basic input / output system
    b) Secondary input / output system
    c) Peripheral input / output system
    d) Marginal input / output system
    e) None of these
41. Which of the following is not a type of key?
    a) Alphabetic Keys
    b) Numeric keys
    c) Function keys
    d) Toggle keys
    e) None of these
42. What is gutter margin?
    a) Margin that is added to the left margin when printing
    b) Margin that is added to right margin when printing
    c) Margin that is added to the binding side of page when printing
    d) Margin that is added to the outside of the page when printing
    e) None of these
43. To insert a new slide in a presentation, press_____
    a) CTRL+N b) CTRL+M
    c) CTRL+O d) CTRL+S
    e) CTRL+F
44. ______ is a combination of software and hardware
    a) Firmware b) Shareware
    c) Freeware d) Netware
    e) Software
45. Memory which forgets everything when you switch off the power is known as
    a) Corrupted
    b) Volatile
    c) Non-Volatile
    d) Non - Corrupted
    e) None
46. Format command is used to create_____
    a) Sector b) Memory
    c) Tracks d) Tracks and sector
    e) None of these

### KEY

1) a 2) d 3) c 4) b 5) c
6) c 7) c 8) c 9) d 10) d
11) d 12) c 13) b 14) b 15) e
16) c 17) d 18) b 19) d 20) a
21) d 22) b 23) a 24) d 25) c
26) c 27) b 28) c 29) d 30) b
31) d 32) d 33) a 34) a 35) c
36) d 37) d 38) e 39) b 40) a
41) e 42) c 43) b 44) a 45) b
46) d